# బేతాళ ప్రశ్నలు

విద్యార్థుల్లో మేథాశక్తినీ, లెక్కలపట్ల ఉత్సాహాన్నీ పెంచే పజిల్స్




అయిదంకెల జీతం కోసం ఇంటర్వ్యూల్లో
అడిగే ప్రశ్నలు - సమాధానాలు

యండమూరి వీరేంద్రనాథ్

**BETHALA PRASNALU**

*By :*
**YANDAMOORI VEERENDRANATH**
36, U.B.I. Colony,
Road No. 3, Banjara Hills,
**HYDERABAD - 500 034.**
**Ph : 924 650 2662**
yandamoori@hotmail.com
w.w.w.yandamoori.com
(సాక్షి ఫన్‌డే- సౌజన్యంతో)

**SARASWATHI VIDYA PEETAM,**
Kakinada - Samalkot Road,
MADHAVAPATNAM,
E.G. Dist. (A.P.)

*First Edition :*
**October, 2009**

*Publishers :*
**Navasahithi Publishers**
Eluru Road, Near Ramamandiram,
Vijayawada - 520 002.
Ph : 0866 - 2432 885
navasahithi@sancharnet.in


*Printers :*
**Nagendra Enterprises**
Vijayawada-2.

*Cover Disign :* Giridhar
*Caricature Paints :* Rampa
*Computer Graphics :* Kumari Yamuna

*Price :*
Rs. **100/-**

## అంకితం

పెద్దయ్యాక
కుంభకర్ణులు నిద్రలేస్తారు.
తాము ఎప్పుడో చనిపోయామని తెలుసుకోవటానికి



పిల్లల్ని కుంభకర్ణుల్ని చేయకుండా పెంచే తల్లితండ్రులకి ఈ పుస్తకం అంకితం

- రచయిత

మీ అభిమాన రచయిత

# యండమూరి వీరేంద్రనాథ్ రచనలు

### నాన్‌ఫిక్షన్

1. బేతాళ ప్రశ్నలు
2. ఇడ్లి-ఆర్కిడ్-ఆకాశం
3. తప్పు చేద్దాం రండి!
4. విజయానికి ఆరోమెట్టు
5. విజయ రహస్యాలు
6. చదువు - ఏకాగ్రత
7. మైండ్ పవర్ నెం.1 అవడం ఎలా?
8. విజయానికి ఐదు మెట్లు
9. విజయంలో భాగస్వామ్యం
10. విజయంవైపు పయనం
11. మీరు మంచి అమ్మాయి కాదు
12. మిమ్మల్ని మీరు గెలవగలరు
13. మిమ్మల్ని మీ పిల్లలు ప్రేమించాలంటే?
14. గ్రాఫాలజీ
15. పాపులర్ రచనలు చేయడం ఎలా?
16. మంచి ముత్యాలు (Quotations)
17. పిల్లల పేర్ల ప్రపంచం
18. పడమటి కోయిల పల్లవి (Poetry)
19. మంచు పూల వర్షం (సుభాషితాలు)

### ఫిక్షన్

20. వీళ్ళని ఏం చేద్దాం?
21. రెండు గుండెల చప్పుడు
22. ఒక వర్షాకాలపు సాయంత్రం
23. సిగ్గేస్తోంది
24. అంకితం
25. మరో హిరోషిమా
26. ప్రేమ
27. అనైతికం
28. ధ్యేయం
29. ది డైరీ ఆఫ్ మిసెస్ శారద
30. ప్రియురాలు పిలిచె
31. వెన్నెల్లో ఆడపిల్ల
32. మంచుపర్వతం
33. భార్యా గుణవతి శత్రు
34. నల్లంచు తెల్లచీర
35. స్వరభేతాళం
36. సంపూర్ణ ప్రేమాయణం
37. కాసనోవా 99
38. అంతర్ముఖం
39. డబ్బు మైనస్ డబ్బు
40. స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్
41. చీకట్లో సూర్యుడు
42. డబ్బు టు ది పవరాఫ్ డబ్బు
43. ఆనందో బ్రహ్మ
44. అష్టావక్ర
45. చెంగల్వ పూదండ
46. దుప్పట్లో మిన్నాగు
47. యుగాంతం
48. ఋషి
49. నిశ్శబ్దం - నీకూ నాకూ మధ్య
50. తులసిదళం
51. తులసి
52. అతడే ఆమె సైన్యం
53. 13-14-15
54. అతడు ఆమె ప్రియుడు
55. లేడీస్ హాస్టల్
56. అగ్ని ప్రవేశం
57. రుద్రనేత
58. రాక్షసుడు
59. ఆఖరిపోరాటం
60. మరణ మృదంగం
61. ప్రార్థన
62. అభిలాష
63. రక్తసిందూరం
64. థ్రిల్లర్
65. వెన్నెల్లో గోదారి
66. పర్ణశాల
67. ఒకరాధ ఇద్దరు కృష్ణులు
68. బెస్ట్ ఆఫ్ వీరేంద్రనాథ్ (కథలు)
69. రాధ-కుంతి "
70. క్షమించు సుప్రియా! "

### ఇంగ్లీషు

71. Secret of Success
72. The Art of Studying
73. Five Steps to Success (In Print

## ఆప్త వాక్యం

'తులసీదళం' నుంచీ 'వెన్నెల్లో ఆడపిల్ల' వరకూ ఒక రచయితగా, 'అభిలాష' నుంచి 'అతిలోక సుందరి' వరకూ ఒక సినిమా మనిషిగా యండమూరి చాలామందికి తెలుసు. కానీ తను మరొక రకంగా కూడా నాకు తెలుసు.

రామచంద్రపురం స్కూల్లో నేను చదువుకునే రోజుల్లో అక్కడే టైపు, షార్టుహాండూ నేర్చుకునేవాడు. ఇద్దరం కాకినాడ పి.ఆర్. కాలేజీ స్టూడెంట్లమే. నేను జూనియర్ని. ఆ సంవత్సరం కాలేజ్ ఫస్ట్ అతడే. అంతకు ముందు హైదరాబాద్‌లో (యాభై సంవత్సరాల) స్కూలు రికార్డుని కూడా బ్రద్దలు కొట్టాడు. ఆపై సి.ఏ. పూర్తి చేసి, అతి చిన్న వయసులో ఆంధ్రాబ్యాంకు చరిత్రలోనే చాలా పెద్ద పోస్టు నిర్వహించిన వ్యక్తి వీరేంద్రనాథ్.

ఈ విషయం ఇక్కడ ఎందుకు ప్రస్తావించవలసి వచ్చిందంటే, ఇటువంటి పుస్తకం వ్రాయటానికి అర్హత వున్న రచయిత అతనే అని చెప్పటం కోసము. లెక్కల్లో ఎన్నడూ అతనికి నూటికి 95కి తక్కువ వచ్చేవి కావు. అతడి కొడుకుకి కూడా ఇంటర్‌లో స్టేట్ ర్యాంక్ వచ్చింది. ప్రస్తుతం సింగపూర్ స్టాక్ ఎక్ఛేంజి కంపెనీలో పనిచేస్తూ ఏడాదికి కోటి రూపాయలు జీతం సంపాదిస్తున్నాడు. పిల్లల్ని మంచి స్కూల్‌లో చేర్పించటంతో తల్లితండ్రుల బాధ్యత తీరిపోదని వీరేంద్రనాథ్ నమ్మకం. అది ఈ పుస్తకంలో చాలా చోట్ల కనపడుతుంది.

❖ ❖ ❖ ❖ ❖ ❖

గతంలో నేనొక రష్యన్ పుస్తకాన్ని అనువదించాను. అందులోని పజిల్స్, హేతువాదం, శాస్త్రీయ దృక్పథం మొదలైన అంశాలు ఈ బేతాళ కథలు వ్రాయటానికి ప్రేరణ ఇచ్చాయని తను నాతో చెప్పాడు. పిల్లలకి ఇలాంటి పుస్తకాల అవసరం చాలా వున్నది.

పిల్లలంటే వీరేంద్రనాథ్‌కి వున్న ఇష్టం గురించి కాకినాడలోని అతడి సరస్వతీ విద్యాపీఠం చూస్తే తెలుస్తుంది. అక్కడే మంచి జవాబులు చెప్పినందుకు ఎయిడ్స్ పేషెంట్ల సంతానానికి నాతోనే ఒకసారి చెప్పుల నుంచీ, బంగారం మెడల్స్ వరకూ బహుమతులుగా ఇప్పించాడు. ఎంతో ప్రలోభ భరితమయిన సినిమారంగాన్ని వదులుకుని, పిల్లల కోసం ఇటువంటివి చేయాలంటే మనిషికి కమిట్‌మెంట్ కావాలి. అటువంటి కమిట్‌మెంట్‌తోనే భారతదేశపు ప్రతిష్టాత్మక ఆంగ్లపత్రిక "ది హిందూ"లో పిల్లల్లో మేథోశక్తిని పెంచే శీర్షిక గత 200 వారాలుగా క్రమం తప్పకుండా

నిర్వహిస్తున్నాడు. ఇది కూడా జర్నలిజంలో ఒక రికార్డే. ఇన్ని వారాలపాటు ఒకవారం కూడా మిస్ అవకుండా వ్రాయాలంటే మనిషికి 'సమయం' మీద అధికారం (టైమ్ మానేజ్‌మెంట్), విషయ సేకరణ పట్ల ఆసక్తి వుండాలి.

నాకు ఒకందుకు కించిత్ గర్వంగా వున్నది. నవలారచయితగా వున్న యండమూరి వ్యక్తిత్వ వికాసం వైపు మారి "విజయానికి అయిదు మెట్లు" వ్రాసిన తరువాత, అందులోని అంశాల్ని మొట్టమొదటిసారి మా 'ప్రశాంతి కౌన్సిలింగ్ సెంటర్'లో చెప్పటం ద్వారా వక్తగా మారాడు. ప్రస్తుతం ఆంధ్రదేశంలో అత్యధికమైన డిమాండ్ వున్న మోటివేటర్లలో వీరేంద్రనాథ్ ఒకరు.

తామరాకు రచయితలు అని కొందరంటారు. తాము వ్రాసింది నీటి బొట్ల లాగా పాఠకులపైకి వదిలేస్తూ వుంటారు. ఆ నీతి వాక్యాల్ని తాము వంటపట్టించుకోరు. ఒక ప్రసిద్ధ ఆంగ్ల రచయిత మరియు మనోవిశ్లేషకుడు "ఈ ప్రపంచంలో టీచర్స్, ప్రీచర్స్ అని రెండు రకాలుగా వుంటారు" అంటాడు. చదివింది చెప్పేవారు మొదటి రకం. అనుభవాన్ని చెప్పేవారు రెండోరకం. యండమూరి మూడోరకం. వ్రాస్తూ, వ్రాసింది ఆచరించటం ప్రారంభిస్తాడు. ఒకప్పుడు ఎంతో సభాపిరికిగా వుండే రచయిత, మనో వికాస పుస్తకాలు వ్రాస్తూ 600 మంది విద్యార్థుల్ని ఆరుగంటల పాటు కదలకుండా కూర్చోబెట్టగలిగే వక్తగా మారటం దీనికి ఉదాహరణ.

పైన నేను ఉదాహరించిన ఆంగ్ల రచయితే మరోకచోట, "నేను సమస్యలో వున్నప్పుడు,మనసు బాలేనప్పుడు నా పుస్తకాలు చదువుతాను" అంటాడు. ఎంతో పరమార్థం వున్న వాక్యాలివి. తన ఆలోచనలు తనకే మార్గదర్శకాలు కావటం కన్నా గొప్పతనం ఏమి కావాలి? కోపాన్నీ, ఆందోళననీ అధిగమించటానికీ, దిగులు నించి బయటపడటానికీ, మార్గాలు చెప్పే మనిషి (అది సైకాలజిస్టు గానీ, రచయితగానీ) తాను ముందు వాటినించి బయటపడాలి. ఈ విషయంలో ఇతడు అభినందనీయుడు. ఇటీవలి కాలంలో యండమూరిలో దిగులుగానీ, టెన్షన్‌గానీ, కోపంగానీ దగ్గిర వాళ్ళం మేమెవరం చూడలేదు. అంతర్ముఖం వ్రాసిన తరువాత ఈ మార్పు వచ్చిందను కుంటాను.

ఈ పుస్తకం గురించి నేనేమీ చెప్పదల్చుకోలేదు. యండమూరి పుస్తకం గురించి చెప్పటానికి ఏముంటుంది? డీప్ ఫ్రిజ్‌లో మందుతోన్న స్టౌ లాటివి అతడి రచనలు. ఏది కావాలంటే అది వుంటుంది. తీసుకునే శక్తి, బాధ్యత మాత్రం మనదే.

- డా. బి.వి. పట్టాభిరాం, సైకాలజిస్ట్

## ఉపోద్ఘాతం

"అమ్మా! జ్ఞానం అంటే ఏమిటి?" వంటింట్లో పని చేసుకుంటున్న తల్లిని అడిగిందో కూతురు. తల్లి పంచదార సీసా చూపించి, "కాస్త తింటావా?" అంది. వద్దంది ఆ పాప.

"పోనీ ఆ కోడిగుడ్డు? లేకపోతే ఆ సీసాలో మైదా?" మళ్ళీ అడిగింది తల్లి. మొహం వికృతంగా పెట్టి "ఛీ" అంది కూతురు. అప్పుడా తల్లి నవ్వి, "ఇవన్నీ కలిపితే వచ్చే 'కేక్'ని మాత్రం ఇష్టంగా తింటావు కదా. జ్ఞానం కూడా అలాంటిదే! పాండిత్యం, తెలివి, అనుభవం, హేతువాదం, నైపుణ్యం అన్నీ కలిస్తే వచ్చేది జ్ఞానం. విడివిడిగా వాటికంత ప్రాముఖ్యత లేదు."

❖ ❖ ❖

"ఒక కూలీ రోజుకి ఒక గజం లోతు తవ్వితే, ఇద్దరు కూలీలు రెండు రోజులకి ఎన్ని గజాలు తవ్వుతారు?"

"అది మా సిలబస్‌లో లేదు."

"$2+2\div2$ ఎంత? బోడ్‌మస్ ప్రిన్సిపుల్ - నాల్గవ తరగతిలో చదివింది. దానిబట్టి జవాబు రెండా? మూడా?"

"ఆ ప్రిన్స్‌పుల్ గుర్తులేదు."

లెక్కలంటే చాలామంది పిల్లల భయానికి కారణం పై ఉదాహరణే. లెక్కల్లో ప్రావీణ్యత రెండుగా వస్తుంది. మొదటి పునాది **'కృషి'**. అంటే ఎక్కాలు కంఠతా పట్టటం, కూడికలూ తీసివేతలూ కాలిక్యులేటర్ లేకుండా చేయగలగటం వగైరా. ఈ స్థితి దాటిన తరువాత రెండోమెట్టు **'తెలివి'**. సమాధానం వైపు వెళ్ళాలంటే ఏదారి గుండా ప్రయాణించాలి అనేది తెలివి.

ఈ పుస్తకం సాయపడేది ఈ రెండో విషయంలోనే. C.A, I.C.W.A, I.I.T, I.I.M, Statistics లాటి ఏ సబ్జెక్ట్ చదవాలన్నా లెక్కల్లో ప్రావీణ్యత తప్పనిసరి. **"కొంతమందికి లెక్కలంటే భయం. జీవితం అంతకన్నా కఠినమైన లెఖ్ఖ"** అన్నాడు లెక్కల మాంత్రికుడు, మేథావి మాస్టర్ రామానుజం.

హేతువు - లెక్కలకి వెన్నెముక! సాధన - ఊపిరి! పరిష్కారం వైపు ప్రయాణం - ప్రాణం!! సరిఅయిన సమాధానాన్ని రాబట్టటం - విజయం!!! ఈ కోణంలో ఆలోచిస్తే రామానుజం మాటలకి నిజమయిన అర్థం తెలుస్తుంది.


కేవలం లెక్కలే కాదు. జాగ్రఫీ, కెమిస్ట్రీ అన్నిటికన్నా ముఖ్యమయిన 'కామన్ సెన్స్' పట్ల అభిరుచి పెరగాలంటే ఇటువంటి పజిల్స్ చేయటం, మెదడుకి రాపిడి పెట్టటం అవసరం.


లెక్కలు వేరు. తర్కం వేరు. "రెండడుగుల ఎత్తు మీద నుంచి దూకిన ఒక పిల్లికి రెండు కాళ్ళు విరిగితే, అయిదడుగుల పైనుంచి దూకిన మరో పిల్లికి ఎన్ని కాళ్ళు విరుగుతాయి?" అన్న ప్రశ్నకి ఒక కుర్రవాడు "అయిదు" అన్నాడు. అతడి తల్లిదండ్రులు కొడుకువైపు విషాదంగా చూసారు. అతడు రాపిడ్ మాథ్స్‌లో చాలా బ్రిలియంట్ స్టూడెంట్ అట.


ఒక ఇంటర్వ్యూలో నా పక్క ఆఫీసరు 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రవహిస్తున్న అయిదు నదుల పేరు చెప్ప'మంటే అభ్యర్థులు కనీసం మూడు పేర్లు కూడా చెప్పలేకపోయారు. దాదాపు అందరూ బి.టెక్ గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు.

అంతవరకూ ఎందుకు? ఒక మెడికల్ కాలేజీలో విద్యార్థుల్ని అయిదుగుర్ని వేదిక ఎక్కించి, "మీరే దిక్కుని చూస్తున్నారు?" అని అడిగితే, వారిలోవారు కాస్త చర్చించుకున్నాక "తూర్పు" అని చెప్పారు. "మీరున్నది భారతదేశం కాబట్టి - ఎదురుగా ఏ సముద్రం వున్నది?" అంటే, వారిలో నలుగురు జవాబు చెప్పలేకపోయారు. హిందూ దేశపు బొమ్మ గీయమంటే తనకి రాదన్నాడు ఒక ఫైనల్ ఇయర్ విద్యార్థి. బొమ్మ వేసి, అరేబియా సముద్రాన్ని కూడా చూపించి అటు తిరగమంటే అందులో ముగ్గురు అయోమయం చెందారు. బంగాళాఖాతం వైపున్న వారికి అరేబియా సముద్రం వెనక (వీపువైపు) వుంటుందన్న సంగతి కూడా తెలియని స్థితిని ఏమని అనాలి?

ఇదంతా విద్యార్థుల్ని తప్పు పట్టటం గానీ, వారి స్థాయిని హేళన చేయటం గానీ కాదు. 'అయ్యో! ఇలా జరుగుతుందేమిటి?' అన్న బాధే. ఈ క్రింది జవాబులు చూడండి. ఇంటర్నెట్‌లో ఒక మిత్రుడు పంపిన ఆన్సర్ షీట్ ఇది.






ఇదంతా నాణేనికి ఒక వైపు. మరొక వైపు అద్భుతమయిన తెలివి, పరిజ్ఞానం వున్న విద్యార్థులని కూడా చూసాను. ఈ పుస్తకంలోని 24వ కథలో 8వ ప్రశ్నకి సరి అయిన సమాధానం ఎలా వ్రాయాలో తెలియక కొట్టుమిట్టులాడుతూంటే, ఒక పదవ తరగతి కుర్రవాడు దానిలోని తర్కం చెప్పి సంభ్రమ పరిచాడు. చిత్రమేమిటంటే - కాలేజీ విద్యార్థులకన్నా - హైస్కూలు విద్యార్థులు చాలా చురుగ్గా వుంటున్నారు. వయసు పెరిగేకొద్దీ "ఇతర వ్యాపకాల" పట్ల ఆకర్షణ, చదువు పట్ల చురుకుదనాన్ని తగ్గిస్తుందనుకుంటాను.

వారానికి ఒకరోజు మౌనంగా, ఎవరితో మాట్లాడకుండా వుండటం ద్వారా గొప్ప ఏకాగ్రతని సాధించవచ్చు. మొదట్లో కష్టం. ఆచరించి చూడండి. ఆ తేడా మీకే తెలుస్తుంది. "మాకు ఏకాగ్రత కుదరటం లేదు. చదువుతున్నప్పుడు మనసు ఎటో వెళ్ళి పోతోంది" అంటారు కొందరు విద్యార్థులు. దీనికి రెండు కారణాలున్నాయి. చదువుకన్నా ఉత్సాహభరితమైన స్నేహితులు, ఇంటర్నెట్‌లు, సినిమా విషయాలూ మొదటి కారణం. చదువుమీద ఉత్సాహం లేక పోవటం రెండో కారణం. మరి ఉత్సాహం ఎందుకుండదు? చదువు కష్టమైనప్పుడు పిల్లలకి దానిమీద ఉత్సాహం ఉండదు. ముఖ్యంగా లెక్కలు, విజ్ఞాన శాస్త్రం విషయాల్లో..! దీనికి మళ్ళీ మూడు కారణాలు :

**1. ప్రతిస్పందనలో అలసత్వం (Sluggish Reflex Actions) :** "ఆరు కార్బన్ పరమాణువులు పది హైడ్రోజన్ పరమాణువుల రింగ్‌తో బెన్‌జిన్ రింగ్‌ని పోల్చినప్పుడు..." అంటూ లెక్చరర్ ఇంగ్లీషులో చెప్పుకుపోతున్నాడు. విద్యార్థికి ఒక ముక్క అర్థం కావటం లేదు. దీనికి కారణం, చిన్నప్పుడు కెమిస్ట్రీలో పునాది సరిగ్గా లేకపోవటమే. "రేపు నిన్నయితే ఈ రోజు శనివారం. ఈ రోజు ఏ వారం?" అన్న ప్రశ్నకి విద్యార్థి కనీసం సమాధానం గురించి ఆలోచించే ప్రయత్నం కూడా చేయటం లేదు. కారణం, మెదడుపై వత్తిడి కలిగించటం ఇష్టం లేకపోవటం!

**2. విశ్లేషణలో అలసత్వం (Problem Analysing Pancity) :** 2a + 2b = 4 అవుతే b+a ఎంత? అన్న చిన్న ప్రశ్నకి ఒక పిల్లవాడు సమాధానం చెప్పలేకపోతే ఆ గుణాన్ని PAP అంటారు. వీరు కేవలం పరీక్షల కోసం సిలబస్ మాత్రమే చదువుతారు. తార్కిక జ్ఞానం వీరికి చాలా తక్కువ వుంటుంది.

**3. దృక్పథంలో అలసత్వం (Paradigm Shift Defficiency) :** "ఒక బెగ్గర్ అన్నయ్య చనిపోయాడు. చనిపోయిన వ్యక్తికి తమ్ముళ్ళు లేరు. ఇదెలా సాధ్యం" అన్నప్పుడు ఒక పిల్లవాడు సమాధానం చెప్పలేకపోవచ్చు. "బిచ్చగాళ్ళందరూ మొగవారే అయివుండనవసరం లేదు కదా" అన్న హింట్ ఇచ్చినా కూడా సమాధానం చెప్పలేకపోతే ఆ లోటుని PSD అంటారు.

ఇవికాక ఇంకా చాలా లోపాలుంటాయి. హైపర్ ఆక్టివిటీ, యాంగ్జైటీ మొదలైనవి. 100 లోంచి 7 తీసేసుకుంటూ పోతే 93-86-79 ఇలా వస్తాయి కదా. "ఆ వరుసలో పదవ అంకెఏది?" అని అడిగినప్పుడు ఆ పిల్లవాడు తప్పు చెప్పాడనుకుందాం. రెండోసారి మళ్ళీ చెయ్యమన్నప్పుడు కూడా తప్పుచేస్తే దాన్ని హైపర్ ఆక్టివిటీ అంటాం. తొందరగా పని పూర్తిచేసి పడెయ్యాలన్న కంగారు ఇది.

❖ ❖ ❖

పై మూడులోపాల్నీ అధిగమించేలా చేసి, పిల్లల్లో హైపర్ ఆక్టివిటీని తగ్గించేలా చేయటమే ఈ పజిల్స్ పుస్తకం వుద్దేశ్యం. మీరు పెద్దలయితే మీ పిల్లలకి ఈ పుస్తకంలో ఒక్కో కథా ఒకరోజు చెప్పండి. పిల్లలయితే, రోజుకో సమస్య చదివి పరిష్కారం స్వంతంగా ఆలోచించండి. తొందరపడి పుస్తకం చివర్లోని సమాధానాలు చూడవద్దు.

ఒకప్పుడు చాలా ఇంటర్వ్యూ బోర్డుల్లో మెంబర్ని నేను. మన పిల్లల్లో జ్ఞానం వుంది. కానీ కంగారు దాన్ని డామినేట్ చేస్తుంది. చిన్న చిన్న ప్రశ్నలకి కూడా తడబడేలా చేస్తుంది. అటువంటి తడబాటుని పోగొట్టటానికి ఈ పుస్తకం సాయపడుతుంది. యాభైవేల రూపాయల ఉద్యోగపు ఇంటర్వ్యూల్లో అడిగిన ప్రశ్నలు కూడా ఇందులో వున్నాయి. చిన్నపిల్లలకి అర్థం అవటం కోసం జవాబులు చాలా విపులంగా ఇవ్వబడ్డాయి. లెక్కల్లో నిష్ణాతులకి ఇది కాస్త చాదస్తంగా కనబడవచ్చు. కానీ తప్పదు.

మరొక విషయం. కొన్ని కఠినమైన ప్రశ్నలకి సమాధానం రాకపోయినా, అర్థం కాకపోయినా నిరాశ పడవద్దు. పిల్లలకి అది చాలా సహజం. పిల్లలంటే గుర్తొచ్చింది. లోపలి ప్రతి కథాప్రారంభంలోనూ బేతాళుడు పిల్లల జ్ఞాన మాంద్యానికి వారి తల్లితండ్రులని తిడుతూ వుంటాడు. పిల్లల పునాది సరీగ్గా వుండాలంటే (ఉపాధ్యాయుల పని వత్తిడి ఎక్కువ కాబట్టి) తల్లితండ్రులే జాగ్రత్త తీసుకోవాలన్న ఉద్దేశ్యమే తప్ప, మరో ఉద్దేశ్యం లేదని మనవి.

అదే విధంగా, ఈ పుస్తకంలో చాలా చోట్ల భగవంతుని ప్రసక్తి వస్తుంది. దేవుడి ఉనికి పట్ల నా అభిప్రాయం పాఠకులకి తెలుసు. పిల్లల్లో 'భక్తి' వలన వినయం, 'పాపభీతి' వలన సత్ప్రవర్తన, 'ప్రార్థన' వలన క్రమశిక్షణ కలుగుతాయనే నానమ్మకం. అందుకే ఆ ప్రసక్తి తరచు తీసుకు రావలసి వచ్చింది. విగ్రహారాధనకి వ్యతిరేకుడినైన నేను కాకినాడలో సరస్వతి గుడి కట్టింది కూడా ఆ కారణంగానే...!

ఇక చివరగా-

ఈ కథలు సాక్షిలో సీరియల్‌గా వస్తున్నప్పుడు కొందరు పాఠకులు చాలా వరకూ సరిఅయిన సమాధానాలు ఇస్తూ ఉత్సాహపరిచారు. వారు: పి.శ్రవణ్ కుమార్, మియాపూర్; పామర్తి నిర్మల, చల్లపల్లి; సాహితీ సౌందర్య వెత్సా, హైద్రాబాద్; వి.యస్.కె. చైతన్య, కొత్తపల్లి; మేడూరి రవికుమార్, సికింద్రాబాద్; రత్నా రమేష్, కాకినాడ; గారపాటి ఈశ్వర్, అమలాపురం; రఘునాథ్ చౌదరి, హైదరాబాద్; ఎం. అప్పలరాజు, విశాఖపట్నం; ఎస్. మధుకర్, కర్నూల్.

'ఎందరో పిల్లలు. కాబోయే మహానుభావులు. అందరికీ అభినందనలు.

**యండమూరి వీరేంద్రనాథ్**
9-9-09

సరస్వతీ విద్యాపీఠం
కాకినాడ

# 1. అతి తెలివి



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని నడుస్తూండగా శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! ప్రతి పిల్లవాడిలోనూ ఒక శక్తి వుంటుంది. దాన్ని ఏ విధంగా అతడు మార్చుకుంటాడు, – అన్న దానిమీదే అతడి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది.

ఒక తల్లి తన కొడుకుని విద్యాధికుడైన ఓ స్వామిజీ దగ్గరకు తీసుకువచ్చింది. "స్వామీ! వీడు నా కొడుకు. వీడికి తండ్రి లేడు. నా మాట అసలు వినడు. చదవడు. ఏ పనీ చేయడు. కాస్త నాలుగు మంచిమాటలు చెప్పి బాగు చెయ్యండి" అని కోరింది.

యోగి ఆ కుర్రాడివైపు చిరునవ్వుతో చూస్తూ, "నీకు దేనిగురించి మంచి చెప్పాలి నాయనా?" అని అడిగాడు.

ఆ కుర్రాడు నిర్లక్ష్యంగా పొగరుగా, అప్పుడే వేసిన తారురోడ్డు పక్కన పడివున్న తారువుండని చూపిస్తూ హేళనగా "దాని గురించి చెప్పండి" అన్నాడు.

స్వామి బాగా చదువుకుని జ్ఞానియైనవాడు. ప్రతి సమస్యకూ పూజలు, జపాలు, ఉపవాసాలు చెయ్యమని సలహాలిచ్చేవాడు కాదు. కుర్రాడిని చూడగానే వాడు తెలివైనవాడనీ, చెప్పేవారు లేకనే ఆ విధంగా తయారైనాడని గ్రహించాడు.

బంతిలా కనబడుతున్న ఆ ఉండని తీసుకు రమ్మని, కుర్రాడు దాన్ని తీసుకొచ్చాక, "దీని ఖరీదు ఎంతవుంటుందని నీ ఉద్దేశం?" అని అడిగాడు.

"ఏమీ ఉండదు."

"దానిలోని తారు ఖరీదు?"

ముందే చెప్పినట్లు ఆ కుర్రాడు తెలివైనవాడు. "ఇందులోని తారు ఖరీదు పదిరూపాయలు ఉండవచ్చునేమో" అన్నాడు.

"అవును నిజమే" అన్నాడు స్వామి. "కానీ ఆ పెట్రోలియం మూలపదార్థాన్ని మరోలా మార్చగలిగితే, అప్పుడది ప్లాస్టిక్ అవుతుంది. ఈ మాత్రపు బంతిలోంచి పదివేల సన్నటి తీవెలు తయారు చేయవచ్చు. జాగ్రత్తగా విను నాయనా! మనిషి గుండె ఆపరేషన్‌కు ఉపయోగించే ఆ ఒక్కొక్క సన్నటి తీవె ఖరీదు పదివేల రూపాయలు.

అంటే... పదిరూపాయలు విలువ కూడా చేయని నీ చేతిలోని తారు, తన **స్థానం మార్చుకుని పరిణితి చెందగలిగితే** దాని విలువ పదికోట్లు అయ్యిందన్నమాట" అంటూ ఆగాడు.

అశువుగా చెప్పిన ఆ ఉదాహరణవిని అప్రతిభుడయ్యాడు ఆ కుర్రాడు. స్వామి కొనసాగించాడు- "కానీ, **ఓసారి తారుగా మారిపోయాక ఇక నీ జీవితం కూడా అంతే. ముడిపదార్థంగా ఉన్నప్పుడే దాన్ని కావల్సిన రీతిగా మార్చుకోవాలి. కాళ్ళక్రింద తారువి అవుతావో, గుండె కదిల్చే తీగెవి అవుతావో తేల్చుకో**".

జ్ఞానోదయమైనట్టు కుర్రాడు నమస్కరించాడు.

ఈ ఉదాహరణ చెప్పి బేతాళుడు, "రాజా! వేపపండు లాంటి ఈ చిన్ని కథలో విశ్వవ్యాప్తమయ్యేటంత జ్ఞానం వుంది. కొన్ని కోట్ల కోట్ల జ్ఞాన బిందువుల సముదాయం 'మెదడు'. దాన్ని ఎలా వాడుకోవాలో మనిషే నిర్ణయించుకోవాలి. కొందరి మెదడు బుల్లితెరని సృష్టించగలిగే అద్భుత జ్ఞానాన్ని కలిగి వుంటుంది. కొందరి మెదడు రేయింబవళ్ళు బుల్లితెరని చూడాలనే ఇష్టాన్ని కలిగి వుంటుంది. కొందరు తెలివినీ, కొందరు బద్ధకాన్ని ఇష్టపడతారు. తెలివంటే అనుకున్న పనిని తొందరగా సాధించటానికి మెదడుని ఉపయోగించగలిగే సామర్థ్యం! బద్ధకమంటే అవసరమైన పని మానేసి ఇష్టమయిన పనిచేస్తూ, ఆ తరువాత బాధపడటం! "తెలివి మెదడుకి సంబంధించినది, బద్ధకం శరీరానికి సంబంధించినద"ని కొందరంటారు. కాదు. అదీ మనసుకి సంబంధించినదే. అయితే తెలివి వేరు. అతి తెలివి వేరు. తనకున్న దానికన్నా ఎక్కువ తెలివిని ఊహించుకోవటాన్ని అతి తెలివి అంటారు. అటువంటి అతితెలివి రాజు కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"ఒక రాజు పక్క రాజ్యాల్తో తెగ యుద్ధాలు చేసి, చాలా సైన్యాన్ని కోల్పోయాడు. మొగవాళ్లు తగ్గిపోవటంతో ఆడపిల్లలకి వరుళ్లు తగ్గిపోయారు. పెళ్లికాని ఆడపిల్లలు ఎక్కువయ్యారు. మరోవైపు సైన్యంలో చేరటానికి యువకులూ మృగ్యం అయ్యారు. అప్పుడు రాజుగారికి ఒక మహత్తరమయిన ఆలోచన వచ్చింది. మంత్రిగారిని పిలిచి "ప్రస్తుతం మనదేశంలో మొగ, ఆడ పిల్లల పుట్టుక నిష్పత్తి ఎలా వున్నది?" అని అడిగాడు.

**"సమానంగా వున్నది రాజా! కాస్త అటూ ఇటూ అయినా, సగటున దేశంలో దంపతులకి సగం మంది ఆడపిల్లలూ, సగం మంది మొగవారూ పుడుతున్నారు"** అన్నాడు మంత్రి.



రాజుగారు గాఢంగా శ్వాసపీల్చి, "ఈ రోజు నించీ కొత్త శాసనం ప్రవేశపెడుతున్నాను. మొగపిల్ల వాడు పుట్టిన దంపతులు రెండో కాన్పుకి ప్రయత్నించవచ్చు. మళ్లీ మగపిల్లవాడే అయితే మూడోసారి కూడా ముచ్చట పడవచ్చు. ఆడపిల్ల పుట్టిన వారయితే వెంటనే అంతటితో ఆపుచెయ్యాలి..." అన్నాడు.

మంత్రి బిక్కమొహం వేసి, "కళాత్మక చిత్రంలో కథలా నాకొక్క ముక్క అర్థం కాలేదు మహాప్రభో! సరీగ్గా శలవియ్యండి" అన్నాడు.

అప్పుడా రాజు విశాలంగా నవ్వి, "మేధావులకీ, మంత్రులకీ అదే తేడా! నీలాటి వాడు మంత్రి అవటం వలనే దేశం ఇలా ఏడుస్తోంది. నేను చేసిన ఈ సంస్కరణవల్ల ఆడపిల్లల జననం ఒకరితో ఆగిపోతుంది. మొగవారిని కనేవారు మాత్రం మరోసారి ప్రయత్నిస్తారు. ఆ విధంగా మనదేశంలో మొగవారి కొరత తీరుతుంది. ఎలా వుంది నా ఆలోచన?" అని అడిగాడు.

మంత్రి మొహం వికసించింది. "మనదేశంలో సైన్యాన్ని పెంచటం కోసమూ, ఆడపిల్లల సంఖ్య తగ్గించటం కోసమూ మీకు వచ్చిన ఆలోచన అద్భుతం. ఈరోజే చాటింపు వేయిస్తాను" అని అక్కణ్నుంచి వేగంగా వెళ్లిపోయాడు.



బేతాళుడు ఇంతవరకూ కథ చెప్పి "విక్రమార్కా! పది సంవత్సరాల తరువాత ఏం జరిగి వుంటుంది? రాజుగారు ఆశించినట్టే ఆ రాజ్యంలో ఆడవారి సంఖ్య తగ్గి, మొగపిల్లలు మునగ మొక్కల్లా పెరిగి వుంటారా? ఈ ప్రశ్నకి తెలిసీ సమాధానం చెప్పకపోయావో - పధ్నాలుగో ఏటినుంచి పబ్బులకెళ్లే పిల్లలు నీకు పదిమంది పుడతారు" అన్నాడు. దానికి సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా అన్నాడు.

(సమాధానం *143* పేజీలో)

# ౨. రాజుగారి సమస్య



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్లి, శవాన్ని దింపి భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అపుడా శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నీ పట్టుదల చూస్తోంటే ఎంతో ముచ్చటగా వుంది. ఈ రోజుల్లో విద్యార్థులందరికీ ఇంత పట్టుదల ఉంటే ఎంత బావుణ్ను! ప్రతి వారికీ ప్రథమ శ్రేణిలో పాసవ్వాలని కోరిక వుంటుంది. కానీ పట్టుదల ఉండదు. పట్టుదల వేరు, కోరిక వేరు. పట్టుదలతో పాటు తెలివి కూడా ఉండాలి. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యే చాలామంది విద్యార్థుల్లో, తెలివితేటలు అభివృద్ధి చెందక పోవటానికి కారణం, పాఠాలు వల్లె వేయించటంలో అధ్యాపకుల కున్న ఉత్సాహం తెలివిని పెంచే ప్రశ్నలు వేయటంలో లేకపోవటమే! పాపం వారినని ఏమి లాభం? ఉత్తీర్ణత శాతమే కదా విద్యాసంస్థల రాబడికి కారణం. కానీ మనిషి జీవితంలో పైకి రావాలీ అంటే 'తెలివి' ప్రథమ స్థానం వహిస్తుంది. ఎన్నో ఇబ్బందుల్నించి బయటపడవేస్తుంది. దీనికి ఉదాహరణగా ఒక యదార్థ సంఘటన గురించి చెబుతాను.

ఒక పెద్ద సంస్థ ఉన్నది. కొన్ని కోట్ల వ్యాపారం చేస్తున్న సంస్థ అది. దాని ఆఫీసు ఒక అత్యాధునికమైన స్వంత భవంతిలో ఉన్నది. దారినపోయే ప్రతి ఒక్కరూ ఒక క్షణం ఆగి దానిని చూడకుండా వెళ్ళరు. చుట్టూ దీపాలతో దేదీప్యమానంగా మెరుస్తూ చూపరులను ఆకర్షించే ఆ భవంతి సంస్థకే గర్వకారణం.

ఆ సంస్థ యజమాని ఒకరోజు జమాఖర్చుల పట్టిక చూస్తూ ఉండగా, అందులో 'భవంతికి రంగులు వేసే ఖర్చు' అక్షరాలా అయిదు లక్షల రూపాయలు అని రెండుసార్లు కనిపించింది. ఉద్యోగిని పిల్చి అడిగాడు.

"అవును సార్! ఆర్నెల్ల కొకసారి రంగులు వేయించటం ఆనవాయితీ. బహుశ రాత్రంతా బయటనుంచి పడే దీపాల వెలుగు వలన గోడ రంగులు వెలిసిపోతూ ఉండవచ్చు..." అంటూ తన అభిప్రాయం చెప్పాడు.

"దీపాల వెలుతురుకి రంగులు వెలిసిపోవటం ఏమిటి? అసలు కారణం కనుక్కోండి" అంటూ ఆదేశించాడు యజమాని.

క్రింది స్థాయి ఉద్యోగుల్ని కనుక్కుంటే, అసలు కారణం అది కాదనీ పక్షుల రెట్టల వల్ల బయటగోడలు తరచు పాడయిపోతున్నాయనీ తెలిసింది. రాత్రిపూట భవంతిపై పక్షులు కూర్చోకుండా ఉండటం కోసం భవంతి చుట్టూ వైర్ల జల్లెడలు శాశ్వతంగా నిర్మించటానికి పదిహేనులక్షల రూపాయల ఖర్చుకి బోర్డు మీటింగ్‌లో అనుమతి ఇచ్చారు. కానీ సంస్థ యజమానికి ఇదెందుకో నచ్చలేదు. వాటిని నిర్మిస్తే భవంతి అందం



పాడైపోతుంది. 'అసలెందుకు పక్షులు నగరంలో అన్ని ఇళ్ళూ మానేసి తమ భవంతిపైనే కూర్చుంటున్నాయి' అని వాకబు చేసాడు. భవంతి ఎత్తుగా ఉండటం వలన అన్నారు కొందరు. చుట్టూ చెట్లు దగ్గిరగా ఉండటం వలన అన్నాడు మరికొందరు. రెండో కారణమే సరి అయినదన్న నిర్ణయానికి వచ్చారు.

భవంతి చుట్టూ ఉన్న చెట్లని కొట్టివేయటానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో, పక్షులు వచ్చేది చెట్లవలన కాదనీ, లైట్ల వెలుతురుకి వచ్చే పురుగుల కోసం అవి అక్కడ చేరుతూ ఉన్నాయని అసలు కారణం తెలిసింది. పురుగుల్ని కంట్రోలు చేసే మందుల కంపెనీకి ఏడాదికి రెండు లక్షల రూపాయలు కాంట్రాక్టు ఇవ్వటం ద్వారా ఈ సమస్యని అధిగమించవచ్చని తేల్చుకున్న అధికారులు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. కానీ ప్రధానాధికారికి మరొక అనుమానం వచ్చింది. నగరంలో ఇన్ని భవంతులు, వాటి చుట్టూ చెట్లూ ఉండగా, పురుగులు తమ భవంతినే ఎందుకు ఎన్నుకున్నాయి?

అప్పుడు అసలు కారణం తెలిసింది. తమ భవంతి అందం అందరికీ తెలియాలన్న అత్యుత్సాహంతో సిబ్బంది సాయంత్రం ఆరింటికే లైట్లు వేసేస్తున్నారు. అప్పటి కింకా నగరంలో లైట్లు వెలగకపోవటంతో పురుగులు ఇక్కడికి చేరుకుంటున్నాయి.

అసలు విషయం తెలుసుకున్న యజమాని, అరగంట ఆలస్యంగా దీపాలు వెలిగించమని ఆదేశాలు ఇవ్వటం ద్వారా సంస్థకి పదిలక్షల ఖర్చుని ఆదా చేసాడు.

❖ ❖ ❖

సమస్య వచ్చినప్పుడు ఒంటరిగా, మౌనంగా కూర్చుని దాని మూలకారణాలూ, పరిష్కారాలూ ఆలోచించటం ఉత్తమమయిన మార్గం! ఈ మార్గాన మనం పయనించగలగాలంటే అందుకు మనకు ఉపకరించే గురువు- 'ప్రకృతి'. ప్రకృతిని కాసేపు తదేకంగా పరిశీలిస్తే మనకు అప్పటిదాకా తెలియని వేలవేల విషయాలు తెలియవస్తాయి. ఎంతమంది ఎంత లోతుగా పరిశోధించి పరిశీలించి ఎన్ని సత్యాలను వెలికి తీసి చెప్పినా, ఇంకా ఎన్నో తరాలకు సరిపడే జ్ఞానం, సత్యం ప్రకృతిలో నిక్షిప్తమై ఉంటుంది. ప్రకృతికి జరామరణాలు లేవు. అందుకే ప్రకృతి నిత్యనూతనమై భాసిల్లుతుంటుంది.

భయమేసినప్పుడూ, దిగులుతో ఉన్నప్పుడూ అన్నిటికన్నా గొప్ప ఓదార్పు దొరికేది ప్రకృతిలోనే. గాలి ప్రేమతో స్పర్శించి పలకరిస్తుంది. చెట్లు కొమ్మల చేతులూపి ధైర్యం చెపుతాయి. కొండలు స్థిరంగా ఉండటం ఎలాగో నేర్పుతాయి.

కానీ అన్నిటికన్నా గొప్పవి గడ్డికొసల చివర్లు. అవి వంగి వుంటాయి. **'సమస్యకి కారణమూ, దానికి పరిష్కారమూ నీలోనే ఉన్నది చూసుకో...' అని చెపుతున్నట్టు ఆ కొసలు, చూపుడు వేళ్ళలా తమవైపుకే తిరిగి ఉంటాయి.** అందుకే తుఫాను వచ్చినప్పుడు చెట్లు కూలిపోతాయేమోగానీ, గడ్డి చెక్కు చెదరదు. అదే ప్రకృతి మనకి నేర్పే పాఠం.

ఆ పాఠమే "భావోద్వేగ నిబద్ధత". కష్టమొచ్చినప్పుడు కంగారు పడకుండా అటువంటి నిబద్ధతతో ఆలోచిస్తే సమస్యకి పరిష్కారం దొరుకుతుంది. ఒక పెద్ద సమస్య వచ్చినప్పుడు అలాటి స్థిత ప్రజ్ఞతతో ఆలోచించి, తన రాజుని కష్టం నుంచి బయటపడేసిన మంత్రి కథ చెపుతాను, శ్రమ తెలియకుండా ఉండటం కోసం విను" అంటూ చెప్పసాగాడు.

"కోసల దేశాన్ని ప్రదీపుడు అనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతడి మంత్రి సుదేష్ణుడు చాలా తెలివైనవాడు. రాజుగారికి ఏ సమస్యవచ్చినా తన చాతుర్యంతో పరిష్కరిస్తూ ఉండేవాడు.

ఒకరోజు ప్రదీపుడు తన సామంత రాజులకీ, మిగతా పరివారానికి విందు ఏర్పాటు చేశాడు. ఆ రోజుల్లో కూడా విందుతోపాటు సురాపానం ఉండేది. అందువల్ల **వెయ్యి సీసాల** అత్యద్భుతమైన ద్రాక్షాసారాని ప్రత్యేకంగా తెప్పించాడు. పది సంవత్సరాలు భూమిలో పాతపెట్టబడిన ఆ సురాపానంతో కూడిన విందు, నభూతో న భవిష్యతిగా చరిత్రలో నిలవాలని భావించాడు.

అయితే అదే సమయానికి వేగులవారు ఒక దేశద్రోహిని పట్టుకున్నారు. అతని ద్వారా ఒక దారుణమైన విషయం తెలిసింది. రాజు విందుని అపసవ్యం చేయటం కోసం కొందరు ఈర్ష్యాపరులు ఒకే రంగు, అదే ఆకారంతో ఉన్న **ఒక విషం సీసాని** ఆ వెయ్యి సీసాల్లో కలిపారు. ఆ విషం సీసాని మానవమాత్రు లెవరూ తేడా కనుక్కోలేరు. అందులోని సారా తాగితే మొదటి గంట వరకూ దాని ప్రభావం ఏమీ ఉండదు. **సరిగ్గా "గంట" తరువాత**, ఆ సారాని తాగిన వ్యక్తి అకస్మాత్తుగా నేలకూలి మరణిస్తాడు.

మరొక "గంట"లో విందు ప్రారంభమవుతుంది. ఎలా?

ఈ విధంగా రాజు సతమతమవుతూ, మంత్రిని పిలిపించి 'ఏం చేద్దామ'ని సలహా అడిగాడు. అప్పుడా మంత్రి "రాజా! రేపు సాయంత్రం ఉరితీతకు ఏర్పాట్లు కావింపబడిన ఖైదీలు మన దగ్గర కొందరున్నారు. వారిమీద ఈ ప్రయోగం చేసి, కల్తీ సీసాని పట్టుకుందాం" అన్నాడు.

రాజు మంత్రిని వెర్రివాడిని చూసినట్టు చూసి "మన దగ్గర ఉరితీత ఖైదీలు వెయ్యిమంది లేరు" అన్నాడు. మంత్రి వినయంగా "వెయ్యిమంది అవసరం లేదు మహారాజా! పదిమంది చాలు" అన్నాడు.

బేతాళుడు ఇంతవరకూ చెప్పి, "వెయ్యిలో ఆ కల్తీసీసాని కేవలం పదిమందిని ఉపయోగించి ఆ మంత్రి ఏ విధంగా పట్టుకోగలిగాడు? మరొక గంటలోనే విందు ప్రారంభమవుతుందాయె! మరోవైపు, విష ఫలితం తేలటానికి కూడా గంటే పడుతుంది కదా! ఇది ఏ విధంగా సాధ్యమవు తుంది? అయినా... ఒకరో... ఇద్దరో... వందో... కాకుండా 'పదిమంది' లెక్కేమిటి? ఈ ప్రశ్నకి తెలిసీ నువ్వు సమాధానం చెప్పక పోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది. జాగ్రత్త" అన్నాడు.

(సమాధానం 144 పేజీలో)

# 3. సమయం విలువ



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్లి శవాన్ని దింపి భుజాన వేసుకుని వెనక్కి తిరిగి మౌనంగా నడవసాగాడు. అప్పుడా శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు "రాజా! నీ పట్టుదల చూస్తోంటే ముచ్చటేస్తోంది. కానీ విజయం సాధించా లంటే కేవలం కృషి మాత్రమే సరిపోదు. దానికి తోడు తెలివి, సరి అయిన పద్ధతిలో ఆలోచన, ఒక ప్రణాళిక కావాలి. అవే లేకపోతే "పాత్రలో నీటిపై తేలుతూ వున్న ఐసుముక్క కరిగి నీటిలో కలిసిపోతే పాత్రలో నీటిమట్టం పెరుగుతుందా? తగ్గుతుందా? అలాగే వుంటుందా?" అన్న ప్రశ్నకి, "ఇది మా మాస్టారు చెప్పలేదు" అని సమాధానం ఇచ్చే అభ్యర్థిలా తయారవవలసి వస్తుంది.

ఒక విషయం పూర్తిగా తెలియటాన్ని "పాండిత్యము" అంటారు. సమయానుకూలంగా ప్రవర్తించటాన్ని "సమయస్ఫూర్తి" అంటారు. పరిష్కారాన్ని ఆలోచించగలిగే శక్తిని "ప్రజ్ఞత" అంటారు. ఇవన్నీ కలిస్తే వచ్చేదే "జ్ఞానము". జ్ఞానము లేని చదువు వృథా.

పదో క్లాసు చదువుతూ ఎనిమిదో క్లాసులో చదివింది మర్చిపోవటం కాదు జ్ఞానమంటే..! ర్యాంకుల కోసం సిలబస్‌ని మాత్రమే ముక్కున పెట్టుకోవటం కాదు తెలివంటే...! ఆ రోజుల్లో గురువులు ఆశ్రమాల్లో జ్ఞానాన్ని బోధించేవారు. పిల్లలు ఏ రంగంలో రాణిస్తారో గ్రహించి దానికి సంబంధించిన విద్య నేర్పేవారు. మందలో వెళ్ళినట్టు అందరూ ఏ చదువు వైపు వెళితే అటు తోలేవారు కాదు. తండ్రులు పిల్లల్ని రాత్రిళ్లు పక్కన కూర్చోబెట్టుకుని కథలు చెప్పేవారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టేవారు. పిల్లల చొప్పదంటు ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పేవారు. తెలివిని పెంచేవారు. రాజా! ప్రతి తల్లి, తండ్రి, ఉపాధ్యాయుడు పిల్లల్ని అడిగి, వారు సమాధానం చెప్పలేకపోతే తాను చెప్పగలిగే ఒక చిక్కు ప్రశ్నని అడుగుతున్నాను. దీనికి సమాధానం తెలిసీ నువ్వు చెప్పకపోయావో, నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అంటూ చెప్పసాగాడు.

"పాండవులని సమూలంగా నాశనం చెయ్యటానికి కౌరవులు పన్నిన పన్నాగమే లక్క ఇల్లు. ఒకసారి మంట పెడితే, **గంటలో మొత్తం దగ్ధమయ్యేలా** దాన్ని మయుడు నిర్మించాడు. అయితే, పాండవులపై ప్రేమచేత దానికి ఒక సొరంగమార్గం కూడా ఏర్పాటు చేశాడు. అనుకున్నట్టుగానే పాండవులు నిద్రిస్తున్న

సమయాన కౌరవులు లక్క ఇంటిని తగలబెట్టారు. నాలుగు వైపులనుంచీ మంటలు వ్యాపించాయి. నకులుడు చురుకైనవాడు. మిగతా నలుగురినీ సొరంగ ద్వారం వద్దకు చేర్చాడు. అయితే ఇక్కడ ఒక చిక్కు వచ్చింది.

ఎన్నో మెలికలు తిరిగిన ఆ సొరంగంలో అక్కడక్కడా లోతయిన గుంతలున్నాయి. దారి అస్తవ్యస్తంగా ఉన్నది. కాగడా లేకుండా అందుగుండా ప్రయాణం చేయడం అసంభవం. ఆ చిమ్మ చీకటిలో వారివద్ద ఒకే కాగడా వున్నది. అది కేవలం గంటసేపు మాత్రమే వెలుగుతుంది.

మరొక చిక్కు ఏమిటంటే – ఆ సన్నటి సొరంగం గుండా, ఒకే సమయానికి ఇద్దరు కన్నా ఎక్కువ ప్రయాణం చెయ్యలేరు. మరో విధంగా చెప్పాలంటే, ఒకరు కాగడా పట్టుకుని ఒకర్ని అటువైపు దింపి, వెనక్కి రావాలన్నమాట. ఆ విధంగా ఒకరు అటూ ఇటూ నాలుగుసార్లు ప్రయాణం చేస్తే, అయిదుగురూ అవతలి వైపుకి చేరుకుంటారు. నకుల సహదేవులు చురుకైనవారు. వారికి అటువైపు వెళ్లటానికి **అయిదు** నిమిషాలు పడుతుంది. అర్జునుడు నడవటానికి **పది** నిమిషాలు, స్థూలకాయుడైన భీముడు వెళ్లడానికి **ఇరవై** నిమిషాలు, వయసులో కాస్త వృద్ధుడైన ధర్మరాజుకి **పాతిక** నిమిషాలూ పడతాయి. అయిదుగురూ అటువైపు చేరుకోవటానికి మొత్తం ఎంతసేపు పడుతుంది?

విక్రమార్కా! భర్తృహరి తన సుభాషితంలో 'తెలివియొకింతలేని యెడ దృప్తుడనై' అన్నాడు. సమాధానం రాకపోతే ఫర్వాలేదు. కనీసం ఆలోచించటానికి కూడా నిరాకరించే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గురువులు ఈ విభాగంలోకి వస్తారు.

మధ్యమమైన తెలివితేటలున్నవారు ఈ విధంగా ఆలోచిస్తారు. "నకుల సహదేవులు ముందుగా అటువెళ్తారు (5 నిమిషాలు). నకులుడు వెనక్కి వచ్చి (5) కాగడా చూపిస్తూ అర్జునుడిని అటు చేర్చి (10), వెనక్కి వచ్చి (5), భీముడినీ (20), మళ్లీ వచ్చి (5), ధర్మజుడినీ (25) అటు చేరుస్తాడు. మొత్తం 75 నిమిషాల్లో అంటే, గంటంపావులో అందరూ అటువైపు నుంచి బయటపడతారు" అని చెప్తారు. అయితే, 'కాగడా **గంట**లో ఆరిపోతుంది. లక్క ఇల్లు **గంట**లో దగ్ధమైపోతుంది. పరిష్కారం ఎలా?' అన్న ప్రశ్నకి వారి తెలివితేటలు సరిపోవు. "ధీరుల్ విఘ్న నిహన్యమానులగుచున్" అన్నాడు అదే భర్తృహరి. ఉన్నతమైన తెలివి గలవారే ఈ సమస్యకి పరిష్కారం చెప్పగలరు. తెలిసీ చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవు తుంది" అన్నాడు.

(సమాధానం145 పేజీలో)

# 4. జ్ఞానానికి మొదటి మెట్టు - తర్కం



పట్టువదలని విక్రమార్కుడు తిరిగి చెట్టువద్దకు వెళ్లి శవాన్ని దింపి భుజాన వేసుకుని వెనక్కి తిరిగి నడవసాగాడు. రాజుకి మౌనభంగం కలిగించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నీ పట్టుదల చూస్తోంటే నాకు చాలా ముచ్చటగా వుంది. కానీ మనిషికి పట్టుదల ఒక్కటే ఉంటే లాభం లేదు. జ్ఞానం కూడా ఉండాలి. 'ఇరవైని సగంతో భాగించి పది కలిపితే ఎంత?' అన్న ప్రశ్నకి "ఇరవై" అని సమాధానం చెప్పేవాడు జ్ఞాని కాదు. ఆలోచించకుండా తొందరగా చెప్పెయ్యాలన్న కంగారు ఉన్నవాడు. అతడికి జ్ఞానం లేదని కాదు. కానీ ఇరవైని సగం (1/2)తో భాగిస్తే నలభై అవుతుందన్న జ్ఞానాన్ని, అతడి తొందరపాటు హరించి వేసింది. జ్ఞానులు వేరు, జ్ఞానులమని అనుకునేవారు వేరు. మనుష్యులు నాలుగు రకాలు. తనకు తెలియనిదేదీ లేదనుకునేవాడు అజ్ఞాని. తనకి తెలిసినదే నిజమని నమ్మేవాడు మూర్ఖుడు. కొత్తని ఒప్పుకోలేనివాడు అహంభావి. తనకున్న మిడిమిడి జ్ఞానంతో అవతలి వారిని అపహాస్యం చేసి అవమానించేవాడు నీచుడు. అలాంటి అహంభావి అయిన ఒక నరమాంస భక్షకుడి కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ చెప్పసాగాడు.

"ఒక అడవిలో రాజుగారు, మంత్రి, మరో ఇద్దరు సైనికాధికారులు నరమాంస భక్షకులకి దొరికారు. కొవ్వుతో నిండుగా ఉన్న రాజుగారి మాంసాన్ని తినటానికి అందరూ చుట్టూ చేరి లొట్టలు వేయసాగారు. కాల్చితినటం కోసం కొందరు కర్రలు పోగుచేసి పెద్దగా మంటలు రగిల్చారు. ఈ లోపులో మరికొందరు పెద్ద కుండ తెచ్చి నూనె పోసి వేడి చేసారు. రాజుని కాల్చుకు తిందామని కొందరూ, వేయించుకు తిందామని కొందరూ ఆ విధంగా వాదులాడుకోసాగారు. అప్పుడా భక్షకుల నాయకుడు తన అనుచరులతో "మీలో మీరు కొట్టుకోకండి. రాజుగార్ని మనం ఎలా తినాలో వారి మంత్రిగారు నిర్ణయిస్తారు" అంటూ మంత్రి వైపు తిరిగి నవ్వుతూ "మీ రాజుగారిని మేము ఇప్పుడు ఏ విధంగా తింటాము? కాల్చి తింటామా? వేయించుకు తింటామా?



ఊహించి చెప్పు. నువ్వు చెప్పేది నిజమయితే ఆయన్ని కాల్చి తింటాము. నువ్వు చెప్పింది నిజం కాకపోతే వేయించుకు తింటాము" అన్నాడు అతి తెలివిగా!

ఒక క్షణం ఆలోచించి "మీరు రాజుగార్ని వేయించుకు తింటారు" అన్నాడు మంత్రి. నాయకుడు వికటాట్ట హాసం చేసి "సరిగ్గా చెప్పావు. ఆయన్ని వేయించుకుని..." అంటూ, ఏదో స్ఫురించిన వాడిలా ఆగిపోయాడు. మంత్రి సన్నగా నవ్వాడు.

నాయకుడికి తన తప్పు అర్థమైంది. దాంతో కోపం తారాస్థాయికి చేరుకుంది. చేతకానివాడికి ఓటమిలో వచ్చేది కోపమే కదా!

అయితే అతను కాస్త తెలివైన వాడు. వారికి మరో పరీక్ష పెట్టదల్చుకున్నాడు. "రాజుని వదిలిపెట్టండి. మిగతా ముగ్గుర్నీ భూమిలో మెడలోతు ఒకరి వెనుక ఒకరు ఉండేటట్టు వరుసగా పాతండి. తాటాకులతో తయారు చేసిన టోపీలు రెండు, కొబ్బరాకులతో తయారు చేసినవి రెండు తీసుకు రండి" అని ఆజ్ఞాపించాడు. అనుచరులు టోపీలు తెచ్చే లోపులో ముగ్గురి కళ్ళకు గంతలు కట్టించి, భూమిలో ఒకరి వెనుక ఒకర్ని మెడలోతు పాతించాడు. ఈ లోపులో అనుచరులు నాలుగు టోపీలు తెచ్చారు. ముగ్గురికీ మూడు టోపీలు పెట్టి, నాలుగో దాన్ని చెట్ల వెనక్కి విసిరేసాడు. ముగ్గురి కళ్లగంతలూ విప్పుతూ "మంత్రీ! నీవు తెలివైన వాడివని అర్థమైంది. అందుకే నిన్ను మధ్యలో పాతిపెట్టించాను. మీ ముగ్గురిలో ఎవరైనా సరే ఒకరు, తన తలపై టోపీ కొబ్బరాకులదో, లేక తాటాకులదో సరిగ్గా మూడు క్షణాల్లో చెప్పగలిగితే అందర్నీ వదిలేస్తాము. లేకపోతే రాజుగారిని వేయించి, మిమ్మల్ని కాల్చుకుని తింటాము" అన్నాడు.

మంత్రి కళ్లు విప్పేసరికి, ముందువాడి తాటాకు టోపీ కనబడింది.

"మూడు..." అన్నాడు నరమాంస భక్షక నాయకుడు. ఇక రెండు క్షణాలు మాత్రమే ఉన్నాయి. తన తలపై ఏమున్నదో తెలీదు. తుప్పల్లోకి ఏది విసిరేసాడో తెలీదు. వెనుక వ్యక్తి తలపై ఏమున్నదో తెలియదు.

మంత్రి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"రెండు" అన్నాడు నాయకుడు. వెనుకనున్నవాడు అసలు మాట్లాడటం లేదు. సమయం గడుస్తోంది. అందర్నీ రక్షించవలసిన బాధ్యత తనపై ఉన్నదని మంత్రికి తెలుసు. రెండిటిలో ఏదో ఒకటి చెప్పి, అదృష్టం పరిశీలించుకోవటం ఇష్టం లేదు. ఇది తెలివితేటలకి సంబంధించిన సమస్య!

"ఒకటి" అన్నాడు నాయకుడు.

మంత్రి వెంటనే సమాధానం చెప్పాడు. "నా తలపై ఉన్నది కొబ్బరాకుల టోపీ..."

బేతాళుడు ఇంతవరకూ కథ చెప్పి "రాజా! మంత్రి ఏ విధంగా సరి అయిన సమాధానం చెప్పి తన వారిని రక్షించుకోగలిగాడు? ఏ రకమైన తార్కిక జ్ఞానం ఉపయోగించాడు? తెలిసీ చెప్పకపోయావో, నీ తల వేయి వ్రక్కలవుతుంది" అన్నాడు.


(సమాధానం *146* పేజీలో)

# 5. కృషికీ, తెలివికీ తేడా!



పట్టువదలని విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. రాజుకి మౌనభంగం కలిగించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నన్ను భుజం మీద వేసుకుని నువ్వు కొంతదూరం నడవటం, నీ మౌన భంగంతో తిరిగి నేను వచ్చి చెట్టెక్కడం, మళ్లీ నువ్వు వెనక్కి రావటం చూస్తోంటే ఒకవైపు నీ మీద జాలి వేస్తోంది, మరొకవైపు నీ పట్టుదలకి ముచ్చట వేస్తోంది. ప్రదీపుడు అనే రాకుమారుడు కూడా తాను ముచ్చటపడిన అమ్మాయికోసం ఎన్నోసార్లు ఈ విధంగానే తిరిగాడు. రాజా! ఇప్పుడు నేను చెప్పబోయే కథలో మెలిక క్లిష్టమైనది. చివరకు ఒక కంప్యూటర్‌కు కూడా ఈ ప్రశ్నకి సమాధానం చెప్పటానికి చాలాకాలం పడుతుంది. లెక్కల్లో నిష్ణాతుడైన శ్రీరామానుజానికే ఈ లెక్క కట్టడానికి పది నిమిషాలు పట్టిందట. అయితే కాసింత తెలివితేటలు ఉపయోగిస్తే దీన్ని చేయటానికి అయిదు సెకన్లు చాలు అని ఆ మేధావే తరువాత చెప్పారు. శ్రమ తెలియకుండా ఉండటానికి నీకా కథ చెపుతాను. విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.



"ప్రదీపుడు అనే రాకుమారుడి విద్యాభ్యాసం పూర్తయిన సందర్భంగా తండ్రి అతడికి ఒక శ్వేతాశ్వాన్ని బహుమతిగా ఇచ్చాడు. చూడ ముచ్చటగా ఉన్న ఆ తెల్లగుర్రంపై ప్రదీపుడు స్వారీకి బయల్దేరి నగరం శివర్లకి వచ్చాడు. అక్కడికి కొన్ని క్రోసుల దూరంలో ఒక శక్తి దేవాలయం ఉన్నది. అక్కడికి వెళ్లి తన గుర్రానికి నుదుట బొట్టుపెట్టి తీసుకురావాలని అతడి ఉద్దేశం. రాజా! ఆ రోజుల్లో దూరాలు యోజనములు, క్రోసులలో లెక్కించబడేవి. కానీ ఈ ప్రశ్నకి అవి అప్రస్తుతం.

యువరాజు నగరం దాటుతూండగా హిమసమీర అనే ఒక పదునైదేండ్ల ఇందువదన గుడివైపు వెళ్తూ కనపడింది. ఆమె అందం అరవిందం, పొంకం కలవింకం. ఆ నీహారికని చూసిన ప్రదీపుడి యవ్వనం మేఘమైంది. ప్రేమ వర్షమైంది.

తన తొలి ప్రేమ గురించి చెప్దామను కున్నాడు గానీ ధైర్యం సరిపోలేదు. చెదిరిన గుండెతో అతడు కాళికాదేవి గుడివైపు సాగిపోయాడు.

హిమసమీర **గంటకు 3 క్రోసుల వేగంతో** గుడివైపు నడుస్తోంది.

అంతకు **ఇరవై రెట్ల వేగంతో** 3 నిమిషాల్లో ప్రదీపుడు అశ్వంపై గుడికి చేరుకున్నాడు.

శక్తి స్వరూపిణి అయిన కాళికాదేవి గుడిని చూడగానే అతడికి ధైర్యం వచ్చింది. "మనసులో ప్రేమని తెలుపలేని నేను రేపు రాజ్యమెలా ఏలతాను?" అనుకున్నాడు. జగన్మాత దీవించినట్టుగా అనిపించింది. వేగంగా వెనుదిరిగి, **అదే వేగంతో** సమీరను చేరుకున్నాడు.

ఆ పాటికి ఆమె కాసింత దూరం ముందుకు వచ్చింది.

ఆమెని సమీపించగానే యువరాజు ధైర్యం మళ్లీ జారిపోయింది.

నూనూగు మీసాలవాడు, నూలుపోగైన హృదయము వాడు. వరించిన స్త్రీకి ఆ మాట చెప్పటమనేది యుద్ధంలో విజయలక్ష్మిని వరించటం కన్నా కష్టమని వానికి అనుభవ పూర్వకంగా తెలిసింది. దిగులుగా వెనుదిరిగాడు.

తిరిగి గుడికి చేరుకోగానే, మళ్లీ ధైర్యం వచ్చింది. వెనుదిరిగి ఆమె వద్దకు వచ్చాడు. ఈ విధంగా ఆమెకూ, గుడికీ మధ్య తిరుగుతూనే వున్నాడు.

భక్తితో సేవించిన జగన్మాత వద్ద ధైర్యం పొందటం, రక్తితో ప్రేమించిన జగన్మోహిని వద్ద అధైర్యం చెందటం..! సముద్ర కెరటంలా ముందుకీ వెనక్కీ సాగిన ఆ యువకుడు చివరకి గుర్రాన్ని గుడి ముంగిట ఆపి, లోపలికి ప్రవేశించి విగ్రహం ముందు చేతులు జోడించి నిలబడి "తల్లీ! మనసులో మాట మగువకి చెప్పే శక్తినివ్వు" అని వేడుకున్నాడు.

అప్పుడు "శక్తి రాతి విగ్రహంలో ఉండదు. దానిని చూసి ప్రేరణ పొందే మనసులో ఉంటుంది" అని తీయటి స్వరం వెనుక నుంచి వినపించింది.

చప్పున వెనుదిరిగి చూస్తే, అప్పటివరకూ అతడు పడుతున్న కంగారునీ, మకతికనీ ఓరకంట గమనిస్తూ గుడిని చేరుకున్న హిమసమీర, పెదవుల వెనుక నవ్వుని అదిమిపెట్టి అక్కడ నిలబడి వున్నది.

ఇంతవరకూ కథ చెప్పిన బేతాళుడు "రాజా! ఆమెకీ గుడికీ మధ్య గాలిపటంలా తిరిగిన ప్రదీపుడు మొత్తం ఎంత దూరం ప్రయాణం చేశాడు? కొత్త అశ్వం ఎన్ని క్రోసుల దూరం తిరిగింది? మహామహులైన గణిత శాస్త్రజ్ఞులనే ఎంతో కలవరపెట్టి కష్టపెట్టిన ఈ ప్రశ్నకి తెలిసీ సమాధానం చెప్పలేకపోయావో, ఉన్న పార్టీలో సముచిత స్థానం దొరక్క, కొత్త పార్టీలో చేరాలా వద్దా అన్న సందిగ్ధంతో ఉన్న చిన్న తరహా నాయకుడిలా పిచ్చెక్కి పోతావు సుమా" అన్నాడు.

(సమాధానం 148 పేజీలో)

# 6. అన్న కన్నా తమ్ముడు పెద్ద



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా వెనుదిరిగి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నీకున్నంత ఓపిక విద్యార్థులకి ఉంటే ఎంత బావుండేది! ఈ సంవత్సరం చదివింది వచ్చే సంవత్సరం మర్చిపోవటం, భారతదేశానికి మధ్యన ఉన్న పర్వతాలు ఏమిటో పదో తరగతిలో గుర్తుండక పోవటం కొందరు విద్యార్థుల స్థితి అనుకుంటే దుఃఖం కలుగుతోంది. ఆలోచన, అనుభవం కలిస్తే కలిగేది జ్ఞానం. జ్ఞానానికి హద్దులు లేవని నిరూపించిన అటువంటి యువకుడి కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

❖ ❖ ❖

ఓరుగల్లు సమీపంలో నాగరాజు అనే బీద యువకుడు ఉండేవాడు. అతడు జయలక్ష్మి అనే అమ్మాయిని ప్రేమించాడు. ధనవంతుడయిన లక్ష్మి తండ్రికి, తన అల్లుడు గొప్ప జ్ఞానం కలవాడై ఉండాలని కోరిక. అందుకని బీదవాడైనా సరే తన ప్రశ్నలకి సరి అయిన సమాధానం చెపితే అతడిని అల్లుడిని చేసుకోవటానికి అభ్యంతరం లేదని అన్నాడు. నాగరాజు ఆ షరతుకి ఒప్పుకున్నాడు.

"నీకు నచ్చిన ఒక అక్షరం చెప్పు" అన్నాడు పిల్ల తండ్రి రంగడు.

"జ" అన్నాడు నాగరాజు ప్రియురాలు జయలక్ష్మి పేరులో మొదటి అక్షరం చెపుతూ.

"అయితే జన్మదినాల మీద ప్రశ్నలడుగుతాను చెప్పు. నా కూతురు కేవలం ఒక జన్మదినమే జరుపుకుంది. చూస్తే నువ్వు చాలా పేదవాడిలా కనపడుతున్నావు. నిజాయితీగా చెప్పు. ఇప్పటికి నువ్వు ఎన్ని జన్మదినాలు జరుపుకున్నావు?" అని అడిగాడు.

"నేను కూడా ఒకటే జరుపుకున్నాను. మిగతావన్నీ దాని తాలూకు వార్షికోత్సవాలు మాత్రమే" అన్నాడు నాగరాజు.

రంగడు సంబరపడి సంతోషంగా తలూపుతూ "బాగా చెప్పావు. నాకు నచ్చావు. మరో ప్రశ్న. నా పెద్దకొడుకు, రెండోవాడు **ఆరు గంటల తేడాతో** పుట్టిన కవలలు. పెద్దవాడు నిన్న పుట్టినరోజు చేసుకున్నాడు. రెండోవాడు రేపు చేసుకుంటాడు. ఇదెలా జరిగింది?" అని ప్రశ్నించాడు.

"పెద్దవాడు ఫిబ్రవరి ఇరవైఎనిమిదిన, ఆ తరువాతి వాడు మరుసటి రోజున... అంటే మార్చి ఒకటిన పుట్టి ఉంటారు. ఇది లీపు సంవత్సరం. మధ్యలో ఫిబ్రవరి 29 కూడా వుంటుంది కాబట్టి, రేపు మార్చి ఒకటిన చిన్నవాడు జరుపుకుంటాడు."

"అద్భుతంగా చెప్పావు. అయితే నాక్కాబోయే అల్లుడికి ఈ తెలివితేటలు సరిపోవు. ఇంకా కావాలి. చాలా క్లిష్టమైన ఆఖరి ప్రశ్న వేస్తున్నాను. ఆలోచించి సమాధానం చెప్పు" అంటూ అడిగాడు. "కుశుడు, లవుడు ఆరు గంటల తేడాతో పుట్టిన కవలలు. కుశుడు ముందు, లవుడు తరువాత పుట్టారు. కానీ ఆ తమ్ముడే తన పుట్టినరోజు 24 గంటల ముందు జరుపుకుంటాడు. ఆ మరుసటిరోజు కుశుడి పుట్టినరోజు! ఎలా ఇది సాధ్యం? తల్లికడుపులో మొదట రూపు దిద్దుకున్న వాడు అన్న అనీ, వాడు తల్లిగర్భంలో వెనుక వుంటాడనీ, ముందు పుట్టినవాడు తమ్ముడనీ తలతిక్క సమాధానం చెప్పకు. ఆలోచించు. అన్నకన్నా తమ్ముడి జన్మదినం ఒకరోజు ముందు ఎలా వస్తుంది? డిసెంబరు ఆఖరి రోజు, జనవరి ఒకటి లాంటి సమాధానాలు దీనికి సరిపోవు కదా. ఎలా ఇది సాధ్యమయింది? సమాధానం చెప్పి నా కూతురి పాణిగ్రహణం చెయ్యి" అన్నాడు.

నాగరాజుకి ఏం చెప్పాలో తెలియలేదు. కిటికీ వెనుక అలికిడి అయితే అటు చూశాడు. లోపల్నుంచి లక్ష్మి ఆకాశంవైపు చూపిస్తూ విమానంలా సైగ చేసింది. దాంతో నాగరాజుకి సమాధానం దొరికి, అది చెప్పి రంగడికి అల్లుడు అయ్యాడు.

ఇంతవరకూ చెప్పి బేతాళుడు "రాజా! ఇది ఏ విధంగా సాధ్యమయింది? అన్నకన్నా తమ్ముడు పెద్ద వాడవటానికీ, విమానానికీ ఏమిటి సంబంధం? తెలిసీ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అన్నాడు.

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

*(సమాధానం 149 పేజీలో)*

# 7. పడవ దాటిన సమస్యలు



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్లి, శవాన్ని భుజాన వేసుకుని వెనుదిరిగి మౌనంగా నడవసాగాడు. అప్పుడు ఆ శవంలోని బేతాళుడు రాజుకి మౌనభంగం కలిగించటం కోసం ఈ విధంగా సంభాషించటం ప్రారంభించాడు.

"రాజా! నిన్ను చూస్తుంటే నాకు ఒక రైతు కథ గుర్తొస్తోంది. అతడు కూడా నీలాగే ఒక పిల్లిని, కోడిని, ధాన్యం గింజల సంచినీ ఒక నదికి ఇట్నుంచి అటు తీసుకువెళ్లడానికి అయోమయంతో చాలా కష్టపడ్డాడు. శ్రమ తెలియకుండా ఉండటం కోసం నీకా కథ చెపుతాను విను" అంటూ ప్రారంభించాడు.

❖ ❖ ❖

ఒక పడవ మీద ఓ రైతు తనతోపాటు కేవలం ఒక వస్తువునిగానీ, జంతువునిగానీ అటు తీసుకువెళ్లగలడు. అతడితోపాటు ఒక పిల్లి, కోడి, ఒక ధాన్యం బస్తా ఉన్నాయి. ముందు పిల్లిని తీసుకెళితే, ఇక్కడ ధాన్యాన్ని కోడి తినేస్తుంది. ముందు ధాన్యాన్ని తీసుకెళ్తే, పిల్లి కోడిని భక్షిస్తుంది. అవతలి ఒడ్డున ఏరెంటిని వదిలి ఇటు వచ్చినా అదే పరిస్థితి! ఇటువంటి పరిస్థితిలో ఏం చెయ్యాలి?

కాస్త తెలివితేటలున్నవాడు ఎవరైనా ఈ సమస్యకి కొద్దిగా ఆలోచించి పరిష్కారం చెపుతాడు. రైతు ముందు కోడిని అటు తీసుకువెళ్లి, ఒక్కడే వెనక్కి వచ్చి, ధాన్యాన్ని అటు తీసుకెళ్లి, కోడిని తిరిగి తనతోపాటు వెనక్కి తెచ్చి, పిల్లిని తీసుకెళ్లాడు. దాన్ని అక్కడ వదిలి, చివరిసారి ఒంటరిగా వెనక్కి వచ్చి కోడిని కూడా తీసుకువెళ్లాడు.

అయితే రాజా! ఇంతకన్నా కష్టమైన ప్రశ్న మరొకటి ఉన్నది. ఇది కూడా నరమాంస భక్షకులకి సంబంధించిన ప్రశ్నే!



నదికి ఇవతలి ఒడ్డున ముగ్గురు నరమాంస భక్షకులు, అటువైపు ఒక రాజుగారు, మంత్రి, సైనికుడూ ఉన్నారు. నది వెడల్పు తక్కువేగానీ ప్రవాహం ఉధృతంగా ఉన్నది.

నరమాంస భక్షకుల వైపు పడవ ఉన్నదిగానీ, అది కేవలం ఇద్దర్ని మాత్రమే మోయగలదు. "మాలో ఒకరు అటువైపు వచ్చి మీలో ఒకర్ని ఇటు తీసుకొస్తాం. అలా మూడుసార్లు చేస్తే, మీ ముగ్గురూ ఇటు రావచ్చు. ఆ తరువాత మేము అటు వెళ్తాము" అని ఒక నరమాంస భక్షకుడు బిగ్గరగా అరిచాడు.

వారి ఔదార్యానికి రాజు సంతోషించాడు గానీ మంత్రి సందేహించాడు. "రాజా! మనలో ఒకరు అటు వెళ్తే, ఆ ముగ్గురూ అతడిని కాల్చుకు తింటారు. ఇటువైపుగానీ, అటువైపు గానీ **మన బలగం వారి సంఖ్యతో సమానంగా ఉండాలి... లేదా వారికన్నా ఎక్కువ అయినా అయి ఉండాలి**. అలా అయితేనే ఆ ప్రతిపాదనకి ఒప్పుకుందాం" అని సలహా ఇచ్చాడు. రాజుకి మంత్రి మాటలు సత్యమే అనిపించాయి. ఆ విధంగానే చెప్పమన్నాడు.

మంత్రి బిగ్గరగా "మీలో ఒకరు ఇటు రండి. మేమిద్దరం అటు వస్తాము. అక్కడకు వచ్చాక ఏమి చెయ్యాలో మేము చెప్తాము. ఆ విధంగా అయితేనే మీరు ఇటువైపుకి, మేము ముగ్గురం అటు తీరానికీ వెళ్లే వీలుంటుంది" అని అరిచాడు.

తమ ఎత్తు పారలేదన్న ఆశాభంగం నరమాంస భక్షకుల్లో స్పష్టంగా కనిపించింది. మంత్రి అనుమానం నిజమే. ఒకరి తరువాత ఒకర్ని తినేద్దామను కున్నారు. కానీ ఇప్పుడు మంత్రి షరతులకు ఒప్పుకోక తప్పదు. ఎందుకంటే వారు తప్పనిసరిగా అటువైపు తీరానికి చేరుకుని దట్టమైన అడవిలోకి వెళ్లిపోవాలి. అందుకని 'సరే' అన్నారు..."

బేతాళుడు ఇంతవరకూ చెప్పి, "విక్రమార్కా! ఎటువంటి పరిస్థితిలోనూ, ఏ తీరాన్నైనా నరమాంస భక్షకుల సంఖ్య తమ వారికన్నా ఎక్కువ వుండకుండా సరిచూసుకుంటూ మంత్రి తన వారందర్నీ అటువైపుకి ఏ విధంగా తీసుకెళ్లాడు? తెలిసీ చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అన్నాడు.

(సమాధానం 150 పేజీలో)

# 8. తెలివికి హద్దుల్లేవు



పట్టు వదలని విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని వెనుదిరిగాడు. రాజుకి మౌనభంగం కలిగించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా చెప్ప సాగాడు.

"రాజా! ఎన్ని రకాల ప్రశ్నలు వేసినా, వాటికి నువ్వు చెప్పే సమాధానాలు చూస్తోంటే, ఈ ప్రపంచంలో నీకు తెలియని విషయం ఏమీ లేదా- అన్న సందేహం నాకు కలుగుతుంది. అయితే, జ్ఞానం ఉండటంవేరు. తమకి జ్ఞానం వున్నదన్న అహంభావం వేరు. తమ జ్ఞానమే సరి అయినది అనుకునేవారు 'విమర్శ' పేరిట ఇతరుల్ని హింసిస్తూ ఉంటారు. అవతలివారి అభిప్రాయాల్ని ఒప్పుకోరు. తమకే తెలివితేటలు, నిర్దిష్టమైన అభిప్రాయాలూ ఉన్నవని మనస్ఫూర్తిగా నమ్ముతారు. ఏదో ఒకరోజు దెబ్బ తినేవరకూ అటువంటి భ్రమలోనే బతుకుతారు. అలాంటి అహంభావి అయిన ఒక రాజు కథ చెపుతాను. శ్రమ తెలియ కుండా విను..." అంటూ ప్రారంభించాడు.

❖ ❖ ❖

"కౌశాలీ నగరాన్ని ప్రశాంతుడు అనే రాజు పాలించే రోజుల్లో పాటలీపుత్రాన్ని వక్రచండుడు అనే అహంభావి రాజ్యమేలేవాడు. ప్రశాంతుడు మహా పరాక్రమశాలి. అయినా పేరుకు తగ్గట్టే, తన రాజ్యాన్ని తన మానాన తాను ఏలుకునేవాడు. రచన చేతకానివాడు నిరర్థక విమర్శకుడుగా తయారైనట్టే, వక్రచండుడికి రాజ్యపాలన చేతకాకపోవటంతో ప్రశాంతుడిపై కయ్యానికి కాలు దువ్వసాగాడు. అయినా విజయం సాధించలేకపోయాడు.

వక్రచండుడి దగ్గరున్న మంత్రిపేరు దుర్బుద్ధి. రాజులాగే అతడు కూడా నక్కజిత్తుల్లో నేర్పరి. యుద్ధంలో ప్రశాంతుని గెలవలేమని గ్రహించిన దుర్బుద్ధి ఒక పన్నాగం ద్వారా కౌశాలీ సైన్యపు ఆహారంలో మత్తు కలిపి, రాత్రికి రాత్రి ఆదేశాన్ని ఆక్రమించుకుని ప్రశాంతుని, అతని ముఖ్య అనుచరుల్నీ బందీకృతుల్ని చేశాడు. అందర్నీ వరుసగా నిలబెట్టి హేళనగా, "చూశావా రాజా! రాజ్యమేలటమంటే శాంతి ప్రవచనాలు చెప్పటం కాదు. దానికి తెలివి, శౌర్యము కావాలి" అన్నాడు వక్రచండుడు.

ఓడిన రాజు నవ్వి, "తెలివంటే అవతలివారిని మోసం చెయ్యటం కాదు వక్రచండా! ఇక శౌర్యమంటావా? నాతో ద్వంద్వ యుద్ధం చెయ్యి. రక్తపాతం లేకుండా రాజ్యార్హత నిర్ణయిద్దాం" అన్నాడు.

ఇంతలో దుర్బుద్ధి చూపు, శత్రురాజు వెనుక నిలబడిన వృద్ధ మంత్రి సుబుద్ధిపై పడింది. రాజు చెవిలో ఏదో చెప్పాడు.

ప్రశాంతుడూ, అతని సిబ్బందీ చేతులకి సంకెళ్లతో వరుసగా ఒకరి వెనుక ఒకరు నిలబడి ఉన్నారు. దుర్బుద్ధి చెవిలో చెప్పింది విన్న వక్రచండ రాజు, శత్రు మంత్రితో, "ఓహో! నువ్వేనన్న మాట గతంలో నరమాంస భక్షకుల నుంచి నీ రాజుని రక్షించింది" అన్నాడు వ్యంగ్యంగా. "తలమీద టోపీ పెడితే, అదే రంగుదో చెప్పగలవటగా. మీ అందరి తలలపై వాటిని పెట్టిస్తాను. చెప్పు చూద్దాం" అంటూ ప్రశాంతుడి వైపు తిరిగి, "నీ మంత్రి నా పరీక్షలో నెగ్గితే, నీతో ద్వంద్వయుద్ధం చేస్తాను. అందులో నేను ఓడిపోతే నీ రాజ్యం నీకిచ్చి వెళ్లిపోతాను. సరేనా" అన్నాడు.

సరేనన్నాడు ప్రశాంతుడు. అతడికి తన మంత్రిపై అంత నమ్మకం ఉన్నది. అయితే మంత్రి సుబుద్ధి దీనికి అంత సుముఖంగా లేదు. సవాలులో ఏదైనా హేతుబద్ధమైన మెలిక ఉంటే తార్కిక జ్ఞానంతో దాని లోతుల్ని శోధించి పరిష్కరించ వచ్చు. కానీ ఈ రాజునీ, మంత్రినీ చూస్తోంటే వారు నోటికొచ్చిన పరీక్ష ఏదో పెడతారని, దానికి పరిష్కారం ఉండదని మనసు చెపుతోంది.

అతడు అనుకున్నంతా జరిగింది. సామాన్యులెవరూ సాధించలేని పరీక్షని శత్రురాజు పెట్టాడు. లేచి నిలబడి ఈ విధంగా అన్నాడు. "రేప్రొద్దున్నే మీ పదిమందినీ మీ ప్రజలముందు, ఒకరి వెనుక ఒకర్ని నిలబెడతాము. మీ తలలపై టోపీలు పెడతాము. **అందులో కొన్ని నల్లవి, కొన్ని తెల్లవి.** అందులో ఎన్ని నల్లవో, ఎన్ని తెల్లవో చెప్పము. ఒకరిది నలుపు, ఆ తరువాత ఇద్దరిదో, ముగ్గురిదో తెలుపు... ఎలాగైనా వుండవచ్చు. అందరికన్నా వెనుక ఉన్నవాడు తన తలపై టోపీ రంగు చెప్తే అతడిని వదిలేస్తాము. చెప్పలేకపోతే అక్కడికక్కడే అతడిని క్షణాల్లో చంపేసి, అతడి ముందు వాడిని అతడి టోపీ రంగు అడుగుతాము. ఈ విధంగా పదిమందీ తమ తమ అదృష్టాలు పరిశీలించుకోవచ్చు. రాజా! నీవీ సవాలుకు ఒప్పుకున్నావు కాబట్టి, తమ కళ్లముందే తమ ప్రియతమ రాజువైన నిన్ను చంపేసినా నీ ప్రజలు ఏమీ చేయలేరు" అన్నాడు వికటంగా నవ్వుతూ.



ప్రశాంతుడు తెల్లబోయాడు. ఇదేమి సవాలు? నిజానికి ఇది సవాలు కాదు. కేవలం అదృష్టం మీద బతుకో చావో ఆధారపడిన లెక్క. దుర్బుద్ధి ఈ రకంగా తమని మోసం చేస్తాడని కలలో కూడా అనుకోలేదు.

అతడీ విధంగా ఆలోచిస్తూ ఉండగా వక్రచండుడు అన్నాడు. "వెళ్లి కారాగారంలో మీరందరూ విశ్రాంతి తీసుకోండి. రేపు మరణం ఖాయమని తెలిస్తే నిద్ర పోవచ్చు. లేదా మరణం తప్పిందని తెలిస్తే నిద్రపోవచ్చు. కానీ మీలో ఎందరు చస్తారో, ఎందరు బతుకుతారో తెలీక మీలో మీరే అలజడితో, బాధతో ఈ రాత్రంతా గడపాలి. చూశారా నా మంత్రి తెలివి..." అంటూ గర్వంగా తన మంత్రివైపు చూశాడు.

ఈ లోపులో మంత్రి దుర్బుద్ధి అన్నాడు "మీలో ఎవరు **అతి తెలివితేటలు చూపించినా** అందర్నీ చంపేస్తాం. అప్పటివరకూ సరి అయిన సమాధానం చెప్పిన అదృష్టవంతుల్ని కూడా వదలం..." అని హెచ్చరించాడు.

ప్రశాంతుడు మౌనంగా వెనుతిరిగి, తన వారితో కలిసి కారాగారం వైపు నడిచాడు. బేతాళుడు ఇంత వరకూ చెప్పి "రాజా! సుబుద్ధి తన రాజుని, మిగతా పరివారాన్ని ఎలా రక్షించాడు? ఈ ప్రశ్నకి తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది జాగ్రత్త..." అన్నాడు.

దానికి విక్రమార్కుడు తల అడ్డంగా ఊపుతూ "చెప్పలేరు. దీనికి సమాధానం ఎవరూ చెప్పలేరు" అన్నాడు. బేతాళుడు విస్తుబోయి "రాజా! సాహిత్యం పుట్టినప్పటి నుంచి, చందమామలో బేతాళకథలు మొదలైనప్పటి నుంచీ నీ నోటివెంట ఈ సమాధానం రాలేదు. నీవిలా అనటం మొట్టమొదటిసారి చూశాను. నిజానికి నీకు మౌనభంగం జరిగింది కాబట్టి నేను వెళ్లిపోవచ్చు. కానీ నీ తెలివితేటల మీద నాకు అపారమైన నమ్మకం ఉంది. మరికొంచెం కథ చెపుతాను విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"ఆ రాత్రి కారాగారంలో ఎవరికీ నిద్రలేదు. అందరూ దీర్ఘాలోచనలో ఉన్నారు. అప్పుడు సర్వ సైనికాధికారి రాజు దగ్గరికి వచ్చి "... నాకో ఆలోచన వచ్చింది మహారాజా! అందరికన్నా చివరగా ఉన్న వ్యక్తి తన టోపీరంగు చెప్పేముందు గొంతు సవరించుకుని కాస్త దగ్గితే, ముందు వాడికి అది సంజ్ఞ అన్నమాట. దగ్గితే నల్లటోపీ, లేకపోతే తెల్లటోపీ" అన్నాడు.

దానికి ప్రశాంతుడు తల అడ్డంగా ఊపుతూ "చివర్లో ఆ దుర్బుద్ధి హెచ్చరించాడు చూశావా! మనం ఏ రకమైన చౌకబారు తెలివితేటలు చూపించినా అందర్నీ


చంపేస్తారు. కేవలం తార్కికమైన తెలివితేటలు మాత్రమే ఉపయోగించాలి. మనం ఏం చేసి రక్షింపబడ్డామో తరువాత ఎవరికైనా చెప్పినా, 'భేష్! జ్ఞానం అంటే అలా ఉండాలి' అంటూ మనల్ని మెచ్చుకోవాలి. కానీ మొత్తం పది టోపీల్లో. ఎన్ని నల్లవో, ఎన్ని తెల్లవో తెలీదు. ఎలా?" అన్నాడు.

అంతలో మంత్రి సుబుద్ధి అడుగు ముందుకు వేసి, "నాకు ఒక ఆలోచన వచ్చింది మహారాజా! ఇందులో చివరగా నిలబడే ఒకరి అదృష్టం మాత్రం చెప్పలేం. మిగతా వారందరూ **ఏ మాత్రం సంశయం లేకుండా నిశ్చయంగా** రక్షింప బడతారు. వరుసలో అందరికన్నా చివర నేను నిలబడతాను" అన్నాడు.

ఆపైన తన ఆలోచన మిగతావారికి చెప్పాడు. మంత్రి ఆ ఆలోచన చెప్పగానే- రాజుతో సహా, మిగతా తొమ్మిదిమందీ ముక్త కంఠంతో, "దీనికి మేము వప్పుకోము. మీరు చివర్లో నిలబడటానికి అంగీకరించము" అన్నారు.

ఎన్నో వాదోపవాదాల తరువాత మంత్రి వారిని వప్పించ గలిగాడు.

❖ ❖ ❖



మరుసటిరోజు ఖైదీలందర్నీ ఒకరి వెనుక ఒకర్ని నిలబెట్టారు. దేశప్రజలు చుట్టూ వలయంలా ఉన్నారు. ప్రజలు కొందరు రోదిస్తున్నారు. కొందరు ఆవేశంగా ఉన్నారు. ఆ సమయంలో వక్రచండుడు, దుర్బుద్ధి అక్కడకు ప్రవేశించారు.

మొదటగా అందరికన్నా చివరగా ఉన్న మంత్రిని ప్రశ్నించారు.



దానికి సమాధానంగా కనులు మూసి భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థించి "నా తలపై ఉన్నది నల్లటోపీ" అన్నాడు సుబుద్ధి. వక్రచండుడు బిగ్గరగా నవ్వి "సరిగ్గా చెప్పావ్. నీ అదృష్టం బావుంది" అంటూ ముందుకు నడిచాడు.

మంత్రి ముందు నిలబడిన సర్వ సైన్యాధిపతి "నా తలపై ఉన్నది కూడా నల్లటోపీనే" అన్నాడు.

ఆ విధంగా వరుసగా మొదటి నలుగురూ తెలుపో, నలుపో సరిగ్గా చెప్పేసరికి వక్రచండుడి మొహం మీద నవ్వు క్రమక్రమంగా మాయమైంది. అందరికన్నా ముందున్న రాజు కూడా సంశయించకుండా, సందేహం లేకుండా తన టోపీ రంగు చెప్పాడు. మంత్రి దుర్బుద్ధి మొహం రక్తం లేనట్టు పాలిపోయింది. జనం ఉప్పెనలా వెళ్లి తమ రాజుని విడిపించారు.

పది నిమిషాల్లో రాజులిద్దరికీ మధ్య ద్వంద్వ యుద్ధం ఏర్పాటు కావింప బడింది. క్షణాల్లో ప్రశాంతుడు వక్రచండుని ఓడించాడు. "నేను నిన్ను ఈ క్షణం చంపాలనుకుంటే చంపేయవచ్చు. కానీ క్షమిస్తున్నాను. వెళ్లి నీ రాజ్యమేలుకో" అన్నాడు.

వక్రచండుడు రాజు ముందు మోకరిల్లి "శక్తికి మించి ఆశించకూడదన్న సత్యం నాకిప్పుడు అర్థమైంది రాజా! అంతేకాదు. తనకున్నదే తెలివనీ, అంతకుమించి జ్ఞానం మరేమీ ఉండదనీ అనుకోకూడదని కూడా తెలిసింది. అయితే నా సందేహం తీరలేదు. మీరందరూ ఏ విధంగా మీమీ తలలపై ఉన్న టోపీల రంగు కనుక్కున్నారు?" అని అడిగాడు. అప్పుడు ప్రశాంతుడు తన మంత్రి అయిన సుబుద్ధి వద్దకు నడిచి, ఆ వృద్ధుడికి నమస్కరించి విస్మయంగా చూస్తున్న ప్రజలతో "నేను నమస్కరిస్తున్నది ఈ మహనీయుడి తెలివికి మాత్రమే కాదు. మమ్మల్ని అందర్నీ రక్షించే బాధ్యత తీసుకుని, తన ప్రాణాల్ని పణంగా త్యాగం చేసి అందరికన్నా చివరగా నిలబడ్డందుకు" అన్నాడు.

బేతాళుడు ఇంతవరకూ చెప్పి "రాజా! ఏ విధంగా మంత్రి తన వారందర్నీ రక్షించుకున్నాడు? తన టోపీ తెల్లటోపీ అని చెప్పి ఉంటే మరణం సంభవించేది కదా? అలాంటి హాని ఉందని తెలిసి కూడా త్యాగానికి సిద్ధపడ్డాడని, రాజు మాటలను బట్టి అర్థమవుతోంది. కానీ మిగతా వారందరూ రక్షింపబడతారని అంత ధీమాగా మంత్రి ఏ విధంగా చెప్పాడు? ఆ క్రితం రాత్రి తనవారికి అతడు చెప్పిన తార్కిక రహస్యం ఏమిటి?" అని అడిగాడు.

*(సమాధానం 152 పేజీలో)*

# 9. అసత్యదీవి



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని వెనుదిరిగి మౌనంగా నడవసాగాడు. అతడికి మౌనభంగం కావించటానికి శవంలోని బేతాళుడు ఈ విధంగా చెప్పసాగాడు.

"రాజా! జన్మలో ఎప్పుడో ఒకప్పుడు అసత్యం చెప్పనివాడు అంటూ ఈ ప్రపంచంలో ఎవరూ ఉండరు. కానీ అసత్యదీవి అని ఒకటున్నది. అక్కడి ప్రజలందరూ నిరంతరం అబద్ధమే చెపుతూ ఉంటారు. చిత్రహింస పెట్టినా నిజం చెప్పరు. వీరివల్ల సత్యం తెలుసు కోవాలంటే ఒకటే మార్గం! వారు చెప్పిన దానికి వ్యతిరేకంగా అర్థం చేసుకోవటమే! 'ఈ పండు విషపూరితం కాదు. తినవచ్చు' అని ఆ దీవిలో ఎవరైనా చెప్తే, ఆ పండు నిజంగా విషమే. ఆ దీవికి కొంతదూరంలో 'సత్యదీవి' అని మరొక దీవి ఉన్నది. చిత్రమేమిటంటే, ఆ దీవిలో అందరూ నిజమే చెప్తారు. ప్రాణం పోయినా అసత్యమాడరు.

చంద్రగుప్తుడనే రాజు ఓడలో ప్రయాణం చేస్తూ ఉండగా, ఒక పడవలో ముగ్గురు ఓడ దగ్గరికి వచ్చారు. తమ తమ దీవుల్లో దొరికే వస్తువుల్ని అమ్మటం కోసం వారు వాటిని రాజుకి, మంత్రికి చూపించారు. మంత్రిపేరు సుబుద్ధి. వివిధ శాస్త్ర ప్రావీణ్యుడు. వారి వస్తువుల్ని పరీక్షిస్తూ రాజు "నువ్వు ఏ దీవికి సంబంధించినవాడివి?" అని ఆ ముగ్గుర్లో ఒకర్ని అడిగాడు. పక్కనున్న సుబుద్ధి సన్నగా నవ్వటం చూసి, ఆ వృద్ధుడివైపు తిరిగి "ఎందుకు మంత్రివర్యా ఆ మందహాసం? నా ప్రశ్నలో ఏమైనా తప్పు ఉన్నదా?" అని అడిగాడు రాజు.

అవునన్నట్టు తలూపుతూ మంత్రి **"ఏ దీవి నుంచి వచ్చినవాడైనా, తాను సత్యదీవి నుంచి వచ్చాననే చెపుతాడు కదా"** అన్నాడు. మంత్రి మాటలు అర్థమవటానికి రాజుకి కొంచెంసేపు పట్టింది. 'నిజమేకదా' అనుకున్నాడు. ఈ లోపులో రాజు పక్కన నిలబడి ఆల్చిప్పల్ని, శంఖాల్ని పరిశీలిస్తున్న రాకుమార్తె, అందులోని ఒకర్ని "వారిద్దరూ ఒకే దీవి నుంచి వచ్చారా?" అని అడిగింది. అతడు 'అవును' అన్నాడు. రెండో వ్యక్తిని కూడా అదే ప్రశ్న వేసింది. అతడు కూడా ఆ సమాధానమే చెప్పాడు. మూడో వ్యక్తిని అదే ప్రశ్న వేయబోతూండగా మంత్రి కల్పించుకుని "అనవసరం రాకుమారీ! అతడు కూడా అదే సమాధానం చెపుతాడు" అన్నాడు.

రాకుమార్తె పేరు పద్మజనేత్ర. తన విశాలమైన కనులని మరింత పెద్దవి చేస్తూ "అదెలా చెప్తాడు మహామంత్రీ? అందులో ఒకరు ఒక దీవి నుంచి వచ్చిన



వ్యక్తి, మరొకరు మరొక దీవి నించి వచ్చిన వ్యక్తి అయి వుండవచ్చు కదా" అన్నది. మంత్రి నవ్వి ఊరుకున్నాడు. అతడు ఎందుకు సమాధానం చెప్పలేదో రాజుకి అర్థమయింది. చిన్నపిల్ల అయిన పద్మజనేత్రకి ఆ తర్కం చెప్పినా అర్థం కాదని, కూతురికి తన మంత్రి అందుకే సమాధానం చెప్పలేదని అనుకున్నాడు. నిజానికి రాజుకి కూడా అర్థం కాలేదు.

విక్రమార్కా! అందులోని తర్కం నేన్నీకు చెప్తాను విను. వచ్చినవారు రాముడు, భీముడు, కృష్ణుడు అనుకుందాం. రాకుమార్తె రాముడిని "మిగతా ఇద్దరూ ఒకే దీవి నుంచి వచ్చారా?" అని అడిగింది. "అవును" అన్నాడు రాముడు. అతడు ఏ దీవికి సంబంధించినవాడో మనకి తెలీదు. రాముడు సత్యదీవివాడైతే, మిగతా ఇద్దరి సంగతీ నిజమే చెప్తాడు కదా! అలా కాకుండా, అతడు అసత్యదీవికి చెందినవాడైతే, అతడు చెప్పేది అబద్ధం కాబట్టి, భీముడు కృష్ణుడు వేర్వేరు దీవుల వారైవుండాలి. అప్పుడు వారిద్దరిలో ఒకరు నిజం చెప్పేవారు, మరొకరు అబద్ధం చెప్పేవారు అవుతారు. రెండో వ్యక్తిని రాకుమార్తె అదే ప్రశ్న వేసింది. అతడు కూడా "మిగతా ఇద్దరూ ఒకే దీవికి చెందినవార"ని రాకుమార్తెకి చెప్పాడు. **అతడు నిజం చెప్పేవాడో, అబద్ధం చెప్పేవాడో మనకి అనవసరం. అతడేం చెప్తాడో, మూడో మనిషీ అదే చెప్తాడు.** ఏ దీవినుంచి వచ్చిన వారైనా ఇద్దరూ ఒకే సమాధానం చెపుతారని అంతకు ముందే మంత్రి రాజుకి చెప్పాడు కదా! అదే సూత్రం ఇక్కడా వర్తిస్తుంది.

ఇది కాస్త కష్టమైన అవగాహన. తర్కానికి పరాకాష్ట. ఇంతజ్ఞానం చంద్రగుప్త మహారాజుకి లేదు. అతడు కేవలం పరాక్రమాన్ని నమ్ముకున్న వాడు. మంత్రి తన పక్కనున్నంత వరకూ అతడికి తెలివితేటల అవసరం అంతగా రాలేదు. కొద్ది రోజులకి వచ్చింది. రాజా! శ్రమ తెలియకుండా ఆ కథ కూడా చెపుతాను విను.

❖ ❖ ❖

రవికిరణుడు అనే పొరుగుదేశపు యువరాజూ, పద్మజనేత్ర ప్రేమించు కున్నారు. పేర్లు కలిసినట్టే వారి హృదయాలు కూడా ఒకరి చూపుకోసం మరొకటి తపించసాగాయి. ఒక ఉద్యానవనంలో అతడి రవి కిరణాలకి ఆమె కలువలు విచ్చుకుంటున్న సమయంలో చంద్రగుప్తుని సైనికులు రవికిరణుని బంధించారు. అయితే అది అంత సులభంగా జరగలేదు. దాదాపు వందమంది సైనికులు కలిసి సింహాన్ని బంధించినట్టు బంధించవలసి వచ్చింది. రాజకుమారుణ్ని అతిథి గృహ దిగ్బంధనంలో పెట్టారు.

అతడి విషయం ఏం చెయ్యాలా అని చంద్రగుప్తుడు మంత్రిని సంప్రదించాడు. "అతడి పరాక్రమం కళ్ళారా చూసాము కదా! అంతటి శూరుడు దొరకడు. వివాహం

చేయండి మహారాజా! అతడు చేసింది తప్పే. కాని అతడిని శిక్షిస్తే పక్కరాజ్యంతో అనవసరంగా శత్రుత్వం వస్తుంది" అన్నాడు మంత్రి.

రాజుకి ఆ సలహా నచ్చలేదు. దేశప్రజల ముందు పరువు పోతుందని ఆయన అభిప్రాయం. అప్పుడు మంత్రి ప్రజలందరూ వింటూండగా నిండుసభలో ఈ విధంగా ప్రకటించాడు. "రవి కిరణా! నీ అదృష్టాన్ని విధి నిర్ణయిస్తుంది. రేపు రెండు గదుల్లో ఒకదాన్ని నువ్వు ఎన్నుకోవలసి ఉంటుంది. ఒక గదిలో రాకుమార్తె పూలమాలతో నిలబడి ఉంటుంది. మరొక గదిపైన విషపూరిత కత్తి వేలాడుతూ ఉంటుంది. మీ ఇద్దరి వివాహం భగవంతుడికి ఇష్టమైన పక్షంలో మీ వివాహం జరుగుతుంది. లేని పక్షంలో నీవు మరణానికి సిద్ధం కావలసి ఉంటుంది. దీనికి నీకు సమ్మతమేనా?" అని అడిగాడు.

రాకుమారుడు దీనికి తన అంగీకారం తెలిపాడు. అప్పుడు మంత్రి కొనసాగించాడు. "రెండు గదుల ముందూ ఇద్దరు కాపలాదార్లు ఉంటారు. అందులో ఒకరు ఎప్పుడూ అబద్ధమే చెప్పే అసత్యదీవివాడు. రెండవవాడు ఎప్పుడూ నిజం చెప్పే సత్యదీవి నివాసుడు. అందులో ఎవరో ఒకర్ని, కేవలం ఒకే ఒక ప్రశ్న వేసే అవకాశం నీకిస్తాం" అన్నాడు.

ఆ సాయంత్రం రాకుమార్తె సుబుద్ధిని కలుసుకుని వేదనగా "ఇది అన్యాయం మంత్రివర్యా! అబద్ధం చెప్పే కాపలాదారుకు, నిజం చెప్పే కాపలాదారుకు కూడా విషం గదిని చూపించి "విషం కత్తి గది ఇదేనా" అని అడిగితే ఒకరు అదే నంటారు. మరొకరు కాదంటారు. ఇలాంటి పరీక్ష పెట్టడం మీకు భావ్యమేనా? విషం గది ముందు అబద్ధాల దీవి వాడు వున్నాడనుకుందాం. దురదృష్టవశాత్తు రాకుమారుడు అతడిని నా గురించి ప్రశ్నిస్తే, అది మృత్యుగదిలో ప్రవేశించటమేగా" అని అంది.

అప్పుడు సుబుద్ధి "తెలివైనవారు అదృష్టం మీద ఎక్కువగా ఆధారపడరు తల్లీ. ఆ రోజు పడవలో ముగ్గురు వ్యక్తులు కలిసినప్పుడు నా సంభాషణ గుర్తు చేసుకో" అన్నాడు.

క్షణాల్లో అతడు చెప్పింది ఆమెకు అర్థమై కళ్లు మిలమిలా మెరిశాయి. ఆ రాత్రే చెలికత్తె ద్వారా యువరాజుకి మరుసటిరోజు కాపలాదారుని ఏ ప్రశ్న అడగాలో వార్త పంపింది. ఆపై వారి వివాహం ఘనంగా జరిగింది."

ఇంతవరకూ చెప్పి బేతాళుడు విక్రమార్కుడితో, "రాజా! రాకుమార్తె తన ప్రియుడికి పంపిన ప్రశ్న రూపం ఏమై ఉంటుంది? దానికీ పడవలో వ్యక్తులకి సంబంధం ఏమిటి? తెలిసీ దీనికి సమాధానం చెప్పక పోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అన్నాడు. దానికి సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా చెప్పాడు.

(సమాధానం 154 పేజీలో)

# 10. వేదాంతపు పునాది తర్కం



భయంకరమైన కీచురాళ్ళ శబ్దాల మధ్య, కన్ను పొడుచుకున్నా కానరాని చీకట్లో పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడా శవంలోని బేతాళుడు, రాజుకి మౌనభంగం కావించటం కోసం ఈ విధంగా చెప్పసాగాడు.

"రాజా! ఏమి సాధించటం కోసం నువ్వీ విధంగా నన్ను తీసుకు వెళ్లటానికి ప్రయత్నిస్తున్నావో నాకు అర్థం కావటం లేదు. వాస్తవం ఆలోచించు. వాస్తవం అంటే "మథన". అదే నిన్ను నీ గమ్యానికి చేరుస్తుంది. జ్ఞానానికి పునాది అదే! "ఇది ఇలా ఎందుకు జరుగుతోంది" అన్న ఆలోచనే కొందరు వ్యక్తుల్ని మతప్రవక్తల్నీ; "ఇలా ఎందుకు జరక్కూడదు" అన్న ఆలోచనే కొందర్ని శాస్త్రవేత్తల్నీ చేసింది. ప్రతి మనిషిలోనూ ఆలోచన ఉంటుంది. చాలామంది దాన్ని ఉపయోగించు కోరంతే. పిల్లల్లో ఇటువంటి ఆలోచనా జ్ఞానాన్ని చిన్నతనం నుంచీ నేర్పటం పెద్దల బాధ్యత" అంటూ కొనసాగించాడు.

"పాటలీపుత్రం నుంచి కౌశాలీ నగరానికి రెండు గుర్రాలు సమానమైన వేగంతో **ఎక్కడా ఆగకుండా** పరుగెత్తాయి. ఎదురుగా ఏ ఆటంకమూ రాలేదు. ఏ అడ్డంకీ లేదు. కాని తెల్లగుర్రం - నల్లగుర్రంకన్నా అయిదు నిమిషాలు ముందుగా చేరుకున్నది. ఎలా?" అన్న ప్రశ్నకి పదేళ్ల కుర్రవాడు "అది అయిదు నిమిషాలు ముందు బయల్దేరింది కాబట్టి" అని తడుముకోకుండా సమాధానం చెప్తే ఆ కుర్రాడికి ఒక బహుమతి కొనిపెడితే, అతడికి 'సమయస్ఫూర్తి' విలువ తెలుస్తుంది.

"విదర్భరాజు తన రాజ్యంలో పరిస్థితులు కనుక్కోవడానికి ఒక సోమవారంపై రాత్రి బయల్దేరి, తిరిగి ఆదివారం ఉదయం రాజధానికి తిరిగి వచ్చాడు. కానీ అతడు తన రాజ్యంలో పర్యటన చేసింది కేవలం మూడు రోజులే! ఇదెలా సంభవం?" అన్న ప్రశ్నకి తలబద్దలు కొట్టుకోకుండా, ప్రశ్న జాగ్రత్తగా చదివి, 'సోమవారం' అనేది గుర్రం పేరని చెప్పగలగటమే తెలివి. ఇటువంటి తెలివికి సంబంధించిన కథ ఒకటి చెపుతాను. శ్రమ తెలియ కుండా విను" అంటూ ప్రారంభించాడు.

❖ ❖ ❖

"మందహాసుడు అనే యువరాజు హేమంత సమీర అనే రాకుమార్తె స్వయంవరానికి వెళ్లాడు. హేమంత అతిలోక సౌందర్యవతి. ఆమె తండ్రి కూడా కాశ్మీరం నుంచి వింధ్య వరకూ విస్తరించిన రాజ్యమున్నవాడు. అందువల్ల చుట్టుప్రక్కల అన్ని దేశాల నుంచీ యోగ్యత ఉన్న రాజకుమారులందరూ ఆమెని పరిణయమాడాలని అక్కడకు వచ్చారు. పోటీ చాలా ఉద్రిక్తంగా, ఉద్విగ్నంగా జరిగింది. గుర్రపు స్వారీ నుంచీ అశ్వారోహణం వరకూ, బాణం గురి నుంచి శబ్దబేధి వరకూ పోటీ జరిగాయి. ఒక్కొక్క పోటీ ముగిసే కొద్దీ కొందరు వైదొలగసాగారు. చివరికి వచ్చేసరికి ఇద్దరు మిగిలారు. సమాన ప్రతిభా పరాక్రమం ఉన్న ఇద్దరు రాకుమారుల్లో ఎవర్ని విజేతగా ఎంపిక చేయాలో తెలియక రాజు అయోమయంలో పడ్డాడు. ఇద్దరికీ ద్వంద్వ యుద్ధం ఏర్పాటు చేద్దామా అని మంత్రిని సంప్రదించాడు.

అప్పుడు అతని మంత్రి ఈ విధంగా అన్నాడు "రాజా! రాజ్యమేలటానికి రాజుకి **తెలివితేటలు** కావాలి. ప్రజలకు ఏం కావాలో తెలుసుకోవటానికి **నేర్పు** కావాలి. వారికి కావలసింది ఇవ్వగలిగే **జ్ఞానం** ఉండాలి. పొరుగురాజు దండెత్తినప్పుడు మాత్రమే పరాక్రమం కావల్సింది. అయితే, అటువంటి పరాక్రమం ఉండవలసింది రాజుకి కాదు. సైన్యానికి, సైనికాధికారికి! ఆ సహాయంలో తాను నీరు కారిపోకుండా, రాజు వారికి ఇవ్వాల్సింది **ధైర్యం!** కాబట్టి కాబోయే యువరాజుకి ధైర్యము, తెలివి, నేర్పు ఉండాలి. చివరి వరకూ పందెంలో నెగ్గుతూ వచ్చిన ఈ ఇద్దరు యువకుల్లో ఎవరికి ఈ మూడు లక్షణాలూ వున్నాయో పరీక్షిద్దాం."

"ఎలా?" అన్నాడు రాజు.


"ఆ విషయం నాకు వదిలి పెట్టండి రాజా!" అంటూ నిండు దర్బారులో ప్రజల సమక్షంలో ఒక పరీక్ష ఏర్పాటు చేసి రాకుమారులిద్దరితో "మీ ఎదురుగా మూడు గదులున్నాయి. వాటి ముందు ఫలకాలున్నాయి చూడండి" అన్నాడు.

మందహాసుడికి ఎదుటి ఫలకాలమీద అక్షరాలు "పూలు – పాములు – రాకుమార్తె" అని కనపడ్డాయి. ఈ లోపులో మంత్రి అన్నాడు. "ముందున్న ఫలకం చూసి మోసపోకండి. 'పాము' అని రాసి ఉన్న గదిలో రాకుమార్తె ఉండి ఉండవచ్చు 'పూలు' అని ఉన్న గదిలో పాము బుసకొడుతూ ఉండవచ్చు. గదుల్లోపల చీకటిగా ఉంటుంది. ఏ మాత్రం పొరపాటు చేసినా ప్రాణాలు పోతాయి. పూలవానలో తడుస్తారో... పాము కాటుకి గురి అవుతారో... పూలహారం ధరించి రాకుమార్తెతో



సహా బయటకు వస్తారో... మీ అదృష్టం మీద... కాదు కాదు... మీ తెలివితేటల మీద ఆధారపడి ఉంటుంది."

రాకుమారులిద్దరూ మొహాలు చూసుకున్నారు. 'ఇందులో అదృష్టమే తప్ప తెలివి ఎక్కడున్నద'ని వారి అభిప్రాయం. ఆ అనుమానం గ్రహించిన మంత్రి ఈ విధంగా అన్నాడు "జాగ్రత్తగా వినండి. **గది బయట వ్రాసి వున్నది గదిలో నిశ్చయంగా వుండదు.** ఈ పరీక్షలో మూడో ప్రయత్నం కూడా వుండదు. మీరు తలుపు తీసే మొదటి గదిలో రాకుమార్తె వుంటే అది అదృష్టమే. అలా లేకపోతే రెండో ప్రయత్నంలో ఆమె గది తెలుసుకోవాలి. లేకపోతే పాముకాటే మిగిలేది. సమర్థుడు అదృష్టాన్ని నమ్ముకోడు. దురదృష్టం ఎదురైతే మరోసారి ప్రయత్నం చేస్తాడు. రాకుమార్తె గదిలోకి ఆ విధంగా నిశ్చయంగా, నిర్భయంగా, నిశ్శంకగా ప్రవేశించిన రాకుమారుడే ఈ దేశపు కాబోయే రాజు... బయల్దేరండి."




అతడి మాటలు పూర్తి కాకుండానే మందహాసుడు రెండో గది తెరిచి పూలవానలో తడిసి, మొదటి గదిలోకి వెళ్లి రాకుమార్తెతో బయటికి వచ్చాడు."

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! నాదొక చిన్న అనుమానం. అదృష్టాన్ని నమ్ముకోకుండా మందహాసుడు కేవలం తెలివిని నమ్ముకుని అంత వేగంగా, ధైర్యంగా "రాకుమార్తె మొదటి గదిలో ఉన్నది" అని ఎలా కనుక్కున్నాడు? తెలిసీ చెప్పలేకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అని హెచ్చరించాడు.

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

*(సమాధానం 155 పేజీలో)*

# 11. అరగుడ్డు కథ



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! సాధించాలన్న పట్టుదల అందరికీ ఉంటుంది. కానీ కొందరు ఆ ప్రయత్నమే చేయరు. మాటిమాటికీ పెద్దలని అంటున్నానని అనుకోకపోతే ఒకమాట. నన్ను బంధించటానికి నీవు చేసే ప్రయత్నంలో సగమైనా పెద్దలు చేస్తే, పిల్లలు చిన్నతనం నుంచే అపురూపమైన తెలివితేటలతో రాణిస్తారు కదా! పిల్లల కలలకీ, భవిష్యత్‌లో ఆ కలలు నిజమవటానికీ మధ్య వంతెన 'క్రమశిక్షణ'. ఆ వంతెన కట్టటానికి కావలసిన సిమెంటు 'ప్రేమ'. మిగతా వ్యాపకాలు కాస్త తగ్గించుకుని తల్లో తండ్రో రోజూ ఓ అరగంట పిల్లల చదువు దగ్గిర కూర్చుంటే ఆ దృశ్యం ఎంత బావుంటుంది? అసలు పిల్లలంటే ఎవరు? నీ తెలివిని పంచుకోవటానికి పుట్టిన వారసులు. నీ ఆస్తితో పాటూ వారికి నీ తెలివినీ, సమయాన్నీ ఇవ్వాలి. ఎందుకు ఇవ్వాలో ఒక కథ ద్వారా చెపుతాను విను.

❖ ❖ ❖

అప్పుడప్పుడే ప్రాణం పోసుకుంటున్న శిశువు దేవలోకంలో భగవంతుడితో, "... నన్ను భూమ్మీదకు పంపబోతున్నావని అందరూ ఇక్కడ చెబుతున్నారు. కానీ ఇంత చిన్నప్రాణిని నేను అక్కడ అంతమంది పెద్దల మధ్య ఎలా బ్రతగ్గలను?" అని అడిగింది.

"చాలామంది దేవతల్లోంచి, నేను నీ కోసం ఒక అద్భుతమైన దేవతను ఎన్నుకున్నాను. నీకు సాయం చేయడం కోసం ఆమె అక్కడ ఎదురుచూస్తూ వుంటుంది."

"కానీ ఇంతకాలం నేనిక్కడ హాయిగా ఆడుతూపాడుతూ ఉన్నాను" అన్నది పాప. ఈ ప్రశ్నకు ఒక్కక్షణం ఆలోచించి చెప్పాడు భగవంతుడు – "అక్కడ కూడా ఆ దేవకన్య నీకోసం పాటలు పాడేట్టు చేస్తాను. నిన్ను ఆమె హాయిగా ఉంచుతుంది."

"కానీ ఇక్కడ మన భాష వేరు. అక్కడ వారి భాష వేరు."

"మన భాషలోని స్వచ్ఛమైన గీతాలద్వారా, తీయతీయటి పలుకుల ద్వారా క్రమక్రమంగా అక్కడి వారి భాష కొద్దికొద్దిగా నేర్పుతుంది."

"కానీ నేను నీతో మాట్లాడాలంటే..." శిశువు అనుమానం వెలిబుచ్చింది.

"నోటితో, మనస్సుతో, చేతుల్తో ఎలా ప్రార్థించాలో ఆ దేవత నీకు నేర్పుతుంది. అన్నిటికన్నా ముఖ్యంగా – స్వచ్ఛమైన చిరునవ్వు ఎలావుంటుందో నవ్వి చూపిస్తుంది..."



"కానీ అక్కడ చాలామంది చెడ్డవాళ్ళు, అసూయపరులు, ద్రోహులు, మూర్ఖులు, వంచకులూ ఉంటారుట..."

"ఆ దేవకన్య తన ప్రాణాలకు తెగించి నిన్ను కాపాడుతుంది. మంచితనం గురించి చెబుతుంది. వంచకులని ఎలా ఎదుర్కోవాలో చెప్పి నీ అజ్ఞానాన్ని పారద్రోలుతుంది. అయినా సరే నీకు జ్ఞానమొచ్చాక నువ్వు కూడా వంచననూ, అజ్ఞానాన్నీ, మూర్ఖత్వాన్నీ ఆశ్రయిస్తానంటే దుఃఖిస్తుందే తప్ప నిన్ను ఏమీ శిక్షించదు, ద్వేషించదు." అంటూ శిశువును భగవంతుడు భూమ్మీదకు వదిలిపెట్టబోయాడు.

ఆ పాప కనులు నీటితో తడిసిపోయాయి. "నేను నిన్ను వదిలిపెట్టి వెళ్తున్నాను. నాకు దుఃఖం కలుగుతోంది. నాకు వేదనగా ఉంది. ఇంతకాలం నీతో ఉన్నాను. నిన్ను వదల్లేను..."

భగవంతుడు సన్నగా నవ్వాడు. ఆప్యాయత పాత్రలో ప్రేమ నింపినట్టుంది ఆ నవ్వు. దాన్ని తన దయాపూరిత హస్తాలతో సకల మానవాళికి స్వయంగా అందిస్తున్నట్లు ఉన్నది ఆ నవ్వు. "... నువ్వు నన్ను వదిలి ఎక్కడికీ వెళ్ళటంలేదే పిచ్చిదానా! అక్కడ ఎప్పుడూ నేను నీ పక్కనే వుంటాను. కావాలనుకున్నప్పుడల్లా నన్ను ఎలా చూడవచ్చో ఆ దేవకన్య నీకు చెబుతుంది" అంటూ ఆ శిశువుని భూమ్మీదకు వదిలిపెట్టాడు.

క్రిందికి జారుతూ, భూలోకపు ధ్వనులు లీలగా చెవులను సోకుతూండగా, కాలుష్యపు సంకీర్ణధ్వనుల మధ్య నుంచి ఎలుగెత్తి దేవుణ్ణి చివరిప్రశ్న అడిగింది... "ఆ దేవకన్యను నేనేమని పిలవాలి?" అని.

ఆకాశం పైనుంచి భగవంతుడు కూడా క్రిందికి చూస్తూ అదే స్వరంతో బిగ్గరగా పలికాడు " 'అమ్మా' అని పిలవాలి..." అతడి కంఠం చతుర్దశభువనాలలోనూ ప్రతిధ్వనించింది. "... పిలవటానికి అందరికీ సులువుగా ఉండటం కోసం భూలోకంలోని అన్ని భాషల్లోనూ ఆ దేవకన్యకు ఒకటి రెండక్షరాల పేరే పెట్టాను! అమ్మ, మా, మాయి, ఆయీ, మమ్మీ..."

❖ ❖ ❖

చూసావా రాజా! అమ్మ అన్న పేరుకి అంత గొప్ప అర్థం వున్నది. ప్రతి తల్లీ పిల్లల్ని ప్రేమిస్తుంది. అయితే ప్రేమ వేరు, బాధ్యత వేరు. దేవకన్య స్థాయిలో పిల్లలకి ప్రతి తల్లీ జ్ఞానాన్ని ఇవ్వాలి. 'చదువు అనేది కేవలం ఉద్యోగం కోసం కాదు. జ్ఞానం కోసం' అని చెప్పాలి.

'ఒక కోడి ఒక రోజుకి ఒక గుడ్డు పెడితే, రెండు కోళ్ళు రెండ్రోజులకి ఎన్ని గుడ్లు పెడతాయి' అన్న ప్రశ్నకి, అయిదో తరగతి చదివే విద్యార్థి 'రెండు గుడ్లు' అని

సమాధానం చెప్తే, ఆ తప్పు ఎవరిది? ఉపాధ్యాయులదా లేక తల్లిదండ్రులదా? విద్యార్థిదా?"

విక్రమార్కుడు మౌనంగా నడక కొనసాగిస్తూ ఉండగా, బేతాళుడు కొనసాగించాడు. "రాజా! దీనికన్నా కాస్త కష్టమైన ప్రశ్న – 'నాలుగు కోళ్లు నాలుగు రోజుల్లో నాలుగు గుడ్లు పెడితే, రెండు కోళ్లు రెండు రోజుల్లో ఎన్ని పెడతాయి?' అన్న ప్రశ్నకి 'రెండు' అని సగం మంది పట్టభద్రులు చెప్పారంటే ఆ తప్పు ఈ విద్యా వ్యవస్థదా? చదువుపట్ల వారికున్న తేలిక అభిప్రాయమా? 'చెట్లకీ, జంతువులకీ తేడా ఏమిటం'టే, చెట్లు కదలవు అని పదో తరగతిలో విజ్ఞానశాస్త్రం చదివిన విద్యార్థి సమాధానం ఇస్తే, 'కొన్ని జంతువులు కూడా కదలవు' అని గుర్తుండని చదువులెందుకు? చదువు మనిషిని జ్ఞానిని చేస్తుంది. మతిమరుపు అజ్ఞానిని చేస్తుంది."

విక్రమార్కుడు మాట్లాడలేదు. బేతాళుడు అన్నాడు "రాజా! హేతుశాస్త్రం వేరు, తెలివి వేరు. "... ఒక పిల్లవాడు ఖాళీ కడుపుతో ఎన్ని కోడి గుడ్లు తినగలడు?" అన్న ప్రశ్నకి 'గుడ్డుని కాస్త ముక్క తినగానే కడుపు ఖాళీగా ఉండదు కదా!' అని తిరిగి ప్రశ్నించటం హేతువు. "ఒక సంచిలో ఆరు గుడ్లు ఉన్నాయి. ఆరుగురు వ్యక్తులు తలా ఒకటీ తీసుకోగా, సంచిలో ఒక గుడ్డు మిగిలింది. ఇదెలా సాధ్యం?" అన్న ప్రశ్నకి 'చివరివ్యక్తి సంచితో సహా గుడ్డుని తీసుకున్నాడ'ని చెప్పటం తెలివి."

చుట్టూ అంధకారం అలుముకుని ఉంది. దూరంగా శ్మశానంలో కీచురాళ్ల శబ్దం భయంకరంగా ధ్వనిస్తోంది. నక్కల ఊళల మధ్య శవంతో సహా విక్రమార్క మహారాజు నడుస్తున్నాడు. అతడి మౌనం భంగం కావించటం కోసం బేతాళుడు ఈ విధంగా తిరిగి ప్రస్తావించాడు. "తర్కము అనేది రెండు రకాలుగా సాగుతుంది. మొదటిది 'ఇలాగే ఎందుకు జరుగుతుంది' – అన్న ప్రశ్న. రెండోది 'ఇలా ఎందుకు జరక్కూడదు' – అన్న ప్రశ్న! ఈ రెండు ప్రశ్నలే మనిషిని జంతువులకన్నా భిన్నంగా, ఉన్నతంగా నిలబెట్టాయి. ఆపిల్ పండు కిందే ఎందుకు పడుతుంది? పైకి ఎందుకు పోదు? అన్న ప్రశ్న భూమ్యాకర్షణ శక్తి గురించి మనిషి తెలుసుకునేలా చేసింది. దీన్నే తర్కం అంటారు. దీని ఆధారంగా ఈ ప్రశ్నకు జవాబు చెప్పు. "రెండు రోజుల్లో రెండు కోళ్లు రెండు గుడ్లు పెడితే, ఒక కోడి రోజుకి ఎన్ని గుడ్లు పెడుతుంది?' గణిత శాస్త్రం ప్రకారం అయితే "సగం గుడ్డు". తర్కశాస్త్రం ప్రకారం అయితే చాలా సమాధానాలుంటాయి. ఒక పెద్ద ఉద్యోగానికి అభ్యర్థి యొక్క స్థిత ప్రజ్ఞత, వివరణ, చాతుర్యం పరీక్షించటం కోసం అడిగిన ప్రశ్న ఇది. తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అన్నాడు.

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

(సమాధానం 156 పేజీలో)

# 12. భారమయిన మోసం



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్లి శవాన్ని దింపి భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా చెప్పసాగాడు. "రాజా! నీ తెలివితేటలు చూస్తే ముచ్చటగా ఉంది. కానీ నీ తెలివిపై ఎవరో తెలివిగా ఆడుకుంటున్నారని నీకెప్పుడూ అనుమానం రాలేదా? 'తెలివితేటలు ఎవరి సొమ్మూ కాద'ని కొందరంటారు గానీ, నిరంతరం వాటిని పెంచుకుంటూ ఉండేవారి 'మెదడు ఖజానా'లో 'తెలివి సొమ్ము' పెరుగుతూనే ఉంటుంది. అయితే ఇతరుల్ని మోసం చేయటానికి కొందరు వాటిని ఉపయోగిస్తూ, చివరికి పట్టుబడిపోతూ ఉంటారు. శ్రమ తెలియకుండా ఉండటానికి అటువంటి కథ చెపుతాను విను.

అవంతీ రాజు వద్దకు ఒక వ్యక్తి వచ్చాడు. అతడు విదేశీ రాయబారి. పొరుగురాజు స్నేహ పూర్వకంగా పంపిన బహుమతులు అందజేసి "రాజా! మా దేశపురాజు మీ దేశంలోని తెలివైన వ్యక్తిని తన దేశం పిలిపించి, సన్మానం చేసి ఉచితమైన సత్కారం చేయదల్చుకున్నాడు. ప్రస్తుతం ఆయనొక సమస్యలో ఇరుక్కున్నాడు. ఆ సమస్యని తన దేశంలో ఎవరూ పరిష్కరించలేకపోయారు. అందుకే మీ దేశపు సహాయం కోరుతున్నాడు. ఒక ద్రోహికి శిక్ష వేయాలి. పదిమంది అనుమానితుల్లో ఆ ద్రోహి ఎవరో కనుక్కోవటానికి అద్భుతమైన తెలివితేటలు కావాలి. అటువంటి వ్యక్తిని ఎంపిక చేసి నాతోపాటు పంపండి" అన్నాడు.

"ఎవరా అనుమానితులు? ఏమా ద్రోహి కథ?" అని అడిగాడు రాజువద్ద ఉండే మంత్రి. అప్పుడా రాయబారి ఈ విధంగా చెప్పాడు. "మా రాజుగారు తన దేశంలో ఉండే పదేళ్లలోపు పిల్లలందరికీ ఒక్కొక్క బంగారు నాణెం ఉచితంగా బహుమానం ఇవ్వదల్చుకున్నాడు. పదిమంది పనివారిని పిలిపించి నాణేలు తయారుచేయిస్తూండగా, అందులో ఒకరు మోసం చేస్తున్నారని తెలిసింది. ఒక్కొక్క నాణెమూ ఒక తులము బంగారంతో చేయవలసిందిపోయి ఒక పూస బరువు తక్కువగా చేస్తున్నారని తెలిసింది. ద్రోహిని ఎలా పట్టుకోవాలో అర్థం కావటం లేదు."

అవంతి రాజు తేలిగ్గా నవ్వి, "ఇందులో కష్టం ఏమున్నది. ఒక్కొక్కరి దగ్గరా వారు తయారుచేసిన ఒక్కొక్క నాణెం తీసుకుని, ఏది తక్కువ బరువు వున్నదో విడివిడిగా తూకం వేసి చూస్తే తేలిపోతుంది కదా! ఆ నాణెము తయారుచేసినవాడే దొంగ" అన్నాడు.

రాయబారి వినమ్రతతో "నిజమే మహారాజా! కానీ ఆ పదిమందీ ఒక సవాలు విసిరారు. నిజంగా తెలివితేటలుంటే, త్రాసుతో **కేవలం ఒకే ఒకసారి తూచటం ద్వారా** ద్రోహిని పట్టుకుని శిక్షించమన్నారు. అదెలాగో అర్థం కావటం లేదు. మా దేశప్రజలకి ఇది నిజంగా సవాలే. మీవాళ్లు ఏదైనా ఆలోచన ఇవ్వగలరా?" అని అడిగాడు.

రాజు పరిష్కారం ఆలోచించమన్నట్టు మంత్రివైపు చూశాడు. మంత్రి నవ్వుతూ, "నేను అక్కడకు వెళ్లి సమాధానం చెప్పి సన్మానం పొందటం ఉచితంగా ఉండదు రాజా! మనదేశపు యువకులకే పరీక్ష పెట్టి ప్రోత్సహిద్దాం" అంటూ చాటింపు వేయించాడు. దానికి దాదాపు వెయ్యిమంది పోటీకి వచ్చారు. వారితో మంత్రి ఈ విధంగా అన్నాడు. "మీకు నా అభినందనలు. ఎందుకో తెలుసా? ఒక తరగతిలో పిల్లల్ని 'మీలో తెలివైనవారు చెయ్యి ఎత్తండి' అన్నప్పుడు చాలామంది సంశయిస్తూ వుంటారు. తన తెలివిపై నమ్మకం వుండటం ప్రతి మనిషికీ ముఖ్యం. అటువంటి నమ్మకంతో వచ్చినందుకు అభినందనలు. ఇక ప్రస్తుత సమస్య విషయానికి వస్తే ఇవిగో! ఇవి పన్నెండు నాణేలు. ఇందులో ఒకటి బరువు తక్కువ ఉన్నది. అదేదో కనుక్కోవాలి. **మీకు తూకంరాళ్లు ఇవ్వము**. కేవలం త్రాసు సహాయంతోటే మీరు కనుక్కోవాలి" అన్నాడు.

రాజు మంత్రివైపు అనుమానంగా చూస్తూ "ఇదేమి సవాలు మంత్రీ! ఇటువైపు ఒక నాణెము, అటువైపు మరొకటి వేసి, ఆరుసార్లు ఆరుసార్లు తూచటం ద్వారా సులభంగా కనుక్కోవచ్చు కదా!" అన్నాడు.

మంత్రి నవ్వి "అదే ఇందులో మెలిక మహారాజా!" అంటూ యువకుల వైపు తిరిగి, "**కేవలం మూడుసార్లు మాత్రమే తూచటం ద్వారా** దొంగనాణేన్ని కనుక్కోగలరా?" అన్నాడు.

యువకులు చకచకా పని ప్రారంభించారు. 6 నాణేల్ని ఒకవైపు, మరో 6 నాణెల్ని మరోవైపు త్రాసులో వేసి... బరువు తక్కువగా తూగిన వాటిని, చెరోవైపు 3 చొప్పున వేశారు. ఈసారి బరువు తక్కువ తూగిన మూడింటిలో ఒక దొంగనాణెం తప్పక ఉంటుంది కదా! అందులో చెరొకటీ చెరోవైపూ వేసి తూస్తే తక్కువ బరువు ఉన్నది తెలిసిపోతుంది. లేదా రెండూ సమానంగా తూగితే మూడోది దొంగనాణెం అన్నమాట. అందరూ అదే చేసి చూపించారు.

"ఇంతవరకూ బావున్నది కానీ, పొరుగురాజు మనముందు వుంచినది ఇంత చిన్న సమస్య కాదు. పదిమందిలో ఒక దొంగని పట్టుకోవాలి. అదీగాక కేవలం **ఒకసారి తూనిక వేయటం ద్వారా** పట్టుకోవాలి. ఈ విధంగా వెయ్యిమందినీ పరీక్షకి పంపలేము కదా మహామంత్రీ! పొరుగురాజు మన గురించి ఏమనుకుంటాడు?" అని అయోమయం చెందాడు రాజు.



మంత్రి నవ్వి, "మీరు చెప్పింది నిజమే. పదిమంది పనివారిలో ఎవరు దొంగో కనుక్కోవటానికి ఈ తెలివితేటలు సరిపోవు రాజా!" అంటూ ఆ యువకుల వైపు తిరిగి, "దొంగనాణెం తక్కువ బరువు ఉన్నది అనగానే మీరందరూ సులభంగా లెక్క చేశారు" అంటూ మరో 12 నాణేలు తెప్పించి, "ఇందులో ఒక దొంగనాణెం ఉంది. అయితే అది **మిగతా వాటికన్నా ఎక్కువ బరువు ఉన్నదో, తక్కువ బరువు ఉన్నదో చెప్పము.** కనుక్కోండి. కేవలం మూడుసార్లు తూచటం ద్వారా కనుక్కోవాలి సుమా!" అన్నాడు.

యువకులందరూ బిక్క మొహంవేసి చూశారు. అప్పుడు మంత్రి వారికి ఒక సూచన ఇచ్చాడు. "చెరోవైపూ ఆరు నాణేలు వేసి తూస్తే మీకెప్పటికీ లెక్కరాదు. నాలుగు - నాలుగు వెయ్యండి" అన్నాడు. అందులో ఒక యువకుడు ఆ సూచనని అర్థం చేసుకుని క్షణాల్లో దొంగనాణేన్ని పట్టుకున్నాడు. అతడిని పొరుగురాజు దగ్గరికి పంపటానికి ఎన్నిక చేశాడు మంత్రి.

"దొంగని ఈ యువకుడు ఎలా పట్టుకుంటాడో? ఇక్కడే ఒకసారి చేసి చూపించమందాం" అన్నాడు రాజు. తీరా అక్కడికి వెళ్లి విఫలమైతే అవమానం జరుగుతుందని ఆయన అనుమానం.

"అవసరం లేదు రాజా! అతడిమీద నాకు నమ్మకం ఉంది. పంపండి" అన్నాడు మంత్రి. రాజుకి ఇంకా సంశయం వీడకపోవటంతో, "రాజా! పొరుగురాజు పరీక్ష కన్నా, ఇప్పుడు నేను పెట్టిన పరీక్ష చాలా పెద్దది. దీన్ని సాధించిన ఈ యువకుడు, దాన్ని సులభంగా పరిష్కరించగలడు" అన్నాడు. మంత్రి మాటపై నమ్మకం వున్న రాజు యువకుడిని పంపటానికి అంగీకరించాడు.

పొరుగుదేశం వెళ్లిన యువకుడు అందర్నీ పరిశీలించాడు. పదిమందీ నిలబడి ఉన్నారు. ఒక్కొక్కరి ఎదురుగా ఆ వ్యక్తి తయారుచేసిన నాణేలు కుప్పగా ఉన్నాయి. మధ్యలో పెద్ద త్రాసు ఉన్నది. **యువకుడు తాను తెచ్చిన సంచిలోంచి తూనిక రాళ్లని తీసి కేవలం ఒకే ఒక్కసారి తూచటం ద్వారా దొంగని పట్టుకున్నాడు.** పొరుగురాజు చేత ఘన సన్మానం పొందాడు."

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! మొదటి పరీక్షలో తూనిక రాళ్లు లేకుండా, దొంగనాణెం ఏదో ఆ యువకుడు ఎలా తెలుసుకున్నాడు? రెండో పరీక్షలో కేవలం ఒకేసారి తూచటం ద్వారా పదిమందిలో ఒక దొంగని పట్టుకోవటం ఎలా సాధ్యం? తెలిసీ ఈ రెండు ప్రశ్నలకీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా!" అన్నాడు.

*(సమాధానం 157 పేజీలో)*

# 13. రొట్టె ఖరీదు



ఒక వ్యక్తి క్షురకర్మకి వెళ్ళాడు. అతడికీ క్షురకుడికీ ఆ సమయంలో సాధారణంగా సంభాషణ జరుగుతూ వుంటుంది. రకరకాల విషయాలపై చర్చలు చేసుకుంటూ వుంటారు. ఒకసారి దేవుడి గురించి ప్రసక్తి వచ్చింది. "మీరు ఎన్నైనా చెప్పండి. భగవంతుడు వున్నాడని నేను నమ్మను" అన్నాడు మంగలి.

"ఎందుకలా అనుకుంటున్నావు?" అడిగాడు క్షవరం చేయించుకుంటున్న వ్యక్తి. అతడిపేరు అన్వేషి.

"ఉన్నాడని మీరెందుకు అనుకుంటున్నారు?" తిరుగు ప్రశ్నవేసాడు మంగలి.

"... మనుషుల్ని కష్టాల్నుంచి ఆదుకునేవాడూ, మనసుకి ప్రశాంతత ఇచ్చేవాడు భగవంతుడు. ప్రపంచాన్ని శాసిస్తున్నవాడు అతడు."

క్షురకుడు నవ్వేడు. అతడి వాదనకి కావలసిన పునాది దొరికింది. "...మీరు చెప్పినది నిజమైతే ఈ ప్రపంచంలో ఇంతమంది మనుష్యులు కష్టాల్నుంచి బయటపడలేక, మనసుకి ప్రశాంతతలేక, రోగాలతో, మానసికాందోళనలతో ఎందుకు బాధపడుతున్నారు? ప్రపంచాన్ని శాసిస్తున్నది అతడయితే, అతడిపేరు చెప్పుకుంటూ ప్రజల్ని మోసం చేసేవారిని ఎందుకు శిక్షించడు? కష్టాల్లో వున్న ప్రజల్ని ప్రలోభపెట్టి, భక్తిని విక్రయించే మోసగాళ్ళ బారినుంచి అమాయకుల్ని ఎందుకు రక్షించడు?"

అన్వేషికి ఏం మాట్లాడాలో తెలియలేదు. అంతలో క్షురకర్మ పూర్తయింది. అన్వేషి వాదించ దల్చుకోలేదు. అతడు తెలివైనవాడు. వాదనలవలన అభిప్రాయాలు మారవని అతడికి తెలుసు. అందుకే అతడు మౌనంగా బయటకు వచ్చాడు. ఆ సమయంలో అతడు రోడ్డు మీద వెళ్తున్న ఒక వ్యక్తిని చూసాడు. ఆ వ్యక్తి జుట్టు పాయలుగా వేలాడుతూ వుంది. అట్టలు కట్టి వున్నది. తన జీవితకాలంలో అతడు క్షవరం చేయించుకుని వుండడు.

అన్వేషి చప్పున తిరిగి క్షౌరశాలలోకి ప్రవేశించి, "ఈ లోకంలో మంగలులు లేరు" అన్నాడు. బయటకు వెళ్ళిన వెంటనే తిరిగి వెనక్కి వచ్చి ఈ విధంగా చెప్తూన్న అన్వేషికి మతి భ్రమించిందేమో అనుకున్నాడు మంగలి. "ఏ విధంగా అలా చెప్తున్నారు? మీ ఎదురుగా నేను వున్నాను కదా!"



"లేదు లేదు. ఈ ప్రపంచంలో మంగలులు లేరు. వుంటే ప్రజలు బారెడు జుట్టుతో, పొడవాటి గడ్డాల్తో తిరగరు. ఇదిగో- నాతో బయటకు వచ్చి ఆ రోడ్డు మీద వెళ్తూన్న వ్యక్తిని చూడు. అతడిని చూస్తేనే తెలుస్తుంది కదా- ఈ లోకంలో క్షురకర్మ అనేది లేదని..."

"లేదు. మంగలి అనేవాడు వున్నాడు. కొందరు బికారులు అతడి దగ్గరకి వెళ్ళకపోతే అతడేం చెయ్యగలడు?"

అన్వేషి నవ్వేడు. "సరీగ్గా నేనూ అదే చెప్తున్నాను. భగవంతుడు వున్నాడు. కొందరు అతడిని ఆశ్రయించకపోతే అతడేం చెయ్యగలడు?"

క్షురకుడు నిరత్తుడయ్యాడు. అప్పుడు అన్వేషి ఈ విధంగా అన్నాడు. "తనకు తెలియనిది వున్నదని నమ్మటము మూఢనమ్మకము. కానీ తనకు తెలియనిదేదీ లేదని నమ్మటము అంతకన్నా ప్రమాదము. విధిని భగవంతుడు కూడా మార్చలేడు. అందువల్ల అసలు భగవంతుడే లేడనటం మూర్ఖత్వం. తనని నమ్మినవారికి స్వాంతన కలుగచేయువాడు భగవంతుడు." క్షురకుడు వింటున్నాడు. అతడి మనసులోని చీకటి తెరల్ని ఎవరో కత్తిరిస్తున్నట్టు అనిపిస్తోంది. అన్వేషి చెపుతున్నాడు "నమ్మిక బలాన్నిస్తుంది. కష్టాల సాంద్రతని తగ్గిస్తుంది. కష్టాన్ని పూర్తిగా తొలగించలేనప్పుడు, నమ్మికతో బలాన్ని పొంది, కష్ట ప్రభావాన్ని తొలగించుకోవటం మంచిదే కదా! కష్టంలో పూర్తిగా మునిగిన మనిషికి ధైర్యం నశిస్తుంది. శక్తి నశిస్తుంది. అదిగో... అప్పుడే ఈ భగవంతుడు తోడ్పడతాడు. మనపై మనకి నమ్మకం కలిగిస్తాడు. మనని తిరిగి మనిషిని చేస్తాడు." అతడు ఆగి తిరిగి అన్నాడు. "భక్తి పేరిట కొందరు భగవంతుడిని వ్యాపార వస్తువు చేసిన మాట నిజమే! ఎప్పుడయితే వ్యాపారం చేయటం ప్రారంభించావో అప్పుడు అందులో నువ్వు నష్టపోవటానికి ఆస్కారం వున్నది. అప్పుడే మోసగాళ్ళు నీ జీవితంలో ప్రవేశిస్తారు. అందుకే భగవంతుడితో ఎన్నడూ వ్యాపారం చెయ్యడు. ఫలానాది నాకు ఇస్తే, ఫలానాది నీకు ఇస్తా- అనకు. భగఃంతుడు వున్నాడూ అనుకుంటే అతడు అజ్ఞానుల్నీ, అమాయకుల్నీ మాత్రమే రక్షిస్తాడు. లంచగొండుల్ని, స్వార్థపరుల్నీ కాదు. భగవంతుడిపై నమ్మికతో ప్రేరణ పొంది, నీ పనిని నువ్వు మరింత శ్రద్ధగా చెయ్యాలి. అతడికి ఆశ చూపి కాదు. భగవద్గీత చెప్పిందదే...!"

❖ ❖ ❖

చెప్పటం ముగించి, బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! భగవంతుడు ఉన్నాడో లేడో మనకి తెలియనట్టే, మనలో ఎన్ని తెలివితేటలున్నాయో మనకి తెలీదు. కొందరు పుట్టుకతోనే మడ్డిగా వుంటారు. మరికొందరు ప్రతిభావంతులుగా పెరుగుతారు. ఏది ఏమైనా, కృషితో తెలివిని పెంచుకోవచ్చునన్నది నిర్వివాదాశం. జన్మతో వచ్చిన అవకరాలను ఏమీ చేయలేం. కానీ ఏ ఋజువూ లేకుండా "నాకు తెలివిలేదు. నాకు జ్ఞాపకశక్తి లేదు" అనుకోకూడదు. ఆటల గురించి, చలన చిత్రాల గురించి ఎన్నో వివరాలు చెప్పగలిగే విద్యార్థి, తనకు జ్ఞాపకశక్తి తక్కువని ఏ విధంగా అనగలడు? అదేవిధంగా, 'తెలివి' గురించి కూడా. నిరంతరం ఆలోచిస్తూ వుండటం వలన తెలివి పెరుగుతుంది. ప్రకృతిలో ఎన్నో ప్రశ్నలున్నాయి. చెక్కబల్లమీదకన్నా నులక మంచంపై పడుకుంటే ఎందుకు సుఖంగా వుంటుంది? తలపై బిందెలు పెట్టుకుని నడిచే స్త్రీల నడక ఎందుకు అందంగా వుంటుంది? ఇలాంటి సందేహాలని నివృత్తి చేసుకునే ప్రయత్నంలోనే మనిషి మిగతా జంతువులనుంచి విడివడి, జ్ఞానవంతుడయ్యాడు. 'సందేహమే' మనిషికీ జంతువులకీ తేడా. ఇలాంటి సందేహానికి సంబంధించిన లెక్క ఒకటి నా వద్ద వున్నది. చాలా చిన్న లెక్క. దీనికి పెద్ద తెలివి కూడా అవసరం లేదు. కానీ తొందర పడవద్దు. తప్పులో కాలేస్తావు. ఆలోచించి చెప్పు.

ఒక అడవిలో ప్రహసితుడనే యువకుడు ఆకలితో నడుస్తూ ఉండగా రాముడు, కృష్ణుడు అనే ఇద్దరు బాటసారులు కనపడ్డారు. రాముడి దగ్గర 5 రొట్టెలు, కృష్ణుడి దగ్గర 3 రొట్టెలు ఉన్నాయి. ముగ్గురూ వాటిని **'సమానంగా'** పంచుకుని తిన్నారు.

ఉచితంగా తినటం ఇష్టంలేని ప్రహసితుడు తాను తిన్న రొట్టెలకి ఖరీదు లెక్కకట్టి ఎనిమిది వరహాలు ఇచ్చి వెళ్ళిపోయాడు. వాటిని రాముడు, కృష్ణుడు ఎలా పంచుకోవాలి? ఎవరెంత తీసుకోవాలి? అయిదు రొట్టెలున్న రాముడు అయిదు వరహాలు, కృష్ణుడు మూడు తీసుకోవాలా? ఇద్దరూ సమానంగా పంచుకోవాలా? వేరే లెక్క ఉన్నదా? తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వక్కలవుతుంది సుమా" అన్నాడు.

*(సమాధానం 158 పేజీలో)*

# 14. గడియారం గొడవ

కష్టం వచ్చినప్పుడు మనం సమయం విలువ మర్చిపోతాం. పరిష్కారం ఆలోచించటం మానేసి, 'విచారిస్తూ' కాలాన్ని దిగులుతో వృథా చేసుకుంటాం. తరువాతి బేతాళ కథ చదవబోయేముందు, 'కాలం' గురించిన ఈ రెండు సంఘటనలూ చదవండి.

❖ ❖ ❖

కష్టాలన్నీ ఒకేసారి కలిసికట్టుగా వస్తాయనటానికి ఉదాహరణ ఒకటి యదార్థంగా జరిగింది. ఊరికి దూరంగా ఒక చిన్నగుట్టమీద ఓ గ్యారేజీ, ఇల్లూ వున్నాయి. ఇంటి యజమాని గ్యారేజీలో మోటార్‌సైకిల్ తుడుస్తూండగా అది పక్కకి పడి ఆయన చెయ్యి విరగడమేగాకుండా పెట్రోలంతా నేలపాలైంది. వాళ్ళావిడ ఫోన్ చేస్తే అంబులెన్స్ వచ్చింది. ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టుకట్టి వెనక్కి పంపారు. ఈ లోపుల ఆవిడ నేలంతా శుభ్రం చేసి ఆ పెట్రోల్ గుడ్డని టాయిలెట్‌లో అటకమీద పడేసింది. అది క్రింద కబోర్డ్‌లో పడడం ఆమె చూసుకోలేదు. విరిగిన చేతికి కట్టు కట్టుకుని ఇంటికి వచ్చిన యజమాని ఉదయాన్నే జరిగిన ఆక్సిడెంట్‌కు విసుక్కుంటూ టాయ్‌లెట్‌లోకి వెళ్ళి కూర్చుని సిగరెట్ వెలిగించి అగ్గిపుల్ల క్రింద కబోర్డ్‌లో పడేసాడు.

సరిగ్గా ఒక్క క్షణానికి టాయిలెట్‌లోంచి పెద్దకేక వినిపించింది. పరుగెత్తుకు వెళ్ళిన భార్యకి మోకాలు పైనుంచి వీపు క్రిందవరకు కాలిన భర్త, ఏడుపాక్కటే తరువాయిగా కనిపించాడు. మళ్ళీ అంబులెన్స్‌కి ఫోన్ చేసింది.

గుట్టక్రింద వాహనం ఆపుచేసి ఇద్దరు వ్యక్తులు పైకివచ్చి అతడిని స్ట్రెచర్‌మీద పడుకోబెట్టారు. స్ట్రెచ్చర్ మోస్తున్న అంబులెన్స్ వ్యక్తి "అంత విచిత్రంగా తొడల వెనుక ఆ ప్రదేశంలో ఎలా కాలింది?" అన్న ప్రశ్నకి ఆమె జరిగిదంతా చెప్పింది. అంతావిని అతను ఫక్కున నవ్వేసరికి, దానిపై నుంచి క్రిందపడిన యజమానికి ఈసారి కాలు విరిగింది.

కష్టాలన్నీ కట్టకట్టుకుని ఇలా వచ్చినప్పుడే మనం జాగ్రత్తగా ఉండాలి. ప్రతి మనిషికీ ఓ 'బ్రేక్‌పాయింట్' ఉంటుంది. అప్పటివరకూ నిబ్బరంగానే వున్నా, ఆఖరికష్టంతో కృంగిపోతారు. శక్తులన్నీ ఒక్కసారిగా నశించినట్టు అనిపిస్తుంది. దీన్నే ఇంగ్లీషులో 'ఒంటెపై చివరి గడ్డిపరక' అన్న సామెతతో ఉదహరిస్తారు. అలాంటి

కష్టాల్లోంచి బయటపడాలంటే 'సానుకూల ఆలోచనాధోరణి' మనిషికి ఎంతో అవసరమవుతుంది. అటువంటి సంఘటన ఇది. చదవండి.

❖ ❖ ❖

కొంతకాలం క్రితం ఓ బట్టల ఫ్యాక్టరీలో రాత్రి పదిన్నర ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. కేవలం అరగంట వ్యవధిలో అంతా జరిగిపోయింది. ప్రొద్దున్నే ఫ్యాక్టరీకి వచ్చిన వెయ్యిమంది కార్మికులకి బూడిద మాత్రమే కనిపించింది. యజమానుల పదిహేను సంవత్సరాల శ్రమ ఫలితం నాశనమై పోయింది. బ్యాంకులు ఆ కంపెనీ తాలూకు అకౌంట్‌లను దిగ్బంధనం చేసాయి. కంపెనీ పోటీదార్లు ఇక దాని పని అయిపోయిందనుకున్నారు. బాకీదార్లు, సప్లయిర్లు అప్పుతీర్చమని ఒత్తిడి తెచ్చారు.

కానీ సరిగ్గా పదిహేను రోజుల తర్వాత అద్దెకు తెచ్చిన మెషినరీతో, టెంపరరీ షెడ్లతో ఆ కంపెనీ తిరిగి పని ప్రారంభించింది. సంవత్సరం తిరిగేసరికల్లా మరింత అందమైన భవంతులు హుందాగా నిలిచాయి. ఇదంతా ఎలా సాధ్యమైంది? దానికి యాజమాన్యం ఈ విధంగా చెప్పారు.

- మొత్తం సంఘటనను మేము సానుకూలధోరణితో చూసాము. ప్రమాదం రాత్రి జరిగింది. పగలు జరిగివుంటే జరిగే ప్రాణనష్టం అంతు లేనిది. అది మా అదృష్టంగా భావించాము.
- అంతకు ముందురోజు ఆదివారం. దానికి ముందు ప్రభుత్వ శలవుదినం. అందువల్ల హార్బర్ నుండి మా గోడవున్‌కు స్టాకు తెచ్చుకోవడానికి వీలు పడలేదు. లేకపోతే నష్టం మరో రెండుకోట్లు ఎక్కువవుండేది.
- మొత్తం ఆఫీసర్లు, కార్మికులు ఒక్క తాటిపై నిలబడి మాకు మానసిక ధైర్యాన్నివ్వటం మాకు అంతులేని శక్తిని కలిగించింది.
- మా యొక్క నాయకత్వ లక్షణాన్ని అత్యవసర పరిస్థితుల్లో నిరూపించుకోవడానికి ఇదొక అవకాశంగా అందరం భావించాం.
- మా దీక్ష, శ్రమ చూసి బ్యాంకులు, సప్లయిర్లు కూడా వెసులు బాటు కల్పించారు. చివరకు నూరుశాతం ఉత్పత్తి సాధించగల్గుతున్నాం.
- అన్నిటికన్నా ముఖ్యంగా, మా వర్కర్లకి పనిలేని దినాలకు కూడా జీతాలతో సహా ఈ ఏడాది బోనస్ ఇవ్వబోతున్నాం.

❖ ❖ ❖



ఎక్కే ముందు చూస్తే శిఖరం 'అమ్మో! ఇంత ఎత్తా' అనిపిస్తుంది. విసుగూ, భయమూ కలిసి నిస్సత్తువ కలుగుతుంది. ఎక్కిన తర్వాత చూస్తే ప్రపంచం ఎంత క్రింద ఉందో తెలుస్తుంది. ఎక్కిన అలసట మటుమాయమై ఆనందం మిగులుతుంది. అదే జీవితం. ఆనందంలో కాలం విలువ తెలియదు. కష్టాలొచ్చినప్పుడు కాలం ముందుకి కదలదు. 'కాలం విలువ' కష్టం వచ్చినప్పుడే గ్రహించాలి. గత శతాబ్దపు ప్రారంభంలో శాస్త్రజ్ఞులు సెకనులో 10,000వ వంతుని కొలవగలిగారు.

ప్రస్తుత శతాబ్దంలో, అంటే 2000 సంవత్సరంలో శాస్త్రవేత్తలు సెకనులో 1,00,00,00,00,000 భాగాన్ని కొలవగలిగే పరికరాల్ని కనుక్కున్నారు. అటువంటి (కాలానికి సంబంధించిన) బేతాళ ప్రశ్నలు ఇప్పుడు చదువుదాం.

❖ ❖ ❖



పట్టువదలని విక్రమార్కుడు తిరిగి వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు బేతాళుడు ఈ విధంగా అన్నాడు "చాలామంది విజ్ఞులు కూడా తమకు తెలిసిన మార్గంలోనే ఆలోచిస్తారే తప్ప రకరకాల ఇతర పరిష్కార మార్గాలు కనుక్కునే ప్రయత్నం చెయ్యరు. రాజా! ఈ ఉదాహరణ చూడు.

కొంతమంది జనం దూరంగా ఒక పక్షిని గమనించారు. ఆ తరువాత వారందరూ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పక్షి తనవైపు వేగంగా రావటాన్ని తాను చూశానని అందులో ఒక వ్యక్తి ఆ తరువాత వెల్లడించాడు. కొన్ని కోట్లు నష్టం జరిగింది... ఇలా ఎంతసేపు చెప్పుకుంటూ పోయినా అదేదో దెయ్యపు పక్షో, గండభేరుండమో అనుకుంటారే తప్ప, వారు **విమానంలో ప్రయాణీకులన్న ఆలోచన** రాదు.

ప్రశ్నకు తొందరతొందరగా సమాధానం చెప్పేయాలన్న కంగారు, చాలామంది విద్యార్థుల్ని తప్పుచేసేలా చేస్తుంది. "5, 6, 7, 8 అంకెల్లో ఏవేవి 2 చేత సమానంగా భాగింప బడతాయి?" అన్న ప్రశ్నకు తొందర్లో 6, 8 అంటారు. '2' అన్ని అంకెల్నీ సమానంగానే భాగిస్తుందని, దేన్నైనా సగం సగం చేస్తుందనీ మర్చిపోతారు.

'ఒక గడియారం రెండు గంటలు కొట్టటానికి రెండు సెకన్లు పడుతుంది. మూడు గంటలు కొట్టటానికి ఎంత సేపు పడుతుంది?' అన్న ప్రశ్నకి సమాధానం: "నాలుగు సెకన్లు". ఎలా అంటే టంగ్ (...) టంగ్ అని రెండు గంటలు కొట్టటానికి

మధ్య ఒక విరామం ఉంటుంది. టంగ్ (...) టంగ్ (...) టంగ్ అని మూడు గంటలు కొట్టడానికి మధ్య రెండు విరామాలు ఉంటాయి. ఒక విరామానికి 2 సెకన్లు పడితే రెండు విరామాలకి 4 సెకన్లు పడుతుంది.

రాజా! పై సూచన ఆధారంగా ఈ అయిదు ప్రశ్నలకీ సమాధానం చెప్పు. మొదటి ప్రశ్న - ఒక గడియారం అయిదు గంటలు కొట్టటానికి 5 సెకన్లు పడితే, పదిగంటలకి ఎంతకాలం పడుతుంది?

రెండో ప్రశ్న - ఒక గ.డియారం 6 గంటలు కొట్టటానికి 30 సెకన్లు పడితే, 12 గంటలు కొట్టటానికి ఎంతకాలం పడుతుంది?

మూడో ప్రశ్న - అర్ధరాత్రి 12 నుంచీ, మధ్యాహ్నం 12 వరకూ మధ్యలో ఒక సమయం దగ్గర - జరిగిపోయిన గంటలు, జరగవలసిన గంటలకన్నా రెండు రెట్లు ఉంటే, అప్పుడు సమయం ఎంతై ఉంటుంది? సమాధానం సులభం. ఉదయం ఎనిమిది గంటలకి, జరిగిపోయిన గంటలు 8, జరగాల్సినవి 4. ఈ ఉదాహరణ ఆధారంగా నీవు ఈ ప్రశ్నకి సమాధానం చెప్పవలసి ఉంటుంది. జరిగిపోయిన గంటలు జరగాల్సిన గంటలకి అయిదు రెట్లు ఉంటే అప్పుడు సమయం ఎంతై ఉంటుంది?

రాజా! ఈ తరువాత నాలుగో ప్రశ్న మరింత కష్టమైనది. కాని కాస్త మనసు పెట్టి ఆలోచిస్తే సమాధానం దొరుకుతుంది. అర్ధరాత్రి 12 నుంచి జరిగిపోయిన నిమిషాలు, మధ్యాహ్నం 12 వరకూ జరగాల్సిన నిమిషాలకి తొమ్మిదిరెట్లు ఉంటే అప్పుడు సమయం ఎంతై ఉంటుంది?

ఇక ఆఖరి ప్రశ్న. భూమి నుంచి దూరంగా వెళ్ళే కొద్దీ బరువు తగ్గుతుందన్న విషయం మనకి తెలిసిందే కదా. అందుకే అంతరిక్షంలో ప్రయాణం చేసేవారు శూన్యంలో తేలుతూ వుంటారు. మరి భూమి లోపలికి, అంటే భూగర్భపు కేంద్రం వైపు ప్రయాణించగలిగితే బరువు తగ్గుతుందా? పెరుగుతుందా? ఒకేలా వుంటుందా? ఈ అయిదు ప్రశ్నలకీ తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయిచ్రక్కలవుతుంది సుమా!" అన్నాడు.

(సమాధానం 159 పేజీలో)

# 15. విశాల దొంగ



విశాల నగరంలో ఒక దొంగ ఉండేవాడు. అతడి అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. ఎలా ఉంటాడో తెలీదు. అందరూ అతడిని 'రేచుక్క' అని పిలిచేవారు. ఎంతటి భద్రత ఉన్న ఇంటినైనా అతడు తల్చుకుంటే రాత్రికి రాత్రి దోపిడీ చేసేవాడు. విశాల నగర మహారాజు రేచుక్కని పట్టుకోవటానికి ఎందరినో నియమించాడు. ఎవరూ పట్టుకో లేకపోయారు.

విశాలనగరంలో ఒక జూదశాల ఉంది. అక్కడ స్త్రీలు కూడా జూదమాడతారు. దాని బయట అరుగుమీద ప్రశాంతుడనే యువకుడు రాత్రిళ్లు నిదురించేవాడు. అతడు గొప్ప తెలివితేటలున్నవాడే గానీ పనేమీ లేక ఖాళీగా ఉండేవాడు. ఇది ఇలా ఉండగా నగర ప్రధాన రక్షణాధికారి వయసు మీరటంవల్ల ఉద్యోగం నుంచి వైదొలిగాడు. ఆ స్థానానికి అర్హుడైన వ్యక్తి కోసం రాజు చాటింపు వేయించాడు. పనేమీ లేని ప్రశాంతుడు కూడా ఆ ఉద్యోగానికి వెళ్లాడు.

రక్షణాధికారిని రాజే స్వయంగా ఎంపిక చేయబూనుకున్నాడు. అతడికి వేపకాయంత వెర్రి ఉంది. దానికితోడు అపారమైన తెలివి కూడా ఉంది. ప్రశాంతుడిని రాజు మూడు ప్రశ్నలు వేశాడు. "ఒక కాగితాన్ని నీవు ఎన్ని సార్లు మధ్యకి మడవగలవు?"

"ఏడు సార్లు కన్నా ఎక్కువ మడతలు వేయలేము" అన్నాడు ప్రశాంతుడు.

ఆ సమాధానానికి సంతోషించిన రాజు మరొక ప్రశ్న వేశాడు.

"ఒక వ్యక్తి బొమ్మ వున్నది. అది నాది కావొచ్చు. నా తండ్రిది కావొచ్చు. లేదా నా కొడుకుది కావొచ్చు. ఆ బొమ్మలోని వ్యక్తి తండ్రి నా తండ్రికి కొడుకు. నాకు సోదరులు లేరు. అతను నాకేమవుతాడు?" అని అడిగాడు.

"మీ తండ్రికి కొడుకు అంటే ఎవరు? మీరే కదా! "అతని తండ్రి మీరే" అంటే - ఆ బొమ్మలోని వ్యక్తి మీకు కొడుకు అవుతాడు" అని సమాధానం ఇచ్చాడు ప్రశాంతుడు.

రాజు ఈసారి మరింత కష్టమయిన ప్రశ్నవేశాడు. "మొక్కలు ఆకాశం వైపుకీ, వాటి వేళ్ళు భూమిలోకి పెరుగుతాయి కదా. ఒండి చక్రం అంచుకి కుండీ

బిగించి అందులో ఒక మొక్కవేసి చక్రాన్ని ఆపకుండా నిలువుగా, గుండ్రంగా తిప్పుతూ వున్నామనుకో. కుండీకి రెండు వైపులా ఖాళీ వదిలేమనుకో. మొక్క ఎటునుంచి బయటకి వస్తుంది? వేరు ఎట్నుంచి వస్తుంది?" చాలా క్లిష్టమయిన ఈ ప్రశ్నకి కొంచెంసేపు ఆలోచించి, "రాజా! నాకున్న కొద్దిపాటి జ్ఞానంతో చెపుతున్నాను" అంటూ సమాధానం చెప్పాడు.

దీనికి అమితంగా సంతోషించిన రాజు తన ఆఖరి ప్రశ్న సంధించాడు. "ఒక నిమ్మ, ఒక బత్తాయి రెండు రూపాయలైతే రెండు నిమ్మ, మూడు బత్తాయిల ఖరీదు ఎంత?"

"చెప్పలేను. అదే నా సమాధానం" అన్నాడు ప్రశాంతుడు. అప్పటి కప్పుడు అతడిని ప్రధాన రక్షణాధికారిగా నియమించాడు రాజు.

పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రశాంతుడు వలపన్నాడు. రేచుక్క ఎలా ఉంటాడో ఎవరికీ తెలీదు. కానీ వేగులవారి ద్వారా ఒకరోజు అతడి ఆచూకీ తెలిసింది. ఫలానా జూదగృహంలో అతను ఆడుతున్నాడన్న విషయం నూరు శాతం ఋజువు అవగానే ప్రశాంతుడు అక్కడికి బయల్దేరాడు.

ఒకప్పుడు తాను పడుకున్న అరుగు పక్కనుంచి మెట్లు ఎక్కి ఒక రక్షణాధికారిగా లోపలికి ప్రవేశించాడు. మారుమూల గదిలో రేచుక్క నలుగురితో కలిసి జూదం ఆడుతున్నాడు. ప్రశాంతుడు ఒక్క ప్రశ్న వేయలేదు. పరిశీలనగా నలుగురివైపూ కనీసం క్షణం కూడా చూడలేదు. అంతకుముందు అతడు రేచుక్క చిత్రపటం చూడలేదు. ఎత్తూ పొడవూ తెలీదు. పేరు పెట్టి పిలవలేదు. జూదం ఆడుతూన్న మిగతా ముగ్గురూ ఎవరో కూడా ప్రశాంతుడికి తెలీదు. అయినా అతడేం సంశయించలేదు. సరాసరి రేచుక్క వద్దకు వెళ్ళి అతడి చేతులకి అరదండాలు తగిలించాడు."

ఈ కథ చెప్పి బేతాళుడు "రాజా! రేచుక్క ఎలా ఉంటాడో ఎవరికీ తెలీదు. ఎలా అంత ధీమాగా, నమ్మకంగా ప్రశాంతుడు ఒక్క ప్రశ్న కూడా వేయకుండా ఎలా బంధించాడు? జాగ్రత్తగా ఆలోచించు. నా కథలోనే నీకు సమాధానం దొరుకుతుంది" అన్నాడు.

(సమాధానం 160 పేజీలో)

# 16. కొలనులో పూలు



పట్టువదలని విక్రమార్కుడు చెట్టువద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడుస్తూండగా రాజుకి మౌనభంగం కావించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా చెప్ప సాగాడు.

"రాజా! జీవితం అంటే ఈరోజు ఆనందంగా బ్రతుకుతూ, రేపు ఇంతకన్నా బాగా బ్రతకటానికి ఏర్పాటు చేసుకోవటం..! సామాన్యులు భవిష్యత్తు గురించి కలలు కంటారు. గొప్పవారు నిద్ర మేల్కొని పని చేస్తారు. అంతే తేడా. చిత్రమేమిటంటే, పరిష్కారాలు లేని సమస్యలు చాలా తక్కువ. మనం ఏదైనా పని చేస్తే దాని ఫలితం ఏమిటో, లాభం ఏమిటో మనకి తెలిసి ఉండాలి. అనుకున్న ఫలితం రావటం లేదంటే మనం చేస్తున్న పనిలోనో, పని చేసే విధానంలోనో ఏదో తప్పు ఉన్నదన్నమాట. అప్పుడు దాన్ని సరిదిద్దుకోవాలి. లేదా ఆ పని చెయ్యటమన్నా మానేయాలి. అంతే తప్ప, 'నన్నీ దురదృష్టం వదలదు' అనుకోకూడదు. నిరర్థకమైన శ్రమ వలన లాభం ఏమున్నది? దీనికి ఒక చిన్న ఉదాహరణ చెపుతాను.

ఒక కుర్రవాడిని అతడి తండ్రి ఒక స్వామి దగ్గరకు తీసుకువెళ్ళాడు. "స్వామీ! నా కొడుక్కి ఏకాగ్రత తక్కువ. చదువుమీద మనసు నిలపడు. స్నేహితులంటే ప్రాణం. జ్ఞాపకశక్తి అసలు లేదు. పరిష్కారం చెప్పండి" అన్నాడు.

స్వామి ఆ కుర్రవాడివైపు తిరిగి, "నీకు నిజంగానే నీ సమస్యనుంచి బయటపడాలనే ఆలోచన ఉన్నదా?" అని అడిగాడు.

"మీరేం చెప్పినా చేస్తాను" అన్నాడు ఆ పిల్లవాడు.

"రేపటినుంచీ **రెండు రోజులపాటు** మాట్లాడటం మానెయ్యి. ఎవరితోనూ మాట్లాడకు. ఆ తరువాతిరోజు సాయంత్రంపూట **గంటసేపు** కళ్ళకి గంతలు కట్టుకుని ఇంట్లో మౌనంగా కూర్చో. మూడు రోజుల తరువాత వచ్చి కనపడు" అన్నాడు స్వామి.

మూడు రోజుల తరువాత వచ్చిన పిల్లవాడితో, "అవును. కాదు – ఈ రెంటిలో ఒక పదంతో జవాబు చెప్పు. నీలో మార్పు – అది అతి చిన్న మార్పు అయినా సరే... ఏదైనా వచ్చినట్టు అనిపించిందా?" అని అడిగాడు.


"అవును" అన్నాడా విద్యార్థి.

స్వామి తలూపి, "ఇలా మరో నాలుగుసార్లు నాలుగు వారాలపాటు చేసి అప్పుడు చూడు. ఇక నా వద్దకు రానవసరం లేదు" అన్నాడు.

నెలరోజుల తరువాత ఆ కుర్రవాడి తండ్రి స్వామి దగ్గరకు వచ్చాడు. అతడి కళ్లు ఆనందంతో మెరుస్తున్నాయి. స్వామికి నమస్కరించి, "నా పిల్లవాడిలో అనూహ్యమైన మార్పు వచ్చింది మహాశయా! ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. ఇది ఎలా సంభవమైంది?" అని అడిగాడు.

"ఇందులో నేను చేసిందేమీ లేదు నాయనా! జ్ఞానం పెంచుకోవాలంటే రోజుకో కొత్తవిషయం తెలుసుకోవాలి. జ్ఞాపక శక్తి పెంచుకోవాలంటే రోజుకో అనవసరమైన విషయం మర్చిపోవాలి. ఆవిధంగా నీ కుమారుడే తనని తాను సంస్కరించుకున్నాడు. రెండు రోజులపాటు అతడు మాట్లాడకపోయేసరికి, పెళుసు రాలిపోయినట్టు అతడి స్నేహబృందం అతడికి దూరమైంది. 'మౌనానందస్వామి' అని ఆ కుర్రవాళ్లు అతడిని హేళన కూడా చేసి ఉంటారు. **కళ్లకి గంతలు కట్టుకున్నప్పుడు అతడు అంతర్ముఖుడు అయ్యాడు.** ఎంత వృధాగా ఇటువంటి స్నేహాలు చేస్తూ ఉన్నాడో ఆలోచించు కున్నాడు. ఆ అంతర్మథనంతో ఏకాగ్రత పెంచుకున్నాడు" అన్నాడు స్వామీజీ.

కాబట్టి ఓ విక్రమార్కా! తనకు తెలివి, ఏకాగ్రత లేవని చింతిస్తే లాభం లేదు. దాన్ని ఎలా సాధించాలో ఆలోచించాలి. భగవంతుడు కేవలం మెదడు అనే గదిని మాత్రమే ఇస్తాడు. దాన్ని తెలివి అనే పూలతో అలంకరించుకోవలసిన బాధ్యత మనదే. ఆ విధంగా శ్రమపడి 'పూల సాయం'తో తన గణితశాస్త్ర జ్ఞానాన్ని పెంచుకున్న ఒక పూజారి యువకుడి అద్భుతమైన కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ చెప్పసాగాడు.





"సోమశేఖరాచారి కాళికాదేవి గుడిలో పూజారి. నిరంతరం భక్తితో ఆ దేవతని పూజిస్తూ ఉండేవాడు. అతడికి ఒకే కోరిక. గణితంలో మేధావినవ్వాలని. కానీ తెలివితేటలు రాలేదు. ఆ విషయమై చింతిస్తూ ఉండేవాడు. ఎంతకాలం పూజలు చేసినా ఆ మాత్రం దయ చూపటంలేదని కాళికాదేవిపై అలిగేవాడు కూడా. ఇదంతా గమనించిన నారదుడు కాళితో, "మాతా! అంతగా నీకు సపర్యలు చేస్తున్న ఆ పూజారికి అతడు కోరిన లెక్కల జ్ఞానాన్ని ఎందుకని ఇవ్వటం లేదు?" అని అడిగాడు.

"నాయినా! కేవలం పూజలు చేయటం వలన జ్ఞానం రాదు. కృషి చెయ్యాలి. మేధో మథనం చెయ్యాలి" అంది ముగ్గురమ్మల మూలపుటమ్మ.

నారదుడు ఆమెకు నమస్కరించి, "తెలివితేటలు పెంచుకోవటమే జీవితమని పిల్లలకి ఎలా తెలుస్తుంది తల్లీ! పెద్దలే ఆ విషయం వారికి చెప్పాలి. ఆ మానవుడికి నువ్వే దాని గురించి నేర్పు" అన్నాడు.

దేవదేవి 'సరే' అన్నట్టు నవ్వింది. ఆ మరుసటిరోజు సోమశేఖరాచారి యథా ప్రకారం పూలతో ఆలయంలో విగ్రహాన్ని అర్చన చేస్తూ ఉండగా విగ్రహం నుంచి ఈ విధంగా మాటలు వినిపించాయి. "సోమశేఖరా! నీ భక్తికి మెచ్చాను. నీకు గణితం బోధిస్తాను. నా కుమారులైన విష్ణు, శివ, బ్రహ్మ ఆలయాలు పక్కనే ఉన్నాయి. ఆ ముగ్గురు దేవుళ్లనీ సమాన సంఖ్యపూలతో అభిషేకం చేసిరా. **ముగ్గురినీ ఒకే సంఖ్య పూలతో పూజించాలి సుమా!**" అన్నది.

ఆచారి అమితానంద భరితుడై, "అలాగే దేవీ! ముప్పై పూలు తీసుకెళ్లి ఒక్కొకర్నీ పదేసి పూలతో అభిషిక్తం చేస్తాను" అన్నాడు.

"మంచిది. కానీ దేవాలయంలోకి తీసుకెళ్లబోయే ముందు కోనేటిలోని జలాలతో పూలని కడుగు. ముందు కొన్నిపూలతో విష్ణువుని పూజించు. మిగిలిన పూలని తిరిగి చెరువులో శుభ్రం చెయ్యి. ఆ తరువాత శివుని పూజించి, తిరిగి మిగిలిన పూలని మళ్ళీ జలంతో శుభ్రం చేసి బ్రహ్మకి అర్పితం చెయ్యి. ముగ్గురు దేవుళ్లకీ సమానంగా పూలు లభించాలి సుమా! సేవలో ఎవరికీ ఎక్కువ తక్కువలు జరగకూడదు. ఏ తల్లికూడా కుమారుల్లో పక్షపాతం చూపించదు కదా!"

"ఇంతగా చెప్పాలా దేవీ! చాలా సులభంగా అది చేస్తాను. గణితంలో ఇదే మొదటిపాఠంగా భావిస్తాను. లెక్కలు ఇంత సులభం అని నేనింతవరకూ అనుకోలేదు" అన్నాడు ఆచారి.

అప్పుడా అశరీరవాణి "అంత సులభం కాదు నాయినా! అసలు మెలిక ఇక్కడే ఉన్నది. కోనేటి జలాలకు ఒక శక్తిని ప్రసాదిస్తున్నాను. ఆ నీటిలో కడగగానే

నీ చేతిలోని పూలు **మూడురెట్లు** అవుతాయి. ఆ విషయం గుర్తుంచుకో. మరొక్క షరతు. చివరి దేవాలయంలో బ్రహ్మని పూజించి బయటకు వచ్చేటప్పుడు నీ **చేతిలో ఒక్క పువ్వు కూడా మిగలకూడదు సుమా!**" అన్నది.

సోమశేఖరాచారి ఆ మరుసటిరోజు 20 పూలు తీసుకెళ్లి చెరువులో కడిగాడు. అవి 60 అయ్యాయి. దేవి ఇంత చిన్న పరీక్ష ఎందుకు పెట్టిందో అర్థం కాలేదు. ముప్పై పూలతో విష్ణువుకి అర్చన చేశాడు. మిగతా ముప్పై పూలతో శివాలయానికి వెళ్లబోతూండగా "ప్రతి పూజ ప్రారంభం ముందు పూలని ప్రక్షాళనం చెయ్యాలి" అన్న కాళికాదేవి మాటలు గుర్తుకు వచ్చాయి. చేతుల్లో మిగిలి ఉన్న 30 పూలనీ కడగగానే అవి 90 అయ్యాయి. ప్రతి దేవుణ్నీ సమానమైన పూలతో పూజించాలన్న షరతు గుర్తొచ్చి, ఆ రోజుకి నిరాశగా వెనుదిరిగాడు.

ఆ మరుసటి రోజు మరింత పట్టుదలతో అర్చనకి బయల్దేరాడు. ఈసారి 2 పూలు మాత్రమే కోసి చెరువులో ముంచాడు. అవి 6 అయ్యాయి. విష్ణువుకి 4 అర్పించి, మిగిలిన 2 పూలనీ తిరిగి చెరువులో కడిగాడు. మళ్లీ 6 అయ్యాయి. శివుడిని సమాన సంఖ్యలో... అంటే 4 పూలతో అభిషేకం చేశాడు. ఇక చేతిలో 2 మిగిలాయి. వాటిని చెరువులో కడిగేసరికి మళ్లీ 6 అయ్యాయి. బ్రహ్మకి 4 అర్పిస్తే చేతిలో 2 మిగులుతాయి. దేవి కోరిక ప్రకారం అందరు దేవుళ్లకీ సమానంగా అర్పించాలి. **చేతిలో ఏవీ మిగలకూడదు**. ఎలా?

కర్తవ్య దీక్షా పరాయణుడైన సోమశేఖరాచారి రకరకాలుగా ప్రయత్నించి చివరకు కనుక్కున్నాడు. కొన్ని పూలని తీసుకెళ్లి - కడిగి - మూడు రెట్లు చేసి - కొన్ని విష్ణువుకి అర్పించి, మిగిలినవి కడిగి- అదే సంఖ్యలో శివునికి అభిషేకం చేసి - తిరిగి మూడు రెట్లు అయిన పూలని బ్రహ్మకిచ్చి - ఖాళీ చేతులతో కాళిక దగ్గరికి విజయహాసంతో వెళ్లాడు."

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! సోమశేఖరుడు ఎన్ని పూలతో ఆరంభించాడు? దేవుళ్లకు ఎన్ని పూలతో అభిషేకం చేశాడు? పూలు మూడురెట్లు అవుతూండగా అందరికీ ఒకే సంఖ్యలో అభిషేకం చెయ్యాలంటే ఎన్నిటితో ప్రారంభించాలి?" అని ప్రశ్నించాడు.

*(సమాధానం 161 పేజీలో)*

# 17. హడావుడి జవాబులు



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! కొందరు తల్లితండ్రులు, తమ పిల్లలకి చదువు సరీగ్గా రావటం లేదని బాధపడుతూ వుంటారు. చదువు ఎందుకు రాదు? దానిపై ఉత్సాహం లేకపోవటం వలన...! చదువుపై ఉత్సాహం ఎందుకుండదు? పక్క విషయాలు మరింత ఉత్సాహమైనవి అవటం వలన...! అటువంటి నిరర్థక అయిస్కాంత క్షేత్రాల పట్ల పిల్లలు ఆకర్షితులవకుండా చూడవలసిన బాధ్యత ఎవరిది? సాయంత్రం ఆరయ్యేసరికి తామే వాటిపట్ల ఆకర్షితమయితే, ఇక పిల్లల్ని ఎవరాపగలరు? దీనికి సంబంధించి ఈ గొప్ప ఉదాహరణ చూడు.

❖ ❖ ❖

ఇద్దరు వ్యక్తులు మరణించి, ఆకాశంలో పయనించసాగారు. ఒకచోట బ్రహ్మాండమైన భవనం కనపడింది. ద్వారం దగ్గర హుందాగా, గర్వంగా కూర్చున్న ద్వారపాలకుడిని మొదటి మనిషి అడిగాడు "ఇదేమిటి?" అని!

"స్వర్గం" అన్నాడు బయట కూర్చున్న వ్యక్తి. లోపల్నుంచి నృత్యం చేస్తున్న చప్పుళ్ళూ, గానమూ వినిపిస్తున్నాయి. దీపాలు నక్షత్రాల్లా వెలుగుతున్నాయి. వాళ్ళిద్దర్నీ ఆహ్వానిస్తూ, "లోపలికి ప్రవేశించండి. మీకేం కావాలన్నా ఇక్కడ లభ్యమవుతుంది" అన్నాడు.

మొదటివ్యక్తి ఆశగా, "జూదముంటుందా?" అని అడిగాడు. పేకాట అంటే అతడికి ప్రాణం. ఆస్తులు అందులోనే కోల్పోయాడు. "ఆహాఁ! అపరధర్మరాజులూ, శకునిలు, రంభలూ, మేనకలూ, మత్తుపదార్థాలూ, ధూమపానాలూ అన్నీ ఉంటాయి. అందుకే దీన్ని స్వర్గం అన్నారు" అన్నాడు. ఆ మాటలకు మొదటివ్యక్తి సంతోషంగా స్వర్గంలోకి ప్రవేశించాడు.

అప్పటివరకూ మౌనంగా ఉన్న రెండోవ్యక్తి, "ప్రశాంతత ఉంటుందా?" అని అడిగాడు. "అది కష్టం. విందులూ వినోదాల మధ్యా, గానాలు నృత్యాలమధ్యా నీ ఒక్కడి కోసం దాన్నెలా సమకూరుస్తాం?" అని ఎదురు ప్రశ్నించాడు ద్వారం దగ్గర కూర్చున్న మనిషి. ఆ సమాధానానికి సంతృప్తి చెందని రెండవవ్యక్తి మరికొంతదూరం ప్రయాణం చేసాక మరో భవంతి కనపడింది. అక్కడ కూర్చున్న వ్యక్తి అతడిని కరుణాపూరితంగా ఆహ్వానిస్తూ, "రా మిత్రమా! ఇక్కడ నీకు కావలసినంత ప్రశాంతత లభిస్తుంది. ఇదే స్వర్గం" అన్నాడు. అతడు ఆశ్చర్యపోయి, "మరి మొదటిది?" అని అడిగాడు.

"అది నరకం. ముందంతా ఆకర్షణీయంగా ఏర్పాటుచేసారు. వ్యసనాల ప్రలోభాలు చూపించి లోపలకు ఆహ్వానిస్తారు. లోపల అప్పుల నూనె బానలూ, కష్టాల కొరడాలు, సమస్యల శిలువకొయ్యలూ ఉంటాయి."

"కానీ వారు మీ పేరు వాడుకుని మోసం చేస్తున్నారు. వారిపై చర్యతీసుకోరా?"

దేవదూత నవ్వి "తీసుకోము. నిరర్థక అయస్కాంత క్షేత్రాల పట్ల ఆకర్షితులయ్యే వారిని అక్కడే జల్లెడపట్టి ఆపుచేస్తున్నారు కదా!" అన్నాడు.

❖ ❖ ❖

చూసావా రాజా! చిన్న కథే అయినా ఎంత గొప్ప నీతి వున్నదో! పిల్లల చెడు అలవాట్లు వారిని నరకం వైపు నడిపిస్తాయి. పిల్లల్లో చాలా హడావుడీ, చురుకుతనమూ వుంటాయి. వాటిని 'శక్తి'గా మార్చాలి. ఈ హడావుడి అన్నది 'పాము విషం' లాంటిది. చంపటానికి, బ్రతికించటానికీ కూడా పనిచేస్తుంది. చిన్నతనంలోనే ఈ పిల్లల్లోని చురుకుదనాన్ని సవ్యమైన మార్గంలోని మళ్ళించకపోతే, పెద్దయ్యాక అది 'కంగారు'గా మారుతుంది. కొందరు వ్యక్తులు చూడు. చిన్న విషయాలకే చాలా హడావుడి పడుతూ వుంటారు. సమస్యల్ని తొందరగా పరిష్కరించాలనే ఉద్దేశంతో తప్పుడు నిర్ణయాలు హడావుడిగా తీసుకుంటారు. నిజానికి అప్పుడే నిగ్రహం పాటించాలి. దీనినే 'నిగ్రహం' అంటారు. **దీన్ని చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పాలి.** తేలిక ప్రశ్నే కదా అని పిల్లలు హడావుడిగా జవాబు చెప్తారు. అది తప్పయినప్పుడు వారికి 'నిగ్రహం' విలువని చెప్పాలి. భవిష్యత్తులో ఆ నిబద్ధతే వారికి చాలా సాయపడుతుంది. ఈ ప్రశ్నలకి తొందర తొందరగా సమాధానం చెప్పు" అంటూ ఈ విధంగా ప్రశ్నించాడు.

1. ఒకచోట కొన్ని కోడిపిల్లలు, కొన్ని కుందేళ్లు ఉన్నాయి. వాటి తలల మొత్తం సంఖ్య 30. కాళ్ల సంఖ్య 92. ఏవేవి ఎన్ని ఉన్నాయి?
2. ఒక గంపలో ఆరు బత్తాయిలున్నాయి. వాటిలో రెండు నువ్వు తీసుకుంటే ఇంకా నీ దగ్గర ఎన్ని ఉంటాయి?
3. దానిలోంచి ఒకటి నీ స్నేహితుడికిస్తే అందులో ఎన్ని వుంటాయి?
4. నీ వాటిలోంచి ఒకటి ఇస్తే దానిలో ఎన్ని ఉంటాయి?
5. ఒక చీరె, జాకెట్టు కలిపి 110 రూపాయలైతే, చీర ఖరీదు జాకెట్టు కన్నా 100 ఎక్కువైతే, జాకెట్టు ఖరీదు ఎంత?
6. రెండు పిల్లులు రెండు ఎలుకల్ని చంపటానికి రెండు నిమిషాలు పడితే, ఒక పిల్లి ఒక ఎలుకని చంపటానికి ఎంతకాలం పడుతుంది?
7. 1000కి 40 కలిపి, మరో 1000, ఇంకో 30, మరో 1000, ఇంకో 20, మరో 1000, ఇంకో 10 కలిపితే మొత్తం ఎంత?"

*(సమాధానాలు 162 పేజీలో)*

# 18. అంకెల గారడి



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా వెనుదిరిగి నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు రాజుకి మౌనభంగం కలిగించటం కోసం ఈ విధంగా చెప్పాడు. "రాజా! ఒక్కొక్కసారి మనం లేని సమస్యకి కూడా చాలా లోతుగా ఆలోచిస్తాం. నిజానికి అక్కడ సమస్య ఏమీ ఉండదు. పరిష్కారం కూడా అక్కడే దొరుకుతుంది. దీనికి తార్కాణంగా ఒక కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను."

"పూర్వం కౌశాలీ నగరాన్ని విక్రమసేనుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఒక ముఖ్యమైన పనికోసం అతడికి కొందరు వేగులవారు కావలసివచ్చారు. దానికోసం ప్రకటించగానే చాలామంది అభ్యర్థులు రాజాస్థానానికి విచ్చేశారు. అందర్నీ పరీక్షించి చివరికి బలిష్టులైన ఆరుగుర్ని ఎంపిక చేశాడు. అత్యంత క్లిష్టమయిన పరీక్షలకి కూడా వారు నిలబడ్డారు. అయితే ఈ ఎంపిక పట్ల మంత్రి సుబద్ధి అంత సుముఖంగా కనపడకపోవటంతో విక్రమసేనుడు కారణం అడిగాడు.

"అవును మహారాజా!" అన్నాడు మంత్రి. "మీరు వారి శరీర సౌష్టవాన్ని, చురుకుదనాన్ని, గొప్ప సునిశిత దృష్టిని పరిశీలించారు. కానీ సాధారణ తెలివితేటల్ని పరీక్షించలేదు" అన్నాడు.

మహారాజు విస్మయంతో "అదేమిటి మంత్రీ! ఎంతో కఠినమైన పరీక్షలు పెట్టి వారి తెలివితేటల్ని చూసే చివరి ఆరుగురినీ ఎంపిక చేశామే! గూఢచారి పదవంటే చాలా ముఖ్యమైనదన్న విషయం మీకు తెలియనిదేముంది?" అన్నాడు.

"నేను చెప్పేదీ అదే రాజా! కఠినమైన ప్రశ్నలు వేసి తార్కిక జ్ఞానాన్ని పరిశీలించారు. కానీ సాధారణ తెలివితేటలు పరీక్షించలేదు. అద్భుతమైన జ్ఞాని కూడా ఒక్కోసారి చిన్న చిన్న విషయాల్లో దెబ్బ తింటాడు. ముఖ్యంగా, ఆ శాఖ అధిపతికి అటువంటి లక్షణం వుండాలి. అందుకే 'సాధారణ తెలివితేటలు' అన్న పదాలు ఉపయోగించాను" అన్నాడు.

అప్పుడు రాజు మంత్రినే ఆ పనికి ఉపయోగిస్తూ, "మీరే ఆరుగురిలో ఒకర్ని ఎంపిక చెయ్యండి" అన్నాడు.

అప్పుడు ఆ మంత్రి ఆరుగురు అభ్యర్థులనీ పిలిచి ఈ విధంగా అన్నాడు "ఎంతో కఠినమైన పరీక్షలకి నిలబడి మీరు ఎంపిక అయ్యారు. నేను చాలా చిన్న పరీక్ష పెట్టి మీలో ఒకర్ని ముఖ్య గూఢచారిగా నియమించాలని అనుకుంటున్నాను. ఈ ప్రశ్నలు మీకు నవ్వు తెప్పించ వచ్చు. లేదా అయోమయంలో పడెయ్యవచ్చు. ఎక్కువ లోతుగా ఆలోచించకుండా సమాధానం చెప్పండి. నాలుగే నాలుగు ప్రశ్నలు."

ఆరుగురు యువకులూ ఉత్సుకతతో వింటూండగా మంత్రి చెప్పాడు. "మొదటి ప్రశ్న : మీరొక అత్యవసర పనిపై రథంమీద వెళ్తున్నారు. గుర్రాలు గట్టిగా సకిలిస్తూ, వేగంగా పరుగెదుతున్నాయి. రథానికున్న మువ్వలు, రథంలో ఉన్న ఇనుప సామాన్లు పెద్దగా శబ్దం చేస్తున్నాయి. రథం ఒక కొండని చుట్టి శిఖరం అంచున సన్నటి బాటలో వెళ్తోంది. ఎడమవైపు లోయ, లోయలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఒక నదీ ఉన్నాయి. కుడివైపు, ఎక్కటానికి వీల్లేనంత ఎత్తుగా ఒక కొండ ఉన్నది.

అటు వంటి బాటమీద వంద గొర్రెల్ని తోలుకుంటూ వెళ్తున్నాడు ఒక కాపరి. అతడిని దాటుకుని మీరు వెళ్లాలి. అతడి వెనుకే వెళ్తే దారి విశాలమవటానికి గంట పడుతుంది. మీకంత సమయం లేదు. గొర్రెల మధ్య దారి చేసుకుంటూ నెమ్మదిగా ముందుకి వెళ్లవచ్చు గానీ, ఏ చిన్న శబ్దానికైనా గొర్రెలు బెదిరి నదిలో పడిపోయే ప్రమాదం ఉన్నది. ఆ పరిస్థితుల్లో ఏం చేస్తారు?"

ఈ ప్రశ్నకి సమాధానంగా ఒక అభ్యర్థి "గూఢచారికి తాను చేస్తున్న పనికన్నా విలువైనది మరొకటి లేదు. పని ముఖ్యం కాబట్టి, గొర్రెల మధ్య నుంచి రథాన్ని తోలుకు వెళ్లి, లోయలో పడిపోయిన గొర్రెల ఖరీదు కట్టి కాపరికి ఇస్తాను" అన్నాడు. మంత్రికి ఈ సమాధానం నచ్చలేదు. పని నెరవేరటం కోసం అమాయకమైన గొర్రెల్ని చంపటం ఏమిటన్నది అతడి అభిప్రాయం.

మరొక అభ్యర్థి "రథానికి ఉన్న పరికరాలు, శబ్దం చేసే ఇతర వస్తువులు తీసేసి, గుర్రాల్ని కూడా విప్పేసి - నేనూ కాపరీ రథాన్ని తోసుకుంటూ గొర్రెల్ని దాటుకుని ముందుకు వెళ్తాం" అన్నాడు. మంత్రికి ఈ సమాధానం కూడా నచ్చలేదు.

సరి అయిన సమాధానం చెప్పిన మూడో యువకుడిని రెండో ప్రశ్న వేశాడు. "నువ్వు, మనదేశపు మరో గూఢచారి ఇద్దరూ కలిసి శత్రుదేశ ఆయుధ కర్మాగారం బయట తుప్పల్లో దాక్కొని ఉండగా అక్కడికి ఆ దేశపు సైనికాధికారి వచ్చాడు. తలుపు దగ్గర ఉన్న కాపలాదారు అతడిని, సైనికాధికారి అయినా సరే రహస్య సూచిక చెప్పనిదే లోపలికి పంపనన్నాడు.

"సరే!"నన్నాడు సైనికాధికారి అతడి వృత్తి నిబద్ధతకి సంతోషిస్తూ. "6" అన్నాడు కాపలాదారు.



"రెండు" అన్నాడు సైనికాధికారి. "9" అన్నాడు కాపలాదారు. "మూడు" అన్నాడు సైనికాధికారి.

"6-9-15" అన్నాడు కాపలాదారు. "2-3-4" అన్నాడు సైనికాధికారి.


అప్పుడు కాపలాదారు ద్వారం తెలిచాడు. దూరం నుంచి చూస్తున్న మీ ఇద్దరికీ ఆ రహస్య సూచిక అర్థమైంది. నీతోటి గూఢచారి ద్వారం దగ్గరకు వెళ్లాడు. "9-12-21" అన్నాడు కాపలాదారు.

"3-4-7" అన్నాడు నీ మిత్రుడు.

అక్కడి సైనికులు అతడిని బంధించారు. ఇంతకీ అసలు సూచిక ఏమిటి? అతడు చెప్పింది తప్పని తెలిసిపోయింది కాబట్టి నీవైతే ఏమి కొత్తగా ఆలోచించి చెపుతావు?"

యువకుడు కనులు మూసుకుని కాస్త ఆలోచించి సమాధానం చెప్పాడు. మంత్రి సంతసించి మూడో ప్రశ్న సంధించాడు. "నీ ఉద్యోగానికి కేవలం రెండు సరైన సమాధానాల దూరంలో ఉన్నావు. ఒక అశ్వికుడు వెళ్లేటప్పుడు గంటకి 60 క్రోసుల వేగంతో వెళ్లి, వచ్చేటప్పుడు 40 క్రోసుల వేగంతో వెనక్కి వస్తే, ఆ అశ్వం సగటు వేగం గంటకు ఎన్ని క్రోసులు?

చాలా సులభంగా కనపడే ఈ కష్టమైన ప్రశ్నకి కూడా ఆ యువకుడు సమాధానం చెప్పేసరికి మంత్రి సంభ్రమం చెంది, తరువాతి ప్రశ్నగా రెండు పాత్రలు చూపించాడు. "క్రింది వెడల్పూ, లోపలి విస్తీర్ణమూ సమానంగా వున్న రెండు పాత్రలు ఇవి. కానీ మొదటిది రెండో దానికన్నా కాస్త పొడవైనది. రెంటిలోనూ పాలు నింపితే దేనిలో ఎక్కువ పాలు పడతాయి? మొదటి దానిలోనా? రెండోదానిలోనా? రెండిటిలోనూ సమానంగానా?" అన్న ప్రశ్నకి యువకుడు సమాధానం చెప్పాక, చివరి ప్రశ్న వేసాడు.



ఒక అంకెని ఒకటిన్నర (1 1/2)తో హెచ్చువేసినా, దానికి ఒకటిన్నర కలిపినా ఒకే సమాధానం వస్తుంది. ఏమిటది?" అని అడిగాడు.

సరి అయిన సమాధానం చెప్పిన యువకుడికి ఆ ఉద్యోగం లభించింది.

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! ఈ నాలుగు ప్రశ్నలకీ, ఆ యువకుడు ఏ సమాధానాలు చెప్పి ఉంటాడు? తెలిసీ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి ప్రక్కలౌతుంది సుమా!" అన్నాడు.

(సమాధానం 163 పేజీలో)

# 19. ఇసుక గడియారం



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు రాజుకి మౌనభంగం కావించటం కోసం ఈ విధంగా అన్నాడు. "రాజా! మనం చేసే పని యొక్క అంతరార్థం మనకి తెలిసి ఉండాలి. అనారోగ్యం వచ్చినప్పుడు కొందరు ఒకవైపు మందులు వాడుతూ, మరొకవైపు భగవత్ ప్రార్థన చేస్తారు. మందులు కూడా భగవంతుని సృష్టే అని మనస్ఫూర్తిగా నమ్మరు. ప్రార్థన కేవలం మానసిక స్వాంతన కోసం మాత్రమే అని, అది కోరిక తీర్చే స్వార్థం కాదనీ తెలుసుకోవటమే జ్ఞానం. అంతా తలరాత అని నమ్మేవారు ఉంగరం పెట్టుకోవటం కూడా తలరాతే అని ఆత్మవంచన చేసుకుంటూ, రత్నాలూ, పేర్లూ, ఇళ్ళూ మార్చటం ద్వారా భవిష్యత్తుని మార్చుకుందామనుకుంటారు. మానవ ప్రయత్నం చేస్తే తప్ప జీవితంలో ఏ విధమైన ఉత్తీర్ణతా రాదని దేవుడే చెప్పిన ఒక కథ నీకు చెపుతాను. శ్రమ తెలియకుండా విను.

కాంచీపురంలో పార్వతీదేవి గుడిలో ఒక యువకుడైన పూజారి ఉండేవాడు. గతంలో చెప్పినట్టే ఈ పూజారికి కూడా రాత్రికి రాత్రి మహాజ్ఞాని అయిపోవాలని కోరిక ఉండేది. రోజూ పూజచేసి తన కోరిక విన్నవించుకునేవాడు.

పూజారి పరిస్థితిని గమనించిన దేవతలు, అతడిని కనికరించమని పార్వతిని కోరారు. కానీ పార్వతి ఒప్పుకోలేదు. "తెలివి అన్నది ప్రార్థన వల్ల రావటం ప్రారంభిస్తే, ఇక తెలివికే విలువ ఉండదు. కాసింత పుట్టుక జ్ఞానాన్ని జంతువులకిచ్చినట్టే మనుషులకి కూడా కాస్త జన్మజ్ఞానాన్ని ఇవ్వటమే దేవుడి పని. జంతువులు జన్మజ్ఞానంతో సరిపెట్టుకుంటాయి? ప్రకృతి ఇచ్చిన జ్ఞానాన్ని పెంచుకోవటం మనిషి కర్తవ్యం. ఎలా పెంచుకోవాలా అన్నది అతడి కృషి మీద ఆధారపడి వుంటుంది. అయినా మీరు చెప్పారు కాబట్టి కొత్తరకంగా అతడి తెలివిని పెంచే ఏర్పాటు చేస్తాను" అంది.

మరుసటిరోజు అతడు అర్చన చేస్తూ ఉండగా అశరీరవాణి ఈ విధంగా పలికింది. "నాయినా! నా కుమారులైన కుమారస్వామి, గణపతుల గుళ్ళు ఈ పక్కనే ఉన్నాయి. వెళ్ళి ఇద్దరికీ చెరో తొమ్మిది నిమిషాలపాటు అభిషేకం చేసిరా. లిప్త మాత్రం





కూడా ఇటూ అటూ కాకూడదు సుమా! ఎవరిని కాస్త ఎక్కువ ప్రార్థించినా మిగతా వారికి కోపం వస్తుంది" అన్నది.

పూజారి అయోమయంగా, "ఇది మానవమాత్రులకి సాధ్యం అయ్యేనా తల్లీ!" అన్నాడు.

అప్పుడు విగ్రహం పక్కనే గరాటు ఆకారంలో ఉన్న రెండు చిన్నపాత్రలు ప్రత్యక్షమయ్యాయి. వాటి లోపల ఇసుక ఉన్నది. అశరీరవాణి అన్నది "వాటిని తలక్రిందుగా తిప్పితే పైనుంచి ఇసుక కిందకి జారుతుంది. మొదటి దానికి 4 నిమిషాలు, రెండో దానికి 7 నిమిషాలు పడుతుంది. వెనక్కి తిప్పితే, తిరిగి ఇసుక వెనక్కి జారటానికి మళ్ళీ అంతే కాలం పడుతుంది. ఈ యంత్రాలతో నా కుమారులను సరిగ్గా చెరి 9 నిమిషాలపాటు పూజించు" అన్నది.

మొదట చేతకాలేదు. పూజారి ఎన్నో విధాలుగా ప్రయత్నించి చివరికి సఫలీకృతుడయ్యాడు. దేవి అతడి పట్టుదలకి సంతోషించి "నాయినా! జ్ఞాన సముపార్జనకి కావలసిన కృషి, పట్టుదల నీలో ఉన్నదని అర్థమైంది" అంటూ అతనికి జ్ఞానం నేర్పి క్రమంగా ప్రతిభా వంతుడిని చేసింది.

కృషి చేసి, ఏకాగ్రత నిలిపి అతడు ప్రజ్ఞావంతుడయ్యాక ప్రత్యక్షమై "నీ అకుంఠిత దీక్షకు, పట్టుదలకు సంతృప్తురాలినయ్యాను. ఇంకొక్క పరీక్ష పెట్టి, నీవు మరింత కృషి చేసి పరిపూర్ణ జ్ఞానివయ్యేలా వరమిస్తాను" అన్నది.

పూజారి చేతులు జోడించి "అంతకన్నానా దేవి. నీ దయ వలన ఏ ప్రశ్నకైనా సమాధానం చెప్పగలననే ధైర్యం వచ్చింది. అడుగు" అన్నాడు.

"కష్టమైన ప్రశ్న ఒకటి అడగనా? సులభమైనవి రెండు అడగనా?" అన్నది కాళి.

"నా అదృష్టం తేల్చటానికి కష్టమైనది ఒకటి చాలు" అన్నాడు పూజారి.

"చెట్టు ముందా? విత్తు ముందా?" అని ప్రశ్నించింది తల్లి.

తడుముకోకుండా "విత్తే ముందు" అన్నాడు పూజారి.

"ఎలా చెప్పగలవు అంత ధీమాగా" అని తిరిగి అడిగింది. దానికి అతడు చెప్పిన సమాధానంతో ఆమె పూర్తి సంతృప్తి చెంది అదృశ్యమైంది.

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! పూజారి ఇద్దరు దేవుళ్ళనీ ఒక్క నిమిషం అటూ ఇటూ కాకుండా పరికరాల సాయంతో ఎలా కొలిచాడు? విత్తు ముందు అన్న సమాధానాన్ని ఎలా సమర్థించుకున్నాడు?" అని ప్రశ్నించాడు.

(సమాధానం 164 పేజీలో)

# ౨౦. కాలం కొవ్వొత్తి



విక్రమార్కుడు తిరిగి చెట్టు వద్దకు వెళ్లి శవాన్ని భుజాన వేసుకుని నడక సాగిస్తూ ఉండగా, శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "నిన్ను చూస్తుంటే నాకు చిన్న పిల్లలు గుర్తొస్తున్నారు. వారు కూడా నీలానే ఫలితం తెలియకుండా పని చేస్తారు. ఒక కుర్రవాడు గది చుట్టూ పరిగెడుతున్నా డనుకుందాం. "ఎక్కడికా పరుగు? ఏ గమ్యం చేరుకోవటానికి?" అని ప్రశ్నిస్తే వాడి దగ్గర సమాధానం ఉండదు. లోపల్నుంచి ఉవ్వెత్తున ఎగసిపడుతున్న శక్తిని కాల్చెయ్యటం కోసమే పిల్లలు ఆ విధంగా గంతులెయ్యటం, పరుగెత్తటం, అతిగా మాట్లాడటం, కొట్టుకోవటం, బల్లలపై నుంచి దూకటం వగైరా చేస్తూ ఉంటారు. నిరంతరం వారిలో విడుదలయ్యే 'అంతర్గత' శక్తిని మంచి దారికి మళ్లిస్తే వారు అద్భుతమైన వ్యక్తులుగా ఎదుగుతారు. వారి పరుగుకి ఒక లక్ష్యాన్ని చూపించటం పెద్దల బాధ్యత. చిక్కటి ప్రశ్నల్ని చక్కటి కథల ద్వారా చెప్పి సమాధానాలు రాబట్టాలి.

"మనని పాలిస్తూన్న రాష్ట్రపతి పేరు పది సంవత్సరాల క్రితం ఏమిటి?" అని అడిగితే, పిల్లవాడు పది సంవత్సరాల క్రితం 'పాలించిన' వ్యక్తి పేరు చెప్పకూడదు. ప్రస్తుతం పాలిస్తున్న రాష్ట్రపతి పేరు చెప్పాలి. ఇటీవలి కాలంలో రాష్ట్రపతి తన పేరు మార్చుకుని ఉంటే ఆ పాత పేరు చెప్పాలి.

పిల్లల్లోని తెలివిని తొందరపాటు ఒక్కోసారి కప్పివేస్తుంది. ఈ అతి చురుకుదనాన్ని తగ్గించాలంటే దాని వలన వచ్చే నష్టాల్ని వివరించాలి. ఉదాహరణకి ఈ క్రింద వాక్యం చూపించి, అందులో 'త' అనే అక్షరాలు ఎన్ని ఉన్నాయో చెప్పమనాలి. "తన తరువాత తన వారసులు తండోప తండాలుగా ఉన్నా సరే, తన తదనంతరపు ఆస్తినంతటినీ తనూకమంతరించు లోపులో భగవతర్పిదము చేయాలన్నదే అతని ఆకాంక్ష."

పిల్లవాడు 10 గానీ, 12 గానీ వున్నాయంటే తిరిగి మరో మారు లెక్కించమనాలి. సరిగ్గా చెప్తే బహుమతి ఇచ్చి ప్రోత్సహించాలి.

రాజా! పదోతరగతి ఉత్తీర్ణులైన వారు కూడా ఎల్లలు, దిక్కులు తెలియని అజ్ఞానంలో ఉన్నారు. "నీవు తూర్పు దిక్కుగా మొహం పెట్టి నిలబడితే, హిందూ



మహాసముద్రం నీ వెనుక ఉంటుందా? కుడా? ఎడమా?" అన్న ప్రశ్నకి అంత తొందరగా సమాధానం చెప్పటం కష్టం.

"కుడి" అని చెప్పినవాడు భౌగోళిక జ్ఞానం ఉన్న కుర్రవాడు.

**"నేను నిలబడింది భారతదేశంలోనా?"** అని ఎదురుప్రశ్న వేసినవాడు మేధావి.

"ఉత్తరం దిక్కుగా నిలబడితే వింధ్య పర్వతం ఎటు ఉంటుంది? దక్షిణం నీ ఎదురుగా ఉంటే ఢిల్లీ ఎటు?" లాంటి ప్రశ్నలు కూడా ఉత్సుకతను పెంచుతాయి. రాజా! ఇప్పుడు నేను అయిదు ప్రశ్నలడుగుతాను. తెలిసీ సమాధానం చెప్పకపోయావో మరణం తథ్యం సుమా" అంటూ ఈ విధంగా ప్రశ్నించాడు.

"ఒకచోట పది కాకులు నేలమీద ధాన్యం గింజలు తింటూ ఉండగా పెద్ద శబ్దంతో ఒకదాన్ని కాల్చి చంపితే అక్కడ ఎన్ని కాకులుండవచ్చు? ఇది మొదటి ప్రశ్న. దీనికి నీ సమాధానం విపులంగా, తార్కికంగా ఉండాలి సుమా!

ఇక రెండో ప్రశ్న. నీ వద్ద రెండు సమానమైన కొవ్వొత్తులున్నాయి. చెరొకటీ సరిగ్గా గంటసేపు వెలుగుతాయి. వాటి సహాయంతో ఒక విద్యార్థి గడియారపు సహాయం తీసుకోకుండా, సరిగ్గా 90 నిమిషాలపాటు చదువు కోవటానికి వీలవుతుందా? వాటిని మధ్యకి కత్తిరించకూడదనేది షరతు.

మూడో ప్రశ్న. ఒక భవంతి ఎత్తు 100 అడుగులు. పై అంతస్తు మీదనుంచి **తాడు సాయంతో** దిగాలి. తాడు పొడవు 75 అడుగులు మాత్రమే ఉన్నది. కానీ దాన్ని మీరు ఎక్కడైనా కత్తిరించుకోవచ్చు. తిరిగి ముడి వేసుకోవచ్చు. భవంతి మీద నుంచి కిందకి దిగుతున్నప్పుడు, ఎక్కడైనా మేకు బలంగా కొట్టుకోవచ్చు. కావాలంటే హుక్ కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. పాతిక అడుగుల పై నుంచి దూకటం లాంటి ఆలోచన్లు వద్దు. ఎలా?

నాలుగో ప్రశ్న. నున్నటి మంచుపై జారటం సులభమా? గతుకుల మంచుమీదా?

అయిదో ప్రశ్న. స్నానం చేసివచ్చాక బిగుతు దుస్తులు, ఉంగరాలు ధరించటం కష్టమవుతుంది ఎందుకని? వేడినీటి వలన శరీరం వ్యాకోచించటం దీనికి కారణమా?

ఈ అయిదు ప్రశ్నలకీ విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

*(సమాధానం 165 పేజీలో)*

# 21. జ్యోతిష్కుడి పందెం



"రాజా! ఈ ప్రపంచంలో కీర్తి రావాలన్నా, డబ్బు సంపాదించాలన్నా కష్టపడి పనిచెయ్యాలంటారు. 'కష్టమయిన పని' అంటే ఏమిటి? ఇష్టం లేని, సాధ్యం కాని పనేగా. అలా ఇష్టంలేని పని చేస్తూ బ్రతకటం ఎందుకు? అదీగాక- కేవలం కష్టపడితే కీర్తీ, డబ్బూ వచ్చేటట్టయితే కష్టపడుతూ పనిచేసే వారందరూ ధనవంతులయిపోవాలిగా. చేసే పనిలో నైపుణ్యమూ, తెలివీ లేకపోతే ఎంత చేసినా వృథాయే. అయితే కొందరు తెలివిగలవారు అమాయకులకు ఆశచూపి మోసం చేస్తారు. చివరికి తమ గోతిలో పడతారు. అలాంటి వ్యక్తి కథ చెపుతాను. విను.

"సంక్రాంతి సందర్భంగా తక్షశిల, పల్నాడు ప్రాంతాల ప్రజలు కోడి పందాలు నిర్వహిస్తారు. తమ దేశ ప్రతినిధులుగా తొమ్మిది పుంజుల్ని వదులుతారు. ఏ దేశపు కోళ్లు నాలుగు కన్నా ఎక్కువ గెలిస్తే ఆ దేశానిది గెలుపన్న మాట. పందాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

ఒక జ్యోతిష్యుడు బయట బిచాణా పరిచి కూర్చున్నాడు. పది వరహాలు ఇస్తే పందానికి ముందే తాను ఫలితం చెపుతానన్నాడు. **తాను చెప్పింది తప్పయితే పదికి వంద తిరిగి చెల్లిస్తానన్నాడు.** చాలామంది ఆ విధంగా సమర్పించుకున్నారు. "పందెం ప్రారంభానికి ముందు ఫలితము 0-0" అని వెల్లడించాడు. ప్రజలు వాడిని తన్ని తగలెయ్యాలనుకున్నారు గానీ, అతడితో ఏమని వాదించగలరు? అతడు చెప్పింది నిజమే కదా!

న్యాయశాస్త్రంలోని లొసుగులు ఈ విధంగానే ఉంటాయి. వాటిని ఆధారం చేసుకునే చాలామంది నేరస్థులు, మోసగాళ్లు చట్టం నుంచి బయటపడుతూ ఉంటారు. అయితే ఒక విషయం మహారాజా! ఒకసారి నేరం నుంచి తప్పించుకున్న వాడు నేరం చేసి ధనం సంపాదించటం ఇంత సులభమా అనుకుంటాడు. తిరిగి నేరం చేసి ఇరుక్కుపోతాడు. రెట్టింపు శిక్ష అనుభవిస్తాడు.

సదరు జ్యోతిష్యుడి విషయం కూడా అంతే జరిగింది. రుచి మరిగిన ఆ మోసగాడు కోడి పందాల్లో కూడా పాల్గొన్నాడు. తక్షశిల కోళ్లకన్నా పల్నాడు కోళ్లు బలమైనవి. వాటిమీద పందెం ముమ్మరంగా సాగుతోంది.



బలమైన పల్నాడుపై **వరహా కాస్తే అర వరహా** లాభం ఇస్తాననీ, బలహీనమైన తక్షశిలపై **వరహా కాస్తే వరహా** ఇస్తాననీ బేరం పెట్టాడు. అందరూ పల్నాడుపై పందెం కాయసాగారు. అయితే, వరహా లాభానికి ఆశపడి తక్షశిలపై కాసేవారు కూడా తక్కువేమీ లేరు.



ఏ విధంగా చూసినా అతడికి లాభమే.

చంద్రవదనుడు అనే తెలివైన యువకుడు దూరం నుంచి ఇదంతా గమనిస్తున్నాడు. పందాలు స్వీకరిస్తున్నప్పుడు జ్యోతిష్యుడు చాలా జాగ్రత్తగా లెక్కలు వేసుకోవటాన్ని అతడు పరిశీలించాడు. తక్షశిలపై పందాలు కట్టేవారు తక్కువ కాగానే ధర పెంచుతున్నాడు. పల్నాటి కోడి ఒకటి ఓడిపోయిందన్న కబురు రాగానే పందాన్ని ఎక్కువ చేస్తున్నాడు. ఒక్కోసారి అర వరహా (1/2) పందాన్ని వరహా (1) చేస్తున్నాడు కూడా. ఈ విధంగా చాలా తెలివిగా ప్రజల్ని ఆకర్షిస్తున్నాడు. నిజానికి ఇప్పటికీ ప్రపంచంలో పందాలు స్వీకరించేవారు చాలా ఆటల్లో చేస్తున్న పని అదే!

జ్యోతిష్కుడు ఈ విధంగా 'ఎర' వేయటాన్ని గమనించిన చంద్రవదనుడు అతడికి గుణపాఠం నేర్పాలనుకున్నాడు. ప్రజల మధ్య సంచలన ప్రకటన చేశాడు. ఎవరు తన దగ్గర ఏ దేశంపై పది **వరహాలు** కాసినా, **గెలుపుతో సంబంధం లేకుండా,** కాసినవారికి **ఒక వరహా** లాభంగా ఇస్తానన్నాడు.

ప్రజలకు మొదట అర్థంకాలేదు. అర్థమయ్యాక దాదాపు పిచ్చెక్కిపోయారు. ఏ ధైర్యంతో అతడా ప్రకటన చేశాడో తెలియక అయోమయం చెందారు. అయితే చంద్రవదనుడు ఆ ప్రాంతంలో నిజాయితీపరుడుగా ప్రసిద్ధి. అందువల్ల అతడిపై నమ్మకం ఉంచారు. క్షణాల్లో వెయ్యి వరహాలు పోగయ్యాయి.

అవి తీసుకుని చంద్రవదనుడు జ్యోతిష్యుడి దగ్గరకి వెళ్లి అందులో కొంత భాగం పల్నాడు మీద కాస్తానన్నాడు. అంత డబ్బు స్వీకరించనన్నాడు జ్యోతిష్యుడు.

దానికి చంద్రవదనుడు అతడితో "చూడూ! ఆట ప్రారంభానికి ముంద ఫలితం '0-0' అన్నప్పుడు నిన్ను చావగొట్ట కుండా ఆగింది ఎందుకో తెలుసా? మాటల్లో న్యాయం లేకపోయినా చట్టం ఉన్నందుకు! ఇప్పుడు అదే విషయం నీ తిరిగి చెపుతున్నాను. పందెం ప్రకటించాక, అది ఎంత పెద్దదైనా స్వీకరించవలసిందే లేదంటే ప్రజల ఆగ్రహానికి గురి అవుతావు సుమా!" అని హెచ్చరించాడు. పందె స్వీకరించేవాడు బిక్కమొహం వేసి 'సరే'నన్నాడు.

చంద్రవదనుడు ప్రజల సొమ్ములో కొంతభాగం పల్నాడుపై కాశాడు. అప్పట ధర **వరహాకి వరహా (1-1) లాభం** ఉంది. అంతలో వరసగా తక్షశిల కోళ్లు రెండ పరాజయం పొందాయి. ఆ దేశంపై ధర **వరహాకి రెండు (1-2) వరహాలు** అయింది మిగతా డబ్బు ఆ దేశంపై కాసాడు.

ప్రజలు ఉత్సుకతతో చూస్తూ ఉన్నారు. పందాలు ముగిశాయి. వచ్చి **లాభంలో సగం ఉంచుకుని**, వాగ్దానం ప్రకారం మిగతా సగం ప్రజలకి పంచా చంద్రవదనుడు.

అతడు అక్కడ నుంచి బయల్దేరుతుండగా జ్యోతిష్యుడు మొహం వేలాడేసుకు వచ్చి, "సర్వనాశనమైపోయాను" అంటూ వాపోయాడు.

"మోసగాడికి లభించే చివరి ఫలితం అదే" అన్నాడు చంద్రవదనుడు.

"లేదు. లేదు. పల్నాడు కోళ్లు గెలిస్తే లాభం పొందేవాడిని" అన్నాడ జ్యోతిష్యుడు. చంద్రవదనుడు నవ్వి, "ఏ దేశం గెలిచినా నాకు అంతే లాభం వచ్చి ఉండేది. అంతేకాదు. అంతకన్నా ఎక్కువ లాభం ఈ పందెంలో ఇంకెవరూ సంపాదించలేరు కూడా. ఇదే గరిష్టమైన లాభం" అన్నాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! చంద్రవదనుడు ఏయే దేశంపై ఎం కాశాడు? ఎంత పందెం ఉండగా కాశాడు? అంత నిర్భయంగా తనకి, తన ప్రజల లాభం వస్తుందని నమ్మకంగా ఎలా చెప్పగలిగాడు? నీ దగ్గిర ఓ వెయ్యి వరహాలుండే పల్నాడుపై పందెం 1:1, తక్షశిలపై 1:2 వుండగా, ఏయే దేశంపై ఎంతెంత కాస్తావ ఏది ఓడినా నీకు లాభం రావాలి. ఎంత లాభం రావాలంటే, అంతకంటే ఎక్కు ఇంకెలా కాసినా రాకూడదు. ఎలా? తెలిసీ ఈ ప్రశ్నకి సమాధానం చెప్పకపోయా నీ తల వేయి వక్కలవుతుంది సుమా!" అన్నాడు.

బేతాళుడి ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

(సమాధానం 166 పేజీ

# ౨౨. స్వయంవరం



సంధ్య వెలుగు ఆకాశానికి హారతి పడుతున్న వేళ, పల్లెపడుచులు రంగవల్లులు దిద్దేవేళ, పక్షులు గూళ్లకి చేరుతున్న తరుణాన, గోధూళి రేపుతూ గోమాతలు ఇళ్లకు చేరుకుంటున్న సమయాన నిడుపాటి కురుల, సొగసైన కనుల, గగన జఘన సొగసుల ఓ చిన్నది దీర్ఘాలోచనలో మునిగి ఉంది. ఒక ఋషి తపస్సు ముగించుకుని కాలువ ఒడ్డున కాలిబాటన తన ఆశ్రమం వైపు నడుస్తూ కొబ్బరిచెట్టు పక్కనే ఆమెను చూశాడు.

ఆశ్చర్య చకితుడైన ముని ఆమె దగ్గరికి వెళ్లి, "బాలా! చూస్తుంటే ఉన్నత వంశానికి చెందిన రాకుమార్తెలా ఉన్నావు. ఈ సమయంలో ఒంటరిగా ఈ నిర్జన ప్రదేశంలో ఏమిటి నీ ఆలోచన? నా అనుభవంతో గానీ, తపశ్శక్తితో గానీ నీకేదైనా సహాయం చేయగలనా?" అని అడిగాడు.

"మునీశ్వరా! మా తండ్రిగారు ఈ నగరపు రాజు. ఆయనకి నేనొక్కదాన్నే సంతానం కావటం వలన, ఆయన గతించిన పిమ్మట నా పదునాలుగవ ఏట నుంచీ రాజ్యపాలన చేస్తున్నాను. నేటితో నాకు ఇరువది సంవత్సరములు నిండుతాయి. నాకు సరిపోయే యువకుడు, ఈ నగరాన్ని పాలించగల తెలివి ఉన్నవాడు, సరైనవాడు దొరకకపోయినా నా రాజ్యం గతి ఏమిటన్నది నా దిగులు" అన్నది.

"నీకెటువంటి గుణగణాలు ఉండే వరుడు కావాలి లలనామణీ!" అన్న మునీశ్వరుడి ప్రశ్నకి ఆమె ఈ విధంగా అన్నది. "స్వామీ! నా నాయకుడికి విశిష్టమైన దేహ దారుఢ్యము కంటే పటిష్టమైన ఆలోచనా విధానం, మానసిక శక్తి ముఖ్యము. ఆజానుబాహుడైన వానికంటే సమయస్ఫూర్తి, సరి అయిన నిర్ణయాధికారం ఉన్నవాడు తగినవాడని నా ఉద్దేశం. అతడిని ఎలా ఎంపిక చెయ్యాలో నాకు అర్థం కావటం లేదు."

"అపురూప లావణ్యానికే వన్నె తెచ్చే తెలివితేటలతో పాటూ, ప్రజలకు మంచి చెయ్యాలన్న జీవితలక్ష్యం గల కన్యారత్నమా! నీకు కావలసిన లక్షణాలున్నవాడు ఈ నగరంలోనే ఉండి ఉంటాడు. ఎంపిక చేసే విధానం నేను చెపుతాను" అంటూ తగు సూచనలు ఇచ్చాడు.

ఆ మరుసటి రోజే ఆమె స్వయంవరం ప్రకటించబడింది. వచ్చిన వారిని రాకుమార్తె మూడు ప్రశ్నలడిగింది.

"ఒక గొర్రెల కాపరి వర్షంలో తన గొర్రెల్ని ఒక్కో దాన్ని ఒక్కొక్క చెట్టుకి కట్టేస్తే, తాను నిలబడటానికి చెట్టేలేదు. అప్పుడు ఒక్కో చెట్టుకి రెండేసి గొర్రెల్ని కడితే, తాను నిలబడటానికి ఒక చెట్టు మిగిలింది. మొత్తానికి అక్కడున్న చెట్లెన్ని గొర్రెలెన్ని?

ఇక రెండో ప్రశ్న. తూర్పు నుంచి ఒక మేకల గుంపు, పడమట నుంచి ఒక గుంపు వచ్చి ఒక చెట్టు దగ్గర చేరాయి. తూర్పు మేక "మీలోంచి ఒకటి వచ్చి మాలో చేరితే మా సంఖ్య రెట్టింపు అవుతుంది కదా!" అంది. అప్పుడు రెండో గుంపులోని పిల్లమేక "మీలోంచే ఒకరు ఇటువస్తే మీకు మేము సమానమౌతాము కదా!" అంది. ఎటువైపు నుంచి ఎన్ని మేకలు వచ్చాయి?

చివరగా మూడోది. ఒకామె నాలుగు చెంబుల నీళ్లలో రెండు చెంబుల పాలు కలిపి అమ్ముతుంది. ఒకరోజు పొరపాటున రెండు చెంబుల నీటిలో నాలుగు చెంబుల పాలు కలిపింది. ఇంకా ఎన్ని చెంబుల నీళ్ళు కలపాలి?"

రాకుమార్తె ఈ ప్రశ్నలు అడగటం పూర్తి చేయగానే, సభికుల మధ్య నుంచి బిగ్గరగా నవ్వు వినిపించింది. అందరూ అటు చూశారు.

స్వయంవరానికి వచ్చిన యువకుల్లోంచి ఒక యాదవ యువకుడు లేచి "రాకుమారీ! ఇంత చిన్న ప్రశ్నలు వేసి అనవసరంగా రెండు విధాలయిన చిక్కుల్లో పడ్డారు మీరు" అన్నాడు.

అందరూ ఆశ్చర్యపోయారు.

'ఏమా చిక్కులు' అని రాకుమార్తె ప్రశ్నించగా యువకుడు చెప్పాడు "ఇంత చిన్న ప్రశ్నలకి సమాధానాలు చెప్పగలవారు మాలో కనీసం వందమంది ఉంటారు. అందరూ చెప్తే ఎవరిని చేసుకోవాలో తెలియక మీకు చిక్కు. ఎవరూ చెప్పలేకపోతే మన నగరంలో ఇంత తెలివిహీనులైన యువకులు ఉన్నారన్న సంగతి బయటపడటం మరో సిగ్గు" అన్నాడు.

రాకుమార్తె మొహం అవమానంతోను, కోపంతోను ఎర్రబడింది. పక్కనే కూర్చున్న ముని కల్పించుకుని, "నువ్వు చెప్పింది నిజమే నాయినా! కానీ ఆమె అడిగిన ప్రశ్న వెనుక ఒక మెలిక ఉన్నది. ముందొక చిన్న ప్రశ్న అడిగి, ఆ విధంగా అభ్యర్థుల్లో అహాన్ని పెంచి ఆపై బుట్టలో పడెయ్యటం ఆమె ఉద్దేశ్యం" అన్నాడు.


రాకుమార్తె ఆయన వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది. నిజానికి ఆమె మరేమీ ప్రశ్నలు అనుకోలేదు. తన ప్రశ్నలు అంత చిన్నవని కూడా అనుకోలేదు.



ఈలోపుగా ఋషి ఆ కుర్రవాడిని ఈ ప్రశ్న అడిగాడు. "నీ దగ్గర నాలుగు తెల్లగొర్రెలు, ఒక నల్లగొర్రె ఉన్నాయి. ప్రతీ గొర్రె తనలాంటి రంగు ఉన్న గొర్రెలు ఎన్ని ఉన్నాయో చెప్పాలంటే, ఎన్ని గొర్రెలు చెప్పగలవు?"

"గొర్రెలు మాట్లాడలేవు" అన్నాడు ఆ యువకుడు. ఊహించని ఆ సమాధానానికి సభికులు, పోటీదార్లు కూడా చప్పట్లు కొట్టారు. రాకుమార్తె కూడా అభినందన పూర్వకంగా చూసింది.

అది ఓరకంట గమనించిన ముని తనలో తాను నవ్వుకుని, "చివరి ప్రశ్న. జాగ్రత్తగా విను. నీవు రాకుమార్తెని వివాహమాడి రాజ్యాన్ని చేపట్టావు. అయాచితంగా నీకు కలిగిన అదృష్టానికి నీకు మరొక యువకుడు శత్రువు అయ్యాడు. అతడికొక అద్భుతశక్తి వున్నది. చీకటిలో చూడగలగటం. కాబట్టి చీకటిలో అతడితో యుద్ధం చేయటం కష్టం అని నీకు కచ్చితంగా తెలుసు. నీవొక కొండ గుహలో చీకట్లో



నడుస్తూ అవతలివైపుకి వెళ్తూ ఉండగా, దూరంగా వెనుకవైపు నుంచి గుర్రం వస్తూన్న చప్పుడు వినిపించింది. **అప్పటికి గుర్రం ఇంకా గుహని చేరుకోలేదు.** గుహలో నువ్వు **ఎనిమిదో వంతు** లోపలికి నడిచావు. గుహవైపు వస్తున్న శత్రువు నిన్ను చంపటానికే వస్తున్నాడని తెలుసు. నువ్వు వేగంగా వెనక్కి వెళ్తే గుహ ప్రవేశ ద్వారం దగ్గర అతడిని కలుసుకుని వెలుతురులో అక్కడే యుద్ధం చేయవచ్చు. లేదా 'అదే వేగం'తో ముందుకు వెళితే వెనుక నుంచి వస్తున్న శత్రువు గుహ **చివరిభాగంలో** నిన్ను కలుసుకుంటాడు. అక్కడ వెలుతురులో యుద్ధం చేసి అతడిని గెలవవచ్చు. ప్రశ్న అది కాదు. నీ పరుగు వేగం కన్నా గుర్రం వేగం ఎన్నిరెట్లు ఎక్కువ? నీ వేగము, గుర్రపు వేగాల నిష్పత్తి ఎంత?"

బేతాళుడు ఈ కథ చెప్పి "రాజా! ఈ ప్రశ్నకు తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది జాగ్రత్త" అన్నాడు.

*(సమాధానం 167 పేజీలో)*

# 23. గణితంలో మెలిక



గత కథలో యాదవ యువకుడు సమాధానం చెప్పగానే మిగతావారు లేచి "మరీ ఇంత సులభమయిన ప్రశ్నలా?" అంటూ అభ్యంతరం లేవదీసారు. రాకుమార్తె ఏదో చెప్పబోయింది గానీ వారు వినిపించుకోలేదు. అప్పుడు ముని కల్పించుకుని, "ప్రశ్నల్లో కష్టము, సులభము అని ఉండవు. ఎనిమిదో తరగతి వాడికి ఆరో తరగతి ప్రశ్న సులభం. తొమ్మిది వాడికి పదో తరగతి కష్టం. ఎక్కువమంది పాల్గొనాలన్న ఉద్దేశంతో, అందరితో మెదడుకు పని పెట్టించాలన్న కోరికతో తయారుచేసిన ప్రశ్నలవి. మీలో ఉత్సాహం, అభిరుచి కలిగించటమే ఇటువంటి ప్రశ్నల ఉద్దేశ్యం. ఈ స్వయంవరం మీ తెలివితేటల పరీక్ష కాదు. పాల్గొనే తపన, ఉత్సాహం మీలో ఎంతవరకూ ఉన్నదో తెలుసుకునే ప్రయత్నం మాత్రమే. మా మనసు అర్థం చేసుకుని విజయలక్ష్మిని చేపట్టండి. ఎవరు ఈ ప్రశ్నలకి తొందరగా సమాధానం చెపుతారో వారిని రాకుమార్తె వరిస్తుంది. అందరికన్నా తొందరగా చెప్పిన వారినే సుమా!" అంటూ ఈ విధంగా అడిగాడు.

**1.** "మీ ఇంటినుంచి మీ కార్యాలయానికి వెళ్లటానికి ఒక వాహనం ఏర్పాటు చేసుకున్నారు. ప్రొద్దున్నే మీతో వెళ్లి సాయంత్రం మిమ్మల్ని వెనక్కి తీసుకురావటం కోసం ఆ వాహనాన్ని నడిపేవానికి రోజుకి మూడొందలు ఇవ్వాలి. మార్గమధ్యంలో "సరిగ్గా మధ్యలో" ప్రతిరోజూ ఇద్దరు యువకుల్ని మీరు చూస్తూ ఉన్నారు. మీ వాహనంలో మరో ఇద్దరికి ఖాళీ ఉన్నది. వారి కార్యాలయం ఎక్కడో వాకబు చేశారు. అది మీరు వెళ్ళే ప్రదేశం పక్కనే. వారికి మీరు సాయం చెయ్యాలనే ఉద్దేశ్యంతో, "ఎలాగూ నేను ఒక్కణ్నే వెళ్తున్నాను కాబట్టి ప్రొద్దున్న మిమ్మల్ని కూడా నాతో తీసుకువెళ్తాను. దానికోసం మీరిద్దరూ విడివిడిగా ఒక్కొక్కరూ ఎంత నాకు ఇవ్వాలో సరిగ్గా చెప్తే, మిమ్మల్ని ప్రతిరోజూ ఉచితంగా తీసుకువెళ్తాను" అన్నారు. **దీనికి రకరకాలుగా లెక్కలు కట్టవచ్చు. కానీ న్యాయ సమ్మతమైన లెక్క ప్రకారం కేవలం ఒకవైపు సగం దూరం వెళ్లటానికి ఒక్కొక్కరూ విడిగా ఎంత ఇవ్వాలి?**

**2.** నీవు మంచుకొండల మధ్య నడుస్తున్నావు. చుట్టూ గడ్డకట్టిన మంచు పేరుకుపోయి వున్నది. విపరీతమైన చలి. పైన సూర్యుడు ప్రకాశిస్తున్నాడు గానీ



చలిని ఆపలేకపోతున్నాడు. నీకు తేనీరు తాగాలనిపించింది. అన్నీవున్నాయి గానీ నిప్పులేదు. ఎలా సృష్టిస్తావు? "రాళ్ళ రాపిడితో" అన్న సమాధానం మరీ పురాతనమైనది. అంతకన్నా ఆధునిక శాస్త్ర పరిజ్ఞానంతో చెప్పు.

**3.** ఒక ఊరిలో గుడి నుంచి రచ్చబండ మీదుగా సత్రాన్ని చేర్చుకోవాలంటే 8 మైళ్ళు, రచ్చబండ నుంచి సత్రం మీదుగా గుడి చేరుకోవాలంటే 11 మైళ్లు, సత్రం నుంచి గుడి మీదుగా రచ్చబండ చేరుకోవటానికి 7 మైళ్లు నడవాలి. సత్రం నుంచి గుడికి, గుడి నుంచి రచ్చబండకి, అక్కణ్నుంచి సత్రానికి మధ్య దూరం **నేరుగా** ఎంత?

**4.** ఒక గోడకి రంగు వేయాలంటే 4 డబ్బాలు తెలుపు. 2 డబ్బాలు నలుపు కలిపి మిశ్రమం తయారుచేయాలి. పొరపాటున 4 నలుపు, 2 తెలుపు కలపటం జరిగింది. దాన్ని సరిచేయటం కోసం మరికొంత తెలుపు రంగు కలపాలి. కానీ కావల్సింది మొత్తం 6 డబ్బాల మిశ్రమం మాత్రమే కాబట్టి కొంత రంగు పారబోయాలి. ఎంతరంగు పారబోయాలి?

**5.** ఈ ప్రశ్న ఆర్థిక సంబంధమైనది. పది గొర్రెల్ని 600కి కొని అందులో సగాన్ని 325 కి, మిగతా సగాన్ని 375 కి అమ్మావు. ఏడాది తరువాత "అవే గొర్రెల్ని" 800 కి కొని, అందులో సగాన్ని 425 కి, మిగతా సగాన్ని 475 కి అమ్మావు. మీకు మొత్తం మీద లాభమా? నష్టమా?ఎంత?

**6.** ఇక ఆఖరి ప్రశ్న. నీ దగ్గర 12,8,5 శేర్లు పట్టే పాత్రలు మూడు ఉన్నాయి. అన్నిటికన్నా పెద్ద పాత్రలో సరిగ్గా సగం పాలు ఉన్నాయి. రెండో దానిలో 6 శేర్లు నీళ్లు ఉన్నాయి. అన్నిటినీ కలిపి బాగా మిశ్రమం చేసి ఆ 12 శేర్లనీ మొదటి రెండు పాత్రల్లో సరిగ్గా సగం - సగం సర్దాలి. పాత్రలపై కొలతలు లేవు. ఉజ్జాయింపులు కుదరవు. ఎలా?"

ఈ విధంగా ముని ప్రశ్నలు అడగటం చివరివరకూ పూర్తి కాకుండానే మిగతా వారు ఇంకా ఆలోచిస్తూ వుండగా యాదవ యువకుడు లేచి, చకచకా సమాధానాలు చెప్పి రాకుమార్తెని చేపట్టాడు.

విక్రమార్కునికి ఈ కథ చెప్పిన బేతాళుడు "రాజా! ఇవన్నీ చాలా చిన్న ప్రశ్నలు. ఎంత తొందరగా చెప్పగలవన్నది ప్రశ్న. స్వయంవరంలో ఇంత చిన్న ప్రశ్నలు అడుగుతారా అన్న అనుమానం మాని ఒక్కొక్క నిమిషంలో ఒక్కో ప్రశ్నకి సమాధానం చెప్పాలి" అన్నాడు.

*(సమాధానం 168 పేజీలో)*

# 24. పన్నెండు బంగారు ప్రశ్నలు



ఇవి పన్నెండు ప్రశ్నలు. ఇందులో కొన్ని చాలా కష్టమైనవి. అయితే, ఈ ప్రశ్నల్లోకి వెళ్ళే ముందు ఈ కథ చదవండి. ఒక పురాతన చైనా దేశపు కథ ఇది. కాస్త మార్పులు చేసి తెలుగులో వ్రాయటం జరిగింది. చదువుతూంటే మనసంతా ఒక అనిర్వచనీయమైన అనుభూతితో నిండిపోతుంది.

❖ ❖ ❖

ఆ టీచర్ చెప్పింది క్లాసులో కొందరికి అర్థమయ్యింది; కొందరికి కాలేదు. ఇంతకీ ఆ టీచర్ ఏం చెప్పిందంటే...

"ఇవ్వటం కన్నా తీసుకోవడం బాగుంటుంది– అని అందరూ అనుకుంటారు. చిన్నప్పుడు నాన్న నడిగి సినిమాకు డబ్బులనుండి, పెద్దయ్యాకా మామ దగ్గిర కట్నం వరకూ చాలామంది 'తీసుకోవడంలోనే' ఆనందం పొందుతారు. కానీ ఒకసారి ఇచ్చిచూడండి. అందులో పొందే ఆనందం చెప్పనలవికానిది. మీకు పుస్తకాలున్నాయి; బట్టలున్నాయి; కాళ్ళకు చెప్పులున్నాయి. ఇవేమీ లేనివాళ్ళు, మీకన్నా చిన్నవాళ్ళు మీ చుట్టూ ఎంతోమంది కనబడతారు. ఉదాహరణకి మీకున్నదానిలో కాస్త స్వీటు ఇచ్చిచూడండి. వాళ్ళ కళ్ళల్లో కనబడే ఆనందం మీరు స్వీటు తింటున్నప్పుడు కలిగే ఆనందంకన్నా ఎక్కువ సంతోషాన్నిస్తుంది."

క్లాసులో టీచరు చెప్పింది అర్థమైన కొద్దిమందీ దాన్ని వెంటనే మర్చిపోయారు. ఒక్క అమూల్య తప్ప!

❖ ❖ ❖

అమూల్యతోపాటు ఆ చిన్న ఇంట్లో అమ్మా, నాన్న, అన్నయ్య ఉంటున్నారు. వాళ్ళది మధ్యతరగతి కన్నా చిన్నస్థాయి కుటుంబం. అమూల్య అన్నయ్య ఎనిమిదో క్లాసు చదువుతున్నాడు. చెల్లి అంటే వాడికి ప్రాణం. అప్పుడప్పుడు తల దువ్వి జడ కూడా వేస్తూంటాడు. అంత ఇష్టమన్నమాట!

అమూల్య ఇంట్లో పనిపిల్లలు ఎవరూ లేరు. అంతటి ఆర్థికస్థోమతుని కలలో కూడా వారు ఊహించలేరు. అయితే అమూల్య తన స్నేహితురాలి ఇంట్లో పనిచేసే అమ్మాయిని చూసింది. తమకన్నా చిన్నది. ఇంటెడు పనీ ఒక్కతే చేస్తుంది. స్నేహితురాలి



తల్లి కర్కోటకురాలు. పండగరోజు చేసుకున్న పిండివంటలలో మిగిలిపోయినవి కూడా పనివాళ్ళకు పెట్టదు.

ఆ రోజు అమూల్య పుట్టినరోజు. నాన్న ఇచ్చిన డబ్బుల్తో ఐస్‌క్రీం కొనుక్కుందామని వీధిలోకి వచ్చింది. అక్కడ పనిపిల్ల కనబడింది. ఐస్‌క్రీం అంటే తనకెంతో ఇష్టమైనా అది మానేసి రెండు ఐస్‌ఫ్రూట్లు కొని ఒకటి పని అమ్మాయికి ఇచ్చింది. పనిపిల్ల మొదట్లో వద్దన్నా బలవంతం మీద తీసుకుంది. తింటూ చెప్పింది. "నీకు తెలుసా? నేనిదే మొదటిసారి ఐస్‌ఫ్రూట్ తినడం!"

ఆ పని పిల్ల మెరుస్తూన్న కళ్ళల్లో వెలుగుని చూసినప్పుడు అమూల్యకు టీచర్ చెప్పిన దానిలో సత్యం అర్థమైంది.

❖ ❖ ❖

అకస్మాత్తుగా ఆ ఇంట్లో ఆనందం అంతమైంది. అప్పటివరకూ ఆడుతూ పాడుతూ తిరిగే అమూల్య అన్నయ్య మంచాన పడ్డాడు. వాడికి మెదడు దగ్గర కణితి ఏర్పడింది. లక్షరూపాయల ఖర్చుతో శస్త్రచికిత్స చేస్తే తప్ప బ్రతకడు. అందులో పదోవంతు కూడా ఆ తల్లిదండ్రుల వద్దలేదు.

తల్లిదండ్రుల మొహాల్లో నవ్వు మాయమవుటం అమూల్య గమనించింది. అన్నయ్య అనారోగ్యం పాలయ్యాడని తెలుసుకానీ పరిస్థితి తీవ్రత ఆ చిన్నపిల్లకు తెలియదు. ఓ అర్థరాత్రి తల్లీ, తండ్రీ మాట్లాడుకుంటూంటే విన్నది... "... ఆపరేషన్ తప్ప మరో మందు లేదా?" తల్లి అడుగుతోంది.

"లోకజన రక్షకుడి సంకల్పమొక్కటే వాడిని రక్షించగలదు. అది తప్ప మరే మందూ లేదు" నిస్సహాయంగా అన్నాడు తండ్రి.

❖ ❖ ❖

దేవుడి విగ్రహం నుంచి డిబ్బీ తీసి లెక్కపెట్టింది అమూల్య. పన్నెండు రూపాయలున్నాయి. అమ్మానాన్నా, ఇంటికొచ్చిన బంధువులూ, ఎవరిచ్చినా దాయటం నేర్చుకుంది. టీచర్ చెప్పిన ఆనాటినుండి ఆ దాచిన డబ్బుతో తమకన్నా లేని పిల్లలకు కావలసినది ఇస్తూ అందులో ఆనందం పొందుతోంది అమూల్య తన క్లాసులో ఓ అమ్మాయికి పాతచెప్పులు కొనిపెట్టింది కూడా!

ప్రస్తుతం తన అన్నయ్య వైద్యానికి ఈ డబ్బులు అవసరం అని గ్రహించి అవి తీసుకుని మందులషాపుకు వెళ్ళింది. ఏం కావాలని అడిగాడు షాపు యజమాని.

"సంకల్పం" అంది.

అతడికి అర్థంగాక "ఏ కంపెనీ తయారు?" అని తిరిగి అడిగాడు.

"... లోకజనరక్షక" అంది తండ్రి మాటలు గుర్తు తెచ్చుకుంటూ!

షాపు యజమాని నవ్వాపుకుని "ఆయుర్వేద మందులషాపులో ప్రయత్నం చెయ్యి" అన్నాడు. అమూల్య అక్కడనుంచి ఆయుర్వేద షాపుకు వెళ్ళింది. పాప చెప్పేది అర్థంగాక, అదక్కడ కూడా దొరకదన్నాడు. మధ్యాహ్నం వరకూ అమూల్య అన్ని షాపులూ వెతుకుతూనే వుంది. కొన్ని దుకాణాల వాళ్ళు నవ్వారు. మరికొందరు హేళన చేసారు. కొందరు అసలా పేరే వినలేదన్నారు.

మధ్యాహ్నమయ్యింది. అమూల్య అలిసిపోయింది. మరోవైపు దాహం. అయినా పట్టుదలతో ప్రతి షాపులోనూ అడుగుతూనే వుంది. ఒక షాపు యజమాని "సంకల్పమా! ఆపరేషన్ బదులు వాడేమందా? పన్నెండు రూపాయలకా? అది దొరికితే నాకూ తీసుకురా. వెయ్యిరూపాయలిస్తాను" అన్నాడు ఆటపట్టిస్తున్నట్లు.

పక్కనే ఈ సంభాషణంతా వింటున్న ఓ వ్యక్తి, "పన్నెండు రూపాయల సంకల్పం ఏమిటమ్మా?" అని ప్రేమగా అడిగాడు. అతడి ప్రశ్న అర్థంగాక "నా దగ్గర ఇన్నే వున్నాయి. మా పక్కింటి పనిపిల్ల రిబ్బను కోసం దాచినవి; అంతకంటే ఇది పెద్ద అవసరం కాబట్టి దీనికోసం తెచ్చాను" అన్నది.

దాచిన డబ్బు వెనుకవున్న ఆ పాప సంకల్పం తెలుసుకున్న ఆ వ్యక్తి, "నువ్వు చెప్పిన మందు నా దగ్గరవున్నది. మీ అన్నయ్య దగ్గరకు నన్ను తీసుకెళ్ళు, ఇస్తాను" అన్నాడు.

"ఖరీదెంత" అని అడిగింది.

ఆ వ్యక్తి నవ్వుతూ, "పన్నెండు రూపాయలు" అన్నాడు.

❖ ❖ ❖

తమ ఇంటిముందు ఆగిన అంబులెన్సు చూసి ఆశ్చర్యపోయారు ఆ పేదదంపతులు. అమూల్యతోపాటు వచ్చిన వ్యక్తి ఆ నగరంలోనికెల్లా పెద్ద న్యూరోసర్జను అని తెలిసి వారి విస్మయం రెట్టింపు అయ్యింది.

రెండ్రోజుల తర్వాత ఆపరేషన్ జరిగింది. ఆరుగంటలపాటు దాని నిర్వహించి బయటకొచ్చిన డాక్టర్‌తో "అన్నయ్యకెలావుంది?" అని అడిగింది అమూల్య.

"నెలరోజులు తిరిగేసరికల్లా నీతో కలిసి ఆడుకుంటాడు సరేనా?" అన్నాడాయన చిరునవ్వుతో!

అమూల్య గుప్పెట తెరిచింది. పన్నెండు రూపాయలు!



"... సంకల్పం డబ్బులు... తీసుకోండి" అంది.

"ఊహూ! వద్దు! పనమ్మాయికి రిబ్బను కొనిపెట్టు".

అమూల్య ఆశ్చర్యంగా "అదేం?" అంది.

"తీసుకోవడంకన్నా ఇవ్వటంలో ఆనందం ఎక్కువని నువ్వే అన్నావుగా" అన్నాడు డాక్టర్ అదే చిరునవ్వుతో.

భగవంతుడు మనిషికి అవసరమైన దానికన్నా ఎక్కువ డబ్బు యిచ్చేది, సాటిమనిషి అవసరాలు తీర్చి వారు పొందే తృప్తిని చూసి ఆనందం పొందమని... కొందరు లోభులు ఈ సత్యాన్ని ఎన్నటికీ గ్రహించలేరు. కానీ ఈ సత్యాన్ని ఓ చిన్నపాప ద్వారా గ్రహించి ధన్యుడయ్యాడు న్యూరోసర్జన్.

❖ ❖ ❖

ఇక మన ప్రశ్నల్లోకి ప్రవేశిద్దాం.

**1.** హైద్రాబాద్ నుంచి ప్రొద్దున 6 గంటలకి కృష్ణా ఎక్స్‌ప్రెస్ బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకి విజయవాడ చేరుకుంటుంది. విజయవాడ నుంచి అదే వేగంతో రోజంతా ప్రతి గంటకీ ఒక రైలు చొప్పున... (ఉదా: 6.30, 7.30, 8.30) ఇరవై నాలుగు రైళ్ళు హైద్రాబాద్ వస్తాయి. కృష్ణా ఎక్స్‌ప్రెస్ తన గమ్యం చేరేలోపులో దాని ఎదురుగా వచ్చే రైళ్లు ఎన్ని?

**2.** ఒక గ్లాసులో బత్తాయి రసం, మరో గ్లాసులో అంతే పరిమాణంలో నిమ్మరసం ఉన్నాయి. సగం బత్తాయి రసాన్ని నిమ్మరసం ఉన్న గ్లాసులో పోసి, బాగా కలిపి, ఆ మిశ్రమంలో మళ్లీ అంతే భాగాన్ని ముందు దానిలోకి పోస్తే, బత్తాయి గ్లాసులో నిమ్మరసపు నిష్పత్తి ఎక్కువ వుంటుందా? నిమ్మగ్లాసులో బత్తాయి ఎక్కువ వుంటుందా? లేదా రెండూ సమానంగా ఉంటాయా? (ఉదాహరణకి చెరో గ్లాసులో 90 మి.లీ. రసాలున్నాయనుకుందాం. మొదటిదానిలోంచి 45 మి.లీ. తీసి రెండోదానిలో పోసి, బాగా కలిపి, ఆ మిశ్రమంలోంచి 45 మి.లీ. తీసి మొదటి దానిలో పోస్తే, బత్తాయి రసంలో నిమ్మరసం నిష్పత్తి ఎక్కువ ఉంటుందా? నిమ్మరసంలో బత్తాయా? లేక రెండూ సమానమేనా?)

**3.** ఒక వ్యక్తి వంతెన పైనుంచి కాలువలో దూకి ప్రవాహానికి ఎదురుగా ఒక కిలోమీటరు వెళ్లాక, ఎదురుగా నీటిలో తేలుతూ వస్తున్న ఒక సీసా బెరడు (మూత) అతనికి ఎదురైంది. దాన్ని దాటుకుని మరో అరగంట ముందుకు ప్రయాణించి అదే

వేగంతో వెనుదిరిగాడు. అతడూ, సీసా మూతా ఒకేసారి వంతెన చేరుకుంటే, నీటి ప్రవాహం గంటకి ఎన్ని కిలోమీటర్లు?

**4.** 1 నుంచి 9 వరకు **"అదే వరసక్రమం"**లో అంకెలు ఉపయోగించి, + లు - ల సాయంతో 100ని సృష్టించమంటే 123-45-67+89 = 100 అని సృష్టించవచ్చు. దీన్ని ఉదాహరణగా తీసుకుని అదే వరస క్రమంలో '10'ని సృష్టించండి. మొత్తం తొమ్మిది అంకెల్నీ ఉపయోగించాలి సుమా! మధ్యలో + లు, - లు వాడుతూ అదే వరస క్రమంలో రాయాలి.

**5.** నేను మార్కెట్‌కి వెళ్తూ ఉండగా ఒక కుటుంబం ఎదురు పడింది. ఒక తండ్రి, తల్లి, ఇద్దరు మగపిల్లలు, ఒకమ్మాయి. వారితో పాటు ఒక ఆడ కుక్కపిల్ల ఉన్నాయి. ఎన్ని 'మగ' ప్రాణులు మార్కెట్‌కి వెళ్తున్నాయి.

**6.** **ఆఖరి బ్యాట్స్‌మెన్ ఇద్దరూ** చెరో 94 పరుగుల వద్ద ఉన్నారు. భారత్ ఇంకా 7 పరుగులు చెయ్యాలి. **రెండు బంతులు** మిగిలి వున్నాయి. ఆట పూర్తయ్యేసరికి భారత్ గెలిచింది. ఇద్దరూ 100 పరుగులు చేశారు. ఇది ఎలా సాధ్యం అయింది? ఈ ప్రశ్న అడగ్గానే 'నో బాల్' గానీ, 'వైడ్‌బాల్' గానీ గుర్తొస్తే క్రీజ్ దాటి పప్పులో కాలేసినట్టే! ఆలోచించండి.

**7.** ఎ+ఇ = అ+ఉ; 2ఒ = ఉ+5; ఎ+ఉ = ఒ అయినప్పుడు అ, ఇ, ఉ, ఎ, ఒ ల విలువలు 1, 2, 3, 4, 5 ల నుంచి కనుక్కోండి.

**8.** ఐదు అంతస్థుల భవంతి ఉన్నది. మీకు రెండు గాజు బంతులు ఇవ్వబడ్డాయి. ఒక అంతస్థు (దాన్ని 'X' అనుకుందాం) నుంచి గానీ, దానిపై అంతస్థుల నుంచి గానీ బంతులు కింద నేలమీదకు విసిరేస్తే అవి పగిలి పోతాయి. ఆ అంతస్థుకన్నా క్రింది అంతస్థుల నుంచి వేస్తే మాత్రం పగలవు. రెండు బంతుల్నీ "వీలైనన్ని తక్కువసార్లు" నేలమీదకు జారవిడిచి అది (అంటే 'X') ఏ అంతస్థో తెలుసుకోగలరా?

ఈ ప్రశ్నకు సమాధానం "3 సార్లు". ఎలాగో చూద్దాం.

మూడో అంతస్థు నుంచి మొదట జార విడవాలి. అది పగలకపోతే రెండ అంతస్థునించి వేయాలి. తరువాత 4వ అంతస్థునుంచి పడెయ్యాలి. అప్పుడు జవాబు తెలుస్తుంది. ఒకవేళ 3లోనే మొదటి బంతి పగిలిపోతే, రెండో బంతిని "జాగ్రత్తగా వాడుకోవాలి". అంటే, మొదటి అంతస్థు మీద నుంచి ఒకసారి, ఆపై రెండో అంతస్థు మీదనుంచి మరోసారి వేసి కనుక్కోవాలి. ఆ విధంగా మొత్తం మూడుసార్లు బంతుల్ని



పడెయ్యటం ద్వారా, ఆ అంతస్థు కనుక్కోవచ్చు. ఈ వివరణ ఆధారంగా ఇప్పుడీ ప్రశ్నకి సమాధానం చెప్పండి.

100 అంతస్థుల భవంతి అయితే ఎన్ని **"తక్కువ"** సార్లు కిందికి పడెయ్యటం ద్వారా ఆ బంతి ఏ అంతస్థు నుంచి పడేస్తే పగలటం ప్రారంభిస్తుందో తెలుసుకోగలము?

**9.** "ఈ రోజు ఏ వారం?" అని నేను నా మిత్రుడిని అడిగితే "రేపు నిన్న అయితే, ఈ రోజు శనివారం" అన్నాడు. ఆ లెక్క ప్రకారం సమాధానం "గురువారం". ఎందుకంటే గురువారానికి మరుసటి రోజు (రేపు) శుక్రవారం కదా! శుక్రవారం నిన్న అయితే ఆ రోజు శనివారం! ఆ విధంగా లెక్క కట్టాలి! ఇప్పుడు ఈ ప్రశ్నకి సమాధానం చెప్పండి.

"ఈ రోజు ఏ వారం?" అని అడిగితే, "నిన్న రేపు అయితే ఈ రోజు బుధవారం" అన్నాడు. ఈ రోజు ఏ వారం?

**10.** వెనుక సీట్లో కూర్చుని ఆగకుండా సొదపెడుతున్న ప్రయాణీకురాలి బారి నుంచి తప్పించుకోవటం కోసం తనకి చెవుడని, ఏమీ వినలేనని చెప్పాడు టాక్సీ డ్రయివర్. అతడు అబద్ధం చెప్పాడని దిగిపోయిన తరువాత ఆమె గ్రహించింది. ఏ విధంగా?

**11.** ఎండగా వున్నప్పుడు ఆ వేడి భరించటానికి ఏ రకం దుస్తులు వేసుకుంటే మంచిది? సూర్య కిరణాల్ని నలుపు గ్రహిస్తుంది. తెలుపు చెదరగొడుతుంది. ఇప్పుడు చెప్పండి. వేసవి ఎండలో నల్ల దుస్తులు మంచివా? తెల్లవా? ఏ రంగు టోపీ ధరించాలి? నలుపా, తెలుపా?

**12.** ఎడారుల్లో ఇసుక విపరీతంగా కాలి, గాలి వేడెక్కి పైకి వెళ్తుంది. పైనుండే గాలి ఎక్కువ సాంద్రత కలిగి వుంటుంది. దూరంగా వుండే వస్తువులపై పడే కిరణాలు ఇసుకపై ప్రతిబింబిస్తాయి. ఇది ప్రకృతి సహజం. ఎడారుల్లో ప్రయాణం అనుభవంలేని వ్యక్తికి దీనివలన కలిగే నష్టం ఏమిటి?

*(సమాధానాలు 170 పేజీలో)*

# 25. నీరూ - బరువూ



'నీరముతప్త లోహముననిల్చి... పౌరుష వృత్తులిట్లు గొల్చువారికిన్...' అని నీతి శతకంలో అన్నాడు భర్తృహరి. నీటి చుక్క ఇనుముపై పడితే ఆవిరైపోతుంది. తామరాకు పై తాత్కాలికంగా ముత్యంలా మెరుస్తుంది. ముత్యపుచిప్పలో పడితే దాని అస్థిత్వమే మొత్తంగా మారుతుంది.

విద్యార్థి జీవితానికీ దీనికీ దగ్గిర సంబంధం వున్నది. చెడు స్నేహ బృందంలో పడితే విద్యార్థి జీవితం, కాలిన ఇనుముపై పడిన నీటి చుక్కలా ఆవిరి అయిపోతుంది. మరికొందరు విద్యార్థి దశలో ఒక వెలుగు వెలిగి ఉద్యోగస్థాయిలో సామాన్యులైపోతారు. తామరాకుపై నీటి చుక్కలా తాత్కాలికంగా తళతళలాడటమంటే ఇదే. మూడో వర్గానికి చెందిన విద్యార్థులు పగడపు చిప్పలో పడిన వర్షపు చినుకులా విలువ పెంచుకుంటారు. 'అందరూ ఒకటే. వారు ఎన్నుకున్న స్థానం బట్టి, భవిష్యత్తులో వారి విలువ మారుతుంది' అని చెప్పే పద్యం ఇది.

దీనిని వ్రాసిన కవి భర్తృహరి. అనుభవాల వల్ల అభిప్రాయాలు మారతాయన టానికి ఆ కవి జీవితమే ఉదాహరణ. అతడి ప్రియురాలి పేరు అనంగసేన. "... అతి మధుర మెద్ది? కాంతాధరామృతంబు..." అంటూ ఆమె ప్రేమలో శృంగారాన్ని వర్ణించాడు భర్తృహరి. అతడు వ్రాసిన శృంగార శతకము కొన్నిచోట్ల శ్రీనాథుని కవిత్వముని మించి ఉంటుంది.

భువనేశ్వరీ దేవతని ఉపాసించటం వలన ఒక పేదబ్రాహ్మణుడికి ఒక పండు లభ్యమవుతుంది. దాన్ని ఆరగించిన మనిషికి మరణముగాని, వృద్ధాప్యముగాని రావు. అటువంటి పండు తాను భుజించుటకన్నా దేశాన్ని పాలించేవాడు భుజిస్తే మంచిదని తలచి ఆ పండును భర్తృహరికి ఇస్తాడు. దాన్ని భర్తృహరి తన ప్రాణం కన్నా మిన్న అయిన ప్రియురాలు అనంగసేనకి ప్రధానం చేస్తాడు. ఆమెకొక హీనుడు ప్రియుడు. వాడికి ఇస్తుంది. వాడు ఒక దాసికీ, ఆమె తన ప్రియుడు ఒక గొల్లవానికీ, అతడు తన ప్రియురాలైన ఒక పేడ ఎత్తే స్త్రీకీ ఇస్తాడు.

ఆమె ఒక గంపనిండా పేడ, దానిపై ఆ పండునీ పెట్టుకుని పోతూండగా రాజప్రాసాదం పైనుంచి దానిని గమనించిన భర్తృహరి నివ్వెరపోయి ఆమెని పిలిపించి



విచారిస్తాడు. మొత్తం వ్యవహారమంతా బయటకు వస్తుంది. వ్యక్తిగత ప్రేమపట్ల విశ్వాసంపోయి, సంసారమందు విరక్తి చెంది అడవికి పోయి తపస్సు చేస్తూ సుభాషిత రత్నావళి వ్రాస్తాడు. అందులో చివరి శతకమే 'వైరాగ్యశతకము'. 'చిత్తజవైరిపాద యుగసే వనమే గతిగానెరింగితిన్' అన్నాడు. 'ఎంత విద్వత్సంపన్నులైననూ, ఎంత శృంగార పురుషులైననూ చివరికి ప్రార్థనలో ముక్తి పొందవలసినదే గదా!' అని దాని అర్థము.

రాజా! ప్రార్థన వేరు. ముక్తి పట్ల స్వార్థం వేరు. కొంతమంది తెలివైనవారు తమ తెలివితేటల్ని ప్రజలకున్న 'ముక్తి' అనే నమ్మకంపై ప్రయోగించి, తమ పబ్బం గడుపుకోవటానికి వినియోగిస్తారు. ప్రజలకి గంగాజలం పైనున్న భక్తిని ఆ విధంగా ఉపయోగించుకుంటున్న భరణీదత్తుడనే తెలివైనవాడి కథ ఒకటి చెపుతాను. విను.

విజయపురి అనే పట్టణంలో భరణీదత్తుడనే నాటకశాల యజమాని అనేక నాటక ప్రదర్శనలు తయారుచేసి ఆడించి జీవనాధారం సాగించేవాడు. అతడు ఎంతో సొమ్ము వెచ్చించి తయారుచేసిన "గంగావతరణం" అనే నాటకానికి ప్రజాదరణ తక్కువై అమితమైన నష్టాలు చవిచూడవలసిన స్థితి ఏర్పడింది. ఏమి చెయ్యాలో తోచని స్థితిలో అతడికి ఒక కొత్త ఆలోచన వచ్చింది. కాశీనించి కాస్త నీరు తెప్పించి, దానిని ఒక బావిలో పోసి, ఆ గంగాజలాన్ని తన నాటకం చూసిన ప్రతి ప్రేక్షకుడికీ తీర్థంగా ఇవ్వసాగాడు. ఆ విధంగా గంగాజల తీర్థం ద్వారా గంగావతరణం నాటకాన్ని బతికి బట్టకట్టేలా చేశాడు. అంతవరకూ ఎవరికీ నష్టం లేదుకానీ, ఆ సమయంలోనే రాజప్రతినిధుల ఎంపిక జరిగే సమయం ఆసన్నమైంది. అందరూ సురాపానాన్ని బహుమతిగా ఇస్తే ఇతడు గంగాజలాన్ని తలా చెంబుడు పంచి ప్రజల అభిమానాన్ని చూరగొని ఎన్నికల్లో నెగ్గాడు. ఆ విధంగా ప్రజాప్రతినిధి అయిన తదుపరి ఆర్జించిన లంచం సొమ్ముతో పారిశ్రామికవేత్త అయ్యాడు.

తనని ఇంతవాడిని చేసిన గంగాజలాన్ని, దానిపట్ల ప్రజలకున్న భక్తినీ, ఆసక్తినీ అతడు మర్చిపోలేదు. పెద్ద ఎత్తున బియ్యం వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఎకరానికి పీపా చొప్పున తన నూతి నీటిని రైతులకిచ్చి, ఆ నీటిని వరి పొలాల్లో జల్లమని చెప్పి, ఆ విధంగా పండిన వరిని "పవిత్ర గంగాజలంతో పండిన వరి బియ్యాన్ని తింటే పది తరాల వరకూ పుణ్యం వస్తుంది" అన్న ప్రచారం ద్వారా ధర పెంచి వ్యాపారాన్ని పదింతలు పెంచేశాడు. గంగా పరివాహక ప్రాంతాల్లో ప్రజలందరూ స్వర్గానికే వెళతారా? అన్న అనుమానం వినియోగదార్లకు రాకపోవటం అతడి అదృష్టం.

రాజా! నమ్మకం మంచిదే. కానీ మూఢనమ్మకం అనారోగ్య హేతువు. పిల్లల్లో చిన్నతనం నుంచీ హేతు శోధన అలవాటు చెయ్యకపోతే, తర్క నైపుణ్యం లేని ఆ పిల్లలు పెద్దయ్యాక తమమీద తమకి నమ్మకం లేక, మోసగాళ్లయిన కొందరు బాబాల్ని జాతక రత్నాల్ని ఆశ్రయించి వివిధ రకాలుగా నష్టపోతూ ఉంటారు. కేవలం లెక్కలే కాదు. విజ్ఞాన శాస్త్రం కూడా కాస్త తెలియాలి. నిజానికి భౌతికశాస్త్రం ఎంతో ఉత్సాహవంతమైనది. దాని గురించి చెప్పాలంటే మళ్లీ దత్తుడి గురించి చెప్పాలి.

ఈ లోగా దత్తుడికి వెన్నెముక దగ్గర నొప్పి ప్రారంభమైంది. ఎంతమంది వైద్యులకి చూపించినా ఫలితం లేకపోయింది. ప్రజల మూఢనమ్మకం మీద కోట్ల ఆస్తి సంపాదించిన దత్తుడికి చిన్నపాఠం చెప్పాలని ఒక యువకుడికి అనిపించింది. అతడి పేరు సౌమ్యముఖుడు. అతడు దత్తుడి వద్దకు వెళ్లి, "నడుము నొప్పికి చైనా దేశపు సూది చికిత్స కన్నా గొప్పది లేదు. నావద్ద ఒక మహిమగల సూది ఉన్నది. దానితో నీవు వెన్నెముకపై గుచ్చుకుంటే చాలు. నొప్పి క్షణాల్లో మాయమౌతుంది" అన్నాడు.

"నీ మాటలు ఎలా నమ్మటం?" అని ప్రశ్నించాడు దత్తుడు. దానికి సమాధానంగా సౌమ్యముఖుడు ఒక పాత్రలో నీటిని తెప్పించి అందులో అతి జాగ్రత్తగా సూదిని వదిలాడు

చాలా ఆశ్చర్యంగా, నమ్మశక్యంకాని విధంగా ప్రేక్షకులు విభ్రాంతి చెందేలా అది **నీటిపై తేలింది**. అందరూ ఆశ్చర్యభరితులయ్యారు.

దత్తుడు ఏ మాత్రం సందేహించకుండా ఆ సూదిని లక్ష రూపాయలకి కొనుక్కున్నాడు. అయితే ఆర్నెల్లు గడిచినా ఫలితం కనపడకపోయే సరికి ఆ సూదిని తిరిగి నీటిపై వదిలాడు. అది మునిగిపోయింది. దత్తుడు కోపచిత్తుడై యువకుడిని పిలిపించి నిలదీశాడు.

ఈసారి యువకుడు దానిని నీటిలో వదిలేసరికి అది మళ్లీ తేలింది. అయోమయంతో తలమునకలైన దత్తుడితో సౌమ్యముఖుడు, "నీమీద నమ్మకంతో ప్రజలు గంగ ఫలం భోజనం చేసినట్టే, నామీద నమ్మకంతో దీనిని వాడు" అన్నాడు. అతడిని శిక్షించమని ఫిర్యాదు చేయటానికి కావలసిన సాక్ష్యాధారాలు లేక దత్తుడు తేలుకుట్టిన దొంగలా మిన్నకుండిపోయాడు.

అయితే అతడికి జరిగిన పరాభవం గురించీ, అతడికి పాఠం చెప్పిన యువకుడి గురించి ఆ పట్టణమంతా తెలిసిపోయింది. అందరూ నవ్వుకున్నారు.



అదే పట్టణంలో అరంగతుడనే వర్తకుడు ఇంటింటికీ తిరుగుతూ కోడిగుడ్లు అమ్మే వ్యాపారం చేసేవాడు. అతడి కూతురు మాళవిక సౌందర్యవతి. అరంగతుడి వ్యాపారం చాలాకాలం వరకూ బాగానే సాగింది. అయితే, ఆ నగరానికి ఒక కొత్త దంపతులు వచ్చారు. వారు గుడ్డుని కొనేటప్పుడు ముందుగా దాన్ని నీటిలో వేసి, అది మునిగితేనే కొనేవారు.

క్రమంగా ఈ విషయం ఆ నోటా ఈ నోటా పాకి, పట్టణమంతా తెలిసిపోయింది. నీళ్లలో మునిగినవి తాజావిగాను, తేలినవి చెడిపోయినవి గాను ప్రజల్లో నమ్మకం బలంగా నాటుకుపోయింది. దాంతో అప్పటి వరకు సజావుగా సాగుతున్న అరంగతుడి వ్యాపారం కుంటుపడింది. గుడ్లు మిగిలిపోసాగాయి.

"మునిగినవి తాజాగుడ్లే. కానీ తేలినవి అన్నీ చెడిపోయినవి కావు. ఇంత చిన్న విషయం ప్రజలకి ఎలా తెలిసేలా చేయటం?" అని కూతురు దగ్గర వాపోయాడు ఆ వర్తకుడు. మాళవిక సౌమ్యముఖుడి దగ్గరకు వెళ్లి ఈ విషయంలో తండ్రికి సహాయం చేయమని కోరింది. "ప్రజల అభిప్రాయం మార్చటం కష్టం. కానీ ఇంకోలా చేయవచ్చు" అంటూ తనని వివాహం చేసుకునే షరతుపైన ఆమెకి సాయం చేస్తానన్నాడు అతడు.

అందగాడైన అతడిని తొలిచూపులోనే ఇష్టపడిన ఆ అతివ అందుకు అభ్యంతరం చెప్పలేదు. ఆమెకు అతడు ఒక పొట్లం ఇచ్చాడు. "ఈ పొడి మీ ఇంట్లో కూడా ఉంటుంది. అందరూ వంటల్లో వాడేదే. దీన్ని నీటిలో కలిపి, అమ్మబోయే గుడ్లని ఆ నీటిలో రాత్రంతా నానబెట్టు" అన్నాడు. ఆ విధంగా వర్తకుడిని కష్టనష్టాలనుంచి రక్షించి అతడి కూతుర్ని వివాహమాడాడు ఆ యువకుడు.

బేతాళుడు ఈ కథ చెప్పి "నీటిపై సూది ఎలా తేలింది? కొన్ని పురుగులు నీటిమీద నడుచుకుంటూ వెళ్తుంటాయి. ఇదెలా సాధ్యం? సూది కూడా ఆ పురుగుల్లాగే నీటికన్నా బరువైనది కదా! ఇక రెండో ప్రశ్న. గుడ్లని నీటిలో మునిగేలా చెయ్యటం కోసం సౌమ్యముఖుడు ఏం చేశాడు? ఈ రెండు ప్రశ్నలకీ తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వక్కలవుతుంది సుమా!" అన్నాడు.

*(సమాధానం 173 పేజీలో)*

# 26. నీటిలో కిరీటం



విసుగు చెందని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని నడుస్తూంటే, అతడి మౌనాన్ని భంగం కావించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు "రాజా! ఈ ప్రశ్నకి సమాధానం చెప్పు. ఇది చాలా కష్టమైన ప్రశ్న సుమా! అతి క్లిష్టమైనది. ఒక రాజు 20 కిలోల బంగారం, 10 కిలోల వెండి కలిపిన కిరీటం చేయించాడు. కిరీటం పూర్తిగా తయారైన తరువాత చూస్తే దాని మొత్తం బరువు 30 కిలోలు ఉన్నమాట నిజమే గానీ కిరీటంలో బంగారం పాలు తగ్గి, వెండి పాళ్లు ఎక్కువైనట్టు రాజుకి అనుమానం కలిగింది. ఈ సమస్యని పరిష్కరించమని తన ఆస్థానంలో ఉన్న శాస్త్రజ్ఞుడిని అడిగాడు. వివిధ శాస్త్రాల్లో నిష్ణాతుడైన ఆ మేధావికూడా ఈ సమస్యా పరిష్కారం తోచలేదు. **కిరీటాన్ని చెడగొట్టకుండా ఎంత కల్తీ జరిగిందో** ఎలా కనుక్కోవటం?

సామాన్యుడికి, గొప్పవాడికి తేడా ఏమిటంటే, సామాన్యులు సమస్య వచ్చినప్పుడు దానివల్ల రాబోయే దుష్ఫలితాలు ఊహించుకుని మిగతా పనులు మానేసి విచారిస్తారు. గొప్పవారు ఏ పనిచేస్తూ ఉన్నా మరోవైపు దాని పరిష్కారం గురించి ఆలోచిస్తూనే ఉంటారు. మెరుపు మెరిసినట్లు ఎప్పుడో, ఎక్కడో సమాధానం దొరుకుతుంది. ఆ విధంగా ఆలోచిస్తూనే ఆ శాస్త్రజ్ఞుడు ఒకరోజు స్నానం కోసం తొట్టెలోకి దిగాడు. పక్కనే నీటిపైన ఒక చెంబు తేలుతూ కనిపించింది. అంతేకాదు నీటిలో దిగగానే తన బరువు కాస్త తగ్గినట్టుగా అనిపించింది.

మామూలు మనుష్యులకి సామాన్యంగా కనిపించేవి మేధావులని ఆలోచింపజేస్తాయి. తను ఎందుకు మునిగాడు... చెంబు ఎందుకు తేలింది? నీటిలో తన బరువు ఎందుకు తగ్గింది? ఈ విధంగా ఆలోచిస్తూ ఉండగా ప్రపంచ చరిత్రలో నూతనాధ్యాయం సృష్టించే ఒక శాస్త్రీయ సత్యం గోచరమైంది.

గాలిలో ఒకే బరువున్న లోహాలు, నీటిలో **వేర్వేరు నిష్పత్తుల్లో** బరువు కోల్పోతాయన్న సూత్రం అది.

ఒక వస్తువు ద్రవములో కోల్పోయిన బరువు, అది తొలగించిన ద్రవపు బరువు కన్నా తక్కువైతే, ఆ వస్తువు (చెక్క, పడవ, చెంబు వగైరా) నీటిలో తేలుతుంది.



లేకపోతే అది మునిగి పోతుందన్న సూత్రం అది. ఈ సూత్రం గురించి క్రితం కథలో మనం చదువుకున్నాం.




ఒక విశ్వరహస్యం కనుక్కున్న ఆనందంతో అతడు అదే పళంగా నీటి తొట్టెలోంచి లేచి, 'యురేకా! కనుక్కున్నాను' అని అరుస్తూ సిసిలీ నగర వీధులగుండా పరుగెడుతూ రాజప్రసాదాన్ని చేరుకున్నాడు. తాను కనుక్కున్న సూత్రం రాజుకి చెప్పి, ఒక కిలో... అంటే 1000 గ్రాముల **బంగారాన్ని** తెప్పించి నీటిలో తూచాడు. 950 గ్రాములు తూగింది. అదే విధంగా కిలో **వెండిని** విడిగా తూచాడు. నీటిలో అది 900 గ్రాములు తూగింది. ఆ విధంగా బంగారం తన బరువులో 5 శాతము (1/20), వెండి తన బరువులో 10 శాతము (1/10) కోల్పోతుందని తెలుసు కున్నాడు.

ఇప్పుడు కిరీటాన్ని తూచాడు. 20 కిలోల బంగారం, 10 కిలోల వెండితో చేయబడిన (చేయబడిందని చెప్పబడిన) ఆ కిరీటం 27.5 (ఇరవై ఏడున్నర) కిలోల బరువు మాత్రమే తూగింది. అప్పుడా శాస్త్రజ్ఞుడు "రాజా! ఇందులో కొంత బంగారం బదులు అంతే బరువున్న వెండి కలిపి మనల్ని మోసగించారు" అన్నాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి, "విక్రమార్కా! ఆ కిరీటంలో బంగారం ఎన్ని కిలోలు, వెండి ఎన్ని కిలోలు ఉన్నది? తెలిసీ సమాధానం చెప్పలేక పోయావో నీ పిల్లలు లెక్కల్లో విజయం సాధించలేరు సుమా!" అన్నాడు.

*(సమాధానం 174 పేజీలో)*


# 27. సగం కాలిన కొవ్వొత్తి కథ



రాజుకి మౌనభంగం కావించటం కోసం శవంలోని బేతాళుడు ఈ విధంగా ప్రశ్నించటం ప్రారంభించాడు.

"రాజా! ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పటానికి లెక్కల జ్ఞానం కన్నా తెలివి తేటలు ఎక్కువ కావాలి. లెక్కలు కాకుండా ఇంగిత జ్ఞానం ఉపయోగించి సమాధానం చెప్పు.

ఒక విద్యార్థి రెండు కొవ్వొత్తుల వెలుగులో చదువు ప్రారంభించాడు. **రెండిటి పొడవూ ఒకటే** అయినా, మొదటిదాని మందం రెండోదాని కంటే ఎక్కువ. మరోలా చెప్పాలంటే... మొదటిది ఆరుగంటలు వెలిగితే, రెండోది నాలుగు గంటలు వెలుగుతుంది. కొంచెంసేపు చదువుకున్నాక ఆ విద్యార్థి నిద్రకుపక్రమించాడు. ఆ సమయానికి మందమైన కొవ్వొత్తి, సన్నటి దానికన్నా రెట్టింపు **పొడవుగా** ఉన్నది. విద్యార్థి ఎంత సేపు చదువుకున్నాడు?




రాముడు, కృష్ణుడు అనే ఇద్దరు అశ్వికులు గుర్రప్పందెం వేసుకున్నారు. 1000 గజాల దూరం పందెం! పందెం ముగిసేసరికి రాముడు కృష్ణుడి కన్నా పదిగజాల వెనుక ఉన్నాడు. రాముడిని ప్రోత్సహించటం కోసం ఈసారి కృష్ణుడు పందెపు ప్రారంభ గీతకి పదిగజాల వెనుక నిలబడి గుర్రాన్ని పరుగెత్తించాడు. మరోవిధంగా చెప్పాలంటే అతడి గుర్రం 1010 గజాలు పరుగెత్తిందన్నమాట. మొదటిసారి ఎలా పరుగెత్తాయో గుర్రాలు అదేవేగంతో పరుగెత్తాయి. ఈసారి ఎవరు ముందు వస్తారు? రాముడా? కృష్ణుడా? ఇద్దరూ ఒకేసారా?



సుగంధి అనే గుర్రం సువర్ణపురం నుంచి గంటకు పదిక్రోసుల వేగంతో బయల్దేరింది. విశాలి అనే గుర్రం విశాఖపురం నుంచి గంటకు ఇరవై క్రోసుల వేగంతో అటు నుంచి బయల్దేరింది. ఈ రెండు గుర్రాలూ ఒకదానికి ఒకటి ఎదురుపడే సమయానికి సువర్ణపురానికి ఏ గుర్రం దగ్గర ఉంటుంది? సుగంధా? విశాలా?

వాయుపుత్ర అనే గుర్రం కాశీ నుంచి గంగానదిపై వేగంగా పరుగులు తీస్తూ సముద్రానికి చేరుకోవటానికి గంట పట్టింది. దానికి రెట్టింపు వేగంతో వెనక్కి వస్తూ, మధ్యలో పది నిమిషాలు ఆగితే, తిరిగి కాశీ రావటానికి ఎంతసేపు పడుతుంది?

నా జేబులో రెండు నోట్లు ఉన్నాయి. వాటి విలువ నూట యాభై రూపాయలు. అయితే ఒకటి యాభై రూపాయల నోటు కాదు. మొత్తం ఉన్నవి రెండే నోట్లు. ఎలా సాధ్యం?

9 × 9 = 81 అని ఒక విద్యార్థి రాశాడు. ఒక ఉపాధ్యాయుడు అది సరైనదే అన్నాడు. ఎదురుగా ఉన్న మరో ఉపాధ్యాయుడు అది సరైన సమాధానం కాదన్నాడు. ఇలా ఎందుకు జరిగింది?

సెకనుకి పదహారు సార్లకంటే ఎక్కువసార్లు కదిలించినప్పుడు గాలిలో అదొకరకమైన శబ్దాన్ని అది సృష్టిస్తుంది. కందిరీగ, తుమ్మెదల ఝుమ్మనే నాదం అలా వినపడేదే. విమానం ప్రొఫెల్లరు సెకనుకి సగటున 25 సార్లు తిరుగుతుంది. దీనిబట్టి ఊహించి చెప్పండి. తేనెటీగ, తుమ్మెద తమ రెక్కలను సెకనుకి ఎన్నిసార్లు ఆడిస్తాయి?

మనిషి సగటున గంటకు 5 కిలోమీటర్లు (5,000 మీటర్లు) నడుస్తాడు. ఆ లెక్కన నత్త, మనిషి వేగంలో ఎన్నోవంతు ప్రయాణిస్తుంది? చిన్న క్లూ తీసుకోండి. నెమ్మదిగా నడిచే జంతువుల్లో రెండోది తాబేలు. అది గంటకు 70 మీటర్లు నడుస్తుంది.

ఒక వ్యక్తి నదిపై నడుచుకుంటూ అవతలి తీరానికి వెళ్లి మంట వేసుకోవటానికి కట్టెలు కొనుక్కొని ఇంటికి తెచ్చుకున్నాడు. ఇదెలా సాధ్యం?

*(సమాధానాలు 176 పేజీలో)*

# 28. తెలివైన మూర్ఖుడు



విక్రమార్కుడికి మౌనభంగం కావించటం కోసం బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! ఎన్నిసార్లు ఓడిపోతున్నా నీవు నీ పట్టుదల వదలటం లేదు. నీ పట్టుదల చూస్తోంటే నాకొక అనుమానం వస్తూ ఉన్నది. **తెలివైనవాడు ఎక్కువ పట్టుదలతో ఉంటాడా లేక మూర్ఖుడా?** అసలు తెలివైన వాడికి, మూర్ఖుడికి ఏమిటా తేడా? భగవంతుడు లేడనే వాడికి ఉన్నాడని వాడు మూర్ఖుడు. ఉన్నాడనే నమ్మేవాడికి లేడనేవాడు మూర్ఖుడు.

'ఆ రోజుల్లో పిచ్చికుక్క కరిచిన చోట ఇనుప ఊచ కాల్చి వాత పెట్టేవారు. రోగి దారుణమైన బాధ చూడలేక లూయీ పాశ్చర్ ఆ రోజుల్లో దానికి మందు కనుక్కున్నాడు' అని చెప్తే అలా చెప్పిన వ్యక్తి చారిత్రక జ్ఞానానికి చప్పట్లు కొడతారు. అదే వ్యక్తి "చీకటంటే భయం కాబట్టి ఎడిసన్ బల్బు కనుక్కున్నాడు" అని అంటే చుట్టూ ఉన్నవారు నవ్వుతారు. అలా అన్న వ్యక్తికి కూడా చరిత్ర బాగా తెలుసని అనుకోరు.

'తాను జీవితంలో భయపడేది కేవలం చీకటికే' అని ఎడిసన్ చాలా చోట్ల చెప్పాడు. మరణ సమయంలో కూడా గదంతా వెలుతురుతో నింపమని కోరాడు. విశేషం ఏమిటంటే చీకటంటే భయం ఉన్న వారికి ఓర్పు ఎక్కువ ఉంటుంది.

ఎడిసన్ కనుక్కున్న బల్బు ఎక్కడున్నది? మొదటిరోజే దాన్ని నౌఖరు నేలపై జారవిడిచి పగలగొట్టాడు. ప్రపంచాన్ని వెలుగుతో నింపబోయే అద్భుత మానవ సృష్టి అయిన ఆ బల్బు తన చేతిలో ఉన్నదన్న ఉద్వేగం వల్ల చేతులు వణికి, దాన్ని వదిలేశాడు. ఎడిసన్ అతడిని కోప్పడకుండా, విసుక్కోకుండా రెండో బల్బు తయారు చేశాడు.

"చీకటంటే ఎడిసన్‌కి భయం" అనగానే ఎగతాళిగా నవ్విన జనం, ఈ వివరణ విని తల వంచుకుంటారు. ఇదంతా ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే మహారాజా, తనకు తెలిసినదే వేదమనుకునేవారు అజ్ఞానులు. అటువంటివారి మధ్య జ్ఞానులు పరిహసింపబడతారు. అలా ఎగతాళికి గురయిన ఒక వ్యక్తి కథ చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.



తన రాజ్యంలో అత్యంత తెలివైనవాడికి 'మేధావి రత్న' అన్న బిరుదు ఇద్దామన్న ఉద్దేశ్యంతో ఒక రాజుగారు పోటీ ఏర్పాటు చేశారు. మేధావులమను కునేవారు వందల సంఖ్యలో అందులో పాల్గొన్నా మొదటి వృత్తంలోనే దాదాపు తొంభై శాతం వెళ్లిపోయారు. అయితే అందులో పాల్గొన్న కృతవర్మ అనే యువకుడి సమాధానాలు విని సభికులు పడీ పడీ నవ్వారు.

"దూది బరువెక్కువా? నీటి బరువెక్కువా?" అన్న ప్రశ్నకి "నీటి బరువు" అన్నాడు.

"కిలో దూది బరువు ఎక్కువా? కిలో ఇనుము బరువు ఎక్కువా?" అన్న ప్రశ్నకి "చెప్పలేము. ఒక్కొక్కసారి ఒక్కొక్కటి బరువుంటుంది" అన్నాడు.

"వంద రాగి తీగెలు ఒక రథాన్ని లాగగలవు. అంతే మందం ఉన్న వెంట్రుకలు ఏమి లాగగలవు?" అని అడిగితే "రెండు రథాల్ని" అన్నాడు కృతవర్మ.

ఒక్కో సమాధానానికి సభికులు ఘొల్లుమన్నారు. న్యాయనిర్ణేతలు కూడా నవ్వాపుకుని, "ఒక వ్యక్తి పరుగెడుతున్నాడు. మధ్యలో ఆగలేదు. మరో వ్యక్తి నడుస్తున్నాడు. మధ్యలో ఆగాడు కూడా! గమ్యానికి ఎవరు ముందు చేరుకోగలరు?" అని అడిగారు.

"చెప్పలేం. ఎవరైనా చేరుకోవచ్చు" అభావంగా సమాధానం చెప్పాడు కృతవర్మ. జనంలో కొందరు ఈలలు వేశారు.



అతడిని మరింత ఏడిపించటం కోసం, "ఆఖరి ప్రశ్న. కనీసం దీనికైనా కాస్త ఆలోచించి చెప్పు. ఆకాశంలో మనిషిని మోసుకుంటూ తీసుకువెళ్ళే ఒక గాలి బుడగ తొట్టెలో ఒక వ్యక్తి జెండా పట్టుకుని ప్రయాణం చేస్తు న్నాడు. బలంగా వీస్తున్న గాలికి బుడగ వేగంగా పక్షిలాగా తూర్పునుంచి పడమరకి వెళ్తోంది. జెండా ఏ దిక్కు వైపు ఎగురుతూ ఉంటుంది?" అని అడిగారు.

"వాలిపోయి ఉంటుంది" క్లుప్తంగా సమాధానం ఇచ్చాడు కృతవర్మ. శ్రోతలు ఘొల్లున నవ్వారు. పోటీ పూర్తయిన తరువాత రాజు విజేతలని ప్రకటిస్తూ, "మన దేశంలో మేధావులతోపాటు అజ్ఞానులు కూడా ఉన్నారని తెలుస్తోంది. అటువంటి వారిలోకెల్లా ప్రథముడైన ఒక వ్యక్తికి 'మూర్ఖశిఖామణి' అని బిరుదు ఇస్తున్నాము" అంటూ కృతవర్మని వేదికపైకి పిలిచాడు. మొహంలో ఏ భావమూ లేకుండా అతడు వెళ్లి ఆ సన్మానాన్ని అందుకున్నాడు. కొందరు నొచ్చుకున్నా, చాలామంది చప్పట్లు కొట్టారు.

ఇది జరిగిన కొంత కాలానికి శీతాకాలం వచ్చింది. ఆ సమయంలో ఆ ప్రాంతపు సరిహద్దుల్లో ఉన్న నది నీరు ఘనీభవించటం మామూలే! పైన మూడు నాలుగంగుళాలు మంచుగా మారినా, అడుగున నీరు ప్రవహిస్తూ ఉంటుంది కాబట్టి ప్రజల అవసరాలకి ప్రమాదమేమీ రాదు.

అయితే ప్రమాదం మరోవైపునుంచి వచ్చింది. సైన్యంతో శత్రురాజు రాత్రికి రాత్రి వచ్చి నదికావల విడిది చేశాడు. మరుసటిరోజు పొద్దున్నే తమపై దాడి చేస్తాడని తెలిసింది. నది దాటి వస్తే తమ ప్రజలకి కష్టనష్టాలు తప్పవు. యుద్ధంగానీ నదికి ఆవలివైపు అడవిలో జరిగితే, తమదే గెలుపు అని రాజుకి తెలుసు. కానీ సైన్యాన్ని అటువైపు పంపటానికి కావలసినన్ని పడవలు లేవు. ఉన్నాకూడా, పడవలపై ప్రయాణం ప్రమాదకరం. వచ్చినవాడ్ని వచ్చినట్టే అవతలివారు నాశనం చేస్తారు. ఏమి చెయ్యాలో తోచక రాజు దిగులుతో సలహాదారులతో సంప్రదిస్తూ ఉండగా కృతవర్మ అక్కడికి ప్రవేశించి, "నదిమీద సైనికుల్ని అటు పంపండి మహారాజా!" అన్నాడు.

తలమునకలయ్యేటంత ఆశ్చర్యంతో రాజు, "ఇంత అర్ధరాత్రి ద్వారపాలకుల్ని తప్పించుకుని మందిరంలోకి ఎలా ప్రవేశించావు?" అని అడిగాడు.

"అత్యవసర పరిస్థితి కాబట్టి అనుమతి లేకుండా వచ్చాను మహారాజా! ముంత పొగలు పెట్టి కాపలా వాళ్లని చెల్లాచెదురు చేశాను. నది దాటేటప్పుడు మన సైనికులు కూడా ఇదే విధంగా గాలివాలు చూసుకుని శత్రువులపై ముంతపొగ ఉపయోగించి, ఏం జరిగిందో అవతలివారు తెలుసుకునే లోపే వారిని హతమార్చ వచ్చు."

దానికి రాజు, "అవతలివైపుకి చేరుకుంటే ఎలాగూ గెలుస్తాం. కానీ నీటిమీద నడుస్తూ మన సైనికులు అటు వెళ్లలేరు. ప్రయత్నించి చూశారు. నడుస్తూంటే మంచు



పెళ్లలు విరిగి ప్రవాహంలోకి జారిపోయారు. నదిమీద మంచు పొరదట్టంగా లేదు. నడుస్తూ వెళ్లటం కష్టం" అన్నాడు.

"నడిస్తే కష్టం. దొర్లుతూ వెళ్లితే సులభం" అన్నాడు కృతవర్మ. రాజు కోపంగా, "దేశం విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇటువంటి హాస్యాస్పద సలహాలు ఇచ్చినందుకు నిన్ను ఉరి తీయించే వాడిని. కానీ మూర్ఖుడవని వదిలి పెడుతున్నాను" అన్నాడు.

కృతవర్మ మౌనంగా అక్కడినుంచి బయటకు నడిచాడు. అరగంట తరువాత ఒక వార్త రాజుని చేరింది. ఎవరో వ్యక్తి నదిపై పాకుతూ విన్యాసాలు చేస్తున్నాడని! రాజు స్వయంగా వెళ్లి చూస్తే, అతడు కృతవర్మ. తన కళ్లని తాను నమ్మలేని రాజు తన సైనికుల్ని కూడా అదే విధంగా చెయ్యమని ఆదేశించాడు. చాలా చిత్రంగా వారు చాలా సులభంగా నదిపై పాకుతూ ముందుకి సాగారు. ఒక్క మంచుపెళ్లా విరగలేదు. ఒక్క సైనికుడూ మునిగిపోలేదు.

తెల్లవారేసరికి శత్రురాజు లొంగిపోయాడు. నిండు సభలో కృతవర్మని సత్కరిస్తూ, "ఇదంతా ఎలా సాధ్యపడిందో నాకు అర్థం కావటం లేదు. దీన్ని బట్టి చూస్తే, నీవు ముందు చెప్పిన సమాధానాలు కూడా సరి అయినవే అని తోస్తోంది. నిండు కుండ తొణకదన్న సామెత బహుశా నీలాంటి వారి వల్లనే వచ్చి ఉంటుంది. ఎంత అవమానం జరిగినా దేశం కష్టకాలంలో ఉన్నదని తెలిసి మళ్లీ వచ్చి రక్షించావు. జ్ఞానులు ఎలా ఉంటారో అనటానికి నీవే తార్కాణం." అంటూ రాజు అతనిముందు ప్రణమిల్లాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! నడిస్తే మంచు పెళ్లలు ఎందుకు విరిగాయి? పాక్కుంటూ వెళ్తే ఎందుకు విరగలేదు? నీటి కన్నా దూది ఏ విధంగా ఎక్కువ బరువు ఉంటుంది? ఇనుము, దూది బరువులు ఎప్పుడు వేర్వేరుగా ఉంటాయి? వెంట్రుకలు రథాల్ని లాగటం ఏమిటి? పరుగెత్తే వ్యక్తి కన్నా నడిచేవ్యక్తి ముందు ఎలా గమ్యం చేరుకునే వీలుంది? బెలూన్ కింద జెండా ఎందుకు వాలిపోయి ఉంటుంది? ఈ ప్రశ్నలకి తెలిసీ సమాధానం చెప్పకపోయావో నీ తల వేయి వక్కలవుతుంది సుమా" అన్నాడు.

*(సమాధానాలు 177 పేజీలో)*

# 29. ఎవరు హరిశ్చంద్రుడు?



"రాజా! ఒక పురాతన కథ చెపుతాను విను. ఒక సముద్రపు ఒడ్డున ఓ చెట్టుపై చిన్నపిచ్చుక గూడు కట్టుకుని ఉంటుంది. దాని గూడు చెట్టుమీద నుండి జారి సముద్రంలో పడిపోతుంది. ఆడపిచ్చుక దుఃఖిస్తూ ఉండగా, మగపిచ్చుక తన రెండురెక్కలతో సముద్రాన్ని పక్కకి తోడి గుడ్డుని తిరిగి తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. సముద్రునికి ఈ వ్యవహారం చాలా నవ్వు తెప్పిస్తుంది. అఖాతమైన నీటిలో లీనమైన ఒక గుడ్డును ఓ చిన్నపిచ్చుక రెక్కల్తో నీరు పక్కకి జరిపి తీసుకోవాలను కోవడం!

కానీ పిచుక తన ప్రయత్నం మానదు. మిట్టమధ్యాహ్నంవరకూ అలా నీటిని ఒడ్డువైపుకు తోస్తూనే వుంటుంది. మధ్యాహ్నం అయ్యేసరికి కెరటాలు మరింతపెద్దవి అవుతాయి. రెక్కలు పూర్తిగా తడిసిపోయాయి. బరువెక్కి పిచుక బలహీనమైపోతుంది. దాన్ని మరింత ఏడిపించటం కోసం సముద్రుడు మరింత పైకి లేస్తూ వుంటాడు. ఈ విధంగా పిల్లికి చెలగాటం, ఎలుక్కి ప్రాణసంకటం పద్ధతిలో జరుగుతూ పిచుక స్పృహతప్పి ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుంది.

అప్పుడు ఆకాశంలో పయనిస్తున్న గరుత్మంతుడు ఈ పిచుకని చూస్తాడు. దివ్యదృష్టితో జరిగినదంతా తెలుసుకుంటాడు. సముద్రుడి ఆకతాయితనానికి అమితమైన కోపం వస్తుంది. తన రెండురెక్కల్ని సముద్రంపై విశాలంగా సాచి, ఒక్కసారి బలంగా కదుపుతాడు. ఆ ప్రళయకాల ఝంఝూమారుతానికి సముద్రం రెండుగా చీలిపోయి, మధ్యలో గుడ్డు మిలమిలా కనబడుతుంది. పిచుక ఆనందంగా దాన్ని తీసుకుని తన గూడు చేరుకుంటుంది.


ఈ కథలో రెండు నీతులు ఉన్నాయి. **ఒకటి:** ప్రయత్నం మానకు. ఎంత కష్టమొచ్చినా నీ ప్రయత్నం నీవు చేస్తూవుంటే నీకు ఫలితం దక్కుతుంది. **రెండు :** నీ శక్తిని ఎక్కువ అంచనా వేసుకుని కొండను ఢీ కొనకు.

ఒకదానికొకటి పరస్పర విరుద్ధమే అయినా ఈ రెండు నీతులూ మానవుల సుఖమయ జీవితానికి ఎంతో ఉపయుక్తమైనవి. కేవలం నమ్మికేకాదు. చర్యకూడా కావాలి. 'నేను పరీక్ష పాసైతే తిరుపతి వస్తాను' అని మొక్కుకుని, చదవటం పూర్తిగా మానేస్తే భగవంతుడు పరీక్షలో సఫలీకృతం చెయ్యడు. భగవద్గీతలో కృష్ణుడు అదే చెప్పాడు. 'కర్మణ్యే వాధి కారస్తే మా ఫలేషు కదాచన...' అన్నాడు. కర్మ నీది, ఫలితంపై ఆశ, ఆపేక్ష వదులు.



భూమి దున్నటం ఆనందం. మొలక పచ్చగా భూమిని చీల్చుకుని రావడం ఆనందం. పైరు ఏపుగా ఎదగడం ఆనందం. పైరు కోయటం ఆనందం. అంతా ఆనందమే! చివరికి "ధాన్యం అమ్మటం" లాభం. కేవలం ధాన్యం అమ్మటం కోసమే మిగతా పనులన్నీ ఏడుస్తూ చేస్తే జీవితమంతా దుఃఖమే అవుతుంది. చేస్తున్న పనిలో ఆనందం పొందడమే జీవితం. అదే కర్తవ్యం. దాన్నే సచ్చిదానందం అన్నారు. సత్-చిత్-ఆనందం. ఈ సచ్చిదానందాన్ని పొందడానికి నిరంతర జపతప హోమాదులు, మడిబట్టలు, తడిగుడ్డలు అవసరం లేదు. చేసే పని ఏదైనా దాన్ని ఏకాగ్రతతో ఇష్టంగా చేయడం, దానిలో అంతర్లీనంగా దాగివున్న ఆనందాన్ని పరిపూర్ణంగా వెలికితీసి అనుభవించడమే జీవితం. 'ఇందులో ఆనందం ఏముందిలే...' అనుకుంటూ పనిచేస్తే, ఎంతటి పనిలోనూ ఆనందం కనబడదు. 'ఇందులో ఇంత ఆనందం ఉందా...?!' అని లోతుగా ఆలోచిస్తే... బియ్యం కడిగి పొయ్యిమీద పెడితే ఆవిర్లు కక్కుతూ తయారయ్యే అన్నంలోనూ మహదానందం కనబడుతుంది.

❖ ❖ ❖




సదా సత్యం చెప్పే కుటుంబం నుంచి ఒకరు, సదా అసత్యం చెప్పే కుటుంబానికి సంబంధించిన మరొకరు కలుసుకున్నారు. దీని ఆధారంగా ఈ నాలుగు ప్రశ్నలకి సమాధానం చెప్పాలి.

1. "మేమిద్దరం సదా అబద్ధాలు చెప్పే కుటుంబం నుంచి వచ్చాము" అన్నాడు అభిరాముడు. ఈ ఒక్క వాక్యం ఆధారంగా సోముడు ఏ కుటుంబం నుంచి వచ్చాడో కనుక్కోవాలి.
2. మిమ్మల్ని భీముడు, విభీషణుడు కలుసుకున్నారు. "మా ఇద్దరిలో ఒకరు అబద్ధాలు చెప్పే కుటుంబం నుంచి వచ్చారు" అన్నాడు విభీషణుడు. భీముడు, విభీషణుడు ఏ కుటుంబాల నుంచి వచ్చారు?

3. భీష్ముడు, రావణుడు మిమ్మల్ని కలిసినప్పుడు, "మేమిద్దరం సత్యం చెప్పే కుటుంబం నుంచి రాలేదు" అన్నాడు భీష్ముడు. ఎవరెవరు ఏయే కుటుంబాల నుంచి వచ్చారు.
4. కృష్ణుడు, సుగ్రీవుడు ఈ రకమైన వ్యాఖ్యలు చేశారు. "మేమిద్దరం చెరో కుటుంబం నుంచి వచ్చాము" అన్నాడు కృష్ణుడు. "అది నిజం కాదు" అన్నాడు సుగ్రీవుడు. ఎవరెవరు ఏ కుటుంబం నుంచి వచ్చారు?"

రాజా! నిజానికి ఇవన్నీ చాలా సులభమైన ప్రశ్నలు. ఇప్పుడు ఒక కష్టమైన ప్రశ్న చెపుతాను విను. ఇది చాలా కష్టమైనది సుమా.

5. అసత్యసంధుడు వారానికి ఒకరోజే నిజం చెపుతాడు. "నేను సోమ, మంగళవారాల్లో అబద్ధం చెపుతాను" అన్నాడొకరోజు. ఆ మరుసటి రోజు "ఈ రోజు గురు, శని, ఆదివారాల్లో ఒకటి..." అన్నాడు. ఆ మరుసటిరోజు "బుధ, శుక్రవారాలు నేను అబద్ధం చెప్పే ఆర్రోజుల్లో రెండు" అన్నాడు. ఇంతకీ అతడు నిజం చెప్పే రోజు ఏది?

ఇక గణితానికి సంబంధించిన లెక్కలు విను. **ఈ క్రింది ప్రశ్నలకి సమాధానాలు అన్నీ రెండంకెలుగల సంఖ్యలే!** ఇది ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలి.

**మొదటి ప్రశ్న :** 10 అన్న అంకెని కాగితం మీద రాసి తలకిందులుగా తిప్పి చూస్తే 01 గా కనిపిస్తుంది. రెంటికీ తేడా 9. ఆ విధంగా 42 తేడా రావాలంటే ఏ సంఖ్య రాసి చూడాలి?

**రెండో ప్రశ్న :** తేడా 21 రావాలంటే ఏ సంఖ్య రాయాలి?

**మూడో ప్రశ్న :** 18కి రెట్టింపు 36 కదా! 18లో సగం 9. ప్రశ్న జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. 18 యొక్క రెట్టింపు దానిలో సగం కన్నా 27 ఎక్కువ. ఈ ఉదాహరణ ఆధారంగా చెప్పు విక్రమార్కా! ఏ సంఖ్య రెట్టింపు దానిలో సగం కన్నా 76.5 ఎక్కువ?

**నాలుగో ప్రశ్న :** 12 అన్న సంఖ్యలో అంకెల మొత్తం 3. అది ఆ సంఖ్యలో నాలుగో వంతు. ఈ ఉదాహరణ ఆధారంగా ఏ సంఖ్యలోని అంకెల మొత్తం ఆ సంఖ్యలో 6వ వంతు.


**అయిదో ప్రశ్న :** అయిదుని దేనితో హెచ్చవేసినా, కలిపినా ఒకే సమాధానం వస్తుంది ?

*(సమాధానం 179 పేజీలో)*

# 30. పదకొండు చావు ప్రశ్నలు



1. సినిమా ఇంకో అయిదు నిమిషాల్లో ముగుస్తుందనగా భర్త తన భార్యని హత్యచేసి, మూడో కంటికి • తెలియకుండా, మిగతా ప్రేక్షకులకి అనుమానం రాకుండా శవాన్ని ఇంటిలోకి తీసుకొచ్చాడు. ఎలా?
2. ఇరవై అంతస్తుల భవనంలో పైనుంచి కిందపడి కూడా పదినెలల పాప బతికింది. ఎలా?
3. చనిపోయిన పిల్లికి వెంట్రుకలు ఎటువైపు ఉంటాయి?
4. ఒక పరీక్షలో, "ఇది ఏ ఎముక?" అని అడిగాడు పరీక్షాధికారి. దాన్ని పరిశీలించి, "ఇది మనిషి తొడ ఎముక" అన్నాడు వైద్య విద్యార్థి. "ఇవి నీ దగ్గర ఎన్ని ఉన్నాయి?" అని తిరిగి అడిగాడు. రెండని చెప్పిన ఆ కుర్రవాడిని ఉత్తీర్ణుడిని చేశాడు. మరో విద్యార్థి "మూడు" అన్నాడు. తరువాత ఒకమ్మాయి "నాలుగు" అనీ, మరో విద్యార్థిని "అయిదు" అనీ చెప్పారు. మరొక అమ్మాయి "7" అంది. వారందరూ తనని ఏడిపిస్తున్నారు అని కోపించి అధికారి వారందర్నీ తప్పించాడు. న్యాయస్థానంలో వారు వాదించి, గెలిచి ఉత్తీర్ణులయ్యారు. ఎలా?
5. శ్మశానంలో తవ్వుతూండగా ఒక శవం బయటపడింది. అస్థిపంజరం మెడలో



క్రీ.పూ. 610-570 అని రాసి ఉన్న రాగిరేకు దొరికింది. తమని మూర్ఖుల్ని చేయటానికి ఎవరో చేసిన ఆకతాయి పని అని వారనుకున్నారు. ఎలా?

6. ఒకామె ఆఫీసు నుంచి ఇంటికొచ్చి, పడగ్గదిలో అచేతనంగా వేలాడుతున్న భర్తని చూసి ఏడుస్తూ డాక్టర్‌కి ఫోన్ చేసింది. డాక్టర్ వచ్చాక, **అతడితో కలిసి** ఆరోజు రెండో ఆట సినిమాకి వెళ్లింది. ఇంతకీ ఏం జరిగింది?


**7.** నిర్మానుష్యమైన ఎడారిలో పంచరైన టైరుతో ఆరుగంటలు జీపులో ప్రయాణం చేసి, అక్కడ నీళ్లు దొరక్క ఒక ప్రయాణీకుడు చనిపోయే పరిస్థితి ఏర్పడింది. పంచరైన టైరుతో అన్ని గంటలు ఇసుక బాటలో ప్రయాణం ఎలా సాధ్యం?

**8.** ఎడారిలో కారు ప్రయాణం గురించి మరో ప్రశ్న. ఒకామె కార్లో ఆరుగంటలు ప్రయాణం చేశాక నిర్మానుష్యమైన ఎడారి మధ్యలో టైరు పంచరైంది. స్పేరు టైరు బిగిస్తూ ఉండగా దాని బోల్టులు, విప్పిన టైరు బోల్టులూ **మొత్తం ఎనిమిదీ** ఎడారి పాము పుట్టలోకి జారిపోయాయి. పుట్ట తవ్వితే ప్రమాదం. ఆమె కారు బాగుచేసుకుని, ఎవరి సహాయమూ లేకుండా ప్రయాణం సాగించింది. ఎలా?

**9.** వంద అడుగుల ఎత్తు ఉన్న నిచ్చెన మీద నుంచి బలమైన గట్టి కాంక్రీటు నేలపై పడి కూడా అతడు చావకుండా, గాయాల్లేకుండా బయటపడ్డాడు. ఎలా?

**10.** "రాత్రి చనిపోయింది బాలుడు కాదు" అన్నాడు ఒకడు. "వృద్ధుడు గానీ, వృద్ధురాలు గానీ అయి ఉంటుంది" అన్నాడు మరొకడు. "నిశ్చయంగా వృద్ధుడే" అన్నాడు మూడోవాడు. ముగ్గురిలో కనీసం ఒకరు నిజమూ, ఒకరు అబద్ధమూ చెపుతున్నారు. చనిపోయిందెవరు?

**11.** మీరు చీకట్లో వెళ్తూ వుండగా, ఇద్దరు వ్యక్తులు మిమ్మల్ని బంధించి ఒక గదిలో పడేసారు. ఆ గదిలో ఒక సింహం వున్నది. దాని దగ్గిర ఒక అగ్గిపెట్టె వున్నది. అందులో 11 పుల్లలు తీసి, ఈ క్రింది విధంగా ఏర్పాటు చేసి, మధ్యలో స్టిక్కర్ అంటించింది. ఒక కుక్క బొమ్మ తయారైంది.



ఆశ్చర్యంగా చూస్తున్న మీతో సింహం ఈ విధంగా అన్నది. "కేవలం రెండు పుల్లల్నీ, స్టిక్కర్నీ మార్చే అవకాశం నీకు ఇస్తున్నాను. కుక్క వెనక్కి తిరిగి చూస్తున్నట్టు బొమ్మ మార్చగలిగితే నిన్ను తినకుండా వదిలేస్తాను" అంది. ఎలా సాధిస్తారు?

(సమాధానాలు 181 పేజీలో)

# 31. సూర్యుడస్తమించని రాత్రి



పట్టువదలని విక్రమార్కుడు శవాన్ని భుజాన వేసుకోగానే అతడికి మౌనభంగం కావించటానికి శవంలోని బేతాళుడు ఈ విధంగా చెప్పాడు. "రాజా! నీలో నాకు నచ్చే మరో గుణం ఏమిటంటే ఎంత సులభమైన ప్రశ్నకైనా వెంటనే సమాధానం చెప్పవు. అడిగినదానికి వెంటనే జవాబు చెప్పటం మంచిదే అయినా, తప్పు చెప్పకూడదు కదా! అందుకే పరీక్ష సమయంలో మొదటి రెండు నిమిషాలూ పిల్లల్ని మౌనంగా కనులు మూసుకుని ప్రార్థన చేసి, తరువాత జవాబులు రాయటం ప్రారంభించమనేది!

ద్వంద్వ యుద్ధంలో గానీ కరాటే ముందు గానీ యోధులు ఏ విధంగా ఊపిరి బిగించి వదుల్తూ ఉద్వేగరహిత స్థితిలోకి వెళ్తారో, ఉద్యోగం కోసం వెళ్లే అభ్యర్థులు కూడా ఆగి ఆగి ఆలోచించి, నవ్వుతూ సమాధానం చెప్పాలి. చిరునవ్వు వలన ఉద్వేగం తగ్గుతుంది. ఆగి ఆగి నెమ్మదిగా సమాధానం చెప్పటం వలన అవతలి వారి ప్రశ్నలో 'మెలిక' అర్థం చేసుకునే సమయం చిక్కుతుంది. "నీకు వివాహం జరగలేదా లేక నీవింకా అవివాహితుడివేనా?" అన్న ప్రశ్నకి తడుముకోకుండా సమాధానం చెప్పే విద్యార్థి తనకింకా వివాహం జరగలేదంటాడు. ప్రశ్నలో అర్థాలు రెండూ ఒకటే అని గుర్తించ గలగాలి. రాజా! అటువంటి చాలా చిన్న చిన్న ప్రశ్నలు అడుగుతాను. సమాధానం చెప్పు అన్నాడు. విక్రమార్కుడు నిశ్శబ్దంగా వింటూ నడుస్తూ ఉండగా బేతాళుడు ఈ విధంగా ప్రశ్నించాడు:

1. ఒక పక్షి మామిడికొమ్మపై, ఒక పండు పక్కన కూర్చుని ఉన్నది. నీవల్ల ఆ పక్షి బెదిరిపోయి, ఎగిరిపోకుండా నువ్వు **అదే పండు** కోసుకోవాలంటే ఏం చెయ్యాలి?
2. ఒక బత్తాయి, ఒక ఆపిల్ ఖరీదు రెండు రూపాయలైతే, రెండు బత్తాయిలు, మూడు ఆపిల్ పళ్ల ఖరీదెంతో క్షణంలో చెప్పగలవా?
3. పరుగు పందెంలో రెండో స్థానంలో పరుగెత్తుతున్న వ్యక్తిని దాటుకుని నీవు ముందుకి వెళ్తే ఏ స్థానంలో ఉంటావు? అదే విధంగా ఆఖరిస్థానంలో పరుగెడుతున్న వ్యక్తిని దాటితే, వెనుక నుంచి ఎన్నో స్థానంలో ఉంటావు?

4. ఒక కుక్క పది అడుగుల పొడవున్న తాడుతో కట్టేసి ఉన్నది. దానికి ఇరవై అడుగుల దూరంలో ఉన్న ఎముకని అది పట్టుకోగలిగింది. ఎలా?

5. పది గారెల్ని ఒక తాడుకి గుచ్చి ముడి వేశారు. తాడు తెంపకుండా, గారెని తుంపకుండా, నోటితో పట్టుకుని విరవకుండా చేత్తో తీసుకుని తినటం ఎలా?

6. ఇక ఆఖరి ప్రశ్న. ఎడమచేతితో పట్టుకోగలవు గానీ, కుడిచేత్తో పట్టుకోలేనిది ఏమిటో కనీసం ఒకటి చెప్పు!

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

1. నీ వల్ల పక్షి బెదిరిపోయి ఎగిరిపోకుండా ఉండాలంటే, పండు కోసుకోవటం కోసం పక్షి అక్కణ్నుంచి ఎగిరిపోయేవరకూ నీవు ఆగాలి.

2. బత్తాయి, ఆపిల్ పళ్లు తాలుకు వేర్వేరు ఖరీదులు తెలియకుండా వాటి మొత్తం ధర క్షణంలో కాదు కదా- గంటలో చెప్పటం కూడా అసాధ్యం.

3. పరుగు పందెంలో రెండో వ్యక్తిని దాటి ముందుకెళ్తే నేను రెండో స్థానంలో ఉంటాను. చివరి వ్యక్తిని దాటి ముందుకెళ్లటం అన్నది చొప్పదంటు ప్రశ్న. చివరివ్యక్తి వెనుక ఎవరూ ఉండరు.

4. కుక్క మెడకి ఒకవైపు తాడు కట్టినా, రెండో చివర ఆ తాడుని ఏ స్తంభానికీ కట్టకపోతే కుక్క ఎంత దూరంలో ఉన్న ఎముకనైనా సులభంగా పట్టుకోగలుగుతుంది. అంతేకాదు. ఒకవేళ స్థంభానికి ఎముక ఒకవైపు కుక్క మరోవైపు వుంటే అది 20 అడుగులు ఇటు వచ్చి అందుకోగలదు. వ్యాసార్థం 10 అడుగులు అయితే, వ్యాసం 20 అడుగులు కదా.

5. గారెని తుంపకుండా, తాడుని తెంపకుండా తినాలంటే **తాడుకి వేసిన ముడి విప్పాలంతే!**

6. ఇక ఆఖరి ప్రశ్న! కుడిచేతితో నీవు కుడి చేతిని కానీ, కుడిచేతి చిటికెన వేలుని గానీ పట్టుకోలేవు.

రాజుకీ విధంగా మౌనభంగం కాగానే శవంతోసహా బేతాళుడు తిరిగి వెళ్లి ఎక్కబోతూ ఉండగా విక్రమార్కుడు "నేను నిన్ను తీసుకెళ్లటానికి మళ్లీ తిరిగి వస్తానని నీకు తెలుసు. ఈ లోపులో రెండు ప్రశ్నలకు జవాబులు ఆలోచించి ఉంచు" అంటూ ఈ విధంగా ప్రశ్నించాడు.

"డిసెంబరు 31 అర్థరాత్రి కొత్త సంవత్సరపు వేడుకలు పూర్తి అయిన వెంటనే, రాత్రి ఒంటిగంటకి తన వూరికి బయల్దేరాడు ఒక వ్యక్తి. దక్షిణ



ప్రాంతంలో మంచు పర్వతాల మధ్య ఊరు అది. తన ఊరు వెళ్లటానికి రెండుగంటలు ప్రయాణం. మంచు కొండలు కాబట్టి మధ్యలో ఇంకే ఊళ్లు గానీ, జనసంచారం గానీ ఉండదు. అటువంటి సమయంలో కారు బ్యాటరీ అయిపోయి అది ఆగిపోయింది. లైట్లు లేవు. కనీసం చంద్రకాంతి కూడా లేదు. ఎముకలు కొరికేసే చలిగాలి. అరిచినా



ఎవరికీ వినపడదు. దగ్గర లైటు లేదు. ఆ మాటకొస్తే చుట్టుపక్కల ఎక్కడా లైటు లేదు. మరో గంట అక్కడ ఉంటే చలికి ప్రాణం పోతుంది. అటువంటి స్థితిలో అతడు దూరంగా కొండమీద ఒక ఇంటిని చూశాడు. అందులో లైటు వెలగటం లేదు గానీ తలుపు తీసే ఉంది. అతడికి అది ఎలా కనపడింది?"

క్షణం ఆగి రెండో ప్రశ్న వేశాడు. "నిర్మానుష్యమైన వీధిగుండా అతడు నడుస్తున్నాడు. ఇళ్లలోను, వీధిలోను ఎక్కడా ఒక్క దీపం వెలగటం లేదు. అతడు నల్లటి దుస్తుల్లో ఉన్నాడు. చేతిలో ఏ లైటూ లేదు. ఎదురుగా మలుపు తిరిగి వస్తూన్న కారుకి కూడా లైట్లు లేవు. గాలికన్నా వేగంగా దూసుకొస్తూ మలుపు తిరిగిన కారు, వీధి మధ్యలో నడుస్తున్న అతడిని ఢీ కొట్టబోయి – వెంట్రుక వాసి దూరంలో ఆగింది. కారు నడిపే వ్యక్తికి అతనెలా కనపడ్డాడు?"

## తిక్క ప్రశ్న

నలుగురు వ్యక్తులకి తమ జీతాల మొత్తం తెలుసుకోవాలన్న కోరిక కలిగింది. కేవలం "మొత్తమే" కావాలి. ఒకరి వివరాలు మరొకరికి గానీ, అయిదో వ్యక్తికి గానీ తెలియ కూడదు. ఎలా? చేతివ్రాతలు మార్చి వ్రాయటం లాంటిది కూడదు.

*(సమాధానాలు 183 పేజీలో)*

# 32. ఎవరు దొంగ



మరుసటి రోజు విక్రమార్కుడు శవంకోసం అర్ధరాత్రి చెట్టువద్దకు వెళ్తూ ఉండగా, ఎదురుగా ఇద్దరు వ్యక్తులు చీకట్లో పరుగెత్తుకు రావటం కనిపించింది. రాజ సైనికులు వారిని వెంటాడుతూ వస్తున్నారు. విక్రమార్కుడు కత్తి దూసి "ఆగండి. పారిపోవటానికి ప్రయత్నిస్తే ప్రాణాలు తీస్తాను" అన్నాడు.

వారు ఈ హఠాత్పరిణామానికి గజగజ వణుకుతూ నిలబడిపోయారు. ఈలోపు రాజభటులు అక్కడికి చేరుకున్నారు. విక్రమార్కుణ్ని చూసి అభివందనం చేసి, "రాజా! వీరు పురవీధుల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటాడాం. అంతకుముందే అక్కడొక దొంగతనం జరిగింది. వీరిద్దరిలో **నిశ్చయంగా ఒకరే దొంగ** అని తెలిసింది" అన్నారు.

"మీ పేర్లు?" అడిగాడు విక్రమార్కుడు.

"నా పేరు రాముడు. ఇతడి పేరు సోముడు. రాజా! నేను నిర్దోషిని" అన్నాడు మొదటివాడు.

**1.** "మా ఇద్దరిలో ఒకరు మాత్రమే నిజం చెబుతున్నారు మహారాజా! ఇంతకన్నా ఎక్కువ ప్రశ్నించకండి" అన్నాడు సోముడు ఖడ్గం మీద ప్రమాణం చేసి. రాజు ఒక్క క్షణం ఆలోచించాడు. సైనికులు అతడేం చెపుతాడా అన్నట్టు ఉత్సుకతగా చూస్తున్నారు. సమాధానం దొరికినట్టు తలూపుతూ "ఏమి దొంగతనం జరిగింది?" అని అడిగాడు విక్రమార్కుడు.



**2.** "చేప" అన్నాడు రాముడు వినయంగా. "చాలా చిన్న చేప మహారాజా! దాని బరువు కూడా ఎక్కువేమీ కాదు. రెండు శేర్లు మరియు చేప బరువులో సగం."

**3.** "పొడవు కూడా ఎక్కువలేదు. మొత్తం రెండు అడుగులు. ఆ రకం చేపల్లో మధ్యభాగం తక్కువుంటుంది. తలని, తోకని తినలేం కదా. ఆ చేప తాలూకు తల,



తోక ఒకే పొడవులో ఉన్నాయి. తల పొడవును రెట్టింపు చేసి తోక పొడవుతో కలిపితే, మధ్యభాగపు పొడవుతో సమానమవుతుంది. మధ్యభాగం అంతే ఉన్నది" అన్నాడు సోముడు వినయంగా.

"మీరు దొంగతనం చెయ్యకపోతే చేప పొడవు, బరువు ఎలా తెలిశాయి? అని ప్రశ్నించను. మీరిద్దరూ నిర్దోషులా? ఇద్దరూ దొంగలా? ఇద్దరిలో ఒకరు దొంగా? అన్న విషయం మీ మొదటి వాక్యాల్లోనే తెలిసిపోయింది. మీరిద్దరూ తెలివైనవారిలా కనపడుతున్నారు. మీరు ఈ ఆఖరి ప్రశ్నకి జవాబు సరిగ్గా కనుక్కోగలిగితే, నా ఆస్థానంలోనే నెలవు కలిపిస్తాను. అప్పుడిక అర్ధరాత్రులు ఇలా అడవుల్లో పరుగెత్తే అవసరం రాదు" అన్నాడు విక్రమార్కుడు.

"మేం నిర్దోషులం మహారాజా!" అన్నారు ఇద్దరూ ముక్తకంఠంతో.

"నాకంతా తెలుసని ముందే చెప్పాను కదా! నా తెలివితేటలు మీరు పరీక్షించారు. ఇప్పుడు నా పరీక్షకి నిలబడి సమాధానాలు చెప్పగలిగితే, మిమ్మల్ని క్షమిస్తాను" అంటూ ఇదంతా చూస్తున్న ముగ్గురు సైనికుల్ని పిలిచి చూపించి, పరిచయం చేస్తూ, "వీరి పేర్లు వరుసగా కదలడు, నవ్వడు, పలకడు" అంటూ వారివైపు తిరిగి, "ఈ అనుమానితుల్ని మీలో మొదట చూసిందెవరు?" అని అడిగాడు.

'నేనే'నన్నాడు కదలడు. 'నేనే' అన్నాడు నవ్వడు. మూడో సైనికుడైన పలకడు మాత్రం "అనుమానితుల్ని ముందు చూసింది 'నవ్వడు' మహారాజా!" అన్నాడు.

**4.** విక్రమార్కుడు దొంగలయిన రాముడు, సోముడివైపు తిరిగి, "ఆ ముగ్గురిలో ఒక్కరే నిజం చెపుతున్నారు. అదెవరో సరిగ్గా చెపితే క్షమించి వదిలేస్తాను" అన్నాడు. వారు కొంచెంసేపు ఆలోచించి సరైన సమాధానం చెప్పగలిగారు.

అప్పుడు తీర్పు చెపుతూ "చేపని దొంగిలించటం చిన్న నేరమే. కానీ నేరం నేరమే కదా! దానికి మీలో దోషిని లేదా దోషుల్ని శిక్షించాలి. కానీ మొదటి తప్పిదం కింద, మీరు మీ తెలివితేటలు నిరూపించుకున్నారు కాబట్టి వదిలేస్తున్నాను" అన్నాడు విక్రమార్కుడు.

సైనికులు వారిని తీసుకువెళ్లగానే బేతాళుడు రాజు భుజమీద ప్రత్యక్షమయ్యాడు. "రాజా! రాముడు, సోముడు ఇద్దరూ దొంగలా లేక వారిలో దొంగ ఒకరేనా? వారిని ముందు చూసిన సైనికుడెవరు? చేప బరువెంత? మధ్యభాగపు పొడవెంత? ఈ నాలుగూ నీవెలా కనుక్కున్నావు? వివరించి నా అనుమానం తీర్చు" అన్నాడు. దానికి సమాధానం విక్రమార్కుడు ఇలా చెప్పాడు.

*(సమాధానాలు 184 పేజీలో)*

# బేతాళ ప్రశ్నలు

విద్యార్థుల్లో మేధాశక్తినీ, లెక్కలపట్ల ఉత్సాహాన్నీ పెంచే పజిల్స్




అయిదంకెల జీతం కోసం ఇంటర్వ్యూల్లో
అడిగే ప్రశ్నలు - సమాధానాలు

యండమూరి వీరేంద్రనాథ్

# 33. నిప్పులపై నీటికాళ్లు



విసుగు చెందని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగివెళ్లి శవాన్ని భుజాన వేసుకుని మౌనంగా నడవసాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నీ పట్టుదల చూస్తోంటే ముచ్చటేస్తోంది. నీకు పిల్లలున్నారో లేదో తెలియదు. ఉంటే మాత్రం వారు చాలా అదృష్టవంతులవుతారు. వారిని జీవితంలో పైకి తీసుకురావటానికి ఇంతే పట్టుదలతో కృషి చేసి ఉండేవాడివి కదా! రాజా నీకొక విషయం తెలుసా? ఏడుపు ద్వారా తమకి కావలసినవి సాధించుకునే 'వ్యతిరేక తెలివి'ని పిల్లలకి పెద్దలే నేర్పుతారు. తన కిష్టంలేని కూర తల్లి వండినప్పుడు పిల్లవాడు గట్టిగా స్వరం పెంచి ఏడుస్తూ పళ్లెం తోసేస్తాడు. ధడేలున పడి అది శబ్దం చేస్తుంది. ముందు గదిలో పత్రిక చదువుకుంటున్న భర్త పిల్లవాడికి కావలసిందేదో పెట్టమని, విసిగించవద్దని అంటాడు. **ఇంట్లో తనపని ఎలా సానుకూలపర్చుకోవాలో పిల్లవాడికి ఆ విధంగా అర్థం అవుతుంది.**

దుకాణంలో తనకి కావలసినది తండ్రి కొననని కసిరినప్పుడు తల్లి దగ్గర మారాం చేస్తాడు. అందరూ తమనే చూస్తుండటంతో ఇబ్బంది పడ్డ ఇల్లాలు భర్తపై ఒత్తిడి తీసుకువస్తుంది. **బయట తన పని ఎలా సానుకూల పర్చుకోవాలో పిల్లవాడికి ఆ విధంగా అర్థం అవుతుంది.**

వ్యతిరేక తెలివిని సులభ భాషలో 'అల్లరి' అంటారు. రాజా! ఏ ఇంట్లో పిల్లల పెంపకం విషయంలో తల్లి, తండ్రి ఒకే మాటపై క్రమశిక్షణతో ఉంటూ ప్రేమకి, గారాబానికి తేడా తెలుసుకుని పెంచుతారో ఆ పిల్లల భవిష్యత్తు దాని బంగారు బాట అవుతుంది.

బోధనకి ప్రత్యేక సమయమంటూ ఉండదు. పిల్లల్ని కూర్చోబెట్టి జ్ఞానాన్ని బోధించనవసరం లేదు. ప్రయాణాల్లోను, పెళ్లిళ్లలోను కూడా ఉదాహరణలు చూపిస్తూ పిల్లల్ని జ్ఞానవంతుల్ని చెయ్యవచ్చు. వాహనం వేగంగా వెళ్తూ అకస్మాత్తుగా ఆగితే అందులో ప్రయాణికుడు ముందుకు ఎందుకు తూలతాడో, సాంకేతిక విద్యనభ్యసిస్తున్న పద్దెనిమిదేళ్ల యువకుడు చెప్పలేకపోతే ఆ పరిస్థితి ఎంత దయనీయం!




"25 శాతాన్ని 1/4 గానూ, 50 శాతాన్ని 1/2 గానూ చెప్పవచ్చు. 58 1/3 శాతాన్ని ఏ విధంగా చూపిస్తావు?" అన్న ప్రశ్నకి 7/12 అని చెప్పటానికి విద్యార్థికి ఎన్నో తరగతి జ్ఞానం కావాలి? ఇవన్నీ చెప్పాలన్న ఉత్సాహం పెద్దలకుంటే ప్రయాణాల్లోను, పెళ్ళిళ్ళలోనే కాదు వంటింట్లో కూడా విజ్ఞానాన్ని పంచుకోవచ్చు. రాజా! దీనికి ఒక ఉదాహరణ చెపుతాను విను.

ఆ రోజు వంట పని తమదని ఒక తండ్రి, కొడుకు వంటింటిలో చేరారు. ఇల్లాలు నవ్వుతూ చూస్తోంది. పెనానికి దోశెలు అతుక్కుపోతున్నాయి. వెడల్పుగా, పలుచగా రావటం లేదు. అట్లపెనం మీద కాస్త నీళ్లు చల్లబోయాడు భర్త. పెనం పాడైపోతుందని వారించి, ఉల్లిపాయ రాయమంది భార్య. అలా ఎందుకు చెయ్యాలో పిల్లవాడికి అర్థం కాలేదు. అట్టు వేసేముందు ఉల్లిపాయతో పెనాన్ని ఎందుకు తుడుస్తారో కొడుక్కి, సాంకేతికంగా వివరించి చెప్పాడు తండ్రి.

"పెనం వేడిగా ఉంటే, పిండి వేయగానే అందులోని నీరు క్షణాల్లో ఆవిరై, గరిటెతో పల్చగా తిప్పేవరకూ ఉండకుండా ఘనపదార్థంగా మారిపోతుంది. ఉల్లిలో ఉండే నీరు పెనాన్ని తాత్కాలికంగా చల్లబరుస్తుంది. కాబట్టి గరిటెతో పిండిని వెడల్పు చేసేవరకూ అట్టు దానికి అతుక్కోదు" అని వివరించాడు.

ఈలోపులో నీటిలో ఉడకబెట్టిన కోడిగుడ్లు పక్కానికి వచ్చాయి. మరోవైపు అప్పుడే కరెంటు కూడా వచ్చి టీవీ పెద్ద శబ్దంతో తిరిగి ప్రారంభమైంది. దాన్ని తగ్గించటానికి వెళ్లిన భార్య, అందులో వస్తున్న దృశ్యాల్ని చూసి ఉద్వేగంగా భర్తని, కొడుకుని పిల్చింది.



భగవంతుడిని స్మరిస్తూ, గట్టిగా కేకలు పెట్టుకుంటూ, నృత్యం చేస్తూ నిప్పులమీద ఇటు నుంచి అటు నడుచుకుంటూ వెళ్తున్నారు భక్తులు. చాలా ఆశ్చర్యంగా

అద్భుతంగా వున్నది ఆ దృశ్యం. వారి కాళ్లు అసలు కాలటం లేదు. "మన అబ్బాయి మంచి మార్కులతో ప్రథముడిగా వస్తే, ఆ నిప్పులమీద నడిచే భక్తులకి ప్రతిఫలం సమర్పించుకుంటానని మొక్కుకున్నానండీ..." అంది భార్య.

"ఇంకానయం. నేను నడుస్తానని మొక్కుకోలేదు" అన్నాడు భర్త.

"ఎంతో పుణ్యం చేసుకుంటే గానీ ఆ ఎర్రటి నిప్పు కణికలమీద కాళ్ళ కాసింత కూడా బొబ్బలెక్కకుండా నడవటం అసాధ్యం సుమండీ!" అంది.

ముగ్గురూ వంటింటిలోకి తిరిగి వెళ్తూ ఉండగా కొడుకు తండ్రితో, "నిప్పులపై నడిస్తే పుణ్యం వస్తుందా నాన్నా! అనుకున్న కోరికలు నెరవేరతాయా?" అని అడిగాడు.

"భగవంతుడిపై భక్తి ఉండటం మంచిదే. కానీ అది మూఢభక్తిగా మారకూడదు. దేవుడికి మొక్కులిస్తే మంచి మార్కులు రావు. నమ్మకంతో బాగా చదివితే వస్తాయి" అంటూ నీటిలో ఉడికిన గుడ్డుని గరిటెతో పైకెత్తి, చేత్తో పట్టుకుని పళ్లెంలో పెట్టాడు. కాలుతున్న గుడ్డుని అతడు అంత సునాయాసంగా పట్టుకోవటం చూసి తల్లీకొడుకులు ఆశ్చర్యపోయారు.

గుడ్డులోంచి ఇంకా ఆవిర్లు వస్తూనే ఉన్నాయి. కొడుకు విస్మయంతో "నీ చెయ్యి కాలలేదా నాన్నా?" అని అడిగాడు.

తండ్రి నవ్వి, "నీవు మరోదాన్ని తియ్యి" అన్నాడు. తండ్రిలాగే గరిటెతో తీసి, చేత్తో పట్టుకోబోయిన కొడుకు, చేయి చుర్రున కాలటంతో సన్నగా కేకపెట్టి గుడ్డుని పళ్లెంలోకి వదిలేశాడు.

తండ్రి కొడుకు తలమీద చేయి వేసి, "మంటలపై నడిచే సూత్రం కూడా నేను అవలంబించిందే! ఆ సూత్రం తెలియకపోవటం వల్లనే నీ చేయి కాలింది" అంటూ భార్య, కొడుకుల మూఢనమ్మకాన్ని తొలగించే ప్రయత్నం చేశాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! కొడుకు వేళ్లు ఎందుకు కాలాయి? తండ్రివి ఎందుకు కాలలేదు? ఆ సూత్రానికి, మంటలపై నడవటానికి సంబంధం ఏమిటి? సమాధానం తెలిసీ చెప్పకపోయావో, నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అంటూ హెచ్చరించాడు.

(సమాధానం 185 పేజీలో)

# 34. రథప్రమాదం



పట్టువదలని విక్రమార్కుడు శవాన్ని భుజాన వేసుకుని నడుస్తూ ఉండగా అందులోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు.

"రాజా! నీకూ నాకూ మధ్య ఈ పోటీ ఎన్నటికీ తెగేలా లేదు. నేను నీకు మౌనభంగం కలిగించటం, నీవు తిరిగి నన్ను బంధించటం - దీనికి అంతం లేనట్టూ ఉంది. ఆరోగ్యకరమైన పోటీ ఎప్పుడూ మంచిదే. ఒక తరగతిలో మొదటిస్థానం కోసం పోటీపడే నలుగురు విద్యార్థులూ ఆ పోటీ వలనే బాగా చదువుతారు. ఆరోగ్యకరమైన పోటీల వల్ల పెద్ద పెద్ద ప్రమాదాలని కూడా ఆపవచ్చు. అటువంటి కథ ఒకటి చెపుతాను. శ్రమ తెలియకుండా విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"కోసల, అవంతీపురం మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతూ ఉండేవి. కోసల రాజు మరణించాక అతడి కొడుకైన యువరాజు ఈ ఘర్షణలకి మూలకారణం ఏమిటా అని పరిశీలిస్తే, సరిహద్దు ప్రాంతాల్లో ఉండే గ్రామాల కప్పం ఎవరికి చెందాలా అన్న విషయమై తరచు గొడవలు జరుగుతున్నాయని తెలిసింది. అతడు అవంతీరాజుకి ఒక రాయబారిని పంపాడు. 'పది గ్రామాల కప్పం కోసం వందల సంఖ్యలో ప్రాణనష్టం ఎందుకు? ఆ పదిగ్రామాలు మీకు అప్పగించేస్తాం. కానీ ఊరికే అలా ఇచ్చేస్తే మేం మా ఓటమిని ఒప్పుకున్నట్లు అవమానంగా ఉంటుంది. దానికి బదులుగా మీరు మీ రాజ్యానికి సంబంధించిన నలుగురు మేధావుల్ని మాకు భరణంగా ఇవ్వాలి."

అవంతీరాజుకి అర్థం కాలేదు. 'నలుగురు మేధావులకోసం సుభిక్షమైన పది గ్రామాల్ని శాశ్వతంగా వదులుకోవటం ఏమిటి?' అన్న అనుమానాన్ని రాయబారి ద్వారా తిరిగి వెనక్కి పంపాడు.

దానికి సమాధానంగా కోసల యువరాజు 'పది సాధారణ గ్రామాల్ని ఆనకట్టలు కట్టో, కాలువలు తవ్వో సుభిక్షమయిన గ్రామాలుగా తీర్చిదిద్దటం సులభం. కానీ రాజుకి మంచి సలహా ఇచ్చేవారు, స్వార్థరహితులు, జ్ఞాన సంపన్నులు అయిన మేధావులు దొరకటం కష్టం. అలాటివారు లభిస్తే, వారి సాయంతో మొత్తం దేశాన్ని సుభిక్షం చేయటం సులభం' అన్నాడు.

'మేధావులంటే ఎవరు?' అని అవంతీరాజు తిరిగి ప్రశ్న పంపాడు.

దానికి జవాబుగా కోసలరాజు 'సమస్యని సహేతుకంగా చూడగలిగే వారు, మూల కారణం తెలుసుకోగలిగేవారు, పరిష్కారం ఆలోచించగలిగేవారు, దాన్ని

అమలులో పెట్టగలిగేవారు... ఇన్ని అర్హతలున్నవారిని మేధావులంటారు. ఒక వ్యక్తి మూడు మెట్లు ఎక్కడం ద్వారా 'జ్ఞాని'గా మారతాడు. తన రంగంలో విషయాన్ని పూర్తిగా తెలుసుకున్న వాడు 'పండితుడు'. దానికి తన తెలివితేటల్ని సరిగ్గా మేళవింపు చేయగలవాడు 'మేధావి'. తన తెలివికీ పాండిత్యానికీ తన అనుభవాన్ని కలిపి, అహంకారాన్ని వీడినవాడు 'జ్ఞాని'. అలాంటి జ్ఞానులు నివసించే రాజ్యం సుఫలం."

అప్పుడే సింహాసనం అధిష్టించిన ఒక చిన్న కుర్రవాడు ఇంత గొప్పగా విశ్లేషించిన సత్యాన్ని చూసి అవంతీరాజుకి మతిపోయింది. తన మంత్రిని పిలిచి, "మన దేశంలో జ్ఞానులు ఎంతమంది ఉన్నారు?" అని వాకబు చేశాడు. దాదాపు సగం మంది ప్రజలు జ్ఞానులన్నాడు మంత్రి.

"వారిలో ఒక వందమందిని పోగు చెయ్యండి. కోసల నుంచి కొందరు పండితులు వచ్చి పరీక్ష చేసి, మనవారిలో నలుగురు జ్ఞానుల్ని ఎంపిక చేసి తీసుకువెళతారు. ప్రతిఫలంగా మనకి పది అత్యంత భాగ్యవంతమైన గ్రామాల్ని భరణంగా సమర్పించుకుంటారట. ఇక భవిష్యత్తులో మన రెండు దేశాలమధ్య యుద్ధాలుండవు" అన్నాడు.


కొన్ని రోజుల తరువాత ఎంపిక ఏర్పాట్లు జరిగి రంగం సిద్ధమైంది. కోసల నుంచి వచ్చిన అధికారులు నాలుగు ప్రశ్నలు వేశారు.

**1.** రథంపై ఒక వైద్యుడు, అతడి సొంత కొడుకు వెళ్తూ ఉండగా, రథం బోల్తాపడి కొడుక్కి తీవ్రగాయాలు తగిలాయి. తండ్రికి స్పృహ తప్పి మరో ఆస్పత్రిలో వున్నాడు. అన్ని ఏర్పాట్లూ జరిగిన చివరి క్షణంలో యువకుడి తలకి శస్త్రచికిత్స చేయవలసిన డాక్టరు "ఈ పరిస్థితుల్లో నా సొంత కొడుక్కి నేను అంత సున్నితమైన చికిత్స చేయలేను" అనటం జరిగింది. అసలక్కడ ఏమి జరిగి ఉంటుంది? ఒక వ్యక్తికి ఇద్దరు సొంత తండ్రులు ఎలా ఉంటారు?

**2.** "రెండో ప్రశ్న కష్టమైనది" అంటూ ఈ విధంగా ప్రశ్నించారు. "ఒక వైద్యుడు భార్యాబిడ్డలతో ప్రయాణం చేస్తూ ప్రమాదంలో పడగా సొంత కొడుకుకి గాయం తగిలింది. భార్యా భర్తలు స్పృహ కోల్పోయారు. "నా సొంతకొడుక్కి నేను శస్త్రచికిత్స చేయలేను" అన్నాడు వైద్యుడు. ఏమి జరిగి ఉంటుంది?

**3.** "మూడో ప్రశ్న మరింత కష్టమైనది" అంటూ నాలుగు పేకముక్కలు చూపించారు. "ఒకటి... మూడు... అయిదు... మొదలైనవి **బేసి సంఖ్యలు**. అ... ఆ... ఇ... నుంచి అః వరకూ **అచ్చులు**. ఆ విషయం మీకు తెలుసుకదా." అంటూ వాటిని బల్లమీద పెట్టారు. చూసేవారికి అవి ఈ విధంగా కనపడుతున్నాయి.







పై ఈ నాలుగు పేకముక్కలకీ ఒకవైపు తెలుగు అక్షరమూ, మరోవైపు అంకె ఉన్నాయి. **ప్రతి అచ్చు వెనుకవైపూ తప్పనిసరిగా బేసిసంఖ్య ఉన్నదా?** అని కనుక్కోవాలంటే, ఏ రెండు ముక్కల్ని తిప్పి చూడాలి? కేవలం రెండు ముక్కల్నే తిప్పాలి సుమా" అన్నారు.

సభికుల్లో ముప్పాతిక భాగానికి ప్రశ్నే అర్థం కాలేదు.

ఇదంతా చూస్తున్న అవంతీ రాజుకి కోపం వచ్చింది. "ఒక మనిషి యొక్క జ్ఞానం పరిశీలించటానికి ఇవేం ప్రశ్నలు?" అని అడిగాడు.

వచ్చిన అతిథులు వినయంగా, "జ్ఞానానికి మూలం కుతూహలం మహారాజా! తెలుసుకోవాలన్న కుతూహలమే జ్ఞానాన్నిస్తుంది. ఇదిగో ఈ నాలుగో ప్రశ్న చూడండి. మీ రాజ్యానికి పదివైపులా సరిహద్దుల్లో పదిమంది మీ గూఢచారులు ఉన్నారనుకుందాం. వారి అనుచరులు మరెక్కడో ఉన్నారు. వారినీ వీరినీ గీతల ద్వారా కలపాలి. 1-1, 2-2... ఆ విధంగా అన్నమాట. గీతలన్నీ చతురస్రం లోపలే ఉండాలి. అన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమిటంటే **ఒక గీతకి మరోగీత తగలకూడదు.** పక్కనుంచే వెళ్లాలి" అంటూ ఒక దీర్ఘచతురస్రం గీసి చూపించారు.



అక్కడున్న సభికులందరూ ముక్త కంఠంతో, "అసంభవం, ఆ అంకెల్ని కలపటం అసాధ్యం..." అన్నారు.

"పోనీ ఈ లెక్క చెప్పండి" అంటూ ఒక కాగితాన్ని వారికి చూపించారు. అందులో ఈ విధంగా వున్నది.

| | | | | |
|---|---|---|---|---|
| 1 | 2 | మొదలు | 1 | 1 |
| 2 | 1 | 1 | 2 | 2 |
| 1 | 1 | 1 | 1 | 2 |
| 1 | 2 | 2 | 2 | 1 |
| 1 | 2 | 2 | 2 | చివర |

"మొదలు అని వున్న చోటునుంచి ప్రారంభించి చివరకు చేరాలి. ప్రతి గడిలోంచి గీత ప్రయాణం చేయాలి. వెళ్ళిన గదిలోంచి మళ్ళీ ప్రయాణం చేయకూడదు. గీత. 1 అన్న అంకె మీద గీత మలుపు తిరగవచ్చు. 2 అన్న అంకెపై మలుపు తిరగటానికి వీల్లేదు. తిన్నగా వెళ్ళాలంతే."

ప్రతినిధులు ప్రయత్నం ప్రారంభించారు. ఎంతకీ రాలేదు.

అవంతీరాజు లేచి కోసల అతిథుల్ని ఉద్దేశించి, "మీరిప్పటివరకూ ప్రశ్నించిన వారందరూ మా రాజకీయ నాయకులు.... నా రాజ్యపు వివిధ నియోజకవర్గ ప్రతినిధులు" అంటూ తన నాయకులవైపు తిరిగి, "మనదేశంలో నదులపేర్లు నాలుగు చెప్పండి. ప్రముఖమైన ఆనకట్టలు మనదేశంలో ఎక్కడెక్కడ ఉన్నాయి? మీ ఊరిలో ధాన్యం బస్తా ధర దాదాపు ఎంత? మీ రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతి అయ్యే వస్తువులు ఏమిటి? పన్నుల బకాయి ఎంత? తలసరి ఆదాయం ఎంత? ఈ ప్రశ్నల్లో కనీసం మూడింటికి జవాబు చెప్పగలిగేవారు లేచి నిలబడండి" అన్నాడు. ఎవ్వరూ లేవలేదు.

అవంతీరాజు కోసల ప్రతినిధులవైపు తిరిగి, "మీ రాజు మిమ్మల్ని నా దగ్గరకు ఎందుకు పంపాడో నాకు అర్థమైంది. ఆ పది గ్రామాలు మీరే ఉంచుకోండి. నా తప్పు నాకు తెలిసిందని చెప్పండి" అన్నాడు.

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! అవంతీరాజు 'తప్పు తెలిసింది' అన్నాడు. ఏమిటా తప్పు? ఆ అయిదు ప్రశ్నలకీ సమాధానాలు ఏమిటి? తెలిసీ చెప్పకపోయావో, నీ తల వేయి ప్రక్కలవుతుంది సుమా!" అన్నాడు.

(సమాధానాలు 186 పేజీలో)

# 35. రెండు పరీక్షలు



బాగా చీకటిపడ్డాక అడవిలో ఒక కొండపై దిగులుగా కూర్చున్న రాకుమార్తెని ఒక నడివయస్కురాలు "ఎందుకలా వున్నావు?" అని అడిగింది.

"నా తల్లితండ్రులు నా వివాహం చెయ్యటం లేదు. ఇకపై చెయ్యరు కూడా" అన్నదా అమ్మాయి.

ఆ స్త్రీ ఆశ్చర్యపోయి, "ఏం" అంది. ఆమె పేరు కౌసల్య.

ఆమె మాటలకి రాకుమార్తె "నా తల్లితండ్రులకు తాము అపురూపమయిన తెలివితేటలు కలవారమని గొప్ప నమ్మకం. అంత తెలివి తేటలున్న అల్లుడు ఈ ప్రపంచంలో ఎవరూ లేడని నిరూపించటమే వారి ఆశయం. అందుకే సమాధానం లేని ప్రశ్నల్తో అవమానం చేసి చంపుతున్నారు. ఇదంతాచూసిన నా స్నేహితురాండ్ర హాస్యోక్తులను భరించలేక పోతున్నాను" అన్నది.

"నిజమయిన తెలివితేటలున్నవారు మెలిక ప్రశ్నలే తప్ప 'సమాధానం లేని' ప్రశ్నలు వేయరు. అర్థం కానివారికి అవతలి వారి తెలివి మూర్ఖంగా కనపడుతుంది" అన్నది కౌసల్య.

"ప్రశ్నలకయితే సమాధానం చెప్పవచ్చు కానీ నా తల్లితండ్రులకి కావలసింది సమాధానం కాదు. ఆ సమాధానం ఎలా వచ్చింది? దాని వెనుక వున్న తర్కం ఏమిటి? ఇంతకన్నా మంచి సమాధానం మరొకటి ఎందుకు లేదు? లాటి వివరాలు వారికి కావాలి. అందుకే ఒక్కరు కూడా ముందుకు రాలేక పోతున్నారు" అన్నదా అమ్మాయి విసుగ్గా.

"ఏమిటా ప్రశ్నలు? కొన్ని ఉదాహరణలు చెప్పు" అని అడిగింది కౌసల్య. రాకుమార్తె చెప్పిన ఆ ప్రశ్నలు విని "ఇవా ప్రశ్నలు? ఇలాటివాటికి జవాబు చెప్పటానికి నా పెద్ద కొడుకు చాలు... కాదు... కాదు... నా చిన్న కూతురు చాలు. రేపే ఏర్పాటు చెయ్యి. అయితే రెండు షరతులు. పరీక్షలో మేము నెగ్గిన పక్షంలో నేను చెప్పినట్టు నీవు వివాహమాడాలి. మేము చెప్పే జవాబు సరయినదో నిర్ణయించవలసింది న్యాయనిర్ణేతలే తప్ప, నీ తల్లితండ్రులు కాదు" అన్నది.

సరేనంది రాకుమార్తె.

"మరోసారి ఆలోచించుకుని నిర్ణయం చెప్పు. పరీక్షలో మేము నెగ్గితే, నేను నిర్ణయించిన వ్యక్తిని చేసుకోవాలి. దానికన్నా ముఖ్యంగా న్యాయనిర్ణేత మేము చెప్పింది అర్థం చేసుకునేటంత తెలివైన వాడై వుండి తీర్పు చెప్పాలి" అంది కౌసల్య. రాకుమార్తె దానికి వప్పుకుంది.

మరుసటి రోజు నిండుకొలువులో రాజు, రాజపత్ని ఆసీనులై ఉండగా, రాజపత్ని మొదటి సమస్యగా రెండు పాత్రల్ని తెప్పించింది. ఒకదానిలో వంద తెల్ల ముత్యాలు, రెండో పాత్రలో వంద నల్ల ముత్యాల్లాటివీ వున్నాయి. "ఈ రెండు పాత్రల్లో మొత్తం 200 వున్నాయి. వాటిని మీ ఇష్టం వచ్చిన నిష్పత్తిలో కలుపుకుని, తిరిగి రెండిటిలో సర్దుకోవచ్చు. నా కూతురు కళ్ళకి గంతలు కట్టుకుని చెరో పాత్రనుంచీ ఒక్కొక్కటి తీస్తుంది. ఆమె చేతికి వచ్చినవి రెండూ తెల్లవే అయితే మీరు గెల్చినట్టే" అంది రాజపత్ని.

కౌసల్య దానికి అభ్యంతరం చెపుతూ, "అసలిది పరీక్ష కాదు. ఇందులో తెలివికి సంబంధించిన పరీక్ష ఏమీ లేదు. అంతా అదృష్టానికి సంబంధించినదే వున్నది" అంది. రాజపత్ని గర్వంగా నవ్వి, "అదే మరి మిగతా పరీక్షకులకూ మాకూ తేడా. కొంతమంది కేవలం అదృష్టాన్ని నమ్ముకుంటారు. కొందరు దాన్ని పెంచుకుంటారు" అంది.

ఆమె మాటల్లో అంతరార్థం అర్థమైనట్టు కౌసల్య చిన్న కూతురి వైపు తిరిగింది. తల్లి అనుమతి కోసమే అప్పటివరకూ చూస్తున్నట్టు నిలబడిన ఆ పాప, రెండు పాత్రల్నీ కలిపి, ఒక దానిలో ఒక తెల్ల ముత్యాన్నీ, మరొక దానిలో 199నీ పోసి సిద్ధం చేసింది. కళ్ళకి గంతలు కట్టుకున్న రాకుమారి మొదటి పాత్రలో చెయ్యి పెట్టీ, ఊహించిన విధంగానే దానిలో వున్న ఒకే ఒక తెల్ల ముత్యాన్ని తీసింది.

రెండోసారి రెండో పాత్రలో చెయ్యి పెట్టి చేతికందిన దాన్ని అందుకోబోతూ వుండగా కౌసల్య "పరీక్ష అయిపోయింది మహారాణీ" అంది గంభీరంగా.

రాకుమార్తె ఏమి తీస్తుందా అని ఉత్సుకతో చూస్తున్న వారంతా ఈ మాటలకి అయోమయం చెందగా కౌసల్య కొనసాగించింది. "మన పరీక్ష అదృష్టం 'పెంచుకోవటం' గురించే తప్ప అదృష్టం 'పరిశీలించుకోవటానికి' కాదు. తొంభై తొమ్మిది తెల్ల ముత్యాలను వంద నల్లరాళ్ళతో కలపటంతోనే అదృష్ట శాతం పెరిగింది" అన్నది. రాజపత్ని దానికి అభ్యంతరం చెప్పబోతూ వుండగా కౌసల్య న్యాయ నిర్ణేత వైపు చూసింది.



"రెండో పరీక్ష నిర్వహించండి" అన్నాడు ఆయన క్లుప్తంగా.

ఈ సారి పరీక్ష రాజుది. "మూడు గదుల్లో ఒక దానిలో రాకుమార్తె వున్నది. మీరు తీసే గదిలో ఆమె వున్నట్టయితే మీరు పరీక్ష గెలిచినట్టే" అన్నాడు.

"ఇందులో పరీక్ష ఏమున్నది? మళ్ళీ అంతా అదృష్టమే తప్ప" అంది కౌసల్య అడ్డు తగులుతూ.

"ముందు మీ ప్రయత్నం మీరు చెయ్యండి. అందులో అదృష్టమున్నదో, అవకాశాల్ని పెంచుకునే తెలివి వున్నదో తెలుస్తుంది" అన్నాడు రాజు.

ఆయన మాటలు పూర్తి కాకముందే కౌసల్య కుమార్తె మొదటి గది తలుపుపై చేయివేసి తీయబోతూవుండగా, రాజు కనుసైగ చేసాడు. సైనికుడు రెండో గది తలుపు తీసి చూపించాడు. అందులో ఒక మేకపిల్ల వున్నది.

రాజు కౌసల్యతో ఈ విధంగా అన్నాడు : "నీ సమస్యని సులభతరం చేసేను. ఇప్పుడు రెండే గదులు వున్నాయి. నీ కూతురు తెరవబోయిన మొదటి గది, మూడోగది. ఇప్పుడు ఆలోచించటానికి మరో అవకాశం ఇస్తున్నాను. మీ ఆలోచన మార్చుకుని మూడోగది తెరిచినా ఫర్వాలేదు. లేదా మీరు మొదట నిర్ణయించకున్న మొదటి గదినే తెరవవచ్చు..." అన్నాడు.

సభికుల్లో కొందరు "అదే గది" అనీ, మరికొందరు "గదిని మార్చు" అనీ అరవసాగారు.

కూతురు– తాను మొదట ఎన్నుకున్న గదిని కాక, మిగిలిన మరో గది దగ్గరికి వెళ్ళి దాన్ని తెరవబోయింది. అందులో రాకుమార్తె వున్నదా లేదా అని అందరూ ఊపిరి బిగబట్టి చూస్తూ వుండగా "అవసరం లేదు మహారాజా! పందెం అయిపోయింది. ముందే చెప్పినట్టు ఈ పరీక్ష 'అదృష్టం' గురించి కాదు. మనిషి తన అదృష్టం పెంచుకోవటం గురించి మాత్రమే. కావాలంటే న్యాయాధికారిని అడగండి" అంది.

అందరూ న్యాయనిర్ణేత వైపు చూసారు. సకల విద్యాపారంగతుడూ, తర్క శాస్త్ర నిపుణుడూ అయిన ఆ న్యాయనిర్ణేత తలవూపుతూ "ఆమె చెప్పినదే సరి అయినది" అన్నాడు. అర్థంకాకపోయినా కొందరు కరతాళ ధ్వనులు చేసారు.

"రాజా" అన్నది కౌసల్య. "నాకు మాటిచ్చిన ప్రకారం నీ కూతురు నేను నిర్ణయించిన కుర్రవాడిని చేసుకోవాలి. ఆ యువకుడు ఎవరో కాదు. నా కుమారుడు. చాలా తెలివైనవాడు. అయితే అవిటివాడు. కాళ్ళులేవు. చర్మవ్యాధి కూడా వున్నది."

రాజ దంపతుల మొహం మాడిపోయింది. క్రమక్రమంగా రాజు మొహంలో క్రోధం చోటు చేసుకుంది. "విషయం చెప్పకుండా మమ్మల్నే మోసం చేస్తావా? ఇప్పుడే నీ శిరచ్ఛేదం కావిస్తాను" అంటూ సైనికులకి సైగ చేస్తూండగా రాకుమార్తె అడ్డుపడి "నాన్నా! ఆమె పరీక్షలో గెలిచి ఎవరిని సూచిస్తే వారిని చేసుకుంటానన్నాను. ఆ మాట మీదే నిలబడతాను" అంది స్థిరంగా. రాజ దంపతుల మొహాలు పాలిపోయాయి.

కౌలస్య ఆమెని దగ్గరకు తీసుకుంటూ, "రాజా! మీరు మీ అల్లుడిని ఎలా పరీక్షించాలనుకున్నారో, నేనూ నా క్కాబోయే కోడల్ని అలానే పరీక్షించాలను కున్నాను. మీ అమ్మాయి నిజాయితీ నాకు నచ్చింది. అయితే మీకొక మాట చెప్పాలను కుంటున్నాను" అని అనుమతి తీసుకుని కొనసాగించింది. "మన కుటుంబంలోకి రాబోయేవాడు ధీశాలీ, తెలివైన వాడూ అయి వుండాలని కోరుకోవటంలో తప్పులేదు. కానీ, పరీక్షలో నెగ్గే వాడు వచ్చే వరకూ పెళ్ళి చేయననటం, మరీ ఇంత కఠినమైన పరీక్షలు పెట్టడం అన్యాయం. ఇలా అంటున్నందుకు అన్యథా భావించకండి. మీ తెలివిపట్ల మీకెంతగర్వం అంటే, "ఓడిపోతే ఏమి ఇవ్వాలి" అన్నది కూడా ఆలోచించకుండా పందెం కట్టారు. కూతురి జీవితాన్ని బలిపెట్టడానికి కూడా సందేహించనంత అహం పనికిరాదు" అంటూ సభికుల్లో కూర్చుని వున్న కొడుకుని పిలిచింది.

నగుమోమువాడూ, అందంతో నలకూబరుని తలదన్నే వాడూ అయిన యువకుడొకడు ఠీవిగా నడుచుకుంటూ వచ్చాడు. "అబ్బాయి నచ్చాడా" అని అడగబోయిన కౌసల్య, తొలి చూపులోనే వలపు తొలకరి తొంగిళ్ళు పడినట్టుగా, తనువు తంతు నాగమైనట్టుగా తలదించుకున్న రాకుమార్తెని చూసి, ఆ ప్రశ్న అడగటం మానుకుంది.

భేతాళుడీ కథ చెప్పి, "రాజా! నాదొక అనుమానం. పరీక్షలు రెండూ పూర్తవ కుండానే కౌసల్య గెలిచినట్టు న్యాయ నిర్ణేత ఎలా ప్రకటించాడు? అదృష్టాన్ని పెంచుకునే అవకాశాలంటే ఏమిటి? తెలిస్తే సమాధానం చెప్పాలి సుమా" అన్నాడు.

(సమాధానం 188 పేజీలో)

# 36. శిఖరంపైకి గాలి సంచి



ఊరికి దూరంగా ఓ చెట్టు ఉండేది. ఓ కుర్రాడు ప్రతిరోజూ దాని దగ్గరకు వచ్చి చెట్టెక్కి ఆడుకుంటూ ఉండేవాడు. అలిసిపోయే దాకా కాయలు కోసుకుని తిని వెళ్ళిపోయేవాడు. చెట్టు కూడా అతడి అల్లరికి సంతోషించేది. తన నీడన పడుకొమ్మని ఆహ్వానిం చేదికానీ ఉత్సాహం ఉరకలు వేస్తున్న ఆ కుర్రాడు బాణంలా పరుగెత్తే వాడు. ఒకరోజు ఆ కుర్రవాడు విచారంగా ఉండటం చూసి చెట్టు, "రా ఆడుకుందువుగానీ" అని ఆహ్వానించింది.

"నేనింకా చిన్న కుర్రాణ్ణికాను, చెట్టులెక్కి ఆడుకోవడానికి! నాకు ఆటబొమ్మలు కావాలి. దానికి డబ్బు కావాలి" అంటూ తన విచారానికి కారణం చెప్పాడు.

"నేను డబ్బు ఇవ్వలేను కానీ ఒక సలహా ఇవ్వగలను. నా పండ్లు కోసుకుని వెళ్ళి అమ్మి నీకు కావలసిన బొమ్మలు కొనుక్కో" అన్నది చెట్టు. కుర్రవాడికి ఈ సలహా అద్భుతంగా తోచింది. గబగబా పండ్లు కోసుకుని వెళ్ళిపోయాడు. తర్వాత మళ్ళీ రాలేదు. చాలా సంవత్సరాలు గడిచాయి. ఓ రోజు ఆ యువకుడు ఆ చెట్టు దగ్గరకు విచారంగా వచ్చాడు. అతడిని గుర్తుపట్టిన చెట్టు "రా! పండ్లు తీసుకో" అంది.

"లేదు, నాకు వాటి అవసరం లేదు. నాకు వివాహం జరిగింది. పిల్లలున్నారు. ఇల్లు కట్టుకోవాలి. డబ్బు అవసరం చాలా వుంది" అన్నాడు.

"నేను నీకు ఇల్లు ఇవ్వలేను. కానీ నా కొమ్మలు కొట్టి కలపచేసి అమ్ముకోవచ్చు" అన్నది చెట్టు. ఆ మాటలకు అమితమైన సంతోషంతో ఆ యువకుడు గబగబా చెట్టెక్కి కొమ్మలు నరికాడు. చెట్టుకి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. అతడి ఆనందాన్ని చూసి చెట్టు కూడా సంతోషించింది. ఆ తర్వాత క్రమంగా ఆ చెట్టు కూడా ముసలిదైంది. అప్పుడు మళ్ళీ అతడు వృద్ధుడై చెట్టు దగ్గరకు వచ్చాడు. "నా భార్య మరణించింది. పిల్లలు చెట్టుకొకరుగా వెళ్ళిపోయారు. నేను మరణించే లోపుగా దేశాలన్నీ తిరిగి వద్దామనుకుంటున్నాను. నాకు పడవ కావాలి" అన్నాడు.

"నా బోదె తీసుకుని వెళ్ళు. అది మాత్రమే మిగిలివున్నది" అన్నదా చెట్టు.
అతడు గొడ్డలితో దాన్ని నరికి తీసుకుని వెళ్ళిపోయాడు. పడవగా తయారుచే
ప్రపంచం అంతా తిరిగాడు. అయినా ఆనందం దొరక్క అలిసిపోయి తిరిగివచ్చా

ముసలిముగ్గై పండుటాకులా మారి వచ్చిన ఆ వృద్ధుడిని సాదరం
ఆహ్వానిస్తూ "... రా! కానీ నన్ను క్షమించు. నీకు ఇవ్వడానికి నా దగ్గర పండ్లే
అన్నదా వృక్షం.

"తినడానికి నాకూ పళ్ళు లేవు" అన్నాడు వృద్ధుడు. "నాకు విశ్రాంతి కావా

"నా వేళ్ళు దిండుగా చేసుకుని విశ్రమించు" అన్నదా చెట్టు.

వృద్ధుడి మొహం విప్పారింది. "అవును. అది మంచిదికూడా" అంటూ
పడుకుని, "ఎంత హాయిగా ఉంది" అన్నాడు. "నిజంగా ఎంతో ప్రశాంతంగా ఉంది"

"ఆ విషయం నీ చిన్నప్పుడే చెప్పాను" అన్నది చెట్టు చిరునవ్వుతో.

ఆ చెట్టే ప్రకృతి. చెట్టు మనిషికి పళ్ళు, బోదె, కలప, కొమ్మలు ఇచ్చినట్టే
ప్రకృతి మనిషికి తెలివి, క్రమశిక్షణ, జ్ఞానం ఇస్తుంది. వయసుతోపాటు వాటి
సక్రమంగా పెంచుకోవటం మనిషి కర్తవ్యం. లేకపోతే జీవితానికి ఒక లక్ష్యం లేకుం
పోతుంది. రాజా! ఇన్నిసార్లు చెట్టువద్దకు తిరుగుతూన్న నిన్ను చూస్తోంటే, నీలా
ఎంతో కష్టపడి అటూ, ఇటూ తిరిగిన ఒక యువకుడు గుర్తొస్తున్నాడు. అత
చివరికి తన తెలివితేటల్తో ఎలా ఆ పనిని సాధించాడో, శ్రమ తెలియక వి
అంటూ బేతాళుడు ఈ విధంగా చెప్పసాగాడు.

ఒక పర్వత శిఖరం పైన ఒక వ్యక్తి చిక్కుపడిపోయాడు. కిందికి రావట
అతడి వద్ద సాధనాలు ఏమీ లేవు. తాళ్ళు, ఆహారమూ మొదలైనవి తీసుకుని పర్వ
పైకి ఎక్కి అతడిని కిందికి తీసుకురావాలి. అసలైన చిక్కు వీటితో కాదు, ప్రాణవాయు
సంచులతో...! వాటిని మోసుకుని పైకి ఎక్కుతున్న మనిషికి **ప్రతి 10 అడుగు
ఎక్కిన దానికి - ఒక గాలి సంచి** ఖర్చవుతుంది. శిఖరం ఎత్తు 3000 అడుగు
అంటే పైకి వెళ్ళే వ్యక్తి తనతోపాటు 300 ప్రాణవాయువు సంచుల్ని ప్రయా
కోసం తీసుకువెళ్ళాలి. ఒక మనిషి తనతోపాటు కేవలం **300 సంచుల్ని** మ
మోయగలడు. అంతకన్నా ఒక్కదానిని కూడా ఎక్కువ మోయలేడు. ఇంతవ
చిక్కులేదు. అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది.





దిగేటప్పుడు ఇద్దరికీ కలిపి కొన్ని సంచులు కావాలి. కానీ వాటిని తీసుకువెళ్ళటం ఎలా? ఇక్కడ సమయం సమస్య కాదు. పర్వతారోహకుడు బలిష్ఠుడు. ఎన్నిసార్లయినా ఎక్కి దిగగలడు. కానీ, **ఎక్కినా, దిగినా** ప్రతి పది అడుగులకీ ఒక గాలిసంచీ కావాలి. అతడి దగ్గర మొత్తం 900 సంచులున్నాయి. రాజా! నీవైతే, చివరికి శిఖరానికి ఎన్ని సంచులు చేర్చగలవు? **ఏ విధంగా లెక్క చేసినా, అంతకంటే ఎక్కువ చేర్చటం కుదరకూడదు సుమా"** అన్నాడు.

బేతాళుడు అడిగిన ప్రశ్నకి రాజు సమాధానం చెప్పలేదు.

"ఎంత కఠినమైన ప్రశ్న కన్నా తడుముకోకుండా జవాబు చెప్పే విక్రమార్కుడు ఆలోచనలో పడ్డాడంటే ఆశ్చర్యమే!" అన్నాడు బేతాళుడు.

విక్రమార్కుడు సాలోచనగా, "నిజమే! ఇది చాలా కఠినమైన ప్రశ్న" అంటూ మరోక్షణం యోచించి చెప్పాడు. "పర్వతారోహకుడు మధ్యలో ఒక మజిలీ వేయాలి. అక్కడివరకూ కొన్ని సంచులు తీసుకువెళ్ళి, అక్కడ వాటిని ఉంచి, మళ్ళీ కిందికి దిగాలి. అయితే, ఇక్కడ మరో చిక్కు ఉన్నది. దిగేటప్పుడు కూడా అతడికి ప్రతి పది అడుగులకీ ఒక సంచి కావాలి. ప్రయాణపు మధ్యలో.... అంటే... సరీగ్గా 1500 అడుగుల దగ్గర మజిలీ వేశాడనుకుందాం! అప్పుడు కూడా ఈ సమస్యకి పరిష్కారం దొరకదు. ఎందుకంటే అతడు మోయగలిగేవి 300 మాత్రమే! అక్కడివరకూ వెళ్ళటానికీ, దిగటానికీ అవి సరిపోతాయి. కాబట్టి ఒక మజిలీ సరిపోదు. రెండు మజిలీలు వేయాలి" అంటూ తిరిగి ఆలోచనలోపడ్డాడు.

అప్పుడు బేతాళుడు "రాజా! నిన్నే ఇంత అయోమయంలో పడేసేటంత గొప్ప ప్రశ్న వేయగలిగినందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నది" అన్నాడు.

(సమాధానం *189* పేజీలో)

# 37. తెలివి - వేగము



పట్టువదలని విక్రమార్కుడు శవాన్ని భుజాన వేసుకుని నడుస్తూండగా అందులోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు: "రాజా! ఈ శవం పని నీకు అప్పజెప్పి ఎవరో నిన్ను బాగా వాడుకుంటున్నారు. నేనిలా అంటున్నానని కోపం తెచ్చుకోకు. ఎంత తెలివైనవాడికైనా ఒక మూల కాస్త మూర్ఖత్వం ఉంటుంది కదా! చదువు లేకపోతే జ్ఞానం రాదు. కానీ జ్ఞానం రావాలంటే కేవలం చదువు మాత్రమే సరిపోదు. అందుకే వేమన:

"చదివి చదివి కొంత చదువంగ చదువంగ
చదువు చదివి యింకఁ జదువు చదివి
చదువు మర్మములను చదువలేఁడయ్యెను
విశ్వదాభిరామ వినురవేమ" అన్నాడు.

"వాస్తవ విషయాలతో నిరంతరం తాను చదివినదాన్ని పరీక్షించుకొననిదే పరిశీలించుకొననిదే ఆ చదువు నైపుణ్యంగా మారదు" - అని దాని తాత్పర్యము.

"రాముడు, కృష్ణ పడవలో వెళ్తున్నారు. కృష్ణకి రాముడు తండ్రి కాదు. కానీ కృష్ణ కొడుకు యొక్క తండ్రికి రాముడు తండ్రి. కృష్ణకి రాముడు ఏమవుతాడు?" అని అడిగితే, వెంటనే జవాబు చెప్పటం కష్టం. 'కృష్ణ' అన్న పేరు స్త్రీకి కూడా వుండవచ్చునని ముందు స్ఫురించాలి. ఆపైన 'తండ్రికి తండ్రి' అన్న విషయాన్ని 'తాత'గా క్లుప్తీకరించుకుంటే, కృష్ణ భర్తకి రాముడు తండ్రి అనీ, ఆ విధంగా ఆయన ఆమెకి మామయ్య అవుతారని బోధపడుతుంది.

రాజా! జీవితంలోలాగే ప్రతీ లెక్కకీ 'ఫలానా విధంగా చేస్తేనే సమాధానం వస్తుంది' అనే సమీకరణాలు ఉండవు. పరిస్థితిని బట్టి వెళ్లాలి. అటువంటి సమస్య ఒకటి చెపుతాను. శ్రమ తెలియకుండా విను.

ఒక జమిందారు, ఆయన భార్య, కొడుకు వ్యాహ్యాళికి వెళ్లారు. అంతలో వారికి ఒక విషయం తెలిసింది. అక్కడికి సరిగ్గా రెండు కిలోమీటర్ల దూరంలో కొండవాలులో ఒక అద్భుతమైన ఇంద్రధనుస్సు వెలిసిందనీ, సెలయేటి వంపులో లోయలో పూలు, ఆకాశంలో హరివిల్లు - ఆ దృశ్యమే అద్భుతమనీ కబురు వచ్చింది.



భార్యాభర్తలు గంటకు నాలుగు కిలోమీటర్ల వేగంతో నడవగలరు. అంటే అక్కడికి చేరుకోవటానికి వారికి అరగంట పడుతుంది. కొడుకు నడక వేగం గంటకు 8 కి.మీ. అయితే, అందరూ ఒకేసారి అక్కడికి చేరుకుంటే ఆ ఆనందం వేరు. కొడుకు తన నడక వేగం సగం తగ్గించుకుంటే అది సాధ్యపడుతుంది. కానీ, ఆ ఇంద్రచాపం వారికోసం అంతసేపు ఆకాశంపై ఆగదు. ఆ విషయం వారికీ తెలుసు.

అన్నట్టు మరో విషయం. వారి వద్ద ఒక గుర్రం కూడా ఉన్నది. దానిమీద రాణీగారు గానీ, జమిందారుగానీ గంటకు 8 కి.మీ. వేగంతో ప్రయాణం చెయ్యగలరు. కొడుక్కైతే దానికి రెట్టింపు వేగంతో పరుగెత్తించగలడు. చిక్కేమిటంటే, ఆ గుర్రంపై ఒకరికన్నా ఎక్కువమంది ప్రయాణం చెయ్యలేరు.

రాజుగారికి కాస్త లెక్కలు తెలుసు. ఆయన భార్యతో "నేను సగం దూరం వెళ్లి అక్కడ గుర్రాన్ని వదిలేస్తాను. నువ్వు అక్కడికి వచ్చి, గుర్రం మీద మిగతా సగం దూరం వస్తే ముగ్గురం తొందరగా - అంటే - దాదాపు ఇరవై రెండు నిమిషాల్లో అక్కడికి చేరుకోవచ్చు" అన్నాడు.

లెక్కల్లో తండ్రి కన్నా కొడుకు కాస్త దిట్ట. "కాదు నాన్నా! ఆ విధంగా అయితే నేను మీకన్నా ఏడున్నర నిమిషాలు ముందే వెళ్తాను. మీరిద్దరూ వచ్చేవరకూ ఆ ఇంద్రధనుస్సు ఉంటుందో లేదో నేను చెప్పలేను. మీరిద్దరూ లేకుండా నేను దానికి ఒక్కణ్ణే చూడను" అన్నాడు.

లెక్కలకన్నా తెలివితేటలూ, ఇంగితజ్ఞానం ముఖ్యం. రాణీగారు ఆ విషయమే చెప్పారు. "మీరు గుర్రాన్ని మధ్యలో వదిలేసి వెళ్తే, నేను అక్కడికి నడిచి వచ్చేవరకూ గుర్రం అక్కడే ఖాళీగా ఉండాలి. మనం కొంచెం తెలివి ఉపయోగిస్తే ఆ సమయాన్ని కూడా వాడుకోవచ్చు. ముగ్గురం ఒకే సమయానికి అక్కడికి చేరుకోవచ్చు" అంది.

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! రాణీగారు చెప్పింది వీలవుతుందా? గమ్యం చేరే సమయం తగ్గించవచ్చా? ముగ్గురూ ఒకే సమయానికి ఎలా వెళ్తారు? కొడుకు తల్లిదండ్రులకన్నా వేగంగా నడుస్తాడు కదా! ఈ ప్రశ్నలకి తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా!" అన్నాడు.

*(సమాధానాలు 190 పేజీలో)*

# 38. ఇరవై 'ఇరుకు' ప్రశ్నలు



1. పాకిస్తాన్‌కి సంబంధించిన ఒక పౌరుడు, కేవలం రెండు తరాల క్రితమే భారతదేశం వచ్చి నివసించటం ప్రారంభిస్తే ఆ వృద్ధుడిని మనదేశంలో సమాధి చేయటానికి ప్రభుత్వం ఎందుకు ఒప్పుకోదు?

2. ఒక గుంపులో 2 కోళ్లు, ఒక నల్లమేక, నాలుగు తెల్ల బాతులు, మూడు తెల్లగొర్రెలు వున్నాయి. ఒక జంతువు ఎన్ని జంతువులతో తన రంగు 'నలుపు' అని చెప్పగలదు?

3. నా జన్మదినం జనవరిలో. ఎన్ని 'తక్కువ' ప్రశ్నలతో నా జన్మదినం కనుక్కోగలరు? నేను కేవలం 'అవును/కాదు' అని మాత్రమే సమాధానం ఇస్తాను.

4. హైద్రాబాద్ నుంచి విశాఖపట్టణానికి మధ్యలో కేవలం రెండు చోట్ల (రాజమండ్రి, విజయవాడ) మాత్రమే ఆగే రైలు ఉందనుకుందాం. దీనికోసం ప్రభుత్వం హైదరాబాద్ - విశాఖ, హైదరాబాద్ - రాజమండ్రి, హైదరాబాద్ - విజయవాడ, విజయవాడ - రాజమండ్రి, విజయవాడ - విశాఖ, రాజమండ్రి - విశాఖ... 6 టిక్కెట్లు వెళ్లటానికి, 6 టిక్కెట్లు తిరుగు ప్రయాణానికి, మొత్తం **12 టిక్కెట్లు ముద్రించాలి**. కొంతకాలానికి ఇంకో రెండు స్టేషన్లు వరంగల్, ఏలూరులలో కూడా ఆగే ఏర్పాటు చేయబడిందనుకుందాం. అప్పుడు మొత్తం 18 టిక్కెట్లు 'కొత్తగా' ముద్రించాలి. ఎందుకంటే, ప్రస్తుతం ఉన్న నాలుగు స్టేషన్లతో ఈ రెంటినీ జత చెయ్యాలి కదా! ఇప్పుడు అసలు ప్రశ్నలోకి వద్దాం. ఇది కూడా కొంచెం క్లిష్టమైన లెక్కే! చెయ్యండి: ప్రస్తుతం ఉన్న స్టేషన్లు 'ఎ'. కొత్తగా వచ్చిన స్టేషన్లు 'బి'. అధికంగా ముద్రించిన టిక్కెట్లు 100. ఎ, బిల సంఖ్య ఎంత? ఆరు అంకెల జీతం కోసం ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్న ఇది.

5. ఈ క్రింది అక్షరాలతో ప్రేమించిన వ్యక్తికి మూడు పదాలు (3 WORDS) పేర్చండి. ఒక్కొక్క అక్షరం కేవలం ఒకసారే వాడాలి.

I E O M U R E Y N A

6. రాధాకృష్ణులు ఆటకి వరహా పందెంతో జూదం ఆడుతున్నారు. కృష్ణుడు 3 ఆటలు గెలిచాడు. చివరికి రాధ 3 వరహాలు లాభంతో లేచింది. మొత్తం వారు ఎన్ని ఆటలు ఆడారు?

7. ఒక రూమరుని మీరు సృష్టించి ప్రపంచంమీదకి వదిలారు. మీ స్నేహితులైన నలుగురికి 30 నిమిషాల్లో చెప్పారు. చెప్పినవారికి చెప్పకుండా వారు అదే సమయంలో అదే సంఖ్యలో చెప్పుకుంటూ పోతే, ప్రపంచంలో ఉన్న మొత్తం 5.6 బిలియన్ జనాభాకి తెలియటానికి ఎంతకాలం పడుతుందో ఈ కింది వాటిలో ఒకటి చెప్పండి.

అ) 4 గంటలలోపు　　ఆ) పదిగంటల లోపు

ఇ) రెండ్రోజులు　　ఈ) వారం

ఉ) నెల　　ఊ) రెండు నెలలు　　ఎ) ఏడాది

8. అయిదు గంటల్లో 5 అడుగుల గొయ్యి తవ్వటానికి అయిదుగురు కూలీలు కావాలి. 100 గంటల్లో 100 అడుగుల గొయ్యి తవ్వటానికి ఎందరు కావాలి?

9. తల తిరిగిపోయే ప్రశ్న ఇది. పదహారు రూపాయలకి 'ఎన్ని' నిమ్మకాయలు వస్తాయో, 'అన్ని' రూపాయలకి 36 నిమ్మకాయలు వస్తాయి. డజను నిమ్మకాయల ఖరీదెంత? ఎంతో చిన్నగా కనపడ్డా, నిమ్మకాయ రసంతో తలంటు కోవాలన్నంత తిక్క పుడుతోంది కదూ! ఫర్వాలేదు. ఓపిగ్గా చెయ్యండి. చిక్కుముడిని విడదీసినట్టు స్థిమితంగా ఆలోచించాలి.

10. నాకెంతమంది సోదరులో, అదే సంఖ్యలో సోదరీమణులున్నారు. నా సోదరికి మాత్రం అక్కలకన్నా అన్నలు రెట్టింపు వున్నారు. మొత్తం మేమెంత మందిమి?

11. ఒక నటుడిని రిపోర్టరు మీ వయసెంత అని అడిగింది. లెక్కల్లో ఉత్సాహం ఉన్న ఆ పిల్లనటుడు "మూడేళ్ల తరువాతి నా వయసుని 3తో హెచ్చించండి" అన్నాడు నవ్వుతూ. "అదేవిధంగా మూడేళ్ల క్రితం నా వయసుని మూడుతో హెచ్చవేయండి. రెండిటి మధ్య తేడాయే నా వయసు." ఇంతకీ అతడి వయసెంత?

12. అగ్రహారం నుంచి ఆదిత్యపురం దూరం 32 కి.మీ. వెళ్ళేటప్పుడు మొదట 8 కి.మీ. ఎత్తు, ఆపై 24 కి.మీ. పల్లం. ఒక కుర్రవాడు సైకిల్‌మీద వెళ్లటానికి 170 నిమిషాలు, రావటానికి 270 నిమిషాలు పడుతుంది. వెళ్లేటప్పుడు గంటకి వేగం ఎంత?

13. ఒక బోటు పక్కనే ప్రవాహంతోపాటు నీటిలో బిరడా కదులుతోంది. దాన్నించి పదవ దూరంగా వెళ్లాలంటే, పడవని ముందుకు నడపటం సులభమా? వెనక్కి తోలటం తేలికా? రెండూ ఒకే కష్టమా?

14. సీసాలో నీళ్లని తొందరగా చల్లబర్చటానికి సీసాని ఐసుపైన పెట్టటం మంచిదా? కిందా? కాఫీని వెచ్చచెయ్యటానికి గిన్నెని స్టౌపైన పెట్టటం మంచిదా? కిందా?
15. పాలిష్ చేసిన బూట్లు ఎందుకు మెరుస్తాయి?
16. 60 పేజీలని రాముడు 2 గంటల్లో, సోముడు 3 గంటల్లో టైపు చేయగలరు. తక్కువ సమయంలో పనిపూర్తి అవ్వాలంటే, ఇద్దరూ చెరో మిషన్‌మీద చెయ్యటం కోసం ఎవరికెన్ని కాగితాలు కేటాయించాలి?
17. ఆరు సంచుల్లో 15, 18, 20, 16, 19, 31 పళ్లు ఉన్నాయి. రాముడు 2, భీముడు 3 సంచులు కొనుక్కున్నారు. రాముడి దగ్గరకంటే భీముడి దగ్గర పళ్లు రెట్టింపు ఉంటే, మిగిలిపోయిన సంచి ఏది?
18. రైలులో కూర్చుని అది నడుస్తున్నప్పుడు వినిపించే చప్పుడు బట్టి దాని వేగం చెప్పగలమా?
19. రైలు కదిలేటప్పుడు కాస్త వెనక్కి ఎందుకు వెళ్తుంది?
20. మీ దగ్గిర 7 ఆపిల్ పళ్ళున్నాయి. ఒక్కొక్క పండుని 3 లేదా 4 కన్నా ఎక్కువ ముక్కలు చేయకుండా, ఏడు పళ్లని 12 మంది కుర్రాళ్లకి పంచటం ఎలా?

### పెరిగే గడ్డి - తినే గొర్రెలు

ఒక ఎకరం మైదానంలో గడ్డిని 100 గొర్రెలు 20 రోజుల్లో ఖాళీ చేయగలవు. 50 గొర్రెలైతే 60 రోజులు పడుతుంది. అదే మైదానాన్ని 25 రోజుల్లో ఖాళీ చేయాలంటే ఎన్ని గొర్రెలు కావాలి?

(సమాధానాలు 191 పేజీలో)

# 39. తెలివికి పరాకాష్ట



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు వెళ్ళి శవాన్ని భుజాన వేసుకుని వెనుదిరిగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు ఈ విధంగా అన్నాడు. "రాజా! మనం ఎంత కాలం బ్రతికామని కాదు. ఎంత తొందరగా జీవితాన్ని మొదలు పెట్టామని చూసుకోవాలి. జీవితంలో పైకి వచ్చిన క్రీడాకారులు, గాయకులు, వాద్యకారులు, మేథావులూ తమ జీవితాన్ని బాల్యం నుంచే ప్రారంభించటం మనకి తెలిసిందే. కొందరు విద్యార్థులకి ఉద్యోగ కష్టాలు ప్రారంభమయిన తరువాతగానీ బాల్యంలోని ఉద్పాదక శక్తి గురించి తెలీదు. బాల్యం నుంచే తెలివిని పెంచుకున్న ఒక కుర్రాడి కథ చెపుతాను విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"ఒక రాజుగారికి ఏడుగురు కొడుకులు. వేటకెళ్లి ఏడు చేపలు తెచ్చారు. అందులో ఒక చేప ఎండక పోయేసరికి, దానికి కారణం నీవంటే నీవని అందరూ కొట్టుకున్నారు. ఆ గొడవ ఆస్తి పంపకాల దాకా వెళ్లింది. వారి తండ్రి అయిన పెదరాజుగారు కూడా పంపకాలే మంచిదనే ఉద్దేశ్యంతో వాస్తుశాస్త్రజ్ఞుడిని పిలిపించారు. రాజుగారికి వంద ఎకరాల స్థలంలో ఏడు ఇళ్లు ఉన్నాయి. అవి ఈ విధంగా ఉన్నాయి.

| | | |
|---|---|---|
| 1 | 2 | 3 |
| | 4 | |
| 5 | 6 | 7 |

ఏడు ఇళ్లకీ ప్రహరీ గోడలు కట్టాలి. స్థలాలు **ఒకరికి కాస్త ఎక్కువ, కాస్త తక్కువ వచ్చినా ఫర్వాలేదు** కానీ ప్రతివారూ తమ ఇంటి చుట్టూ ప్రహరీ గోడ ఉండాలని అడిగారు.

"అదెంత పని? అలాగే చూద్దాం" అన్నారు రాజుగారు. కానీ వాస్తు శాస్త్రజ్ఞుడు ఒక మెలిక పెట్టాడు. మూడుకన్నా ఎక్కువ ప్రహరీ గోడలు కట్టకూడదనీ, ఆ గోడలు కూడా తిన్నగానే **ఉండాలి తప్ప వంకర్లు తిరగకూడదనీ** అన్నాడు. వంద ఎకరాల

చుట్టూ పెద్ద ప్రహరీ గోడ వున్నది. అంతవరకూ సరిపోయింది. మధ్యలో మూడు గోడలు నిర్మించాలి.

రాజుగారికి ఏం చెయ్యాలో తోచలేదు. చతురస్రమైనా ఫర్వాలేదు, త్రిభుజమైనా ఫర్వాలేదు గానీ, ప్రతీ ఇంటి చుట్టూ ఏదో ఒక రూపంలో ప్రహరీ గోడ ఉండాలని ఒకవైపు కొడుకులు కోరుతున్నారు. అలాగేనని తాను వాగ్దానం ఇచ్చాడు. మరో వైపేమో వాస్తు నిపుణుడు ఆ వందెకరాల్లో **మూడు తిన్నటి గోడలకన్నా ఎక్కువ ఉండకూడదని** అంటున్నాడు. ఇదెలా సాధ్యం? ఒక ఇంటిని గానీ రెంటిని గానీ పడగొట్టి వేరే స్థానంలో కడితే తప్ప సాధ్యం కాదనిపించింది. ఈ సమస్యని పరిష్కరించినవారికి కోరిన బహుమతి ఇస్తానని ప్రకటించాడు.

చాలాకాలం వరకూ ఎవరూ రాలేదు. ఏమి చెయ్యాలా అని రాజు ఆలోచిస్తూ ఉండగా, ఒకరు తనీ సమస్యని పరిష్కరిస్తానని కబురు చేశాడు. రాజుగారు అతడిని పిలిపించాడు. నలభై ఏళ్ళ వ్యక్తి వచ్చి, ఒక కాగితం మీద మూడు తిన్నటి గీతలు గీసి చూపించాడు. ఒక్కొక్క గడిలో ఒక్కొక్క ఇల్లు వున్నది.

దాన్ని చూసి రాజు చాలా సంతోషించి, "ఇదింత సులభమా?" అన్నాడు.

"పరిష్కారం దొరకనంతవరకూ ఏ సమస్య అయినా కష్టంగానే ఉంటుంది రాజా! మనం చాలామందిమి అసలు ఆలోచించము. సర్లే అని వదిలేస్తాం. నేను కూడా చాలామందిని అడిగి చూశాను. ఎవరూ చెప్పలేదు. చివరికి మా అబ్బాయి ప్రశాంతుడు చెప్పాడు."

అప్పటివరకూ యథాలాపంగా వింటున్న రాజుగారు ఉలిక్కిపడి, "మీ అబ్బాయి చెప్పాడా? ఈ ఆలోచనలు నీవి కావా?" అని అడిగాడు.

"నావి కావు. మా అబ్బాయివి. రాజా! మీకు అనుమానం రావొచ్చు. ఆలోచన అతనిదైతే, నేను ఎందుకు వచ్చానా అని. వాడు రానన్నాడు. వాడు చెప్పింది మీకు చెపుదామని నేను వచ్చానంతే."

"వాడెందుకు రానన్నాడు?"

వచ్చిన వ్యక్తి వినమ్రంగా చెప్పాడు. "మీరు ఈ సమస్యకి పరిష్కారం చెపితే కోరిన బహుమతి ఇస్తానన్నారు. తాను అడిగిన బహుమతి మీరు ఇవ్వరు కాబట్టి తాను రానన్నాడు."

"ఏమిటా బహుమతి?"



"మీరు కోపగించుకోనంటే చెపుతాను రాజా! వాడు మీ ముఖ్య సలహాదారుగా ఉండాలనుకుంటున్నాడు. ఆ పదవి మీరు ఇవ్వరని, దానికోసం రావటం వృథా అనీ అన్నాడు."

"నిజంగా నీ కుమారుడికి అన్ని తెలివితేటలుంటే, ఆ పదవి కట్టబెట్టడానికి అభ్యంతరం ఏముంది? అయినా ఇందులో నేను కోపం తెచ్చుకోవలసిన విషయం ఏమిటి?"

"వాడి వయసు 14 సంవత్సరాలే. ఇది ఒక వైపు. ఇక రెండో వైపు ఏమిటంటే ఒక ఎండని చేప కోసం ఆస్తిపంపకాలు కోరుకునే కొడుకులున్న మీకు 'సలహాదారు' అవసరం చాలా ఉన్నదని వాడి అభిప్రాయం" భయపడుతూ చెప్పాడు.

అయితే రాజు ఆ మాటలకి బిగ్గరగా నవ్వి, "నీ కొడుకు తెలివైనవాడి లాగా ఉన్నాడే. బాగా గ్రహించాడు. నిజమే. కొందరు తండ్రుల్లాగా నేనూ నా పిల్లల్ని గారంగా పెంచాను. గారమూ, ప్రేమా ఒక్కటే అనుకున్నాను. పైకి ఇలా కనపడుతున్నాను కాబట్టి నేను సంతోషంగా ఉన్నాననుకుంటున్నారు అందరూ. నేను చాలా కుమిలిపోతున్నాను. ఈ సమయంలో నాకు ముఖ్య సలహాదారే కాదు, ఆలోచన్లు పంచుకునేవాడు కూడా కావాలి. వయసుతో నిమిత్తం లేదు. నీ కొడుకుని తీసుకురా. తప్పక ఉద్యోగం ఇస్తాను" అన్నాడు.

ఈ సంభాషణంతా వింటున్న మంత్రి కల్పించుకుని "రాజా! ఈ కుర్రవాడు చెప్పిన పరిష్కారం గొప్పదే. కానీ, అంత పెద్ద ఉద్యోగం ఇచ్చేటంత గొప్పది కాదు" అన్నాడు.

"మీరు చెప్పిందీ సబబుగానే ఉన్నది. కానీ మనం అతడు కోరిన బహుమతి ఇవ్వమని ముందే ఊహించగలగటం, అలా అని మౌనంగా ఊరుకోకుండా మనకి సహాయం చేయటం కోసం తండ్రిని పంపటం, పైగా నా కుమారులపైన అతడి అభిప్రాయం - ఇవన్నీ చూస్తోంటే నాకెందుకో అతడ్ని కలుసుకోవాలనిపిస్తోంది. మంత్రీ! మీరు కూడా తెలివైనవారే కదా! మీరే అతడికి ఏదైనా పరీక్ష పెట్టండి. అందులో నెగ్గితే మన ఆస్థానంలో చేర్చుకుందాం" అన్నాడు.

❖ ❖ ❖

నిండుసభలో రాజుగారి పక్కనే పద్నాలుగేళ్ల ప్రశాంతుడు కూర్చుని ఉన్నాడు. దూరంగా రాణిగారూ, మంత్రిగారూ ఉన్నారు. ఆ కుర్రవాడితో రాజు ఈ విధంగా అన్నాడు. "ఉన్నమాట చెప్పనా? నీకు ఉద్యోగం ఇవ్వాలని నాకున్నది. రాణీగారు కూడా సుముఖంగానే ఉన్నారు. కానీ మంత్రికి అంత ఇష్టం లేదు. అలా అని

అతడేమీ నీకు వ్యతిరేకుడు కాదు. ఇంత చిన్నపిల్లవాడికి అంత పెద్ద స్థానం ఏమిటని అతని ఉద్దేశ్యం. అందుకే ఈ పరీక్ష."

ప్రశాంతుడు మౌనంగా వింటున్నాడు. రాజు కొనసాగించాడు. "నీకు మా ఆస్థానంలో ఉద్యోగం ఇస్తున్నట్టు రాజపత్రం ఒక పెట్టెలో ఉన్నది. మంత్రిగారి పక్కన వంద పెట్టెలున్నాయి. పత్రం ఎన్నో పెట్టెలో ఉన్నదో నువ్వు సరిగ్గా కనుక్కుంటే నీకా ఉద్యోగం వస్తుంది. రాణి, మంత్రిని కొన్ని ప్రశ్నలడుగుతుంది. అతడి జవాబుల ఆధారంగా రాణి ఆ పెట్టె సంఖ్య చెపుతుంది. ఆమె చెప్పే సమాధానం సరి అయినదైతే నీకు అదృష్టం ఉన్నట్టు..."

ప్రశాంతుడు మొహం చిట్లించి, "నా ఉద్యోగానికీ, ఆమె చెప్పేదానికీ సంబంధం ఏమిటి?" అన్నాడు.

రాజు నవ్వి, "ఆమెకున్న తెలివితేటలను బట్టి ఆమె ఆ పెట్టె సంఖ్య చెపుతుంది. అది తప్పయితే, వారి సంభాషణ ఆధారంగా నీవు చెప్పవచ్చు."

"ఇది చాలా కఠినమైన పరీక్షలా ఉన్నట్టుంది."

"అవును. చాలా కష్టమైనది. నా సలహాదారు అవ్వాలంటే ఇది నీవు నెగ్గాలి. వారి సంభాషణ విను" అన్నాడు రాజు. ప్రశాంతుడు వారివైపు తిరిగాడు. రాణి మంత్రితో, "ప్రశాంతుడి ఉద్యోగ పత్రం మొదటి ఏడు పెట్టెల్లో వున్నదా?" అని అడిగింది. లేదన్నాడు మంత్రి. ఈ మాటలు కుర్రవాడికి వినిపించాయి. కాగితంపై ఆ విషయం వ్రాసుకున్నాడు.

రాజు కుర్రవాడివైపు తిరిగి, "మంత్రి నిజమే చెపుతున్నాడు. నీ ఉద్యోగపత్రం 8-100 పెట్టెల్లో ఒకదానిలో ఉన్నది" అన్నాడు.

ఈ లోపులో మంత్రిని రాణి రెండో ప్రశ్న "యాభై లోపులో ఉన్నదా? యాభై-వంద మధ్యలో ఉన్నదా?" అని అడిగింది.

మంత్రి దీనికి సమాధానం నోటితో చెప్పకుండా కాగితం మీద రాసి ఇచ్చాడు. రాణి దాన్ని చదివి మూడో ప్రశ్న వేయబోతూ ఉండగా రాజు ప్రశాంతుడి వైపు తిరిగి, "మంత్రి అబద్ధపు జవాబు వ్రాసి ఇచ్చాడు" అన్నాడు.

ప్రశాంతుడు కంగారుపడి, "ఏం వ్రాసి ఇచ్చాడో తెలియకుండా నాకేమి అర్థం అవుతుంది?" అన్నాడు.

"అందుకే ఇది చాలా కఠినమైన పరీక్ష అన్నాను" క్లుప్తంగా సమాధానం ఇచ్చాడు రాజు.



ప్రశాంతుడు కళ్లు మూసుకుని సుదీర్ఘంగా ఆలోచిస్తూండగా రాణి మంత్రిని, "ఆ పెట్టె సంఖ్య 4తో నిశ్శేషంగా భాగింపబడుతుందా?" అని అడిగింది.

మంత్రి సమాధానాన్ని కాగితంపై రాసి ఇస్తూ ఉండగా రాజు ప్రశాంతుడితో, "పాపం నా భార్య - అతడు చెపుతున్న జవాబులన్నీ నిజాలే అనుకుంటోంది. ఈసారి కూడా అబద్ధమే రాశాడు" అన్నాడు.

ప్రశాంతుడు సమాధానం ఇవ్వలేదు. గాఢమైన ఆలోచనలో నిమగ్నమయ్యాడు. రాజు, మంత్రి కలిసి ఈ వ్యూహాన్ని నిర్మించారని తెలుస్తూ ఉన్నది. కానీ రాజు అన్నట్టు ఇది దుర్భేద్యమైన వ్యూహంగా కనపడుతోంది. నిజంగా తన తెలివితేటలకిది పరీక్షే.

ఈలోపులో రాణీ మరో ప్రశ్న అడిగింది. "పెట్టె సంఖ్య వర్గమా?" అని.

రాజు ప్రశాంతుడివైపు తిరిగి, "మంత్రి ఈసారి సత్యమే రాశాడు. అన్నట్టు 'వర్గం' అంటే తెలుసుగా. 4-16-25-36 లాంటి సంఖ్యల్ని వర్గాలు అంటారు. మంత్రి ఏమి రాశాడు? అని మాత్రం అడక్కు" అన్నాడు.

ప్రశాంతుడు చిన్నగా నవ్వి తలూపుతూండగా, రాణి అడిగింది. "ఇక చివరి ప్రశ్న. ఆ రెండంకెల సంఖ్యలో మొదటి అంకె 3 కదా".

దానికి మంత్రి ఏదో సమాధానం ఇచ్చాడు. రాజు ప్రశాంతుడి వైపు తిరిగి, "అతడు చెపుతోంది అబద్ధమో, నిజమో తెలియటం లేదు" అన్నాడు.

మంత్రి సమాధానం రాసిన కాగితాన్ని విప్పి, చదివి రాణి లేచి నిలబడి చప్పట్లు కొడుతూ, "వచ్చేసింది" అంటూ ఒక పెట్టె చూపించింది. ఆస్థానంలో అందరూ ఊపిరి బిగబట్టి నిశ్శబ్దంగా చూస్తూ ఉండగా మంత్రి ఆ పెట్టె తెరిచాడు.

అందులో ఉద్యోగ ఉత్తర్వు కాగితం లేదు.

అందరూ ఒక్కసారిగా శ్వాస వదలటంతో అక్కడ 'స్' మన్న శబ్దం వినిపించింది. రాజు నిస్పృహగా తలూపుతూ, "కష్టం, నిజంగా ఇది కష్టమే" అన్నాడు.

ప్రశాంతుడు తలెత్తి ఆయనవైపు చూస్తూ, "ఇందులో కష్టమేమీ లేదు మహారాజా! 81వ పెట్టె తెరవమనండి. అందులోనే ఉన్నది ఉత్తర్వు" అన్నాడు.

బేతాళుడు ఇంతవరకూ చెప్పి, "అసలిది ఎలా సాధ్యం? రాణీ కనుక్కోలేనిది, దూరంగా కూర్చున్న ప్రశాంతుడు ఎలా తెలుసుకున్నాడు? పైగా- మంత్రి ఏమి సమాధానాలు ఇచ్చాడో తెలియకుండానే ఎలా జవాబు చెప్పగలిగాడు? తెలిసీ దీనికి సమాధానాలు చెప్పకపోతే నీ తల వేయి వ్రక్కలవుతుంది సుమా" అన్నాడు.

*(సమాధానం 194 పేజీలో)*

# 40. ఏడు వింతలు



"రాజా! నీకిప్పుడో గొప్ప కథ చెపుతాను. పిల్లల్లో ఊహాశక్తి ఎంత గొప్పగా వుంటుందో వివరించి చెప్పే కథ ఇది. నిజానికి ప్రతి విద్యార్థిలోనూ ఈ శక్తి వుంటుంది. సరిగ్గా వాడుకోక కొందరు నిరర్థకం చేసుకుంటారు" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

ఒక ఉపాధ్యాయని తన క్లాసుపిల్లల్ని ప్రపంచంలోని ఏడు వింతలని గుర్తించి వ్రాయమన్నది. పిల్లలంతా తమకు తెలిసినవీ, గుర్తున్నవీ- తప్పులో ఒప్పులో వ్రాయటం ప్రారంభించారు. ఒక పాప మాత్రం ఏమీ తోచక స్థబ్దుగా అలాగే వుండిపోయింది.

టీచరు ఆ పాపకు సాయం చేద్దామనుకుని కాస్త వివరాలు ఇవ్వటం ప్రారంభించింది. ప్రపంచ వింతల్లో ఒకటిగా నిలచిన ప్రాచీనమైన చైనాగోడ గురించి చెప్తూ, "ఎన్నో గాలివానలకూ, తుపానులకూ ఎదురునిల్చింది. ఏ శక్తీ దాన్ని నాశనం చేయలేకపోయింది. ధైర్యానికి ఉదాహరణ" అన్నది.

పాప కాస్త ఆలోచించి, స్ఫురణకొచ్చినట్టు వ్రాసింది.

ఆపైన టీచరు **పనామా కాలువ** గురించి చెప్పటం ప్రారంభించింది. "...నిరంతరం జీవంతో ప్రవహిస్తూనే వుంటుంది. మనిషికి సాయం చేస్తూనే వుంటుంది."

పాప వ్రాసింది.

**పీసా టవర్** గురించి చెప్తూ టీచర్ హింట్ ఇచ్చింది. "...కాస్త వంగి వుంటుంది. అయినా కూలదు. వంగటం కూలిపోవటానికి చిహ్నం కాదు. ప్రకృతికి ఎదురునిలవటానికి ఉదాహరణ- అని నిరూపించిన శిఖరం అది".

పాప వ్రాసింది.

**ఈజిప్ట్‌లోని పిరమిడ్‌**ల గురించి టీచర్ అన్యాపదేశంగా సూచించింది. "...మనిషి తెలివి తేటలకి, పట్టుదలకీ, ఏకాగ్రతకి ఉదాహరణం. కాలం కాలరాయలేకపోయింది. మనిషి ఇంత సాధించగలడా? అన్నట్టు మూర్తీభవించిన తెలివితేటలకు ప్రతీకగా నిలిచిన శిఖరం."

ఆతరువాత **తాజ్‌మహల్** గురించి చెప్పింది టీచరు. "చాలామంది దీన్ని వెన్నెల్లో చూడాలంటారు. కానీ మనసుకే కళ్ళుంటే, ప్రపంచంలోని అందాలన్నిటినీ చూడవచ్చు అని నిరూపించిన మరో అద్భుతం..."

పాప వ్రాసింది.



"భగవంతుడు, పాపభీతి, స్వర్గం నరకం- అలా కాకుండా ప్రేమపట్ల మనిషికి స్వేచ్ఛ అవసరం గురించి చెప్పిన ఒక చైతన్యమూర్తి ప్రతీక..." అంటూ **లిబర్టీ స్టాచ్యూ** గురించి హింట్ ఇచ్చింది. చివరగా **ప్రముఖ చర్చి** గురించి సూచిస్తూ, "కరుణకీ, మానవతకీ చిహ్నం. ప్రేమతో తప్పుల్ని క్షమించగలగడమే మనిషికి వరం" అన్నది.

పాపవ్రాయటం పూర్తిచేశాక, "ఇలా తీసుకొచ్చి చూపించు" అన్నది టీచరు. పాప జంకుతూ, సిగ్గుపడుతూ, నెమ్మదిగా వచ్చి టీచరుకు కాగితం అందించింది. అందులో ఈ విధంగా వుంది. **"మహాత్మాగాంధీ, మదర్ థెరిస్సా, మార్టిన్ లూథర్ కింగ్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, హెలెన్ కెల్లర్, గౌతమబుద్ధ, మా అమ్మ"**. పాప వ్రాసినపేర్లు టీచరు క్లాసులో చదివి వినిపించింది. ఎవరూ హేళనగా నవ్వలేదు. కరతాళ ధ్వనుల్తో ఆ గదంతా నిండిపోయింది" అంటూ ముగించిన బేతాళుడు, "రాజా! నాకొక అనుమానం. అర్థం లేని ఆ సమాధానాలకి పిల్లలు ఎందుకు చప్పట్లు కొట్టారు?" అని ప్రశ్నించాడు.

దానికి విక్రమార్కుడు నవ్వి, "బేతాళా! నాకు మౌన భంగం కావించాలనే తప్ప, ఈ ప్రశ్నకు సమాధానం నీకు తెలీదా? స్వతంత్రం కోసం చైనా గోడకన్నా దృఢంగా నిల్చినవాడు **మహాత్మాగాంధీ**. కరుణ ప్రవహించిన కాలువ **మదర్ థెరిస్సా**. వంగినా కూలని టవర్ **మార్టిన్ లూథర్ కింగ్**. ఏకాగ్రతకి ప్రతీకమయిన శిఖరం **ఐన్‌స్టీన్**. కళ్ళులేకపోయినా వెన్నెల్ని చూడగల్గినది **హెలెన్ కెల్లర్**. ప్రేమకి నిర్వచనం చెప్పిన **గౌతమబుద్ధుడు**. చివరగా అన్నిటికన్నా మిన్నగా ప్రేమకి చిహ్నం **'అమ్మ..!'** బేతాళా! వీరికన్నా ఈ ప్రపంచంలో ఏడు వింతలు ఏముంటాయి? **"మనుష్యులు తయారు చేసిన వింతలకన్నా, ఏడు అద్భుతాలుగా మారిన మనుషులు మిన్న"** అని నిరూపించిన ఆ పాప ఊహాశక్తికి కేవలం ఆ తరగతి ఏమిటి? మొత్తం ప్రపంచం అంతా చప్పట్లు కొట్టాలి" అన్నాడు. రాజుకీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతో సహా మాయమయ్యాడు.

❖ ❖ ❖

1. ఇద్దరి కుడిచేతి వేళ్ళని గుణిస్తే- అది 25 అనుకుందాం. ముగ్గురైతే సమాధానం 125. నలుగురైతే 625. ప్రపంచంలో అందరి వేళ్ళనూ ఆ విధంగా గుణిస్తే (ప్రస్తుత జనాభా 670 కోట్లు అయితే) ఆ సమాధానంలో ఎన్ని 'సున్నాలు' ఉంటాయి? కాస్త అటు ఇటుగా చెప్పినా ఫర్లేదు. ఊహించండి.
2. సంవత్సరంలో కొన్ని నెలలకి 30, కొన్నిటికి 31 రోజులు ఉంటాయి. లీపు సంవత్సరంలో 29 రోజులుండే నెలలెన్ని?

3. చెరువులో ఒక వ్యక్తి పడవలో వెళ్తున్నాడు. పడవలో ఒకపెద్ద బండరాయి, ఒక కర్రదుంగా వున్నాయి. రాయిని నీటిలో వేశాడు. పడవ పైకి లేవటం వలన చెరువులో నీటి మట్టం తగ్గుతుందా? చెరువులో రాయి మునగటం వలన నీటిమట్టం పెరుగుతుందా? అలాగే వుంటుందా? అదే గానీ, పడవలోని కర్ర దుంగని నీటిలో వేస్తే – ఫలితంలో తేడా వుంటుందా?

4. మీరొక బోటులో వెళ్తూండగా షార్క్ చేపలు చుట్టుముట్టినట్టు ఊహించుకోండి. అదే సమయానికి బోటుకి చిల్లు పడింది. మీ దగ్గర ఒక కత్తి ఉంది గానీ, మొదటి చేపని పొడిచేసరికి అది విరిగిపోయింది. రెండు బలమైన చేపలు మీ కాళ్ళు పట్టుకున్నట్టు ఊహించుకోండి. ఆ సమయంలో మీరేం చేస్తారో చెప్పండి?

5. రెండు కాళ్లతో చెట్టెక్కి, మూడు కాళ్లతో దిగే జీవి ఏది?

6. పాకిస్తాన్ లాహోర్ నుంచి గంటకి 100 మైళ్ల వేగంతో ఒక రైలు ఆఫ్ఘనిస్తాన్ బయల్దేరింది. అదే సమయానికి కాబూల్‌లో గంటకి 80 మైళ్ల వేగంతో లాహోర్ బయల్దేరింది మరో రైలు. రెండూ మధ్యలో కలుసుకున్నప్పుడు – ఏది కాబూల్‌కి దగ్గరగా ఉంటుంది.

7. ఒక రాకుమార్తెని ఒక యువకుడు అడవిలో దొంగల బారి నుంచి రక్షించి, ఆమె ప్రేమని పొందాడు. ఇద్దరూ వివాహం చేసుకోవాలనుకున్నారు. సరీగ్గా అదే సమయానికి మరొక యువకుడు యుద్ధంలో శత్రు సైనికుల బారి నుంచి రాజుని రక్షించినప్పుడు అతడికి వివాహం చేసి అర్ధరాజ్యం ఇస్తానని ఆ రాజు వాగ్దానం చేశాడు. రాకుమార్తె, రాజు – ఇద్దరూ తమ మాటకి ప్రాణం ఇస్తారు. ఇప్పుడేం చెయ్యాలి?

8. భూమధ్యరేఖ మీద ప్రదక్షిణం చేసిన మనిషి కాళ్లు దాదాపు 40,070 కి.మీ. నడుస్తాయి. మనిషి ఎత్తు **రెండు మీటర్లు** అయితే, అతడి తల కాళ్లకన్నా ఎంత ఎక్కువ దూరం ప్రయాణం చేస్తుంది? మరోలా చెప్పాలంటే, భూమి చుట్టూ కట్టిన రిబ్బను కంటే, భూమికి రెండు మీటర్ల ఎత్తున కట్టిన రిబ్బను ఎంత ఎక్కువ పొడవుంటుంది?

9. ఒక బాస్కెట్‌లో 6 గుడ్లు ఉన్నాయి. ఒక్కొక్క గుడ్డుని ఒక్కొక్కరు చొప్పున అయిదుగురు తీసుకుంటే, బాస్కెట్‌లో ఒక గుడ్డు మిగిలింది. ఎలా సాధ్యం?

10. రంధ్రాలు లేని కుండని, నీళ్ళు పడుతున్న పంపు కింద ఎంతసేపు పెట్టినా అది నిండకపోవటానికి కారణమేమై వుంటుంది?




11. పది గజాల్లో అర (1/2) అంగుళాలెక్కువా? ఆరు నిమిషాల్లో అరసెకన్లా?

12. మీరొక భారతదేశపు గూఢచారి అనుకోండి. మీ దగ్గర ఒక పెట్టె వుంది. అందులో వందదాకా వస్తువులు పెట్టవచ్చు. స్విచ్ నొక్కితే, ఆ వంద వస్తువుల్లో దేనిలోనైనా బాంబు ఉందేమో, ఎర్రలైటు వెలగటం ద్వారా అది సూచిస్తుంది. ఒక పరీక్షకి వెయ్యి రూపాయల దాకా కరెంటు ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో మీకు 11 సెల్‌ఫోన్లు దొరికాయి. అందులో **రెండింటిలో** బాంబులున్నాయని మీకు ఖచ్చితంగా తెలుసు. కరెంటు కోసం ప్రభుత్వ ధనం ఎక్కువ ఖర్చు చేయటం మీకు ఇష్టం ఉండదు. **ఎన్ని తక్కువసార్లు పరీక్షించటం** ద్వారా వాటిని కనుక్కోవచ్చు?

13. ఒక తేనె సీసా బరువు 500 గ్రాములు. తేనె తీసేసి నూనె పోస్తే దాని బరువు 350 గ్రాములు. తేనె బరువు నూనె బరువుకన్నా రెట్టింపు. ఖాళీ సీసా బరువెంత?

14. రెండేళ్ల తరువాత నా కొడుకు వయసు ఇప్పటికి రెట్టింపు అవుతుంది. నాలుగేళ్ల తరువాత నా కూతురు వయసు ఇప్పటికి మూడు రెట్లు అవుతుంది. నా కూతురు పెద్దా? కొడుకా?

15. విజయవాడ నుంచి హైదరాబాద్ 250 కి.మీ. పాదయాత్ర చేస్తే ఉజ్జాయింపుగా ఎన్ని అడుగులు వేయాల్సి ఉంటుంది?



16. నేలలో రెండు అడుగుల లోతున ఆ పైపు గట్టిగా పాతిపెట్టబడి ఉంది. ఆ ఇనుపగొట్టంలో పొరపాటున ఒక టేబుల్ టెన్నిస్ బాల్ పడిపోయింది. ఆ గొట్టం వ్యాసం చాలా చిన్నది కాబట్టి చేతులు పట్టవు. బాల్‌ని పడేసిన కుర్రాడి దగ్గర ఒక రెంచ్, స్క్రూడ్రైవర్, గునపం మాత్రమే ఉన్నాయి. బంతిని బయటికి తీయటం ఎలా?

*(సమాధానం 195 పేజీలో)*

# 41. ప్రేమికుల కలయిక



గోదావరికి చెరోవైపునా ముచ్చటైన రెండు ఊర్లు - ఆదిత్యపురం, వేదహితం. ఈ ఊరి యువకుడు శంభు, ఆ ఊరి అమ్మాయి సంహితతో ప్రేమలో పడ్డాడు. పెద్దలు కూడా వారి వివాహానికి ఒప్పుకున్నారు. మూఢం దాటాక ముహూర్తం నిశ్చయించారు.

అయితే ప్రేమికులు అంత దూరాన్ని కూడా సహించలేక పోయారు. ఒకర్నొకరు ఎంత తొందరగా చూసుకుందామా అనిపించటమే కదా ప్రేమంటే..!

ఈ లోపులో వేదహితం నుంచి ఒక పురోహితుడు ఆదిత్యపురం వచ్చాడు. శంభు అతడి దగ్గరకి వెళ్ళి, "తిరిగి మీరు ఎన్ని గంటలకి మీ ఊరు వెళ్తారు స్వామీ?" అని అడిగాడు.

"ఈ సాయంత్రమే!" అని జవాబిచ్చాడాయన.

"మీ ఊరి అమ్మాయితో నా వివాహం నిశ్చయమైన సంగతి మీకు తెలుసు కదా! వచ్చే నెలలో మా వివాహం. కానీ అంతవరకూ నేను ఆమెని చూడకుండా ఉండలేను. ఈ రాత్రి సరిగ్గా పదిగంటలకి బయల్దేరి పడవపై అటు వస్తాను. గట్టుమీద నిలబడి ఉండమనండి. హరికేన్ లాంతరు వెలుగులో ఆమె ముఖారవిందాన్ని ఒకసారి చూసి తిరిగి వెళ్ళిపోతానని చెప్పండి."

ఆయన నవ్వి, "నీ ప్రేమ సాంద్రత చూస్తుంటే ముచ్చటేస్తోంది. అయితే 'విజ్ఞులు ప్రేమలో పడతారు. సామాన్యులు ఆకర్షణలో పడతారు' అని నాదో నమ్మకం. మరణించేవరకూ ఆకర్షణలో ఉండగలగటమే ప్రేమ. అర్ధరాత్రి నదిదాటి వెళ్ళి ప్రేయసిని చూడాలనుకోవటం ఆమెపట్ల నీకున్న ప్రేమా? లేక తొలి యవ్వన సాంగత్యపు ఆకర్షణా? అని తెలియాలంటే, నీవు విజ్ఞుడివా లేక సామాన్యుడివా అన్న విషయం నాకు తెలియాలి. కృష్ణ పరమాత్మకున్నన్ని తెలివితేటలు నీకుంటే, రుక్మిణీ కళ్యాణంలో విప్రుని పాత్ర ఆనందంగా పోషిస్తాను" అన్నాడు.

"అడగండి."


"అవతలి ఒడ్డు ప్రసక్తి వచ్చింది కాబట్టి దాని గురించి అడుగుతాను. ముగ్గురు సైనికులు అవతలి ఒడ్డుకి వెళ్ళాలి. పడవ దగ్గర ఇద్దరు పిల్లలు ఉన్నారు. తమని



అటువైపుకి తీసుకువెళ్ళమని వారు అడిగారు. "ఈ పడవ కేవలం ఒక యువకుడిని మోయగలదు. లేదా ఇద్దరు పిల్లల్ని మాత్రమే మోయగలదు. కానీ మీ ముగ్గుర్నీ దింపుతాం లెండి" అంటూ ముగ్గుర్నీ అటు దింపి వచ్చేసారు. ఇది ఎలా సాధ్యం? మొత్తం మీద పడవ ఎన్నిసార్లు అటూ ఇటూ ప్రయాణం చేసింది?"

"నేనీ ప్రశ్నకి సమాధానం చెప్తే నాది ప్రేమో, ఆకర్షణో నిర్ణయిస్తారన్న మాట" అన్నాడు.

"ఎవరి పిచ్చి వారికి ఆనందం అన్న విషయం మర్చిపోకు. నీవడిగిన పని నేన్నీకు ఉచితంగా చేస్తున్నాను. ఒక యోగ్యుడికి సాయం చేశానన్న తృప్తి నాక్కలగాలంటే నీవీ ప్రశ్నకు సమాధానం చెప్పాలి."



ఈ సంభాషణ ఇక్కడ జరుగుతున్న సమయానికి గోదారికి అటువైపు "సరిగ్గా పదింటికి పడవమీద ఆదిత్యపురం వస్తాను. అతడిని ఒక క్షణం చూసి వెళ్ళిపోతాను. ఒడ్డుమీద నిలబడమనండి" అన్నది సంహిత.

"తప్పక చెపుతాను తల్లీ! మీ ఊరిలో పని ఇంకో గంటలో అయిపోతుంది. వెళ్ళగానే నీమాట అతడి చెవిన వేస్తాను. అన్నట్టు - పడవ అంటే గుర్తొచ్చింది. నా మనవడిని పాఠశాలలో ఒక ప్రశ్న అడిగారుట. రేపొద్దున్నే చెప్పాలి. ఎంత ఆలోచించినా మనసుకి తట్టడం లేదు. నీవీ సాయం చెయ్యి. నేన్నీకు ఆ సాయం చేస్తాను."

"ఏమిటా ప్రశ్న?"

"ప్రశ్న పైకి సులభంగానే కనపడుతోంది కానీ తేలటం లేదు. గాలి వాటుకి పడవ మీద ఒక వ్యక్తి మైలు దూరాన్ని మూడు నిమిషాల్లో వెళ్ళి, ఎదురుగాలిలో ఆరు

నిమిషాల్లో వెనక్కి వచ్చాడు. గాలి లేకపోతే ఆ దూరాన్ని ఎంత కాలంలో పూర్తి చూస్తాడు?"

ఆమె సమాధానం లెక్క కట్టి చెప్పింది.

"బాగా చెప్పావమ్మా!" అన్నాడు ఆ వృద్ధుడు. "పొద్దున్నించీ సతమత మవుతున్నాను" అంటూ లేచి, "శంభుకి నీ రాక విషయం తప్పక చెపుతాను" అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

❖ ❖ ❖

రాత్రి పదయింది. సరిగ్గా సంహిత ఇట్నుంచి పడవలో ప్రయాణం ప్రారంభించిన సమయానికి, ఆ విషయం తెలియని శంభు అట్నుంచి ప్రయాణం ప్రారంభించాడు. ఆదిత్యపురపు ఒడ్డుకి 720 గజాల దూరంలో రెండు పడవలూ ఎదురుపడ్డాయి. కానీ చీకటిగా ఉండటం వలన ఒకర్నొకరు గమనించలేదు. చెరొక వడ్డుకి చేరుకుని, ప్రేమించిన వారికోసం ఇద్దరూ సరిగ్గా ఒక గంట నిరీక్షించి, దిగులుగా వెనుదిరిగారు. అప్పుడు వారి ప్రేమకు నిదర్శనంగా ఆకాశం మెరిసింది. ఆ వెలుగులో ఒకరికొకరు కనపడ్డారు. రెండు పడవలూ ఒకటయ్యాయి. అలా ఒకటైన ప్రదేశం వేదహిత ఊరు ఒడ్డుకి 400 గజాల దూరంలో ఉంది." అంటూ క్షణం ఆగి అడిగాడు.

"రాజా! జాగ్రత్తగా ఆలోచించి చెప్పు. నది వెడల్పెంత? మరోలా అడగాలంటే, ఆదిత్యపురం నుంచి వేదహితం ఎంత దూరంలో ఉంది? ఈ జవాబులతోపాటు మిగతా రెండూ కూడా ఆలోచించు. సంహిత, శంభులు తమ తమ ప్రశ్నలకు చెప్పిన సమాధానాలు ఏమిటి?" అని అడిగాడు.

(సమాధానం 197 పేజీలో)

# 42. అంకెల గారడీ



"రాజా! పట్టు వదలని విక్రమార్కుడు అన్న పేరు నీకెందుకు వచ్చిందో ఇప్పుడు నాకు అర్థమవుతోంది. అయితే, పట్టువదలని వారు రెండు రకాలు. మొదటి రకం వారు ధీశాలులు. అదృష్టం తమ తలుపు తట్టేవరకూ పట్టు వదలకుండా పని చేసేవారు. రెండోరకం వారు మూర్ఖులు. బంగారం లేదని తెలిసి కూడా పట్టు వదలకుండా గని తవ్వేవారు. నా శవాన్ని ఈ విధంగా నీవు తీసుకెళ్లటం చూస్తోంటే క్రమక్రమంగా నీవు రెండో రకానికి మారుతున్నావేమో అనిపిస్తోంది. కానీ సమస్యలకి పరిష్కారాలు చెప్పటంలోని నీ తెలివితేటలు చూస్తుంటే, అలా నమ్మబుద్ధి కావటం లేదు. నీకిప్పుడు రెండు కథలు చెపుతాను. మొదటి కథ – తనపై తనకి నమ్మకం వున్న వ్యక్తి కథ. రెండోది తార్కిక జ్ఞానం కోల్పోయి, అడ్డదారుల్లో అదృష్టం కోసం ప్రయత్నించిన ఒక అప్రయోజకుడి కథ. శ్రమ తెలియకుండా విను" అంటూ ఈ విధంగా చెప్పసాగాడు.

"ఎనభై సంవత్సరాల ఒక వృద్ధురాలు తన ఇంటిపై అంతస్థుమీద మంటల్లో చిక్కుపడిపోయింది. చుట్టూ ఎకరం నేల. దురదృష్టవశాత్తు ఇంట్లో నౌకర్లు కూడా ఎవరూ లేరు. మంటలవేడికి తలుపు బిగుసుకుపోయింది. గదిలోంచి బయటకు రాలేక, మరణం తథ్యమనుకుంది. ప్రాణభయంతో ఆమె అటూఇటూ పరిగెత్తసాగింది. అరిచినా ఎవరికీ వినబడదు. అంత ఓపిక కూడా లేదు.

ప్రహరీగోడ అవతల్నుంచి ఇదంతా ఒక యువకుడు చూసాడు. మామూలుగా అయితే లోపల అంత ప్రమాదం జరుగుతోందని ఎవరికీ తెలియదు. అయితే అతడు అగ్నిమాపకదళంలో పనిచేస్తున్నవాడు. కిటికీలోంచి వస్తున్న పొగని చూసి ప్రమాదం పసిగట్టాడు. క్షణం ఆలస్యం చేయకుండా గోడదూకి భవనం దగ్గరకు పరుగెత్తాడు.

తన అంచనా నిజమైందని తెలియగానే, భవంతిపైకి ఎక్కి నీళ్ళట్యాంకుకి తాడుకట్టి కిటికీలోంచి లోపలికి దూకి, ముసలామెను బయటకు తీసుకొచ్చాడు.

"నీకెలా కృతజ్ఞత తెలపాలో తెలియడం లేదు. దానికన్నా మరింత ఆశ్చర్యకరమైన విషయం నాకు మరొకటి తోస్తున్నది. అంత తొందరగా, అంత

తెలిసినవాడిలా, ఎంతో అనుభవం ఉన్నవాడిలా పనులన్నీ చకచకా ఎలా చేసావు? ఒంటికి మసి అంటకుండా నన్ను మంటల్నుంచి ఎలా తప్పించావ్?" అని అడిగింది.

యువకుడు కాసింత బిడియంతో, "ఫైర్‌మెన్ ట్రయినింగ్‌లో ఉన్నాను" అన్నాడు. ఈలోపల మంటలార్పేవాళ్ళు వాటిని చల్లార్చారు.

"నీ పేరు" అడిగింది ఆ ధనవంతురాలైన వృద్ధురాలు.

"ప్రహ్లాదచక్రవర్తి. మా అమ్మకు ప్రహ్లాదుడు అంటే ఇష్టం" అన్నాడు.

"భగవంతుడి భక్తుడనా?"

"కాదు, అవతలివారు ఎంత బలవంతం పెట్టినా తాను నమ్మిన సిద్ధాంతాన్ని మార్చుకోనందుకు..." కాసింత గర్వంగా అన్నాడు.

ఆమె బీరువాలోంచి ఒక నోట్లకట్ట తీసి ఇస్తూ, "ఇదిగో పదివేల రూపాయలు... తీసుకో" అన్నది. వద్దన్నాడు అతడు. "లేదయ్యా! చాలా ఆనందంగా ఇస్తున్నాను. ఈవిడ ప్రాణం విలువ ఇంతేనా అనుకుంటున్నావా? లేక ప్రాణాలకు తెగించి రక్షిస్తే ఇంత తక్కువ ఇస్తుందేమిటని సంశయిస్తున్నావా...! కావాలంటే..."

"అయ్యయ్యో! అదేమీకాదు" కంగారుగా అన్నాడు ప్రహ్లాదచక్రవర్తి. "ప్రాణాపాయస్థితిలో ఎవరున్నా, ప్రాణాలకు తెగించి కాపాడటం మా ప్రథమ కర్తవ్యం – అని మొదటిరోజు మాకు చెప్పారు. నా పని నేను చేసాను. దానికి డబ్బు తీసుకోను క్షమించండి".

"కానీ నేను ఆనందంగా ఇస్తున్నాను."

"నేను ఆనందంగా స్వీకరించలేను."

"పదివేలు తక్కువసొమ్ము కాదు. నీకు డబ్బు అవసరం లేదా?"

"ఉన్నది. డబ్బు అవసరం లేనిదెవరికి? నా తల్లి ఆరోగ్యం బావోలేదు. దానికోసం నా తండ్రి అప్పులు చేసాడు. అది తీర్చాలి. కానీ దానికోసం నా విలువల్ని మార్చుకోను. అవసరాన్నిబట్టి తన సిద్ధాంతాన్ని తండ్రికోసం మార్చుకోలేదు కాబట్టే ప్రహ్లాదుడు యుగయుగాలుగా సుస్థిరుడై నిలిచాడు."

ఆ మాటలకు వృద్ధురాలి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కంఠం గద్గదమయ్యింది. ఓ యువకుడు ప్రలోభాలకు లొంగిపోకుండా ఇంత స్థిరచిత్తంగా ఉండడం ఆశ్చర్యమనిపించింది. "ఈ డబ్బు... డబ్బు..." అంది. ఆపైన ఏం మాట్లాడాలో తెలియలేదు. యువకుడు మనస్ఫూర్తిగా నవ్వి, "డబ్బు అవసరం నాకన్నా ఎక్కువవున్నవారు మీ



చుట్టూ ఎందరో కనబడతారు. వారికి ఇవ్వండి. అప్పుడు వారి కళ్ళలో కనబడిన ఆనందం మీ ప్రాణాల విలువని పెంచుతుంది. ఈ డబ్బుకి సార్థకత కూడా లభిస్తుంది" అని అక్కడ నుండి వెళ్ళిపోయాడు. చేతుల్లో నోట్ల కట్టని చూస్తూ ఆమె అలాగే వుండిపోయింది.

❖ ❖ ❖

"ఇంతకన్నా పెద్దసైజు చెప్పులు చూపించమ్మా" అన్నది ఇది జరిగిన రెండురోజులకు చెప్పులషాపుకు వెళ్ళిన ఆ వృద్ధురాలు.

దుకాణంలో యువతి నిచ్చెన మరో పక్కకి జరిపి, రెండు మెట్లు ఎక్కి చెప్పులు తీసి చూపించింది. వాటిని తొడుక్కుంటూ "మొన్న ప్రమాదంలో అన్ని చెప్పులూ కాలిపోయాయమ్మా! మరో నాలుగు జతలన్నా కనీసం కావాలి. కాస్త ఖరీదైనవి చూపించు" అంది.

షాపులో పనిచేసే యువతి నిచ్చెన ఎక్కి పై 'అర'వరకూ వెళ్తుండగా, ఆమె గర్భంతో ఉన్నదని వృద్ధురాలు గ్రహించింది. అతికష్టంమీద జాగ్రత్తగా ఆమె మెట్లు ఎక్కటం చూసి జాలేసింది. తనని రక్షించిన యువకుడి మాటలు అకస్మాత్తుగా గుర్తొచ్చాయి. సంశయించకుండా పర్సులోంచి పదివేలు తీసింది.

"కడుపుతో ఉన్నట్టున్నావ్. ఈ పని కష్టంగాలేదూ?"

యువతి అలసిపోయిన చిరునవ్వుతో "ఇంకో రెండునెలలకు తొమ్మిదోనెల వస్తుందమ్మా! అప్పటినుంచి శెలవు పెడతాను" అంది.

"కానీ నీ ఆరోగ్యం అంతగా సహకరించడం లేదనుకుంటాను."

ఆమె చూపిస్తున్న ఆ ఆప్యాయతకు కళ్ళు సజలాలయ్యాయి. తలదించుకుని, "సెలవు పెట్టేటంత ఆర్థికస్థోమత మాకు లేదు అమ్మగారూ" అంది.

"నీకు నెలజీతమెంత?"

"రెండువేలు."

**"...డబ్బు అవసరం నాకన్నా ఎక్కువవున్నవారు మీ చుట్టూ ఎందరో కనబడతారు. వారికి ఇవ్వండి. అప్పుడు వారి కళ్ళలో కనబడిన ఆనందం మీ ప్రాణాల విలువని పెంచుతుంది. ఈ డబ్బుకి సార్థకత కూడా లభిస్తుంది..."** అన్న ప్రహ్లాదచక్రవర్తి మాటలు... ఆమెకు స్ఫురణకు వచ్చాయి.

"ఇవిగో పదివేలు... అయిదునెలలు సెలవుపెట్టి విశ్రాంతి తీసుకో" అని, ఆ యువతి సంభ్రమాశ్చర్యాల్నుంచి తేరుకోకముందే షాపు బయటకు వచ్చి కారెక్కింది

ఆ వృద్ధురాలు. తళుక్కుమన్న ఆ అమ్మాయి కళ్ళలోని ఆనందం చూసినప్పుడు ఆ వృద్ధురాలుకు ప్రహ్లాదచక్రవర్తి చెప్పిన 'సంతృప్తి' అనే మాటకు నిజమైన అర్థం తెలిసింది.

భర్త ఇంటికి రాగానే యువతి జరిగినదంతా చెప్పింది. "ఈ రెండునెలలూ ఎలా ఆ షాపులో పనిచెయ్యాలా అని భయపడ్డాం. ప్రసవం జరగ్గానే మళ్ళీ వెళ్ళాలా అని బాధపడ్డాం. మన ప్రార్థన భగవంతుడు విన్నట్టున్నాడండీ. అయిదు నెలలు విశ్రాంతి తీసుకొమ్మని వృద్ధురాలి రూపంలో మనకు కావలసినంత డబ్బిచ్చి పంపాడు..."

ఆ మాటలకు భర్త మనస్ఫూర్తిగా నవ్వేడు.

రాజా! అతడెందుకు అంత హాయిగా నవ్వేడు? కేవలం భార్యకి విశ్రాంతి దొరికినందుకా? మరేదయినా కారణం వున్నదా? ఈ ప్రశ్నకి నీవు సమాధానం ఆలోచించేలోపులో దీనికి వ్యతిరేకమైన మరో కథ చెపుతాను.

పై ఆదాయం బాగా లభించే శాఖలో ఒక ఉద్యోగి పదేళ్ళల్లో దాదాపు కోటి రూపాయలు సంపాదించాడు. అంతలో అతడికి మరో శాఖకి బదిలీ అయింది. అక్కడ పై రాబడి దొరకదు. మనిషి రక్తానికి అలవాటు పడిన పులి, అది దొరకకపోతే ఏ విధంగా తయారవుతుందో ఆ విధంగా తయారయ్యాడు. సరిగ్గా ఆ సమయంలో అతడికి స్వామీ బుద్బుదానందబాబా విషయం తెలిసింది.

స్వామీజీ తలుచుకుంటే భగవంతుడు రాసిన జాతకాన్ని కూడా మార్చగలడని ప్రతీతి. ఒకసారి రాయబడిన జాతకం ఎలా మారుతుంది అని ఎవరైనా ప్రశ్నిస్తే, ఆ స్వామీజీ శిష్యులు చిరునవ్వుతో, "స్వామీజీని కలుసుకుని, ఆయన ఆశీర్వాదం పొందటం కూడా జాతకంలోనే ఉంటుంది. అలా మారే అదృష్టం ఉన్నవారికే స్వామీజీని కలుసుకోవాలన్న ఆలోచన వస్తుంది" అని అంటారు. దానిని నమ్మినవారు కాలాన్ని, ధనాన్ని ఖర్చు పెట్టి మనశ్శాంతినీ, తాత్కాలిక ఆనందాన్నీ పొందుతూ ఉంటారు.

ఉద్యోగి వెళ్ళి ఆయన్ని కలుసుకున్నాడు. మోకరిల్లి తాను వచ్చిన పని చెప్పాడు. స్వామి చిరునవ్వుతో, "నీవు పుట్టిన సంవత్సరం, ఉద్యోగంలో చేరిన సంవత్సరం, నీ వయసు, ఉద్యోగ అనుభవకాలం – అన్నీ కలుపు నాయినా. నాలుగు అంకెల సంఖ్య వస్తుంది. వచ్చిందా?" అని ప్రశ్నించాడు. "వచ్చింది స్వామీ!" అన్నాడు ఉద్యోగి నమ్రతగా.

"ఆ నాలుగు అంకెల్నీ ఒకదానికి ఒకటి మళ్ళీ కలుపు." అన్నాడు స్వామి.



"కలిపాను బాబా!" అన్నాడు ఉద్యోగి.

"నాలుగు వచ్చింది కదా! అదే నీ దురదృష్టం."

ఉద్యోగి తన చెవులని తానే నమ్మలేనట్టు స్వామివైపు సంభ్రమంగా చూసి, చప్పున కాళ్ళమీదకు వంగి నమస్కరించి, "అద్భుతం స్వామీ! ఎలా తెలుసుకున్నారు దీన్ని?" అని అడిగాడు.

"ఆ విషయం పక్కన పెట్టు. ముందు నీ విషయం గురించి ఆలోచిద్దాం. నాలుగు అనే అంకెకి అధిపతి రాహువు. అదే నీకు కీడు చేస్తోంది. ఏడాదిపాటు పూజలు చేయాలి. పది లక్షలదాకా ఖర్చవుతుంది. నీకు సమ్మతమేనా?" అన్నాడు.

"అంతకన్నా భాగ్యం ఏముంటుంది? ఉద్యోగంలో అనుకున్నట్టు మార్పు వస్తే, ఆ డబ్బు కొన్ని నెలల్లో సంపాదిస్తాను స్వామీ!"

ఏడాదిపాటు పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా నడిచాయి. ఉద్యోగంలో మార్పు రాలేదు సరికదా గతంలో అక్రమార్జనలపై, ఆస్తులపై ప్రభుత్వం విచారణ మొదలు పెట్టబోతోందని తెలిసింది. ఉద్యోగి కాస్త కోపంతోనూ, ఎక్కువ దుఃఖంతోనూ స్వామి దగ్గరికి వెళ్ళి వాపోయాడు.

బుద్బుదానంద తాపీగా, "గతంలో చేసిన లెక్క మరొక్కసారి చెయ్యి నాయినా, ఈసారి ఎంత వచ్చిందో మనసులోనే లెక్క కట్టు. ఎనిమిది వచ్చింది కదా!" అన్నాడు. ఉద్యోగి తన దుఃఖమూ, కోపమూ మర్చిపోయి అమితాశ్చర్యంతో కళ్ళప్పగించి చూశాడు. స్వామి ఒక తాయెత్తు ఇస్తూ, "ఎనిమిది శనిగ్రహానికి సూచన. నా శక్తిని శని అడ్డుకుంటోంది. అందుకే ఈ తాయెత్తు. ఇది తయారుచేయటానికి లక్ష అయింది. ఆ డబ్బు ఇచ్చి తాయెత్తు తీసుకెళ్ళి చేతికి కట్టుకో" అన్నాడు.


బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! తాయెత్తుకి మహిమలూ, పూజలకి శక్తులూ ఉన్నాయా? అని ప్రశ్నించను. ఉంగరాలు ధరిస్తే జాతకాలు మారతాయా? లాంటి చొప్పదంటు ప్రశ్నలు నీలాంటి జ్ఞానిని అడగను. మొదటిసారి వచ్చినప్పుడు "నాలుగు" అనీ, రెండోసారి "ఎనిమిది" అనీ అవి రాహువు, శనులకు ప్రతీకలని బాబా ఎలా చెప్పాడు?" అని ప్రశ్నించాడు.

*(సమాధానం 199 పేజీలో)*

# 43. దమయంతి స్వయంవరం



వర్షర్తువు వెళ్లి హేమంతం వస్తోంది. నీటి పరికిణీ వదిలిన ప్రకృతి మంచు చీరె కట్టుకుంటోంది. దానిని కరిగించటానికి చిలిపి సూర్యుడు తూర్పు నుంచి తొంగి చూస్తున్న సమయంలో, తోటలో కూర్చుని దమయంతి ఒక తామరాకుని తదేకంగా చూస్తోంది. ఆ ఆకుపై నలమహరాజు బొమ్మ ఉన్నది.



సరస బిసినీ పలాంశంబు (తామరాకు) పై చరణ నఖాగ్రంపు (కాలిగోటి)తో హంస గీసిన బొమ్మ అది.

ఆ నలమహరాజు ఎంత అందగాడో శృంగార నైషథంలో శ్రీనాథుడు ఎంత గొప్పగా వర్ణించాడంటే, స్వర్గంలోని దేవతాస్త్రీలు ఆ మహారాజు అందాన్ని కన్నార్పకుండా తదేకంగా చూస్తూ ఉండటం వలననే అనిమేషులు (రెప్పపాటు లేనివారు) అయ్యార్ట.

ఆమె ఆ బొమ్మని చూసి రోమాంచిత స్థితిలో ఉండగా అక్కడికి నలుడు వచ్చాడు. అంత అకస్మాత్తుగా అతడు అక్కడ కనపడేసరికి ఆమె ఆశ్చర్యంతోనూ, ఆనందంతోనూ ఉక్కిరిబిక్కిరి అయింది. దుర్భేద్యమైన ఆ అంతఃపుర ప్రాంగణంలోకి ఎలా ప్రవేశించగలిగాడా అన్న అనుమానం కన్నా, అతడి దర్శనం ఆమెకు ఎక్కువ సంతోషాన్నిచ్చింది.



అయితే ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. ప్రేమికుడిగా తాను రాలేదనీ, ప్రేమకు రాయబారిగా వచ్చాననీ చెప్పాడు. "దేవీ! అష్ట దిక్పాలకుల్లో నలుగురు నిన్ను ప్రేమిస్తున్నారు. వారి తరపున రాయబారిగా వచ్చాను. వారి వలనే ఈ దుర్భేద్యమైన అంతఃపురంలోకి ప్రవేశించగలిగాను. వారిలో ఒకరిని వరించు" అన్నాడు.

"నిన్ను తప్ప ఎవరినీ వరించలేను. నేను ఆత్మహత్య చేసుకుని మరణిస్తాను" అన్నది దమయంతి.

నలుడు విషాదంగా నవ్వాడు. ఇక్కడ శ్రీనాథ కవి చమత్కృతి చూడండి. "ఏ విధంగా మరణిస్తావు నువ్వు? గాలిలో ఉరి వేసుకుంటే వాయుదేవుడూ, సముద్రంలో దూకితే వరుణుడూ సంతోషిస్తారు. ఏ విధంగా నువ్వు మరణించినా నీ ప్రాణాన్ని తీసుకువెళ్ళటానికి వచ్చిన యముడు సంతోషిస్తాడు. మరోవైపు ఇంద్రుడు స్వర్గంలో సిద్ధంగా ఉన్నాడు. ఆ నలుగురే నిన్ను ప్రేమిస్తోంది" అన్నాడు.

"వారి విషయం నేను చూసుకుంటాను" అంది దమయంతి.

(ఇక్కడి నుంచీ కథ కల్పితం).

❖ ❖ ❖

స్వయంవరం సిద్ధమైంది. మరికొద్దిసేపట్లో అది ప్రారంభ మవుతుందనగా వజ్రాయుధము, పాశము, దండము మొదలైన తమ తమ ఆయుధాలతో ఇంద్రుడు, యముడు, వరుణుడు మొదలైనవారు వచ్చారు. ఆమెను చూడగానే అశువుగా ఇంద్రుడు, "నీ లావణ్య పయోధి యందు అలరున్ నేత్రాబ్జముల్... స్వప్న సమాగమంబుల..." అన్నాడు.

దమయంతి నవ్వి, "అతిశయోక్తి అయినా అతికినట్లుండాలి. రెప్పపాటు లేని దేవతలకి నిద్రేమిటి? కల ఏమిటి?" అని అడిగింది. ఆ మాటలకి దెబ్బ తిన్న ఇంద్రుడు, "తెలివైన దానివేనే!" అన్నాడు.

"తెలివిని నమ్ముకోని వారే స్వయంవరానికి ఆయుధాలని తెచ్చుకుంటారు" అన్నది దమయంతి.

యముడు కోపంగా, "మా కన్నా తెలివైనదానివా నువ్వు? అయితే నేనొక ప్రశ్న వేస్తాను. సమాధానం చెప్పు. వరుణుడి కంటే నేను పెద్ద" అన్నాడు. వరుణుడు కల్పించుకుని "అవును. యముడి కంటే నేను చిన్న" అన్నాడు. గాలి దేవుడు కవ్విస్తూ, "వారిద్దరిలో కనీసం ఒకరు అబద్ధం చెపుతున్నారు" అన్నాడు.

చాలా అయోమయం కలిగించే ప్రశ్న. అయితే సకల విద్యా పారంగతురాలైన దమయంతి నవ్వి, "ఇద్దరూ ఒకేమాట చెప్పారు. అంటే ఇద్దరూ నిజమయినా చెపుతూ వుండి వుండాలి. లేదా అసత్యమయినా చెపుతూ వుండాలి. కనీసం ఒకరు అబద్ధం చెపుతున్నారంటే, ఇద్దరూ అబద్ధం చెప్పటానికి కూడా వీలున్నది కదా! కాబట్టి వరుణుడే పెద్ద" అన్నది.

అష్టదిక్పాలకులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

యముడు రోషంగా, "సరే! నేను మరొక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెప్పు" అన్నాడు.

"నాకేమిటి లాభం?" అంది దమయంతి.

"సరి అయిన సమాధానం చెప్తే స్వయంవరానికి నీ ప్రియుడు నలుడిని కూడా తీసుకొస్తాం. నీ తెలివితేటలతో అతడిని గుర్తుపట్టగలిగితే, మేము పోటీ నుంచి తప్పుకుంటాం" అన్నారు అష్టదేవతల్లో ఒకరు.

"ఏమిటి మీ ప్రశ్న?" అని అడిగింది.

"మాలో ముగ్గురు - వరుణుడు, వాయుదేవుడు, యముడు నిన్ను ప్రేమించారు. కానీ ప్రథముడు మాత్రం ఇంద్రుడు" అన్నాడు ఈశాన్య దేవుడు.

అప్పుడు ఇంద్రుడు కల్పించుకుని, "దమయంతీ! ఆ ముగ్గురూ మూడు ప్రకటనలు చేశారు. అవి ఇవి. అయితే ఏయే దేవుడు ఏ ప్రకటన చేసాడో నీకు చెప్పను. జాగ్రత్తగా విను.

1. అందులో ఒకరు "నలమహారాజుని నీవు ప్రేమిస్తున్నావని ఇప్పటివరకూ నాకు తెలీదు" అన్నారు. అతడు నిజం చెపుతున్నాడు.
2. "నన్ను వివాహమాడితే నిన్ను రాణిని చేస్తాను" అన్నారు మరొకరు. అతడు అబద్ధం చెపుతున్నాడో, నిజం చెపుతున్నాడో నాకు తెలీదు.
3. మూడో దిక్పాలకుడు "అందరిలోకి నిన్ను నేను అధికంగా ప్రేమిస్తున్నాను" అన్నాడు. అతడు అబద్ధం చెపుతున్నాడు.

ఇప్పుడు వారు మరి కొన్ని ప్రకటనలు చేస్తారు. అవి విని, ఆపై నీ తెలివితేటలుపయోగించి, ఎవరే ప్రకటన చేశారో కనుక్కుంటే, నీతో ఆఖరి పందానికి మేము 'సిద్ధం" అన్నాడు. దమయంతి వారివైపు తిరిగింది.

వరుణుడు నవ్వి, "నలమహారాజుని నీవు ప్రేమిస్తున్నావని నాకు తెలీదు- అన్నది వాయుదేవుడు" అన్నాడు. యముడు అతడిమాటలకు అడ్డుపడుతూ, "కాదు.



కాదు. ఆ మాట వాయుదేవుడు అనలేదు. తనని వివాహమాడితే రాణిని చేస్తానన్నాడు" అన్నాడు. వాయుదేవుడు తల అడ్డంగా ఊపుతూ "ఆ రెండూ నేను అనలేదు" అన్నాడు.

అష్టదిక్పాలకులూ ఆమెవైపు అల్లరిగా చూస్తున్నారు.

దమయంతి క్షణం కూడా ఆలోచించకుండా, "వరుణుడు అబద్ధం చెపుతున్నాడు. యముడు నిజం చెపుతున్నాడు" అన్నది.

అష్ట దిక్పాలకులూ అదిరిపడ్డారు. "ఎలా చెప్పగలిగావు? అందులోనూ అంతే వేగంగా ఎలా చెప్పావు?" అని అడిగారు.

దమయంతి చిరునవ్వుతో, "నా ప్రేమ గురించి తెలీదన్నవాడు నిజం చెపుతున్నాడు. అలా అన్నది వాయుదేవుడు అని వరుణుడు అన్నాడు. అది అబద్ధం. ఎందుకంటే, వరుణుడు కానీ నిజం చెప్పి ఉంటే, "ఆ మాట నేను అనలేదు" అని వాయదేవుడు అనడు. కాబట్టి యముడొక్కడే సత్యసంధుడు" అన్నది. ఆ మాటలకి యముడి మొహం ఆనందంతో వెలిగిపోయింది.

❖ ❖ ❖

ఇంతలో స్వయంవరం మొదలైంది. నలుడు కూడా ఉన్నాడు. అతడి మనసంతా అలజడిగా ఉంది. దమయంతి మాత్రం తన తెలివిపై నమ్మకంతో నిబ్బరంగా ఉంది.

రాజులందరూ ఆశీనులై ఉన్నారు. అందులో అష్ట దిక్పాలకులు కూడా ఉన్నారు. ఒకవైపు నలుగురూ, మరోవైపు అయిదుగురూ కూర్చుని ఉన్నారు. మొత్తం తొమ్మిదిమంది అయ్యారు. ఆమె అయోమయంలో పడింది. ఉండవలసింది ఎనిమిది మందే కదా! ఇది దేవతల మాయ అని అర్థమైంది.

అంతలో ఆమె కళ్లముందు ఏదో పొర కదులుతున్నట్టుగా అనిపించింది. ఎదురుగా ఉన్న అయిదుగురిలో ఇద్దరు మాయమయ్యారు. ఆమె దిగ్భ్రమతో చూసింది. మిగిలిన ముగ్గురూ ఒకే రూపంలో అచ్చుగుద్దినట్టుగా ఉన్నారు.

ఆమె వెనుక నుంచి అశరీరవాణిగా ఇంద్రుడి స్వరం వినిపించింది- "ఆ ముగ్గురిలో ఒకరు నీ భర్త! అతడిని నువ్వు గుర్తుపట్టాలి. మిగిలిన ఇద్దరూ యముడు, వాయువు. ముగ్గుర్నీ నీవు ఒక్కొక్క ప్రశ్న వేయవచ్చు. కేవలం ఒకే ప్రశ్న సుమా" అన్నాడు. ఆమె సందిగ్ధంగా చూసింది. ఇంద్రుడు కొనసాగించాడు. "నీ భర్త నీతో నిజమే చెపుతాడు కాబట్టి అతడి సంగతి వదిలేస్తే, యముడు సదా అబద్ధమే చెపుతాడు. వాయువు నిజంగానీ, అబద్ధం గానీ ఏదైనా చెప్పవచ్చు."

దమయంతి ఒక క్షణం కనులు మూసుకుని ఆలోచించి, మొదటి వ్యక్తిని, "మధ్యలో కూర్చున్న వ్యక్తి పేరేమిటి?" అని అడిగింది.

"నలమహారాజు" అన్నాడు.

మధ్యవ్యక్తిని "నీ పేరేమిటి?" అని అడిగింది.

"యముడు" అన్నాడు అతడు.

దమయంతి తన చేతిలోని పూలమాల మూడో వ్యక్తి మెడలో వేసింది. దిగ్భ్రాంతులై చూస్తున్న దిక్పాలకులతో "మూడో ప్రశ్న అవసరం లేదు" అన్నది చిరునవ్వుతో.

❖ ❖ ❖

అత్యంత వైభవంగా జరిగిన నల దమయంతుల వివాహానికి వచ్చిన అష్ట దిక్పాలకులు- ఆమె అంత వేగంగా ఎలా జవాబు చెప్పగలిగిందని ప్రశ్నించారు. అప్పుడామె దానికి జవాబు చెప్పింది. అంతావిని "బాగా చెప్పావు. నీ పట్ల కాంక్ష ప్రకటించినందుకు మేము సిగ్గు పడుతున్నాము. దమయంతీ! నీవే గెలిచావు" అన్నారు దిక్పాలకులు.

చివరగా ఇంద్రుడన్నాడు. "మనిషికీ జంతువుకీ మూడు ముఖ్యమైన తేడాలున్నాయి. తెలివి, కోరిక, నైపుణ్యం..! కోరిక ఉన్నవాడు జీవిస్తాడు. లేనివాడు కేవలం కాలం వెళ్లదీస్తాడు. నైపుణ్యమూ, తెలివి, కోరిక ఉన్నవారు విజయం సాధిస్తారు. అవి లేనివారు జీవితపు చివర్లో మేల్కొని, తాము ఎన్నడో మరణించామని గుర్తిస్తారు. తెలివికన్నా గొప్ప ఆయుధం మరొకటి లేదు. ఆ విషయమే నీవిప్పుడు నిరూపించావు. నీకు శుభం కలుగుగాక."

బేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా! దమయంతి అంతసులభంగా తన భర్తని ఎలా గుర్తించింది?" అని అడిగాడు. దానికి సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా చెప్పాడు.

(సమాధానం 200 పేజీలో)

# జవాబులు

## 1. అతి తెలివి

"పది సంవత్సరాలు తిరిగే సరికి చిన్న పిల్లల్లో ఆడపిల్లల శాతం రెట్టింపు అవుతుంది" అన్నాడు విక్రమార్కుడు. "ఈ సమాధానం నీకు ఆశ్చర్యం కలిగించవచ్చు గానీ ఇది నిజం! దేశంలో కొత్తగా పెళ్లయిన దంపతులు వందమంది వున్నారను కుందాం. అందులో సగం మందికి మొదటి సంతానం మొగపిల్లలు, మిగతా సగం మందికి ఆడవారూ పుడతారు. అందుకే మంత్రి - దేశంలో పిల్లలు **సగం సగం నిష్పత్తిలో వున్నారు** అన్నాడు. రాజుగారు చేసిన శాసనం వలన, ఆడపిల్ల పుట్టిన దంపతులు అక్కడితో ఆపుతారు. మొగపిల్లవాడి తల్లిదండ్రులు మరో ప్రయత్నం చేస్తారు. వారికి రెండో సంతానంగా ఆడపిల్ల పుట్టే అవకాశమే ఎక్కువ.

నీకు అర్థం అవటం కోసం మరింత వివరంగా చెపుతాను. పక్క పక్క ఇళ్ళలో నాలుగు జతల కొత్త దంపతులు వున్నారనుకో. సగటున ఇద్దరు దంపతులకు మొదటి సంతానం మొగ పిల్లలు, ఇద్దరు దంపతులకు ఆడపిల్లలు పుడతారు. ఆడపిల్లల వారు అక్కడితో ఆపుతారు. మొగపిల్లల తల్లితండ్రులు మరో సంతానాన్ని కనవచ్చు. మంత్రి మాటల ప్రకారం వారికి ఆడపిల్లలు పుట్టే అవకాశమే ఎక్కువ. అప్పటివరకూ దేశంలో నిష్పత్తి సమానంగా వున్నదంటే అదే కదా అర్థం. ఈ లెక్కన ఆ వీధిలో 2 మొగపిల్లలు, 4 ఆడపిల్లలు పెరిగారు కదా. అలా కాలం గడిచేకొద్దీ ఆడవారు మొగవారికి రెట్టింపు అవుతారు. ఒకవేళ ఒక దంపతులకు రెండో సంతానంగా కూడా మొగపిల్లవాడే పుట్టినా 3:3 అవుతారుతప్ప మొగవాళ్ళు పెరగరు. అతి తెలివి రాజుగారు ఆ విధంగా అతి చిక్కటి పప్పులో కాలు వేసారు".

విక్రమార్కుడికి ఈ విధంగా మౌన భంగం కాగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టు నాశ్రయించాడు.

(ప్రశ్నలో ప్రచురించిన బొమ్మ పరిశీలనగా చూస్తే ఈ సమాధానం మరింత బాగా అర్థమవుతుంది.)

## 2. రాజుగారి సమస్య

విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు "తెలివి తేటలు రకరకాల స్థాయిల్లో ఉంటాయి. అందరికీ అర్థం అవటం కోసం ప్రశ్నని చిన్నది చేద్దాం. వెయ్యికి బదులు, 4 సీసాలే ఉన్నాయనుకుందాం. వాటిలో విషం ఉన్నదాన్ని కనుక్కోవటానికి ఎందరు కావాలి?

'నలుగురు కావాలి' అనేది మొదటిస్థాయి తెలివి. 'అవసరం లేదు. ముగ్గురు చాలు' అనేది రెండోస్థాయి తెలివి. 'అది కూడా అవసరం లేదు. ఇద్దరు చాలు' అనేది మూడోస్థాయి తెలివి. ఎలాగో చెప్పమంటావా?

ఖైదీలు రాము, సోము - అనుకుందాం. రామూ మొదటిదీ, సోమూ రెండోదీ, ఇద్దరూ కలిసి మూడోదీ తాగుతారు. రామూ మరణిస్తే ఒకటో సీసా కల్తీ. సోమూ మరణిస్తే రెండో సీసా కల్తీ. ఇద్దరూ మరణిస్తే మూడోది, ఎవరూ మరణించక పోతే నాలుగోది కల్తీ!

నాలుగు సీసాల్లో కల్తీ సీసా పట్టుకోవటానికి ఇద్దరు ఏ విధంగా సరిపోతారో, ఎనిమిదింటిలో కల్తీ సీసా పట్టుకోవటానికి ముగ్గురు చాలు. ఏ విధంగానో చెప్పమంటావా భేతాళా! అయోమయం చెందకు. శ్రమ కోర్చుకుని విను. జ్ఞానమూ, దంతమూ వచ్చేటప్పుడు చాలా బాధపెడతాయి. కానీ వచ్చాక ఆ సౌఖ్యం తెలుస్తుంది. అందుకని అర్థం చేసుకో.

ఖైదీల పేర్లు ఎ, బి, సి అనుకో! ఎ మొదటి సీసానీ, బి రెండోదాన్నీ, సి మూడోదాన్నీ, ఎబి (4), బిసి (5), సిఎ (6), ఎబిసి (7) తాగుతారు. ఎబి మరణిస్తే నాలుగో సీసా కల్తీది. ఎబిసి ముగ్గురూ మరణిస్తే ఏడో సీసా కల్తీది. ఒకసారి ఈ సూత్రం అర్థమైతే, నాలుగు సీసాల స్వచ్ఛత పరీక్షించటానికి ఇద్దరూ (2×2), ఎనిమిది సీసాల్ని పరీక్షించటానికి ముగ్గురూ (2×2×2), పదహారుకి నలుగురూ (2×2×2×2) చాలని అర్థమవుతుంది.

"ఆరంభింపరు నీచ మానవులు" అన్న భర్తృహరి పద్యం తెలుసుకదా. మధ్యలో వదిలెయ్యక లెక్కగట్టు. పదిమంది ఖైదీలతో 1024 సీసాలని ఆవిధంగా పరీక్షించవచ్చునని నీకే తెలుస్తుంది."

రాజుకీ విధంగా మౌన భంగం కాగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.



## 3. సమయం విలువ

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు. "నకులుడు చురుకైనవాడే...! కానీ నలుగుర్నీ తీసుకెళ్లే బాధ్యత అతడు తీసుకోవటం ద్వారా సమయం వృథా అవుతుంది. ధర్మరాజుని ఒకసారి, భీముడిని రెండోసారి తీసుకెళ్లటానికి 45 నిమిషాలు పడుతుంది. అలా కాకుండా, వారిద్దరినీ కలిసి వెళ్లమనటం ద్వారా పాతిక నిమిషాల్లో పని అయిపోతుంది కదా! అదే సమయస్ఫూర్తి!

నకుల సహదేవులు ముందు ఇటుగా వచ్చి (5) నకులుడు వెళ్లి (5) భీముడిని, ధర్మరాజుని ఇటు పంపి (25) వారి వద్దనున్న కాగడా సహదేవుడు తీసుకుని (5) అర్జునుడిని తెచ్చి (10) చివరిగా వెళ్లి (5) నకులుడితో కలిసి వస్తే (5) కాగడా ఆరిపోయే సమయానికి - అంటే అరవై నిమిషాల్లో అయిదుగురూ ఇటు చేరుకుని, అటు వైపు కౌరవులు ఎంతో కష్టపడి ధనం వెచ్చించి కట్టిన లక్క ఇల్లు తగలబడిపోవటం చక్కగా కనులారా నవ్వుతూ గమనించవచ్చు. బేతాళా! ఈ ప్రశ్నకి ముందు నీవు "నీటిలో తేలే ఐసు" గురించిన ప్రసక్తి తెచ్చావు గుర్తుందా? ఆ ప్రశ్నకి జవాబు చెప్పటం చాలా కష్టం. నీరు ఘనీభవించబోయేముందు వ్యాకోచం చెందుతుంది. అందుకే నీటిపై అది తేలుతుంది. ధృవ ప్రాంతంలో చేపలకి ప్రకృతి ఇచ్చిన గొప్ప వరం అది. పైన ఐసుపొర వుండటం వల్ల లోపలి నీరు వెచ్చగా వుండి వాటికి రక్షణ ఇస్తుంది. ఇక నీ ప్రశ్న "ఐసు కరిగితే నీటి మట్టం పెరుగుతుందా?" అన్న దానికి సమాధానం... 'పెరగొచ్చు. పెరగకపోవచ్చు.' వ్యాకోచించిన ఐసు పరిమాణం నీటికన్నా ఎక్కువ. అందువల్ల అది కరగటం వలన నీటిమట్టం తగ్గుతుంది. అదీగాక, ఐసులో గాలి బుడగలు కూడా వుంటాయి కదా. ఇది ఒక సమాధానం. ఆర్కిమెడిస్ సూత్రం ప్రకారం, ఐసు నీటిపై వుంటుంది కాబట్టి, అది కరగి నీటిలోకి జారినప్పుడు నీటి మట్టం పెరుగుతుంది. ఇది మరో సమాధానం" అన్నాడు.

రాజుకీ విధంగా మౌన భంగం కాగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**చికెన్ 65 అన్న పేరెందుకొచ్చింది?**


సరిగ్గా 65 రోజుల వయసున్న కోడిమాంసము అమితమైన రుచిగా వుంటుందట. ఒక ప్రసిద్ధ కంపెనీ (ఒక రోజు అటూ ఇటూ కాకుండా) అదే వయసున్న కోడి మాంసాన్ని అమ్ముతూ నెం.1 స్థానాన్ని పొందింది.

## 4. జ్ఞానానికి మొదటి మెట్టు - తర్కం

అప్పుడు విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"మంత్రికి ముందు వ్యక్తి టోపీ మాత్రమే కనపడుతోంది. కానీ మంత్రి వెనుక వున్న వ్యక్తికి రెండు టోపీలూ కనపడుతున్నాయి. అక్కడున్నవి రెండు కొబ్బరాకులు, రెండు తాటాకుల టోపీలని అతనికి తెలుసు. ముందు కనపడుతున్నవి **రెండూ కొబ్బరాకులవయితే**, వెంటనే తన టోపీ తాటాకుదని వెంటనే చెప్పేసేవాడు. అతడు మౌనంగా వున్నాడంటే, ఎదురుగా ఉన్న రెండు తలలపై రెండు వేర్వేరు టోపీలు చూస్తున్నాడన్నమాట. ఇది తెలిసిన తరువాత మంత్రి పని సులువైపోయింది. తన ముందు వ్యక్తి తలపై ఉన్నది తాటాకు టోపి అని చూశాడు కాబట్టి, తన తలపై వున్నది 'కొబ్బరాకులది' అని మంత్రి తెలుసు కున్నాడు."

"అద్భుతంగా చెప్పావు. చాలా గొప్పగా ఆలోచించావు. రాజా! తెలివితేటలు రకరకాల స్థాయిల్లో వుంటాయి! నిన్న నేను అడిగిన ప్రశ్న మొదటిస్థాయి తెలివితేటలకి సంబంధించినది. దీనికన్నా పైస్థాయి ప్రశ్న ఇప్పుడు అడుగుతున్నాను." అంటూ ఈ విధంగా అడిగాడు.



"ముగ్గురు వ్యక్తుల్నీ ఒకరి వెనుక ఒకర్ని భూమిలోతు పాతిన నరమాంస భక్షనాయకుడు ఈసారి **అయిదు టోపీలు** తెప్పించాడు. రెండు నల్లవి. మూడు తెల్లవి. ముగ్గురి తలలపై మూడు పెట్టి, రెండిటిని తుప్పల్లోకి విసిరేసాడు. విసిరేసిన వేమిటో ముగ్గురికీ తెలీదు, అందరికన్నా వెనుక వున్న సైనికుడిని, అతడి తలపై టోపీ రంగు ఏమిటని అడిగాడు.

అతడికి ముందున్న ఇద్దరి టోపీలూ కనపడుతున్నాయి.

"నాకు తెలీదు" అన్నాడు అందరికన్నా వెనుకనున్నవాడు.

అతడి ముందున్నవాడినీ నరమాంస భక్షకుడు అదే ప్రశ్న అడిగాడు.

అతడు కూడా "నాకు తెలీదు" అన్నాడు.



అందరికన్నా ముందున్నవాడు మంత్రి.

అతడి ముందు ఏ టోపీలూ కనపడటం లేదు.

"నీ తలపై ఉన్నది ఏ రంగు టోపీ?" అని నాయకుడు అడిగిన ప్రశ్నకి, "నా వెనుక వాళ్లిద్దరూ చెప్పలేదా?" అని ఎదురు ప్రశ్నించాడు మంత్రి.

"వాళ్లకి ముందు టోపీ కనపడుతోంది. అయినా చెప్పలేక పోయారు. నువ్వు కూడా చెప్పలేకపోతే ఇక మాకు విందే..." అంటూ మళ్లీ వికటాట్టహాసం చేశాడు నరమాంస భక్షకుడు.

అతడి మాటలు ఇంకా పూర్తి కాకముందే "వాళ్లిద్దరూ మాట్లాడలేదంటే, నా తలపై ఉన్నది తెల్ల టోపీ" అన్నాడు మంత్రి. నాయకుడి నవ్వు సగంలో ఆగిపోయింది. మంత్రి ఎలా కనుక్కున్నాడో అర్థం కాలేదు. రాజా! ఇది సామాన్యమైన ప్రశ్న కాదు. పిల్లల్లోనూ, పెద్దల్లోనూ తార్కిక శక్తిని పెంచే ప్రశ్న! కేవలం సమాధానం తెలియటమే కాదు, అవతలి వారికి దానిని అర్థమయ్యే రీతిలో చెప్పటం కూడా అందమైన కళే!" అన్నాడు బేతాళుడు. దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"అందరికన్నా వెనుక ఉన్నవాడికి ముందు రెండు టోపీలు కనపడుతున్నాయి. అవి రెండూ నల్లవి అయిన పక్షంలో, ఉన్నవి రెండు నల్ల టోపీలే కాబట్టి... తన తలపై ఉన్నది తెల్లది అని సులభంగా చెప్పేసేవాడు. అతడలా చెప్పలేదంటే అతడి కళ్లముందు **రెండు తెల్లటోపీలుగానీ, ఒక నల్లదీ ఒక తెల్లది గానీ** కనపడుతున్నాయన్నమాట. మధ్యనున్నవాడు ఈ మాత్రం అర్థం చేసుకుంటే, తన ముందున్నవాడి టోపీ నల్లదైన పక్షంలో, నిస్సంకోచంగా, క్షణమైనా ఆలోచించకుండా, తన తలపై ఉన్నది తెల్లది అని చెప్పి వుండేవాడు. (రెండూ నల్లవి అయ్యే అవకాశం లేదు కదా.) అతడు అలా చెప్పకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు కాబట్టి, అందరికన్నా ముందున్న మంత్రికి తన తలపై ఉన్నది "తెల్లటోపీ" అని తెలిసిపోయింది. అది చెప్పి ఆ విధంగా నరమాంస భక్షకుల బారి నుంచి ముగ్గురూ బయటపడ్డారు. "ఎందుకొచ్చిందిలే ఇంత కష్టం" అనుకోకుండా చదివి, తర్కం అర్థం చేసుకుని ఇలాంటివి పిల్లలకి చెప్తే, వారిలోంచే ఒక ఐన్‌స్టీనూ, అబ్దుల్ కలామూ ఉద్భవిస్తారు" అన్నాడు. రాజు మౌనభంగంతో విక్రమార్కుడు తిరిగి చెట్టెక్కాడు.

## 5. కృషికీ, తెలివికీ తేడా!

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు "రాకుమారుడు అమ్మాయికీ గుడికీ మధ్య **ఎన్నిసార్లు తిరిగాడు**? ఈ లోపులో ఆమె ఎంత ముందుకు నడిచింది? లాంటి లెక్కలు కడితే ఈ సమస్య తేలదు. జీవిత సమస్యలు కూడా అంతే! సరైన దారిలో ఆలోచించకపోతే పరిష్కారం లభించదు. చాలామంది జీవితంలో ఎదురైన సమస్యలకన్నా, లేని సమస్యల పరిణామాల్నీ, రాబోయే సమస్యల వల్ల కలగబోయే కష్టాల్నీ ఊహించుకుని కలత చెందుతూ ఉంటారు.

గంటకు అరవై క్రోసుల వేగంతో, మూడు నిమిషాల్లో ప్రదీపుడు మొదటిసారి గుడికి చేరుకున్నాడు. అంటే గుడికీ హిమసమీరకీ ప్రారంభ దూరం మూడు క్రోసులన్నమాట. లెక్కలో ఇచ్చిన దాని ప్రకారం ఆమె ఆ దూరం నడవటానికి గంటసేపు పడుతుంది. ఈ గంటసేపు అటూ ఇటూ ప్రదీపుడు గుర్రం మీద కాలుగాలిన పిల్లిలా ఆ పిల్ల కోసం తిరుగుతూనే వున్నాడు. ఎన్నిసార్లు తిరిగాడు అన్నది కాదు ఇక్కడ ముఖ్యం. ఎంతసేపు తిరిగాడన్నది లెక్క కట్టాలి. గంటసేపు తిరిగాడు. అంటే మొత్తం అరవై క్రోసులు ప్రయాణించాడన్నమాట."

రాజుకీ విధంగా మౌన భంగం కలగగానే బేతాళుడు తిరిగి శవంతో సహా చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**ఆలోచించేటప్పుడు మనుష్యులు పైకెందుకు చూస్తారు?**

"న్యూరో లింగ్విస్టిక్స్" అని కొత్తగా ప్రాముఖ్యత పొందుతున్న శాస్త్రం ప్రకారం, ఒక పాత విషయాన్ని గుర్తు చేసుకుంటున్నప్పుడు పై శూన్యంలోకి చూస్తూ ఆ "దృశ్యాన్ని" మనిషి వూహించుకుంటాడు. గతంలో జరిగిన "మాటల్ని" గుర్తుతెచ్చుకోవలసి వచ్చినప్పుడు క్రిందికి చూస్తాడు. ఎదుటి వారు అర్థం కానప్పుడు, తన భావాలు చెప్పవలసి వచ్చినప్పుడూ సూటిగా చూస్తాడు.



## 6. అన్న కన్నా తమ్ముడు పెద్ద

"విమానంలో బయల్దేరి పడమటివైపు వెళ్లేవారు గడియారాన్ని వెనక్కి జరుపుకోవాలి. తూర్పు వైపు వెళ్లేవారు ముందుకి జరుపుకోవాలి. ఇటు ముందుకీ అటు వెనక్కీ జరుపుకుంటూ పోతే, ఒకచోటకొచ్చేసరికి ఒకరోజు తేడా వస్తుంది. **భూమ్మీద ఊహాజనితమైన ఆరేఖని అంతర్జాతీయ దినరేఖ అంటారు.**

ప్రపంచంలో ఆ గీతకి అటు ఉన్నవారికీ ఇటు ఉన్నవారికీ ఒక రోజు తేడా ఉంటుందన్న మాట.

లవకుశుల తల్లి ఏ పడవలోనో, ఓడలోనో ప్రయాణం చేస్తూ గీతకు ముందు లవుణ్ణీ, గీత తరువాత కుశుణ్ణీ కని ఉంటుంది. అందువల్ల పెద్దవాడు, ఆ తరువాత పుట్టినవాడి కన్నా చిన్నవాడు అయ్యాడు. ఈ దినరేఖ గురించి పిల్లలకి పాఠ్యాంశాల్లో ఉన్నదో లేదో తెలీదు కానీ దీని గురించి చెప్పవలసిన బాధ్యత మాత్రం ఇంట్లో పెద్దలదే" అన్నాడు. ఈ విధంగా రాజుకి మౌనభంగం కలుగగానే, బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

(ఈ ప్రశ్నకి మరో సమాధానం కూడా వున్నది. ఆలోచించండి. -రచయిత)

### మీకు తెలుసా?

**సాదు స్వభావుడయిన లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులెందుకు కోసాడు?**

కవిసామ్రాట్ ఊహ ప్రకారం శూర్పణ చెవులకు గ్రహణశక్తి వుంది. ఎన్ని యోజనాల దూరంలో వున్న జంతువు అలికిడినైనా పసిగట్టి, గట్టిగా ఊపిరి పీలిస్తే అది నోటి ముందుకు వచ్చి పడాల్సిందే. రాక్షసుల బారినుంచి మునుల్నీ, జంతువుల్నీ కాపాడటానికి వనవాసానికి వచ్చినవాడు, ఆ విధంగా ఆమె ముక్కు చెవులూ కోసి తన బాధ్యత నిర్వహించాడు.

## 7. పడవ దాటిన సమస్యలు

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు "ఎటువంటి పరిస్థితుల్లోనూ నాగరికుల సంఖ్యని నరమాంసభక్షకుల సంఖ్య అధిగమించకూడదు. కాబట్టి మొదటి భక్షకుడు ఇటు రాగానే, అతడిని అక్కడే ఉండమని రాజు, మంత్రి అటు వెళ్తారు. తరువాత మంత్రీ, ఒక భక్షకుడూ ఇటు వస్తారు. ఆ పైన మంత్రి తన సైనికుడిని అటు తీసుకెళ్ళి, అటు ఉన్న భక్షకుడిని ఒంటరిగా ఇటు పంపుతాడు. ఆ విధంగా ముగ్గురు ఇటూ, ముగ్గురు అటూ చేరుకుంటారు" అని ఆగి, "బేతాళా! ఇంతకన్నా కష్టమైన ప్రశ్న మరొకటి ఉన్నది. నా మౌనభంగం కలుగగానే నీవు వెళ్లిపోతావని తెలుసు. నేను మళ్ళీ వచ్చేలోపుగా ఆలోచించి ఉంచు" అంటూ చెప్పసాగాడు.

"ముగ్గురు ఇటు, ముగ్గురు అటూ కాకుండా అందరూ ఒకవైపే ఉంటే, ఆ ప్రశ్న చాలా కష్టతరమవుతుంది. సమస్యని ఈ విధంగా ఊహించు. నదికి ఒకవైపే రంగయ్య, గంగయ్య, వెంకయ్య, వారి భార్యలైన రంగమ్మ, గంగమ్మ, వెంకమ్మలు ఆరుగురూ ఉన్నారు అనుకుందాం. పడవ ఇద్దరినే మోయగలదు. మొగవాళ్ల అనుమానస్తులు. ఏ భార్య అయినా తన భర్త లేకుండా **పరపురుషుడి సమక్షంలో నదీ తీరంపై గానీ, పడవలో గానీ ఉండడానికి** ఒప్పుకోరు. మరోలా చెప్పాలంటే స్త్రీ... తోటి స్త్రీతోగానీ, భర్తతోగానీ ప్రయాణం చెయ్యాలి. అదే విధంగా, ఒక స్త్రీ... సాటి స్త్రీల మధ్యగానీ, తన భర్తతో గానీ ఉండాలి. బేతాళా! కష్టపడటానికి మనసు నిరాకరిస్తుంది. సుఖం దానికి హాయినిస్తుంది. కానీ రాపిడి చెందే కొద్దీ మెదడు పదునెక్కుతుంది. 'మనకెందుకులే ఇంత శ్రమ' అనుకునేవాడు జీవితంలో పైకి రాడు. రాలేదు. నా ప్రశ్నని పక్కన పడెయ్యకుండా, నేను వచ్చేలోపులో ఆలోచించి ఉంచు" అన్నాడు. రాజుకీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతో సహా చెట్టెక్కాడు.

(సమాధానం ప్రక్క పేజీలో)



రాజు ప్రశ్నకి సమాధానం:

ముందు రంగయ్య తన భార్య రంగమ్మతో అవతలి ఒడ్డుకు వెళ్తాడు. మళ్ళీ తిరిగి వచ్చి ఇద్దరు స్త్రీలను, అంటే... గంగమ్మ, వెంకమ్మలను అవతలి ఒడ్డుకు పంపుతాడు. ఇప్పుడు రంగమ్మ పడవని తిరిగి ఇవతలి ఒడ్డుకు తెస్తుంది.. ప్రయాణం ఈ విధంగా పది విడతలుగా సాగుతుంది. ఉదాహరణకు భర్తలను ABC, భార్యలను abc అనుకుంటే, జవాబు ఇలా వుంటుంది.

| ట్రిప్ నెం. | ఇవతలి ఒడ్డున వున్నవారు | పడవలో ప్రయాణించేవారు | అవతలి ఒడ్డున వున్నవారు |
|---|---|---|---|
| 1 | Bb Cc | Aa → | Aa |
| 2 | Bb Cc | ← A | a |
| 3 | A B C | bc → | abc |
| 4 | A B C | ← a | b c |
| 5 | Aa | BC → | b c |
| 6 | Aa | ← Bb | Cc |
| 7 | a b | AB → | Cc |
| 8 | a b | ← c | A B C |
| 9 | b | a c → | A B C |
| 10 | b | ← B | Aa Cc |
| 11 | | Bb → | Aa Cc |
| సమాప్తం | | | Aa Bb Cc |

## 8. తెలివికి హద్దుల్లేవు

ఆ సమస్యకు విక్రమార్కుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు. "మరుసటి రోజు ఉరి అనగా, అంతకష్టంలో మంత్రి ఏమి ఆలోచించి తనవారినందరినీ రక్షించ గలిగాడు? బేతాళా! నీ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు భావోద్వేగ నిబద్ధత గురించి కొంచెం చెప్పవలసి ఉంటుంది. అన్ని వైపుల్నుంచీ కష్టాలు చుట్టుముట్టినప్పుడు, అపాయం ముంచుకొస్తున్నప్పుడు, నీవేవిధంగా ప్రవర్తించి పరిష్కారాన్ని ఆలోచిస్తావు అన్నదే 'భావోద్వేగ నిబద్ధత'. దీనికో ఉదాహరణ చెపుతాను విను. పడవలో చాలామంది యాత్రికులతో కలిసి నీవో దీవి సందర్శనానికి వెళ్లావు. సముద్రం మధ్యలో ఉన్న ఆ దీవి ఎంతో అందంగా ఉన్నది. ఆ సౌందర్యానికి ముగ్ధుడివై, ఆ సౌందర్యాన్వేషణలో పడవ వెళ్లిపోవటం గమనించలేదు. చీకటి పడుతోంది. నీటిమట్టం పెరుగుతోంది. పాములు వొడ్డుకు కొట్టుకొస్తున్నాయి. రెల్లుగడ్డి భయంకరంగా ఊగుతోంది. చుట్టూ గాలి శబ్దం తప్ప మరేమీ లేదు. 'ఆ ఒంటరి దీవిలో నువ్వేం చేస్తావు? ఆ మానసిక ఒత్తిడిని ఎలా తట్టుకుంటావు?' అన్నదానికి సమాధానం చెప్పేదే నీ మనసుపై నీకున్న నిబద్ధత" అంటూ ఆగి కొనసాగించాడు.

"ఒక రాకుమారుడు అశ్వంపై అర్థరాత్రి అడవిలో వెళ్తున్నాడు. దట్టమైన చీకటి, పెద్ద తుఫాను, ఉరుములు, మెరుపులు! ఆ పరిస్థితుల్లో ఒక చెట్టుకింద, చిన్నప్పుడు తన ప్రాణాల్ని రక్షించిన వైద్యుడిని చూశాడు. అతడి పక్కనే చలికి వణికిపోతూ చావటానికి సిద్ధంగా ఉన్న ఒక వృద్ధురాలిని చూశాడు. వారితోపాటు తన ప్రియురాలిని కూడా గమనించాడు. తన అశ్వంపై కేవలం **ఒకరినే** తీసుకెళ్లగలడు. ఎవరిని తీసుకెళ్లాలి?

మానవతావాదులు వృద్ధురాలిని, యదార్థవాదులు వైద్యుణ్ని, అవకాశవాదులు అమ్మాయినీ తీసుకువెళ్తామంటారు. కాని తన అశ్వాన్ని వైద్యుడికిచ్చి, వృద్ధురాలిని తీసుకువెళ్లమని చెప్పి, తెల్లవారే వరకూ వర్షంలో తన ప్రియురాలితో తడుస్తూ ఆనందించటమే సమయస్ఫూర్తి.

'ఈ రోజు ఏ వారం' అని ఒక తర్కశాస్త్రజ్ఞుడిని అడిగితే, "రేపు నిన్న అయితే ఈ రోజు శనివారం" అని సమాధానం చెప్పాడనుకో! నీవీరోజు 'గురువారం' అని ఎంత తొందరగా గ్రహించగలవన్నది నీ తార్కిక జ్ఞానం. గురువారానికి మరుసటిరోజు శుక్రవారం కనుక, నిన్న శుక్రవారం అయితే ఈ రోజు శనివారమే కదా!

అదేవిధంగా నలుగురు వ్యక్తులు ఒకరితో ఒకరు కరచాలనం చేసుకుంటే, మొత్తం ఆరు కరచాలనాలు జరుగుతాయని వెంటనే చెప్పగలగటం లెక్కల్లో పరిజ్ఞానం.

బేతాళా! ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, 'నీవు అడిగావు గుర్తుందా? "ఎన్నిసార్లు ఇలా శవాన్ని మోస్తూ తిరుగుతావు. నీకు విసుగురాదా?" అని! నీ ప్రశ్నలు నామెదడుకి రాపిడి పెడుతున్నాయి. నీవడిగినది నిజంగా చక్కటి ప్రశ్న: పదిమంది



వ్యక్తుల్ని వరుసగా ఒకరి వెనుక మరొకర్ని నిలబెట్టి తెలుపు, నలుపు టోపీలు పెట్టి, తమ తలపై ఉన్న టోపీల రంగు కనుక్కోమంటే, నిజంగా చాలా కష్టం. కానీ చివర్లో రాజు, తన మంత్రికి నమస్కరించి ఏమన్నాడు? "అందరి కన్నా చివర నిల్చుని మీ ప్రాణాల్ని ప్రమాదంలో పెట్టి మమ్మల్నందర్నీ రక్షించారు" అన్నాడు గుర్తుందా! ఈ ప్రశ్నకి సమాధానం చెప్పాలంటే ఆ మాటలే ఆధారం...!

**దీన్ని బట్టి తేలిందేమిటంటే, చివరనున్న మంత్రికి తన తలపైనున్న టోపీ రంగు ఏదో తెలీదు. తెలుపో, నలుపో– రెంటిలో ఏదో ఒకటి చెప్పి అదృష్టవశాత్తు బయటపడ్డాడు.**

కాని అతడికి తన ముందున్న వారి అందరి టోపీలూ కనపడుతున్నాయి. అంతకు ముందు రాత్రి తన వారందరికీ ఏం చెయ్యాలో చెప్పాడు కదా! ప్రతి వ్యక్తినీ, తన ముందున్న టోపీలని చూడమనీ, **నలుపుకి '1', తెలుపుకి '2'** విలువ ఇచ్చి మొత్తం టోపీల విలువ కూడమని ఉంటాడు. తన టోపీకి ముందు వెనుకల తేడా బేసిసంఖ్య అయితే టోపీరంగు నలుపు, సరిసంఖ్య అయితే తెలుపు."

"నాకు అర్థం కావటం లేదు విక్రమార్కా" అన్నాడు బేతాళుడు.

"విజయరహస్యం అంత సులభంగా అర్థం కాదు బేతాళా! పట్టువదలని నన్ను చూస్తే ముచ్చట వేస్తుందని నువ్వే అంటావు కదా! అర్థం చేసుకోవటానికి ప్రయత్నించు. **మంత్రికి తన ముందున్న తొమ్మిది టోపీలూ కనపడుతున్నాయి.** అందులో 2 తెల్లవి, 7 నల్లవి అనుకుందాం! తెల్లవాటి విలువ 2×2. నల్లవాటి విలువ 7×1. మొత్తం పదకొండు. అది బేసిసంఖ్య. బేసిసంఖ్య నలుపుకి చిహ్నం. అందుకే మంత్రి తన టోపీ రంగు నలుపు అని చెప్పాడు. మరోలా చెప్పాలంటే, **తన ముందున్న తొమ్మిది టోపీల విలువ 'బేసి' సంఖ్య** అని, ముందున్న వ్యక్తికి సూచించాడు. మంత్రి ముందు నిలబడి వున్నది సర్వసైనికాధికారి. **అతనికి ఎనిమిది టోపీలు కనపడుతున్నాయి.** శత్రురాజు మంత్రిని ఉరి తీయలేదు కాబట్టి, ఆ వృద్ధుడి తలపై ఉన్నది నిజంగానే నల్లటోపీ అని నిర్ధారణ అయిపోయింది. ఇప్పుడు సైనికాధికారి తన ముందు కనపడే 8 టోపీల విలువ కట్టాలి. ఉదాహరణకి అతడికి 6 తెలుపు, 2 నలుపు కనపడుతున్నాయనుకుందాం. వాటి విలువ (2×2) + (6×1) = 10. మంత్రి ముందున్న టోపీల విలువ "బేసి" సంఖ్య. తనది "సరి" సంఖ్య. **బేసిసంఖ్య – సరిసంఖ్య = బేసిసంఖ్య.** ఆ విధంగా లెక్కకట్టి సైనికాధికారి కూడా తన టోపీ "నలుపు" అని చెప్పాడు. మరోలా చెప్పాలంటే, ప్రతివ్యక్తీ **తన వెనుక ఉన్న వ్యక్తికి కనపడే టోపీల విలువలోంచి, తనకి కనపడే టోపీల విలువ తీసేస్తే, తన టోపీ విలువ వస్తుంది.** అది సరిసంఖ్య అయితే తనది తెల్లటోపీ! బేసిసంఖ్య అయితే తనది నల్లటోపీ!"

రాజుకీ విధంగా మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

## 9. అసత్యదీవి

"నువ్వు నిజం చెప్పేవాడివా? అసత్యవంతుడివా?" అని అడిగితే, ఇద్దరూ సత్యవంతులమే అంటారు. కాబట్టి ఆ ప్రశ్న వల్ల లాభం లేదు. అయినా, **కేవలం ఒకే ఒక్క ప్రశ్న అడగాలి** కాబట్టి, ఇద్దరూ ఒకే సమాధానం చెప్పే ప్రశ్న తయారు చెయ్యాలి. ఆ ప్రశ్న గమ్మత్తుగా వుండాలి.

$(+1) \times (-1) = (-1)$. అదే విధంగా $(-1) \times (+1)$ కూడా $(-1)$ అవుతుంది. అటువంటి ప్రశ్న తయారు చెయ్యాలి. **"రాకుమార్తె నీ గదిలో ఉన్నదా- అని ఆ రెండో కాపలాదారుడిని అడిగితే అతడేం సమాధానం చెప్తాడు?"** అని మొదటి కాపలాదారుడిని యువరాజు అడగాలి.

ఈ ప్రశ్నకి మొదటి కాపలాదారు సత్యవంతుడైతే, రెండోవాడు... (అంటే అబద్ధం వాడు) ఏం చెప్తాడో అదే చెప్తాడు. అంటే అది అబద్ధం.

మొదటి కాపలాదారు అబద్ధాల దీవి వాడైతే, నిజం చెప్పేవాడు ఏం చెప్తాడో దానికి వ్యతిరేకంగా చెప్తాడు. అదీ అబద్ధమే. **ఆవిధంగా ఇద్దర్లో ఎవరు చెప్పినా అబద్ధం బయటపడుతుంది.** ఒక ఉదాహరణ ద్వారా ఇది బాగా అర్థమవుతుంది.

రాకుమారుడు మొదటి కాపలాదారయిన సత్యవంతుడి దగ్గరకి వెళ్ళి "నీవు కాపలా కాస్తున్న గదిలో రాకుమార్తె వున్నదా- అని నీ పక్క మనిషిని అడిగితే అతడు ఏం సమాధానం చెపుతాడు?" అన్న ప్రశ్న అడిగాడనుకుందాం.

ఇప్పుడు రెండు రకాల అవకాశాలున్నాయి. అసత్యవంతుడి గదిలో రాకుమార్తె వుండటం, ఉండకపోవటం. ఒకవేళ ఉందనుకుందాం. అప్పుడు అసత్యవంతుడు ఏం సమాధానం చెపుతాడు? "నా గదిలో రాకుమార్తె లేదు యువరాజా" అని అబద్ధం చెపుతాడు కదా. కాబట్టి సత్యవంతుడయిన కాపలాదారు, రెండో కాపలాదారు ఏమి జవాబు చెపుతాడో అదే చెపుతాడు. "లేదని అంటాడు యువరాజా ఆ కాపలాదారు" అని చెపుతాడు.

రాకుమారుడికి ఎవరు సత్యవంతుడో, ఎవరు అసత్యవంతుడో తెలీదు. పొరపాటునీ అసత్యవంతుడి దగ్గరికి వెళ్ళి "తాను కాపలాకాస్తున్న గదిలో రాకుమార్తె వున్నదా- అని నీ పక్క మనిషిని అడిగితే అతడు ఏం సమాధానం చెపుతాడు?" అని అదే ప్రశ్న అడిగాడనుకుందాం. అసత్య వంతుడెప్పుడూ అబద్ధమే చెపుతాడు కాబట్టి "తన గదిలో రాకుమార్తె లేదని అతడు చెపుతాడు యువరాజా" అంటాడు.

కాబట్టి - సత్యవంతుడు చెప్పినా, అసత్యవంతుడు చెప్పినా **"లేదు" అనే గదిలో రాకుమార్తె వుంటుంది. ఉందన్న గదిలో రాకుమార్తె వుండదు.**

అసత్యాన్ని సత్యవంతుడు "అసత్యం" అంటాడు. సత్యాన్ని అసత్యవంతుడు కూడా "అసత్యం" అనే అంటాడు. అదే ధర్మం ఇక్కడ వర్తిస్తుంది."

రాజుకీ విధంగా మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.



## 10. వేదాంతపు పునాది తర్కం

"నీవడిగిన అన్ని ప్రశ్నల్లోకీ సులభమైన వాటిలో ఇదొకటి. మంత్రి చెప్పిన వివరాల ప్రకారం, ఫలకం మీద రాసి ఉన్నది లోపల ఉండదు కాబట్టి 'పాములు' అని రాసి ఉన్న గదిలోకి నిర్భయంగా వెళ్లవచ్చు. మందహాసుడు చేసిందదే! పూలవానలో తడిసి బయటకొచ్చాడు. అది 'పూల' గది అని తెలిపోయింది. ఇక రెండు గదులున్నాయి. అందులో ఒకదానిమీద 'రాకుమార్తె' అని రాసి ఉన్నది. కాబట్టి ఆ గదిలో ఆమె ఉండదు. నిశ్చయంగా వేరే గదిలో ఉంటుంది. మిగిలింది పూలగదే కదా! ఆ విధంగా 'పూలు' అని రాసి ఉన్న మొదటి గదిలో ప్రవేశించి, రాకుమార్తెని కనుక్కున్నాడు."

రాజుకీ విధంగా మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**మిగతా జంతువుల్లాగా మనుష్యుల చర్మం మీద బొచ్చెందుకు వుండదు?**

ఆహారం కోసం (విల్లు కనుక్కోక ముందు రోజుల్లో) అన్నిటికన్నా కష్టపడిన జంతువు మనిషే. వేటగాడి శరీరంపై జుట్టు ఎక్కువ వుంటే అలసట నుంచి తొందరగా తేరుకోవటం కష్టం. అయితే ఈ థియరీ అంత సరికాదనిపిస్తోంది. అదే నిజమైతే వేటలో తక్కువ పాల్గొనే స్త్రీ జాతికి ఎక్కువ జుట్టు వుండాలి కదా. ఆకర్షణ పెంచటానికి మొగ నెమలిని ఆకర్షణీయంగా సృష్టించినట్టే, ప్రకృతి స్త్రీని అందంగా సృష్టించినట్టు తోస్తుంది. ఏది ఏమైనా, మనుష్యులు గుహల్లోంచి బయటకొచ్చాకే చెర్మంపై జుట్టు కోల్పోయారనేది నిర్వివాదాంశం.

## 11. అరగుడ్డు కథ

"ఒకటిగానీ, రెండుగానీ పెట్టవచ్చు. లేదా అసలేమీ పెట్టకపోవచ్చు. మొత్తం మూడు రకాల అవకాశాలున్నాయి" అన్నాడు విక్రమార్కుడు. ఆపై ఈ విధంగా కొనసాగించాడు. "నాలుగు కోళ్లు 4 రోజుల్లో 4 గుడ్లు పెడితే, 2 కోళ్లు 2 రోజుల్లో 1 గుడ్డు పెడతాయి. ఈ ప్రకారం లెక్కకడితే, 2 కోళ్లు 2 రోజుల్లో 2 గుడ్లు పెడితే 1 కోడి 1 రోజులో 'అరగుడ్డు' పెడుతుంది. నవ్వొచ్చే సమాధానం ఇది. కానీ ఇది గణితం. ఈ విధంగా 'గణితం' ఒకటి చెపుతుంది. తర్కం మరొకటి చెపుతుంది. ఈ పరిస్థితుల్లో గణితం పనికిరాదు. తర్కం కావాలి.

ప్రశ్నని మరొకసారి పరిశీలిద్దాం. "సోమ, మంగళ అనే 2 రోజుల్లో రాధ, రమణి అనే 2 కోళ్ళు 2 గుడ్లు పెడితే, సోమవారం నాడు రాధ అనే కోడి ఎన్ని గుడ్లు పెడుతుంది?" అన్నది ప్రశ్న. హేతువాదం అంటే, ఏదీ వదిలెయ్యకుండా అన్ని మార్గాలూ అన్వేషించటం.

'రాధ' అనే కోడి సోమవారం మాత్రమే గుడ్డు పెట్టేదీ, 'రమణి' అనేది మంగళవారం పెట్టేదీ అయితే, ఆ రెండు కోళ్ళూ, రెండు రోజులకి రెండు గుడ్లు పెడతాయి. 'రాధ' అన్న కోడి మొదటిరోజు ఒక గుడ్డు పెడుతుంది. 'ఒక గుడ్డు' అన్నది ఆ విధంగా మొదటి సమాధానం.

'రాధ' అనే కోడి సోమవారం నాడు 2 గుడ్లు పెట్టేది అయి, 'రమణి' అసలు గుడ్లు పెట్టనిదయితే, సోమవారం మనకి రెండు గుడ్లు లభిస్తాయి. ఇది రెండో సమాధానం.

రెండు కోళ్ళూ సోమవారం విశ్రాంతి తీసుకునే దినం అయితే, ఆ రోజు అసలేమీ పెట్టకపోవచ్చు. ఇది మూడో సమాధానం. బేతాళా! నువ్వన్నట్టుగా సినిమాలు, బంధువుల గురించి నిర్థక చర్చలు, ఇంట్లో వాగ్వివాదాలు, అంతులేని గారాబాలూ కాకుండా, పిల్లల్తో ఇటువంటి ప్రశ్నలు - సమాధానాలు చర్చిస్తే వారికి తెలివీ, చురుకుధనమూ పెరుగుతాయి. భవిష్యత్తుకి మంచి పునాది పడుతుంది." అన్నాడు.

రాజుకి ఆ విధంగా మౌనభంగం కలగగానే శవంతో సహా బేతాళుడు తిరిగి చెట్టు ఎక్కాడు.

### మీకు తెలుసా?

ప్రొద్దున్నే పుంజులు "కొక్కొరొకో"మని ఎందుకు కూస్తాయి?

"దూరంగా వెళ్ళొద్దు" అని తమ గుంపుకి సందేశం ఇవ్వటం కోసం...! సంసార బాధ్యతలు లేని పుంజులు అంతగా గొంతు చించుకోవు. గమనించండి.



## 12. భారమయిన మోసం

మొదటి ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "నాలుగు నాణాల చొప్పున వాటిని మూడు భాగాలుగా విడగొట్టి, వాటికి ఎ, బి, సి అని పేర్లు పెట్టాలి. ఎ, బి లని చెరోవైపు వేసి తూస్తే రెండు అవకాశాలున్నాయి. 1. రెండూ సమానంగా ఉండటం, 2. ఏదో ఒకటి ఎక్కువ బరువు ఉండటం.

**1.** రెండిటి బరువూ సమానంగా ఉన్న పక్షంలో అవి స్వచ్ఛమైన నాణాలన్న మాట. ఇక నుంచీ అవి తూనిక రాళ్లుగా ఉపయోగపడతాయి. వాటిలోంచి రెండూ, దొంగనాణెం ఉన్న 'సి' గుంపులోంచి రెండూ తీసుకుని తూస్తే దొంగనాణెం - ఆ రెంటిలో ఉన్నదా? మిగిలిపోయిన వాటిలో ఉన్నదా తెలుస్తుంది. మూడోసారి తూనికలో దాన్ని పట్టుకోవటం చాలా సులభం.

**2.** అలా కాకుండా ఎ, బిలలోనే దొంగనాణెం ఉన్నప్పుడు ఈ లెక్క చాలా క్లిష్టతరమౌతుంది. ఎ, బిల బరువు సమానంగా లేని పక్షంలో సి విభాగంలో ఉన్న నాలుగు నాణాలు స్వచ్ఛమైనవన్నమాట. ఆ స్వచ్ఛమైన నాణాల్ని ఒకవైపు వేయాలి. బరువు ఎక్కువగా ఉన్న 'ఎ' విభాగంలోంచి 2 నాణాలూ, బరువు తక్కువగా ఉన్న 'బి' విభాగంలోంచి 2 నాణాలూ తీసుకుని వాటితో తూచాలి. దాన్నిబట్టి దొంగనాణెం బరువు మిగతా వాటికంటే ఎక్కువో, తక్కువో, అది 'ఎ' లో ఉన్నదో, 'బి' లో ఉన్నదో తెలుస్తుంది.

దొంగనాణెం - వదిలివేసిన మిగతా నాలుగిట్లో ఉంటే మాత్రం ఈ సమస్యకి పరిష్కారం మరీ మరీ కష్టమౌతుంది. ఇప్పటికే అయోమయం చెందిన నిన్ను మరీ తికమక పెట్టకుండా, సమాధానాన్ని నీ విజ్ఞతకే వదిలేస్తున్నాను.

❖ ❖ ❖

ఇక రెండో ప్రశ్న విషయానికి వస్తే, 10 మందిలో దొంగని పట్టుకోవటం కష్టం కాదు. తేలిగ్గా అర్థం అవటం కోసం పదిమంది పనివారు కాకుండా 3 మాత్రమే ఉన్నారని అనుకుందాం. కేవలం ఒకే ఒకసారి తూచటం ద్వారా దొంగని ఎలా పట్టుకోవటం? ఇదే కదా ప్రశ్న.

తులానికి, కాసుకి తేడాని 'పూస' అనుకుందాం. ఇప్పుడు మొదటి కంసాలి దగ్గర 3, రెండో వ్యక్తి దగ్గర 2, మూడో మనిషి దగ్గర 1 నాణెము తీసుకుని తూచాలి. మూడు పూసల బరువు తక్కువ ఉంటే మొదటివాడు, రెండు పూసల బరువు తక్కువ ఉంటే రెండోవాడు, ఒక పూస తక్కువ ఉంటే మూడోవాడు దొంగన్నమాట."

## 13. రొట్టె ఖరీదు

విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

"అతిథి తను తిన్న 1/3 వంతు రొట్టెలకి 8 వరహాలు చెల్లించి వెళ్ళిపోయాడు. మూడోవంతు (1/3) తిన్న అతిథి ఎనిమిది వరహాలు చెల్లించాడంటే, మొత్తం 8 రొట్టెల ఖరీదు 24 వరహాలు. అంటే ఒక్కొక్క రొట్టె ఖరీదు 3 వరహాలు. ఆ లెక్కన రాముడి దగ్గర 15, కృష్ణుడి దగ్గర 9 వరహాలు విలువ చేసే రొట్టెలున్నాయన్నమాట. ఇద్దరూ చెరో 8 వరహాలు విలువచేసే రొట్టెలు తిని, మిగతాది అతిథికి ఇచ్చారు. ఎవరెంత త్యాగం చేస్తే వారికంత దక్కాలి కదా! కాబట్టి రాముడు 7 వరహాలు (15-8), కృష్ణుడు ఒక వరహా (9-8) తీసుకోవాలి.

అడగకపోయినా నీ మిగతా రెండు ప్రశ్నలకి కూడా సమాధానం చెపుతా విను. నులక మంచం మీదగానీ, పరుపుపైనగానీ పడుకుంటే ఆ గుంటల్లో శరీరం ఇమిడిపోవటం వలన గరిమనాభి విడిపోయి, బరువంతా శరీరపు కొన్ని ప్రదేశాల్లోనే పడకపోవటం వలన సుఖంగా వుంటుంది.

ఊగే పడవల్లో జీవితం గడిపేవారు నడిచేటప్పుడు అలల తాకిడికి క్రింద పడిపోకుండా వుండటం కోసం, శరీరపు గరిమనాభి విశాల ప్రదేశంలో పడేటట్టు చూసుకోవాలి. అందువల్ల వారు కాళ్ళు ఎడం చేసి నడవటం అలవాటు చేసుకుంటారు. అందుకే వారినడక వక్రంగా వుంటుంది. కడవలు మోసే అతివలు అప్రయత్నం గానే తమ గరిమనాభి నేలపై నిటారుగా పడేలా నడుస్తారు. అందుకే వారి నడక రాయంచలా హుందాగా, హొయలుగా వుంటుంది".

రాజుకీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**జ్ఞాన దంతం అవసరం ఏమిటి? దాని లాభం ఏమైనా వుందా?**

ఏమీ లేదు. పళ్ళ డాక్టరుకి తప్ప. ఒకప్పుడు మనిషి పచ్చి మాంసం లాటి కఠినమైన పదార్థాలు తినేవాడు. అప్పుడు వుండేది. నూడుల్స్ తినే మనిషికి దాని అవసరం లేదు. అందుకే అది కొందరిలో రాదు. వారందరూ జ్ఞానం లేని వారు అని అనుకోనవసరం లేదు.



## 14. గడియారం గొడవ

బేతాళుడి ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "అయిదు గంటలు కొట్టటానికి అయిదు సెకన్లు పడితే, పది గంటలు కొట్టటానికి 11.25 సెకన్లు పడుతుంది. అయిదు గంటల శబ్దాల మధ్య ఎన్ని విరామాలుంటాయి? నాలుగు!! అదేవిధంగా, పదిగంటల శబ్దాల మధ్య తొమ్మిది విరామాలుంటాయి. నాలుగు విరామాలకి పట్టేకాలం 5 సెకన్లు అయితే, 9 విరామాలకి 11.25 సెకన్లు కదా!

ఇక రెండో ప్రశ్న. అరు గంటలు (5 విరామాలు) కొట్టటానికి ముప్పై సెకన్లు పట్టిందంటే, పన్నెండు గంటలు (11 విరామాలు) కొట్టటానికి 66 సెకన్లు పడుతుంది.

మూడో ప్రశ్న. అర్థరాత్రి నుంచీ 'గడిచిన గంటలు', మిట్టమధ్యాహ్నానికి 'గడవ వలసిన గంటల'కన్నా అయిదు రెట్లు ఎక్కువైనప్పుడు గడియారంలో సమయం ఎంతై ఉంటుంది? అన్నది. ఆ ప్రశ్నకి సమాధానం ఉదయం పది. అర్థరాత్రి నించి అప్పటివరకూ... జరిగిపోయినవి 10, మిట్టమధ్యాహ్నం వరకూ... జరగాల్సినవి 2. అంటే అయిదు రెట్లు.

నాలుగో ప్రశ్న కష్టమైనది. తొమ్మిది రెట్లు తేడా ఉంటే...? ఇది చెయ్యాలంటే అర్థరాత్రి నుంచి మిట్టమధ్యాహ్నం వరకూ ఎన్ని నిమిషాలో లెక్క కట్టాలి. 12 గంటలు అంటే 720 నిమిషాలు. దీన్ని 9:1 నిష్పత్తిలో విడగొడితే 648:72 వస్తుంది. అంటే, ఉదయం 10.48 నిమిషాలకి... అయిపోయిన సమయం, అవవలసిన సమయానికి 9 రెట్లు ఉంటుంది."

ఇక చివరి ప్రశ్న. భూమికి దూరంగా వెళ్ళేకొద్దీ బరువుతగ్గినట్టే, భూమి లోపలికి వెళ్ళినా బరువు తగ్గుతుంది. అయితే దీనికి కారణాలు వేరు. భూ కేంద్రం సమీపించే కొద్దీ, ఆకర్షణ శక్తి అన్నివైపులకీ లాక్కుంటుంది. భూమ్మీద అలాకాదు. కేవలం క్రిందికే వత్తిడి వుంటుంది. నమ్మలేని నిజం ఇది. అయితే, చాలా లోపలికి ప్రయాణించాకే ఈ ప్రభావం మొదలవుతుంది.

ఈ విధంగా విక్రమార్కుడు సమాధానం చెప్పగానే బేతాళుడు ఉద్వేగంగా, "అద్భుతం రాజా! అద్భుతం. నిన్ను 'విసుగు చెందని విక్రమార్కుడు' అని ఎందుకంటారో అర్థమైంది. నీకున్నంత ఓపిక ప్రతీ ఉపాధ్యాయుడికీ ఉండాలి. జ్ఞాన సముపార్జన అంటే, అదేదో విసుగెత్తించే చర్య కాదనీ పెద్ద పెద్ద లెక్కల్ని కూడా చిన్న చిన్న వినోదాత్మకమైన కథలుగా చెప్తే పిల్లల్లో అది చురుకుదనాన్నీ, తెలివిని పెంచుతుందనీ అందరూ తెలుసు కోవాలి. అన్ని వృత్తుల్లో కెల్లా గొప్పది ఉపాధ్యాయ వృత్తి. దీన్నెవరూ కాదనలేరు. అటువంటి గొప్ప ఉపాధ్యాయుడు నీలో నాకు కనపడుతున్నాడు" అంటూ అదృశ్యమయ్యాడు.

## 15. విశాల దొంగ

సాధారణంగా నవ్వని విక్రమార్కుడు ఆ ప్రశ్నకి నవ్వి, "బేతాళా! నన్ను అయోమయంలో పడేయటానికి చాలా చెప్పావు. అరుగుమీద పడుకుంటాడన్నావు. ఏ ప్రశ్నా వేయలేదన్నావు. కానీ సమాధానం చాలా చిన్నది. ఆ గృహంలో స్త్రీలు కూడా జూదమాడుతూ ఉంటారని నీవే చెప్పావు కదా! అదే సమాధానం. రేచుక్కతో జూదమాడుతున్న మిగతా వారందరూ స్త్రీలు అయి ఉంటారు" అన్నాడు.

"ఇక మరో ప్రశ్నకి సమాధానం : చక్రం గిర్రున తిరుగుతున్నప్పుడు ఆకర్షణ శక్తి కేంద్రం బయటవైపు వుంటుంది. దాన్ని పరున్ముఖ శక్తి అంటారు. వేర్లు చక్రం బయటవైపుకి తన్నుతాయి. మొక్క చక్రం ఇరుసు వైపుకి పెరుగుతుంది." రాజుకి ఆ విధంగా మౌనభంగం కాగానే శవంతో సహా బేతాళుడు తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**పూర్వకాలం ఫోటోలు దిగేటప్పుడు జేబులో చేతులు ఎందుకు పెట్టుకునేవారు?**

ఆ కాలంలో ఫోటో తీయటం కోసం చాలా సేపు పట్టేది. అంతసేపు చేతులు గాలిలో వదిలి నిలబడటం, అందులోనూ నవ్వుతూ నిలబడటం మరీ కష్టం కాబట్టి జేబులో పెట్టుకోవటమో, దేనిమీదన్నా ఆన్చటమో చేసేవారు. జాగ్రత్తగా గమనించి చూడండి. ఇప్పటికాలంతో పోల్చుకుంటే అప్పటి మనుష్యులు ఫోటోల్లో సీరియస్‌గా కనపడతారు. కాస్త విసుగూ, స్టిఫ్‌నెస్సూ కూడా కనపడుతుంది. ఈ రోజుల్లో లాగా 'క్లిక్' మనగానే ఫిల్మ్ మీద ముద్రపడేదీ కాదు. అంగుళమయినా కదలకుండా వుండవలసి రావటమే ఆ 'బిగుసుకు' పోవటానికి కారణం. అంతసేపు ఒకే లెవల్లో నవ్వుని పెదాలపై నిలబెట్టి వుంచటం కూడా కష్టమే. ప్రయత్నించి చూడండి.



## 16. కొలనులో పూలు

కొలనులో మూడురెట్లు అయ్యే పూలతో పూజారి మూడు గుళ్లలో ఒకే సంఖ్య పూలతో ఎలా అభిషేకం చేస్తాడన్న ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"చివరి గుడి అయిన బ్రహ్మకి అభిషేకం చేసేముందు పూజారి కోనేటిలో పూలని కడిగినప్పుడు, అవి మూడు రెట్లు అయి ఉంటాయి. అంటే **ఒక్కొక్క దేవుణ్ణీ పూజించే పూల సంఖ్య 3 తో సరిగ్గా భాగించబడేది** అయి వుండాలి. మరో రకంగా చెప్పాలంటే విష్ణువుకి, శివుడికి అర్పించిన పూలు కూడా 9, 15, 21, 27 మొదలైన సంఖ్యల్లో ఏదో ఒకటి అయి ఉండాలి. ఇలా ఒక్కొక్క సంఖ్యతో లెక్కవేసుకుంటూ వెళ్తే, జవాబు '27' సరిగ్గా సరిపోతుంది.

"ఏ విధంగా?" ప్రశ్నించాడు బేతాళుడు.

"పదమూడు పూలతో ప్రారంభిస్తాడు. చెరువులో కడిగినప్పుడు అవి 39 అవుతాయి. 27 విష్ణువుకి అర్పించి, మిగతా 12 చెరువులో ప్రక్షాళనం చేయగానే అవి 36 అవుతాయి. అందులో 27 శివునికి అర్పించి, మిగతా 9 పూలూ చెరువులో కడిగి ఆ 27 పూలనీ బ్రహ్మకి అర్పిస్తాడు."

రాజుకీ విధంగా మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.

(ఈ ప్రశ్నకి సమాధానం ఆల్జీబ్రా పద్ధతిలో కూడా చెయ్యవచ్చు. ప్రారంభంలో పూలు 'ఎక్స్' అని, దేవుడికి అర్పించినవి 'వై' అని అనుకుంటే, చివరికి మిగిలేవి 'సున్నా' కాబట్టి: $3(3(3x-y)-y)-y = 0$ అవుతుంది. దాన్ని సంక్షిప్త పరిస్తే $27x = 13y$ అవుతుంది. ఆ విధంగా తొలి పూలసంఖ్య 13. దేవుడికి అభిషేకం చేసినవి 27గా వస్తాయి. అయితే, ఇంత అయోమయం లేకుండా మొదటి పద్ధతే సులభం.)

### మీకు తెలుసా?

**పిల్లలకన్నా పెద్దలెందుకు ఎక్కువసార్లు కన్నార్పుతారు?**

నీటి సాయంతో కంటిలోని దుమ్ము, సూక్ష్మ కణాల్ని పక్కకు తోయటం కోసం మనుష్యులు కనురెప్పలు అల్లారుస్తారు. పిల్లల కళ్ళు చిన్నవి. మీకు తెలుసా? పసిపిల్లలకి పుట్టిన నెలరోజుల వరకూ కంట్లో అసలు నీరే వుండదు. అయిదు నిముషాలు పెద్దలు కన్నార్పకుండా చూస్తే మంట, దురద మొదలవుతాయి. ప్రేమించిన వ్యక్తిని రెప్పవాల్చకుండా చూడటమంటే.... అది వేరే సంగతి.

## 17. హడావుడి జవాబులు

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

1. కోళ్ళు x, కుందేళ్ళు y అనుకుంటే x+y = 30, 2x+4y = 92 అవుతుంది. సమీకరణాన్ని క్లుప్తీకరిస్తే సమాధానం దొరుకుతుంది. 14 కోడి పిల్లలు, 16 కుందేళ్లు.
2. బుట్టలోంచి రెండు నేను తీసుకుంటే నా దగ్గర రెండు ఉంటాయి. దానిలోంచి అంటే బుట్టలోంచి!
3. అందులోంచి ఒకటి నా స్నేహితుడికిస్తే అందులో 3 ఉంటాయి.
4. నా వాటిలోంచి ఒకటి ఇచ్చినా బుట్టలో పళ్ల సంఖ్య మారదు.

జవాబు తెలిసిన తరువాత, 'ఇంత సులభమా' అనిపిస్తుంది కానీ, పిల్లల్ని ఈ ప్రశ్నలు తొందర తొందరగా అడిగితే కొందరు తప్పు సమాధానాలు చెపుతారు. జాకెట్టు ఖరీదు 10 రూపాయలంటారు. ఒక పిల్లి ఒక ఎలుకని చంపటానికి ఒక నిమిషం చాలంటారు. 4090కి పది కలిపితే 5000 అని సమాధానం చెప్తారు. ఇవి సరి అయిన సమాధానాలు కావు.

5. జాకెట్టు ఖరీదు 5. చీరె ఖరీదు 105. రెండిటి ఖరీదూ కలిపితే 110. రెండిటి మధ్య తేడా వంద.
6. పిల్లి ఎలుకను చంపటానికి 2 నిమిషాలు.
7. 4090కి పది కలిపితే 4,100 వస్తుంది.

ఈ విధంగా రాజుకి మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

మనిషి వేళ్ళన్నీ ఎందుకు సమానంగా వుండవు?

పురాతన కాలంలో చెట్ల కొమ్మలు పట్టుకునే మనిషి చేతి చివర్ల పరిణామ క్రమం అది. బంతిని పట్టుకున్నప్పుడు వేళ్ళన్నీ సమానంగా కనపడతాయి గమనించండి. మన చిటికెన వేలు మరింత పొడుగ్గా వుండి వుంటే తరచు నలిగి పోతూ వుండేది. వేళ్ళన్నీ సమానంగా వుంటే మనిషి జ్ఞానం కూడా ఇంత వేగంగా పెరిగి వుండేది కాదేమో!



## 18. అంకెల గారడి

"ఒకవైపు ఎత్తయిన శిఖరం, మరొకవైపు అగాధంలాంటి లోయ - మధ్యలో ఇరుకు దారిలో వెళ్తున్న గొర్రెలు. వెనగ్గా వచ్చిన రథం గొర్రెలకి ప్రమాదం జరక్కుండా ఎలా ముందుకి సాగుతుంది?" అన్న మొదటి ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "గుర్రాల సకిలింతలకి గొర్రెలు బెదిరి కింది లోయలోకి పడకుండా ఉండాలంటే రథాన్ని ఆపుచేసి, గొర్రెల్ని వెనక్కి తిప్పి రథం వెనుకవైపుకి నడిపించి, ఆ తరువాత రథాన్ని ముందుకు కొనసాగించాలి.

ఇక రెండో ప్రశ్న: 9-12-21 కి సమాధానంగా 3-4-7 అని తోటి గూఢచారి చెప్పగానే అతడిని శత్రుసైనికులు బంధించారంటే అతడు తప్పు చెప్పాడన్నమాట. 6-9 కి సైనికాధికారి సమాధానంగా 2-3 అనగానే ÷3 అనుకున్నాడు. కానీ అతి ముఖ్యమయిన విషయం మర్చిపోయాడు. తరువాతి ప్రశ్న 15 కి సమాధానం ఈ లెక్కన 5 కావాలి. కానీ శత్రు సైనికాధికారి 4 అన్నాడు. లోతుగా ఆలోచించకుండా తొందరపడి పక్క గూఢచారి శత్రువులకి దొరికిపోయాడు. గూఢచారులకి కావలసింది ఆ సునిశిత దృష్టి. కాబట్టి 6-9-15 కీ 2-3-4 కీ సంబంధం ఏమిటన్నది ఆలోచిస్తే అవి తెలుగులో అక్షరాల సంఖ్య అని తెలుస్తుంది. ఆ లెక్క ప్రకారం 'ఇరవై ఒకటి' అన్న పదాల్లో 6 అక్షరాలున్నాయి. అది చెప్పకుండా '7' అనబట్టి ఆ సైనికుడిని శత్రు సైనికులు బంధించారు.

ఇక మూడో ప్రశ్న: వెళ్లేటప్పుడు గంటకి 60 క్రోసుల వేగంతో వెళ్లి వెనక్కి 40 క్రోసుల వేగంతో వెనక్కి వస్తే సగటు వేగం ఎంత? అన్న ప్రశ్నకి కొందరు 50 అంటారు. ఇది కూడా తొందరపాటు జవాబే. రెండు ఊళ్ళు వున్నాయనుకుందాం. వాటి మధ్య దూరం 120 క్రోసులు అనుకుంటే, వెళ్ళటానికి 2 గంటలు, రావటానికి 3 గంటలు, మొత్తం వెళ్లి రావటానికి 5 (2+3) గంటలు పడుతుంది. సగటు వేగం 48 (240/5) అవుతుంది.

నాలుగో ప్రశ్నలో, పాలపాత్రల బహిర్గత ద్వారాలు నేలకి ఒకే ఎత్తులో వున్నాయి కాబట్టి, రెంటిలోనూ పాలు సమానంగానే పడతాయి.

ఇక చివరి ప్రశ్న: $x + (1.5) = x\,(1.5)$ అయితే x ఎంత అన్న సమీకరణం సాధిస్తే జవాబు 3 అవుతుంది. 3 ని ఒకటిన్నరతో హెచ్చవేసినా, 3 కి ఒకటిన్నర కలిపినా ఒకే సమాధానం వస్తుంది."

రాజుకీ విధంగా మౌనభంగం కలుగగానే బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

## 19. ఇసుక గడియారం

"నాలుగు నిమిషాలు, ఏడు నిమిషాల సమయాన్ని కొలిచే ఇసుక యంత్రాలతో తొమ్మిది నిమిషాలని ఎలా కొలుస్తావు?" అన్న ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "రెండు యంత్రాలనీ బోర్లా తిప్పాలి. 4 నిమిషాలు పూర్తి కాగానే చిన్నదాన్ని మళ్ళీ వెనక్కి తిప్పాలి. పెద్దదానిలో ఇసుక సరీగ్గా 7 నిమిషాల తరువాత పూర్తిగా క్రిందికి జారిపోతుంది. వెంటనే పెద్దదాన్ని బోర్లా తిప్పాలి. అప్పటికి చిన్నదానిలో ఇంకా 1 నిమిషం ఇసుక మిగిలి వుంటుంది. అయోమయం లేకుండా ఇక్కడే కాస్త ఆలోచించాలి.

సరీగ్గా 8 నిముషాలు అయ్యేసరికి చిన్నది పూర్తిగా ఖాళీ అయిపోయి వుంటుంది. పెద్దదానిలో నిముషం ఇసుక క్రిందికి జారివుంటుంది.

ఇప్పటికి 8 నిముషాలు అయ్యాయి. కాబట్టి మనకి కావల్సింది ఇంకా ఒక నిముషం.

పెద్దదానిలో 1 నిముషం ఇసుక క్రిందికి జారింది. దాన్ని తిరిగి వెనక్కి తిప్పితే చాలు. లెక్క తేలిపోయిందిగా. ఆ విధంగా 9 నిమిషాలపాటూ వినాయకుడినీ, కుమారస్వామినీ అర్చన చేసి వుంటాడు పూజారి."

❖ ❖ ❖

ఇక రెండో ప్రశ్న. "కఠినమైన ప్రశ్న ఒకటి వెయ్యనా? సులభమైన ప్రశ్నలు మూడు వెయ్యనా?" అన్న పార్వతిని కఠినమైనది ఒకటే వెయ్యమని పూజారి కోరాడు. "చెట్టు ముందా? విత్తు ముందా?" అన్న ప్రశ్నకి "విత్తు" అని పూజారి సమాధానం చెప్పాడు. "ఎలా చెప్పగలవు?" అని పార్వతి అడిగింది. రెండో సమాధానం చెప్పవలసిన బాధ్యత పూజారికి లేదు. ముందు అనుకున్న ఒప్పందం ప్రకారం ఆమె కేవలం ఒకే ఒక ప్రశ్న అడగాలి. ఆ విషయమే ఆమెకి విన్నవించుకుని ఉంటాడు. దానికి సంతోషించిన పార్వతి అతడిని జ్ఞానిని చేసి ఉంటుంది" అన్నాడు విక్రమార్కుడు.

బేతాళుడు తిరిగి శవంతో సహా చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**కంటి పరీక్ష ఛార్టుల్లో E అన్న అక్షరాన్ని ఎందుకు ప్రారంభంలో వుంచుతారు?**

నూట యాభై సంవత్సరాల క్రితం కంటి పరీక్షలో మొదటి పెద్ద అక్షరంగా A వుండేది. త్వరలోనే అది E గా మారింది. మూడు నల్ల అడ్డగీతల మధ్య సమానమైన తెల్ల ఖాళీ స్థలం వుండటం వల్ల ఆ అక్షరానికి ప్రథమ స్థానం ఇవ్వటం జరిగింది.



## 20. కాలం కొవ్వొత్తి

పదికాకులు నేలమీద ధాన్యం గింజలు తింటూ ఉండగా ఒకదాన్ని పెద్ద శబ్దంతో కాల్చి చంపితే అక్కడ ఎన్ని కాకులుంటాయి? అన్న ప్రశ్నకి "ఏమీ ఉండవు. అన్నీ ఎగిరి పోతాయి" అని సమాధానం చెబితే అది మొదటి స్థాయి తెలివి.

"ఒకటి ఉంటుంది. ఎందుకంటే కాకులు **చెట్టుమీద లేవు. నేల మీద ఉన్నాయి.** కాబట్టి చచ్చిన కాకి ఒకటి ఉంటుంది" అని చెప్పటం రెండో స్థాయి.

తార్కిక జ్ఞానానికి అంతెక్కడ? కాకులు అసలెందుకు ఎగిరిపోతాయి? శబ్దం వినే కదా! అక్కడ చెవిటి కాకులు కొన్ని నిద్రపోతూ ఉండవచ్చు. లేదా కొన్ని గుడ్డివి అయి ఉండవచ్చు. అవి కాకి పిల్లలతో ఉండి ఉండవచ్చు. శబ్దానికి స్పృహ తప్పిన రెండో కాకిగానీ, చచ్చిన కాకిని తినటానికి వాలిన కాకులుగానీ ఉండొచ్చు. కాబట్టి ఆ ప్రశ్నకి సరి అయిన సమాధానం "ఒకటి తప్పక వుంటుంది. ఒకటి గానీ, అంతకంటే ఎక్కువగానీ కూడా ఉండొచ్చు" అనేది. ఇది మూడోస్థాయి తెలివి.

❖ ❖ ❖

ఇక రెండో ప్రశ్న. గంటపాటు వెలిగే కొవ్వొత్తిని తీగెకి వేలాడదీసి చెరోవైపూ వెలిగిస్తే అది అరగంటపాటు వెలుగుతుంది. అదే సమాధానం! అది అసంభవం అని వాదించేవారు కొందరు ఉండవచ్చు. దానికి సమాధానం చెప్పటం కష్టం.

❖ ❖ ❖

వంద మీటర్ల భవంతిని 75 మీటర్ల తాడుతో దిగటం ఎలా? భవంతికి ఒక హుక్కు దిగకొట్టాలి. తాడుని 50 మీటర్ల దగ్గర కత్తిరించాలి. నూతిలో గిలక వేసినట్టు పెద్ద తాడుముక్కని హుక్కు నుంచి కిందికి చెరోవైపూ జారవిడవాలి. దాని సాయంతో 25 మీటర్లు కిందికి దిగవచ్చు. అక్కడ మేకు కొట్టి చిన్నతాడుని ఆ మేకుకి బిగించాలి. పెద్దతాడుని హుక్కు నుంచి లాగేసి, దీనికి కట్టితే, అది 75 మీటర్లు అవుతుంది. దాని సాయంతో నేలమీదకు జారవచ్చు.

గతుకుల మంచుపై జారుతున్నప్పుడు ఆ వత్తిడికి మంచు బొడిపలు కరిగి నీరు అవుతుంది. కాబట్టి గతుకులపై జారటమే సులభం. ఇక వేడినీళ్ళ స్నానం వల్ల శరీరపు ఉష్ణోగ్రత ఏమీ పెరగదు. దళసరిగా వున్న చెర్మం మెత్తబడుతుంది. వేడివలన కాకుండా, రక్తపు పొంగువల్ల శరీర పరిమాణం పెరుగుతుంది. బిగుతు దుస్తులు, ఉంగరాలు అందువల్ల తొడుక్కోవటానికి ఇబ్బంది పెడతాయి.

(వాక్యంలో 14 'త' అనే అక్షరాలున్నాయి.)

## 21. జ్యోతిష్కుడి పందెం

"ఈ లెక్కకి జవాబు చెప్పాలంటే, అనవసర విషయాలన్నీ తీసేసి, కేవలం అవసరమైన విషయాలు సమీక్షించి, అయోమయాన్ని తొలగించుకోవాలి.

**1.** చంద్రవదనుడి వద్ద నున్న ప్రజల డబ్బు వెయ్యి వరహాలు. వారికి 10 శాతం లాభాన్ని పంచుతానని వాగ్దానం చేసాడు. కాబట్టి వెయ్యికి వంద లాభం రావాలి. లెక్కలో చెప్పినదాని ప్రకారం అతడికి రెట్టింపు లాభం వచ్చింది. అంటే 200ల వరహాలు లాభం వచ్చిందన్న మాట. సగం తాను తీసుకుని, సగం ప్రజలకి పంచాడంటే అర్థం అదే కదా.

**2.** పల్నాడుపై లాభం 1:1, తక్షశిలపై 1:2 వుండగా పందెం కాసాడు. అంతేకాదు. ఏది గెల్చినా తనకు "లాభం ఖాయం" అన్నాడు. ఏది గెల్చినా "గరిష్ట" లాభం రావాలంటే 3:2 నిష్పత్తిలో కాయాలి. కాబట్టి పల్నాడుపై 600, తక్షశిలపై 400 కాయాలి. అప్పుడు ఏది నెగ్గినా అతడికి 1200 వస్తుంది. పెట్టుబడి పోనూ 200 లాభం అన్నమాట.

**3.** ఇంకే విధంగా కాసినా, అంటే 599-401 కానీ 601-399 కానీ... ఎలా కాసినా సరే 200 గరిష్ట లాభం రాదు.

### మీకు తెలుసా?

**లోతు గాయాలకన్నా చర్మం ఉపరితలంపై గీసుకున్నవి ఎందుకు ఎక్కువ మంటగా వుంటాయి?**

సాధారణంగా కాళ్ళ దగ్గిర, చేతులపైనా ఎక్కువ గీసుకుపోవటం జరుగుతుంది. నరాల అంచులు అక్కడే ఎక్కువ వుంటాయి. చెర్మం తెగినప్పుడు ఆ నరాల అంచులు బయట గాలికి బహిర్గతమవుతాయి. చెమటలోని ఉప్పు నుంచి, సబ్బులోని ఆమ్లం వరకూ ఏది తగిలినా ఆ నరాల కొసలు మంట పెడతాయి. రక్తం రాకపోయినా గాయం మండటానికి కారణం కూడా ఇదే. (బ్యాండ్-ఎయిడ్ వెయ్యటం వల్ల బాహ్య తాకిడిలేక మంట వుండదు. అంతేతప్ప గాయం తొందరగా తగ్గటమంటూ జరగదు. క్రిమి రక్షణ సంగతి వేరే) గాయం లోపలికంటా తగిలినప్పుడు నరాలపై ప్రభావం తక్కువ వుంటుంది కాబట్టి, గాయం పెద్దదయినా బాధ తక్కువ వుంటుంది.



## 22. స్వయంవరం

ఒక్కొక్క చెట్టుకి ఒక్కొక్క గొర్రెని కట్టేస్తే తాను నిలబడటానికి చెట్టే లేదంటే, చెట్లూ గొర్రెలూ సమానం అన్నమాట. అలా కాకుండా ఒక్కో చెట్టుకి రెండు గొర్రెల్ని కడితే ఒక చెట్టు మిగిలిందీ అంటే, చెట్ల సంఖ్యలోంచి ఒకటి తీసేస్తే, అవి గొర్రెల సంఖ్యలో సగం ఉంటాయన్నమాట. ఆ విధంగా లెక్క చేస్తే 2 గొర్రెలు, 2 చెట్లు వస్తాయి. ఇది మొదటి ప్రశ్నకు సమాధానం.

ఇక రెండో ప్రశ్నకు వస్తే, తూర్పు నుంచి వచ్చిన గొర్రెలు 5, పడమట నుంచి వచ్చినవి 7. ఇట్నుంచి ఒకటి అటువెళ్తే అవి రెట్టింపు (4/8) అవుతాయి. అట్నుంచి ఒకటి ఇటు వస్తే (6/6) సమానం అవుతాయి.

ఇక మూడో ప్రశ్న. ఇది చాలా సులభం. పాలకి నీళ్లు రెట్టింపు ఉండాలి. పాలు నాలుగు చెంబులు, నీళ్లు రెండు చెంబులు ఉన్నాయి. కాబట్టి మరో 6 చెంబుల నీళ్లు పోయాలి. అప్పుడు పాలు 4, నీళ్ళు 8 అవుతాయి.

బేతాళా! చివరి ప్రశ్నలో కాస్త చిక్కు మెలిక ఉన్నది. గుహ పొడవు 8 మైళ్లు అనుకుందాం. గుహలో నీవు ఎనిమిదో వంతు నడిచావు. అంటే నీవు 1 మైలు ముందుకు వెళ్లావు. వెనుక నుంచి గుర్రపు శబ్దం వినిపించింది. నీవు వెనక్కి పరిగెడితే, 1 మైలు వెనక్కి వెళ్లాలి. అంతేగా. సరిగ్గా ఆ సమయానికి ప్రవేశ ద్వారాన్ని చేరుకుంటుంది. మరో విధంగా చెప్పాలంటే, **గుర్రం ప్రవేశ ద్వారాన్ని గుర్రం చేరుకునేలోపు** నీవు ఒక మైలు ముందుకు గానీ, వెనకకు గానీ పరుగెత్తగలవు. ఒకవేళ ముందుకు పరిగెత్తావు అనుకో. గుర్రం గుహ ప్రవేశద్వారం చేరుకునే సమయానికి నీవు ఇంకా 6 మైళ్లు ముందుకు పరిగెత్తాలి. నిన్ను చేరుకోవాలంటే గుర్రం 8 మైళ్లు పరుగెత్తాలి. కాబట్టి మీ వేగాల నిష్పత్తి 3:4 అన్నమాట."


దానికి బేతాళుడు, "భేష్ మహారాజా! ఆ యువకుడు కూడా సరిగ్గా ఇవే సమాధానాలు చెప్పాడు." అని ఒక క్షణం ఆగి అన్నాడు. "యువకుడి గణిత పరిజ్ఞానానికి రాకుమార్తె సంతోషిస్తూన్న సమయంలో స్వయంవరానికి వచ్చిన మిగతా యువకులు దానికి అభ్యంతరం తెలిపారు. ఇంత చిన్న ప్రశ్నలకు సమాధానం చెప్పగలగటం రాజ్యార్హతని ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ఆ విషయం వచ్చే కథలో వింద్దాం."

## 23. గణితంలో మెలిక

బేతాళ ప్రశ్నకి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "న్యాయ ప్రకారం మొత్తం ప్రయాణాన్ని ఆరు భాగాలు చెయ్యాలి. మీరు నాలుగు భాగాలు, వారిద్దరూ చెరో భాగమూ ప్రయాణించాలి కాబట్టి వారిద్దరూ తలో యాభై రూపాయలు ఇవ్వాలి. దీన్నే మరింత వివరంగా అర్థమయ్యేలా చెప్పాలంటే రాను, పోను దూరం 4 మైళ్లు అనుకుంటే, 3 మైళ్లు మీరొక్కరే ప్రయాణం చేశారు. మిగతా ఒక్క మైలూ మీ ముగ్గురూ కలిసి ప్రయాణించారు. కాబట్టి వారు ఒక్కొక్కరూ మొత్తం ఖర్చులో ఆరవ వంతు భరించాలి. అంటే తలకో యాభై రూపాయలు. అంతే తప్ప, ఒకవైపు దూరానికి 150 చొప్పున లెక్క కట్టి నాలుగుతో భాగించకూడదు. అంతేకాదు "కారు డ్రైవరు మైలుకి 75 తీసుకుంటున్నాడు. మన ముగ్గురం కలిసి ఒక మైలు ప్రయాణించేసాము. కాబట్టి మేమిద్దరం తలో 25 ఇస్తాము" అన్నా తప్పే. వ్యాపారంలో చాలా గొప్ప సూత్రం ఇది.

**2.** మంచుతో ఒక కటకం తయారుచెయ్యాలి. భూతద్దపు ఆకారంలో వున్న ఆ మంచు ముక్క ద్వారా సూర్యకిరణం సూటిగా పడి మంట సృష్టిస్తుంది.

**3.** ఇక మూడో ప్రశ్న. గుడి, రచ్చబండ, సత్రంల మధ్య దూరం విడివిడిగా ఎంత అని! ఇచ్చిన ప్రశ్న ప్రకారం మొత్తం దూరాలన్నీ కలిపితే 26 మైళ్లు వస్తుంది. ఈ మూడు ప్రదేశాల్నీ ఒక త్రిభుజంగా ఊహించుకుంటే, ఆ త్రిభుజం చుట్టూ రెండు ప్రదక్షిణలు చేస్తే ఆ ప్రయాణం 26 మైళ్లుగా సాగుతుందన్న మాట. మరింత సులభంగా అర్థం అవటం కోసం ఈ క్రింది బొమ్మ చూడండి.




A + B = 11 (గుడి నుంచి సత్రం మీదుగా రచ్చబండ)

B + C = 8 (సత్రం నుంచి రచ్చబండ మీదుగా గుడి)

A + C = 7 (రచ్చబండ నుంచి గుడిమీదుగా సత్రం)

2A + 2B + 2C = 26.

దీన్నే "రెండు ప్రదక్షిణలు"గా సూచించటం జరిగింది. దీన్ని సగం చేస్తే ఆ త్రిభుజం చుట్టుకొలత 13 మైళ్లు అని తెలుస్తుంది. అది తెలిశాక జవాబు చాలా



సులభం. గుడి నుంచి రచ్చబండ 2 మైళ్ళు, సత్రం 5 మైళ్ళు, రచ్చబండ నుంచి సత్రం 6 మైళ్ళు. మొత్తం 13 మైళ్ళు.

**4.** గోడకి రంగు వేయటానికి 6 డబ్బాల మిశ్రమం కావాలి. అందులో 4 తెలుపు, 2 నలుపుకి బదులు వ్యతిరేకంగా కలపబడింది. కాబట్టి సగం మిశ్రమం పారబోసి, అందులో 3 డబ్బాల తెలుపు కలిపితే తెలుపు, నలుపు 4:2 అవుతుంది.

**5.** అయిదో ప్రశ్నలో అనవసరంగా అయోమయం సృష్టించబడింది. గొర్రెల్ని 600 కొని 700కి అమ్మి, మళ్ళీ వాటినే 800 కొని, 900కి అమ్మితే లాభం 200. దీన్నే ఇంకోలా ఆలోచిద్దాం. మీరు వెయ్యితో వ్యాపారం ప్రారంభించారనుకుందాం. 600కి కొని 700కి అమ్మితే చేతిలో 1100 డబ్బు వుంటుంది. తిరిగి 700కి గొర్రెల్ని కొంటే చేతిలో 400 వుంటుంది. 800కి అమ్మితే 1200 వుంటుంది. అంటే **లాభం రెండొందలేగా**. చాలా చిన్న చిన్న ప్రశ్నలు ఇవన్నీ. అయితే ముని అంత తెలివితక్కువ వాడేమీ కాదు. చివరి ప్రశ్న చాలా కష్టంగా ఇచ్చాడు. పైకి చాలా సులభంగా కనపడినా, ఎంతో లోతుగా, దీర్ఘంగా ఆలోచిస్తే తప్ప జవాబు రాదు.

**6.** ఆఖరి ప్రశ్న. 12, 8, 5 శేర్లు పట్టే పాలపాత్రల్లోని 12 శేర్ల పాలని రెండిటిలో సగం సగంగా సర్దాలి. అదీ ప్రశ్న. దాన్ని సాధించాలంటే పెద్ద దాని (12) లోంచి, మధ్య దాన్ని (8) నింపి, అందులోంచి పాలని చిన్నదాని (5)లో పోయాలి.

ఇప్పుడు వరుసగా 4, 3, 5 ఉంటాయి.

చిన్నది, పెద్దది కలిపి (9) పెద్ద పాత్రలో ఉంచుకుని, మధ్యదానిలోది చివరి దానిలో పోయాలి.

అప్పుడు 9, 0, 3 అవుతాయి. పెద్దదానిలో పాలు మధ్య దానిలో పోయటం ద్వారా దాన్ని 1, 8, 3 గా చెయ్యాలి.

ఇప్పుడు మధ్యదానిలోని పాలు చిన్నదానిలో పోసి నింపితే 1, 6, 5 అవుతుంది.

ఆపైన మొదటిది, చివరిది కలిపేస్తే 6, 6, 0 అవుతుంది.

ఈ లెక్క చేయాలంటే చాలా ఓర్పు కావాలి. పిల్లల్లోని అనవసరమైన అతి చురుకుదనాన్ని తగ్గించి, సహనంగా ఆలోచించటాన్ని ఈ విధమైన లెక్కలు నేర్పుతాయి. ఆ 'కుదురుదనాన్ని' వారికి నేర్పాలంటే పక్కన కూర్చుని వారిని ప్రోత్సహించాలి."

రాజుకీ విధంగా మౌన భంగం కావటంతో బేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కాడు.

## 24. పన్నెండు బంగారు ప్రశ్నలు

**1.** ఆరుగంటలపాటు ప్రయాణం చేసే రైలుకి ఎదురుగా, అట్నుంచి గంటకి ఒకటి చొప్పున బయల్దేరి వస్తూన్న రైళ్లు ఎన్ని ఎదురౌతాయి? ఇదీ ప్రశ్న. దీనికి సమాధానం కొంతమంది 6 అని వాదిస్తారు. తప్పు. ఎందుకంటే, ఈ రైలు బయల్దేరే సమయానికే, రైల్వే ట్రాక్ మీద అప్పటికే 6 రైళ్లు ఉన్నాయి కదా! మరో ఆరు అట్నుంచి బయల్దేరుతాయి. కాబట్టి సమాధానం 12. ఈ లెక్క చేయటానికి ఇదో పద్ధతి.

ఇంకో పద్ధతి కూడా ఉంది. ఎదురెదురుగా ప్రయాణిస్తున్నప్పుడు వేగాల్ని 'కలపాలని' ఆరోక్లాసు గణిత శాస్త్రంలో చదువుకున్నాం కదా! ఆ తర్కం ప్రకారం ఈ రైలు అటు వెళ్తున్నప్పుడు, అట్నుంచి వచ్చే రైలు ప్రతీ అరగంటకీ ఒకటి ఎదురొస్తుంది. ఆ విధంగా ఆరు గంటల్లో 12 ఎదురొస్తాయి. కష్టమైన లెక్కే! తర్కాన్ని అర్థం చేసుకోవటం రవ్వంత కష్టమే కదా!

**2.** రెండు గ్లాసులున్నాయి. ఒకదానిలో బత్తాయి, మరొకదాన్లో నిమ్మరసం ఉన్నాయి. సగం నిమ్మరసాన్ని బత్తాయి రసపు గ్లాసులో పోసి, మళ్లీ ఈ రెండిటి మిశ్రమం మొదటిదానిలో పోస్తే, దేంట్లో దేని నిష్పత్తి ఎక్కువ ఉంటుంది? ఈ ప్రశ్నకి సమాధానం "రెండిటి నిష్పత్తీ ఒకేలా ఉంటుంది."

ఈ లెక్క నన్ను చేయమన్నప్పుడు "అదెలా ఉంటుంది? నాన్సెన్స్!" అంటూ బలంగా వాదించాను. "ఇటు నుంచి రెండోసారి అటు పోసేటప్పుడు, కొంచెం బత్తాయి కూడా అటు చేరుతుంది కదా!" అన్నది నా వాదన. కానీ నా ఆలోచన తప్పని తేలింది. అయితే ఈ తర్కాన్ని అర్థం చేసుకోవటానికి నాకు చాలాసేపు పట్టింది. ఎలా ఇది సాధ్యమో ఆలోచిద్దాం.

గ్లాసులో ద్రవం 90 మి.లీటర్లు అని ప్రశ్నలోనే ఉంది కదా! బత్తాయిని 'x' అని, నిమ్మరసాన్ని 'y' అని అనుకుంటే, రెండిటిలోనూ 90x, 90y ఉంటాయి. రెండో గ్లాసులోని నిమ్మరసాన్ని మొదటి గ్లాసులో పోస్తే 90x+45y మొదటిదానిలోను, 45y రెండో దానిలో ఉంటాయి. రెండో గ్లాసుని ఇప్పుడు పూర్తిగా నింపాలంటే, మొదటి మిశ్రమంలోంచి 45 మి. లీటర్లు అందులో పోయాలి. ఆ మిశ్రమం 30x+15y అన్న విషయం మనకు తెలిసినదే కదా! అలా చేస్తే అప్పుడు మొదటి గ్లాసులో 60x+30y ఉంటుంది. రెండో గ్లాసులో 45y+(30x+15y) ఉంటుంది. మరోలా చెప్పాలంటే 60x+30y మొదటిదానిలో, 60y+30x రెండో దానిలో



ఉంటాయి. నిష్పత్తి ఒకటే కదా! ఇప్పటికీ నాకు అనుమానమే. కానీ ఒప్పుకోక తప్పదు.

గమ్మత్తేమిటంటే, నేనింత బుర్ర బద్దలు కొట్టుకున్న ఈ విషయానికి ఒకరు చాలా సులభమైన చక్కటి సమాధానం పంపారు. "75:25 ఒక గ్లాసులో అయితే 25:75 మరో గ్లాసు కదా. నిష్పతి ఒకేలా కాకుండా ఇంకోలా ఎలా వుంటుంది?" అని. నిజమే. చాలా సింపుల్ సమాధానం.

**3.** వంతెన మీద నుంచి దూకిన వ్యక్తి కిలోమీటరు ప్రయాణం చేశాక సీసా మూత నీటిలో తేలుతూ ఎదురైంది. అతడు మరో అరగంట ముందుకు ప్రయాణం చేసి, వెనుదిరిగి వంతెన దగ్గర మూతని చేరుకున్నాడు. ఇప్పుడు మనం నీటి ప్రవాహపు వేగాన్ని కనుక్కోవాలి. ఇదీ ప్రశ్న. ఈ లెక్కని ఆల్జీబ్రా పద్ధతిలో చేస్తే చాలా క్లిష్టమవుతుంది. అలా కాకుండా **నీటికి అసలు ప్రవాహవేగం లేదనుకుందాం.** అప్పుడు సీసా బెరడు కదలకుండా అక్కడే ఉంటుంది. ఈతగాడు అరగంటసేపు ముందుకు వెళ్లి వెనక్కి వస్తాడు. మొత్తం గంట పడుతుంది. ఒకవేళ నీటి ప్రవాహం ఉండి ఉంటే, ఈ గంటసేపటిలో బెరడు ఒక కిలోమీటరు ప్రయాణం చేసి వంతెనని చేరుకుని ఉండేది. కాబట్టి నీటి ప్రవాహం గంటకి 1 కిలోమీటరు. ఇలా చేస్తే 'ఇంతేనా ఈ లెక్క' అనిపిస్తుంది. మరోలా చేస్తే అయోమయంతో తల బాదుకోవాలని పిస్తుంది.

**4.** ఒకటి... రెండు... మూడు... అలా పదిని తయారు చెయ్యాలంటే చాలా మార్గాలున్నాయి. ఉదాహరణకి 12 + 3 + 4 + 5- 6 - 7 + 8 - 9 = 10. మీరింకో పద్ధతి ప్రయత్నం చెయ్యండి.

**5.** నేను మార్కెట్‌కి వెళ్తూండగా ఒక కుటుంబం ఎదురుపడింది. నేను 'మొగ' అయితే, ఒక మగప్రాణి మాత్రమే మార్కెట్‌కి వెళ్తోంది. వాళ్ళు మార్కెట్ నుంచి వస్తున్నారు.

**6.** మొదటి బ్యాట్స్‌మాన్ 3 పరుగులు తీస్తూ ఉండగా, ఓవర్ త్రోలో బంతి బౌండరీ దాటుతుంది. కానీ క్రీజులో బ్యాటు సరిగ్గా పెట్టని కారణంగా ఒక పరుగు అతని ఖాతాలో తక్కువగా జమ అవుతుంది. దీన్ని షార్ట్‌రన్ అంటారు. ఆ తరువాతి బంతిని ఆఖరి బ్యాట్స్‌మాన్ సిక్సర్ కొడతాడు. ఆ విధంగా 7 పరుగుల విజయంలో ఇద్దరూ సెంచరీలు సాధిస్తారు. పిల్లల్లో 'అతి చురుకుతనం' గురించి ప్రస్తావిస్తూ ఈ ప్రశ్న అడిగినప్పుడు చాలామంది విద్యార్థులు 'నో బాల్... వైడ్' అని అరుస్తారు.

'అదే హైపర్ యాక్టివిటీకి నిదర్శనం' అని అనగానే తప్పు తెలుసుకుని ముసిముసి నవ్వులు నవ్వుతారు. ఇంకా ఒకటి రెండు కారణాలు వున్నాయి. బంతి హెల్మెట్‌కి తగలటం లాటివి. అంతేతప్ప వైడ్... నో బాల్ మాత్రం కాదు.

**7.** అ = 5, ఇ = 4, ఉ = 1, ఎ = 2, ఒ = 3.

**8.** వంద అంతస్థుల భవంతి పైనుంచి, నేలమీదకు ఏ అంతస్థు భవంతి నుంచి విసిరితే గాజుబంతి పగులుతుంది? రెండు బంతుల సాయంతో 'తక్కువసార్లు' ప్రయత్నించి కనుక్కోవాలి...! చాలా కష్టమైన ప్రశ్న ఇది. రకరకాల కాంబినేషన్లు ప్రయత్నించాలి. పిల్లల మెదళ్లకు నిజంగా పరీక్షే. సరి అయిన సమాధానం 'పద్నాలుగు'.

మొదట 14వ అంతస్థు మీదనుంచి బంతి విసరాలి. అది పగిలితే మొదటి నుంచీ (రెండో బంతితో) ఒక్కో అంతస్థూ పరీక్షించుకుంటూ వెళ్లాలి. మొత్తం 14 సార్లు!

ఒకవేళ 14వ అంతస్థు నుంచి విసిరినప్పుడు అది పగలకపోతే 27వ అంతస్థు నుంచి విసరాలి. ఆ విధంగా 14, 27, 39, 50, 60, 69, 77, 84, 90, 95,. 99 అంతస్థుల నుంచి విసరటం ద్వారా గాజు బంతి సాంద్రత బలం కనుక్కోవచ్చు. ఏదైనా అంతస్థు నుంచి విసిరినప్పుడు బంతి పగిలిపోతే, రెండో బంతి (అక్కడి నుంచి పై అంతస్థుకి) వేసుకుంటూ వెళ్ళాలి. చిన్నవారికి కాస్త అయోమయమే! కానీ పదో తరగతి విద్యార్థి ఈ లెక్క చెయ్యగలిగి ఉండాలి. ఇదే లెక్కని 13వ అంతస్థు మీద నుంచి గానీ, 15వ అంతస్థు మీద నుంచి గానీ చేస్తే సమాధానం (ఇంత తక్కువసార్లుగా) రాదు. కావాలంటే ప్రయత్నించి చూడండి.

**9.** ఈ రోజు శుక్రవారం. ఎందుకంటే, శుక్రవారానికి 'నిన్న' గురువారం. గురువారం రేపైతే, ఈ రోజు బుధవారం. ఈ సమస్య గురించి ఈ పుస్తకం ఒకసారి ఇంతకుముందే చర్చించాం.

**10.** క్షణం కూడా ఆపకుండా ఆమె మాట్లాడుతూ ఉంటే టాక్సీ డ్రైవరు తనకి చెవుడు అని చెప్పాడు. డబ్బు చెల్లిస్తూ వుండగా ఆమెకి అర్థమైంది అతడికి చెవుడు లేదని! ఎలా? చాలా తేలికైన ప్రశ్న. విజ్ఞులైన పాఠకులకి సమాధానం చెప్పనవసరం లేదని భావిస్తున్నాను.

**11.** వేసవిలో తెల్లదుస్తులు, తెల్ల టోపీ మంచివి.

**12.** దూరంగా వస్తువుల ప్రతిబింబాలు ఇసుకలో కనపడటం వలన అక్కడ నీరు వున్నదేమో అని కొత్తవారు భ్రమపడతారు. దీన్నే 'ఎండమావి' అంటారు.



## 25. నీరూ - బరువూ

దానికి సమాధానంగా విక్రమార్కుడు "కోడిగుడ్లు నాణ్యమైనవా? కావా? అన్న విషయం తెలుసుకోవటానికి నీటిలో వేసి పరీక్షిస్తారు. "ఒక వస్తువుని నీటిలో వేసినప్పుడు - అది తొలగించిన నీటిభారం ఆ వస్తువు నీటిలో కోల్పోయిన భారము కంటే ఎక్కువైతే, ఆ వస్తువు నీటిలో తేలుతుంది" అని కొన్ని దశాబ్దాల క్రితమే ఆర్కిమెడిస్ అనే శాస్త్రజ్ఞుడు కనుక్కున్నాడు. జలాంతర్గామి కూడా ఈ సూత్రం ప్రకారమే నడుస్తుంది. దాని మధ్యలో ఒక 'నీటి గది' ఉంటుంది. దాన్ని పూర్తిగా నీటితో నింపితే అది అడుక్కి వెళ్లిపోతుంది. నీరు తీసేస్తే పైకి వస్తుంది. నీటి మధ్యలో ప్రయాణించడం కోసం నీటిగదిలో సగం నీటిని నింపుతారు. ఇదే సూత్రాన్ని కోడిగుడ్లకి కూడా జనం ఉపయోగిస్తారు. కానీ తేలిన గుడ్లు అన్నీ చెడిపోయినవి కావు. జన్యుపరంగా తేలికైనవి కూడా అయ్యుండవచ్చు. కానీ ఆ విషయాన్ని ప్రజలచేత ఎలా ఒప్పించటం? అందుకే వర్తకుడి కూతురికి ఆ యువకుడు 'ఉప్పు' ఇచ్చి ఉంటాడు. ప్రతివారూ వంటలో ఉపయోగించే పదార్థం అదే కదా! రాత్రంతా గుడ్లని ఉప్పు నీటిలో నానబెట్టి ఉంచటం ద్వారా వాటి బరువు పెంచవచ్చు.

ఇక రెండో సందేహానికొస్తే, వెన్నెముక నొప్పికి యువకుడు ఉపయోగించిన సూది ఎందుకు మునిగిపోలేదు? ఆర్కెమెడిస్ సూత్రం ప్రకారం అది మునగాలి. కాబట్టి నిశ్చయంగా పై సూత్రం దీనికి కారణం కాదు. మరేమై ఉంటుంది? అది తెలుసుకోవాలంటే నీటిపై 'పరుగెత్తే' పురుగులు ఎందుకు మునిగిపోవో తెలుసుకోవాలి. వాటిని గమనిస్తే - కనీసం వాటి కాళ్లు కూడా తడవవు. నీటికంటే పురుగు బరువు ఎక్కువా కాదా అన్నది కాదు ఇక్కడ ప్రశ్న. కనీసం కాస్తయినా మునగాలి కదా! మరి అవి ఎలా నీటిపై పరుగెత్తగలుగుతున్నాయి? ముందే చెప్పినట్టు పై శాస్త్రం ఇక్కడ పనికిరాదు. అవి వేగంగా పరుగెత్తగలగటానికి కారణం వాటి కాళ్లు నూనెలో తడిసినట్టు జిడ్డుగా ఉండటం వలన...!



జిడ్డు చేతులకి నీరు అంటుకోదని మనందరికీ తెలుసు. ఇదే సూత్రం ప్రకారం సూదికి నూనె రాసి దాన్ని అతి జాగ్రత్తగా నెమ్మదిగా నీటిమీద ఉంచగలిగితే **ఆ నూనెపొర నీటిపై ఒక వలలా చదునుగా మారి** సూదిని పైనే నిలబెడుతుంది. ఆ యువకుడు పారిశ్రామికవేత్తకు బుద్ధి చెప్పటం కోసం ఉపయోగించిన శాస్త్ర సూక్ష్మం అదే!" అన్నాడు.

"అమోఘం మహారాజా! నీకు కేవలం గణితం మాత్రమే తెలుసనుకున్నాను. గణిత, భౌతిక, రసాయన శాస్త్రాలు నిజానికి అక్క చెల్లెళ్ళలాంటివి. ఒకదానిలో ఉత్సాహం ఉంటే, మిగతా రెండిటిలో ప్రావీణ్యత వస్తుంది." అంటూ మాయమయ్యాడు.

## 26. నీటిలో కిరీటం

బంగారం నీటిలో 20 వంతు, వెండి నీటిలో 10వ వంతు బరువు కోల్పోతుందని తెలుసుకున్న శాస్త్రజ్ఞుడు, కిరీటపు మొత్తం బరువు నీటిలో ఎంత ఉన్నదో చూశాడు. ఏ మోసమూ జరగకపోయి ఉంటే 28 కిలోలు ఉండాలి. అది 27.5 కిలోలు ఉంది.

కాబట్టి మోసం జరిగిందన్నమాట. మరింత వివరంగా చెప్పాలంటే 20 కిలోల బంగారం 1 కిలో, 10 కిలోల వెండి 1 కిలో నీటిలో తన బరువును కోల్పోతుంది. ఆ విధంగా మొత్తం 2 కిలోలు తక్కువ తూగాలి. కానీ రెండున్నర కిలోలు తక్కువ తూగింది.

ఎంత మోసం జరిగింది? ఒక కిలో బంగారం బదులు ఒక కిలో వెండి కలిపితే, గాలిలో బరువు ఒకే విధంగా ఉంటుంది కానీ, నీటిలో తేడా ఉంటుంది. ఎంత? 1/10 - 1/20 = 1/20. అంటే 50 గ్రాములు తేలిక చూపిస్తుంది. మరోలా చెప్పాలంటే, 50 గ్రాముల తేడావస్తే ఒక కిలో మోసం జరిగిందన్నమాట. ఇప్పుడీ కల్తీ కిరీటం 500 గ్రాములు తక్కువ బరువు తూగింది. అంటే 10 కిలోల బంగారం బదులు, అంతే బరువున్న వెండిని కల్తీ చేశారన్నమాట" అంటూ ముగించాడు విక్రమార్కుడు.

"భళి మహారాజా! లెస్సగా చెప్పటమే కాదు. అందరికీ అర్థమయ్యేలా సులభరీతిలో వివరించావు. పరీక్షల ప్రతిపాదికగా కాకుండా ఈ విధంగా వివరించి చెప్తే విద్యార్థులు **ప్లవన సూత్రాల్ని** జీవితాంతం మర్చిపోరు. కేవలం పరీక్షలకోసమే చదివే విద్యార్థి అతి తొందర్లో చదువుపట్ల విరక్తిభావం పెంచుకుంటాడు. భౌతికశాస్త్రము, గణితము ఎంత ఆసక్తికరమో తెలియజెప్పటం కోసం ఇలాంటి ఉదాహరణలు చెప్తే పిల్లలకు తెలివిని పెంచుకోవటం పట్ల ఆసక్తి పెరుగుతుంది. **తెలివి పెంచుకోవటం కన్నా ఈ ప్రపంచంలో ఆనందదాయకం మరేమున్నది?** దీనికి ఉదాహరణగా ఒక కల్పిత కథ చెపుతాను. విను.

ఒక కుర్రవాడు చదువుపట్ల, క్రమశిక్షణ పట్ల నిర్లక్ష్యంతో, స్నేహితుల పట్ల, ఇతర వ్యాపకాల పట్ల ఉత్సాహంతో పరీక్ష తప్పాడు. అతడి తండ్రి చివాట్లు పెట్టగా, ఇంటిపై అలిగి ఒక రాత్రికి రాత్రి ఊరు విడిచి వెళ్లిపోయాడు. ఊరు దాటిన అతడు, చీకట్లో దారి తప్పి చిట్టడవికి చేరుకున్నాడు. గుడ్లగూబల అరుపులు,



కీచురాళ్ల చప్పుళ్లు, క్రూరమృగాల పదఘట్టనలతో భయభ్రాంతుడైన ఆ పిల్లవాడిని ఒక మంచి దెయ్యం ఆదరించి తన గృహానికి తీసుకెళ్లింది. అద్భుతంగా ఉన్నదా రాజప్రసాదంలాంటి ఇల్లు.

"నీవు తిరిగి ఇంటికి వెళ్లటం అసంభవం. జీవితాంతం ఈ అరణ్యంలోనే ఉండాలి. అయితే నీకు రెండు మార్గాలు చెపుతాను. ఒకటి ఎన్నుకో. నేను పది సంవత్సరాలపాటు నీతో ఉండి ఆపై వెళ్లిపోతాను. ఈ ఇంట్లో ఎన్నో సౌఖ్యాలు ఉన్నాయి. ఈ పదేళ్ళూ అన్నీ అనుభవించవచ్చు. దెయ్యం పిల్లలతో స్నేహం చెయ్యవచ్చు. ఆడుతూ పాడుతూ వారితో గడిపి వెయ్యవచ్చు. జీవితం ఇంత గొప్పగా ఉంటుందా అన్నట్టుగా రికామీగా అడవంతా తిరగొచ్చు. అయితే, సరీగ్గా పదేళ్ల తరువాత నేను, ఈ ఇంటి సహా మాయమైపోతాను. జీవితాంతం ఇక ఈ అడవిలో భారంగా ఆకులు, అలములు, తింటూ గడపాలి. ఇదొక మార్గం.

రెండో మార్గం ఏమిటంటే, నేను పది సంవత్సరాలపాటు ఈ అడవిలో ఎలా బతకాలో నీకు బోధిస్తాను. శిక్షణ కష్టమే గానీ, కాస్త అంకితభావంతో నేర్చుకుంటే అందులోనే అంతులేని ఆనందం నీకు కనపడుతుంది. పది సంవత్సరాల తరువాత నేను మాయమైపోతాను. కానీ ఈ రాజప్రసాదం లాంటి ఇల్లు నీకు మిగిలిపోతుంది. జీవితాంతం అందరికన్నా ఎక్కువ సుఖాలు అనుభవించవచ్చు. నీకేది కావాలి?" అని అడిగింది.

క్షణం కూడా ఆలోచించకుండా ఆ పిల్లవాడు "రెండోదే" అన్నాడు. అతడిని తిరిగి అతడి ఇంట్లో దింపుతూ "నీ తండ్రి చెప్పింది కూడా అదే కదా!" అన్నది ఆ దెయ్యం. ఈ కథచెప్పి, "విక్రమార్కా! ఆ తండ్రి తన కొడుక్కి ఏమి చెప్పి ఉంటాడు?" అని అడిగాడు బేతాళుడు.

దానికి సమాధానంగా "పది సంవత్సరాలపాటు చదువుమీద దృష్టి నిలిపితే, ఆ తరువాత రాజప్రసాదం లాంటి సౌఖ్యాలు లభ్యమవుతాయి. దెయ్యం స్నేహితులతో తిరిగి; నిరంతరం బుల్లితెర, క్రికెట్టు చూడటం లాంటి భూతపు అభిరుచులు అలవర్చుకుంటే తల్లిదండ్రుల నీడ నుంచి జనారణ్యమనే ప్రపంచంలోకి వచ్చాక బతుకు దుర్భరమవుతుంది. ఆకులూ అలములూ తినాలి. ఇదే ఆ తండ్రి తన కొడుకుని తిడుతూ చెప్పి ఉంటాడు" అన్నాడు విక్రమార్కుడు. రాజుకీవిధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.

## 27. సగం కాలిన కొవ్వొత్తి కథ

$(x-yx/6) = 2 (x-yx/4)$ అనుకుని ప్రతీ లెక్కా ఆంగ్ల పద్ధతిలో చెయ్యడంకంటే, కొన్ని సార్లు ఇంగిత జ్ఞానం ఉపయోగిస్తే సులువవుతుందని చెప్పటానికి ఈ లెక్కే మంచి ఉదాహరణ. ఒక గంట గడిచేసరికి లావు కొవ్వొత్తి పొడవులో 1/6 వంతు, సన్నకొవ్వొత్తి 1/4 వంతు పొడవు తగ్గిపోతాయి. రెండిటి పొడవూ ఒకటే కాబట్టి మూడు గంటలు గడిచేసరికి లావుది సగమవుతుంది. సన్నటిది పావువంతు మిగులుతుంది, 'సగం'లో 'పావు' అర్ధభాగమే కదా! కాబట్టి ఆ విద్యార్థి 3 గంటలపాటు చదివాడన్నమాట.

ఇక రెండో ప్రశ్న. వెయ్యి గజాల దూరం పరుగెత్తడానికి కృష్ణుడి అశ్వానికి 1000 క్షణాలు పట్టిందనుకుందాం. అంటే క్షణానికి ఒకగజం పరుగెడుతుందన్నమాట. అదే సమయంలో రాముని గుర్రం 990 గజాలు మాత్రమే పరుగెత్తింది. ఈ లెక్కన పదిగజాలు వెనుక నిలబడిన కృష్ణుడి గుర్రం 1010 గజాలు పరుగెత్తే లోపులో రాముని గుర్రం ఎంతదూరం పరుగెడుతుంది అన్నది లెక్క. సమాధానం 999.9 గజాలు మాత్రమే. ఈ లెక్కన కూడా రాముడి గుర్రం వెనుకబడే వుంటుంది.

మిగతావన్నీ సులభమైన ప్రశ్నలే. కంగారుపడకుండా ఆలోచిస్తే సమాధానాలు చిటికెలో లభ్యమవుతాయి. మూడోప్రశ్నలో రెండు గుర్రాలూ మధ్యలో కలుసుకుంటే సువర్ణపురానికి రెండూ ఒకే దూరంలో ఉంటాయి. వాటి వేగాలతో సంబంధం ఏమున్నది?

నాలుగో ప్రశ్న మరింత హాస్యాస్పదమైనది. గుడ్డెద్దు చేలో పడ్డట్టు లెక్కలు కట్టే విద్యార్థులని అడగవలసిన ప్రశ్న ఇది. **గంగ నీటిపై** గుర్రం ఎలా పరుగెడుతుంది?

అదే విధంగా ఆ తరువాత ప్రశ్న. నీ దగ్గర ఉన్న మొదటిది యాభై నోటు కాదు. కానీ రెండోది అవ్వొచ్చుగా!

$9 \times 9 = 81$ సరి అయిన సమాధానమే.కానీ అతడి బల్లకి **ఎదురుగా నిలబడిన** మరో ఉపాధ్యాయుడికి అది ఎలా కనపడుతుంది? $18 = 6 \times 6$ గా కనపడుతుంది కదా! అందుకే అది తప్పన్నాడు.


తుమ్మెద సెకనుకి 220 సార్లు, తేనెటీగ 440 సార్లు రెక్కలు ఆడిస్తుంది. మరో ప్రశ్నకు జవాబు: నత్తవేగం, మనిషి వేగంలో వెయ్యవ (1/1000) వంతు.

చలిమంట వేసుకోవటానికి నది మీద ఒకమనిషి ఎలా నడుస్తూ వెళ్లగలడు? చలికి నది నీరు ఘనీభవించి ఉంటే వెళ్లగలడు. అంతేకదా బేతాళా!" అన్నాడు విక్రమార్కుడు. రాజుకీ విధంగా మౌనభంగం కాగానే శవం తిరిగి చెట్టుపైకి చేరుకుంది.



## 28. తెలివైన మూర్ఖుడు

"బరువుకీ, ఒత్తిడికీ తేడా ఉన్నదని చాలామంది గుర్తించరు. సూది కన్నా మేకు బరువైనది. కానీ నొక్కితే సూది శరీరంలోకి దిగుతుంది. ఒదే ఒత్తిడితో మేకుని నొక్కితే దిగదు. బరువుకీ పీడనానికీ తేడా అదే! నడిచినప్పుడు బరువంతా కాళ్లమీదే పడుతుంది. పాకుతూ గానీ, దొర్లుతూ గానీ వెళ్లినప్పుడు శరీరపు బరువు ఎక్కువ విస్తీర్ణం మీద పడుతుంది. గరిమనాభి విశాలమైనకొద్దీ ఒత్తిడి తగ్గుతుంది. సైనికులు నది మంచుపై పాకుతూ వెళ్లినప్పుడు అందుకే ఆ పొరలు విరిగిపోలేదు.



ఇక కృతవర్మ చెప్పిన మిగతా సమాధానాలు కూడా విజ్ఞానశాస్త్రంపై ఆధారపడి ఉన్నవే! ఒక బంతి నిండా నీరుపోసి, అంతే పరిమాణం ఉన్న మరో బంతి నిండా దూది బ..లం..గా... కుక్కి బరువులు పోలిస్తే, నీటి బంతికన్నా దూది బంతి బరువే ఎక్కువ ఉంటుంది. పరిమాణానికీ - ద్రవ్యరాశికీ - బరువుకీ ఉన్న తేడా తెలిస్తే ఇటువంటి ప్రశ్నలకి జవాబు చెప్పటం సులభం.

అదేవిధంగా ఇనుము - దూది బరువులు తీసుకుంటే ఒకచోట రెండు బరువులూ ఒకటే అయ్యుండవచ్చు. పర్వతం మీద, ధృవాల దగ్గర వాటి బరువులు వేర్వేరుగా ఉంటాయి. బలంగా వీచేగాలి ప్రభావం కూడా వాటిమీద ఉంటుంది. ఆర్కిమెడిస్ సూత్రం ద్రవాలకే కాదు. గాలికి కూడా వర్తిస్తుంది. ఒక వస్తువు తొలగించిన గాలిబరువు, అది గాలిలో కోల్పోయిన బరువుకి సమానం.

ఇక - పరుగెత్తే వ్యక్తికన్నా నడిచే వ్యక్తి గమ్యానికి ముందు చేరుకునే అవకాశం ఎలా ఉంటుంది అన్నది మరో ప్రశ్న. ఈ ప్రశ్నకి సమాధానం తెలుసుకోవాలంటే 'పరుగు' తాలూకు నిర్వచనం తెలుసుకోవాలి. **నడకంటే- పాదాలు నేలపై ఎక్కువసేపు ఉండటం. పరుగంటే - పాదాలు గాలిలో ఎక్కువసేపు ఉండటం. దీనికీ వేగానికీ సంబంధం లేదు**. వ్యాయామం చెయ్యటం కోసం గదిలో 'పరుగెత్తే' వారు, ఎంత వేగంగా కాళ్లు కదిపినా, అక్కడ ఉండటం మనకు తెలిసిన విషయమే కదా! అడుగులు 'దూరంగా' వేయటం వేరు. అడుగులు 'వేగంగా' కదపటం వేరు. కాబట్టి ఎవరయినా ముందు వెళ్ళొచ్చు.

రథాన్ని ఒక రాగి తీగె లాగాలంటే అది దాదాపు 4 రూళ్ల కర్రంత మందంగా ఉండాలి. అంతే మందంలో దాదాపు లక్ష వెంట్రుకలు ఉంటాయి. ఆ విధంగా చూసుకుంటే వెంట్రుకలే బలమైనవి. అవి రెండేమిటి- మూడు రథాల్ని కూడా లాగగలవు.

ఇక ఆఖరి ప్రశ్న: కదులుతున్న రథంలో ఇద్దరు పిల్లలు పక్కపక్కనే కూర్చుని బంతాట ఆడుకున్నారనుకుందాం. ఒకరు విసురుతున్నారు. మరొకరు పట్టుకుంటున్నారు. రథం ఎంత వేగంగా వెళ్తున్నా, దానితో పాటే బంతి కదులుతూ ఉంటుంది. బుడగ విషయం కూడా అంతే! బుడగ గాలికి ముందుకు కదులుతోంది. కింద తొట్టెలో కూర్చుని ఉన్న వ్యక్తి చుట్టూ ఉన్న 'వాతావరణం' కూడా అదే వేగంతో కదులుతోంది. సాపేక్ష సిద్ధాంతం ప్రకారం జెండాపై ఏ విధమైన ఒత్తిడీ ఉండదు. అందుకే అది వాలిపోయి ఉంటుంది.

జెండా నేలపై స్థిరంగా ఉండి, గాలి ప్రవాహం వేగంగా ఉంటే- జెండాని తనతోపాటూ తీసుకెళ్లటానికి గాలి ప్రయత్నిస్తుంది. జెండా వస్త్రం కుడివైపుకి వాలితే ఎడమకీ, ఎడమవైపు వాలితే కుడికీ తోస్తుంది. దీన్నే 'రెపరెపలాడటం' అంటారు. **జెండా కర్ర ఎంత లావుగా ఉంటే జెండా అంత వేగంగా రెపరెపలాడుతుంది**. నిరోధించే కొద్దీ గాలి బలం పెరగటమే దీనికి కారణం. అవన్నీ తెలుసుకోకుండానే సభికులు కృతవర్మని చూసి నవ్వారు. అజ్ఞానం నవ్విస్తుంది. జ్ఞానం క్షమిస్తుంది."

"అద్భుతంగా చెప్పావు విక్రమార్కా! జ్ఞానంతో కూడిన నీ వచనాలు వింటూంటే నిన్ను వదిలి వెళ్లాలనిపించటం లేదు. నీ నుంచి మరింత తెలుసుకోవాలని పిస్తోంది. ఇప్పటివరకూ భౌతికశాస్త్రంలో ప్రశ్నలు వేశాను. రేపు తర్క శాస్త్రంలోను, గణితంలోను వేస్తాను" అంటూ అక్కడ నుంచి అదృశ్యమయ్యాడు బేతాళుడు.



## 29. ఎవరు హరిశ్చంద్రుడు?

బేతాళుడు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా అన్నాడు- "ఉన్న విషయాల్ని తెలుసుకోవటం విజ్ఞానం. ఈ విషయం ఇలాగే ఎందుకున్నది? ఇంకోలా ఉండకపోవటానికి కారణం ఏమిటి? అని ఆలోచించటం ప్రజ్ఞానం. తర్కజ్ఞానం పిల్లల్లో ప్రజ్ఞానాన్ని పెంచుతుంది."

1. నీవడిగిన మొదటి ప్రశ్నలో "మేమిద్దరం అసత్యం చెప్పే కుటుంబంలో నుంచి వచ్చాము" అన్న వాక్యం అసత్యమే కదా! అందుకని అభిరాముడు అసత్యం చెబుతున్నాడు. సోముడు సత్యవంతుడు.
2. రెండో ప్రశ్నలో విభీషణుడు "మా ఇద్దరిలో ఒకరు అసత్యం చెప్పే కుటుంబం నుంచి వచ్చారు" అని చెప్పినది సత్యమే కదా! కాబట్టి రెండో వాడైన భీముడు అసత్యం చెప్పే కుటుంబం నుంచి వచ్చాడు.
3. మూడో ప్రశ్నలో "మేమిద్దరం సత్యం చెప్పే కుటుంబం నుంచి రాలేదు" అని భీష్ముడు చెప్పింది నిజం.
4. నాలుగో ప్రశ్నలో సుగ్రీవుడు అబద్ధం చెపుతున్నాడు. ఇద్దరూ చెరో కుటుంబం నుంచీ రావటమన్నది నిజమేకదా.
5. అసత్యసంధుడు 'సత్యం' చెప్పే రోజు **మంగళవారం**! ఇదెలా తెలుసు కోవటం? ప్రశ్న ప్రకారం ఈ తర్కాన్ని పెంపొందించవచ్చు.

- అసత్యసంధుడు వారంలో ఒక రోజు తప్పక నిజం చెపుతాడు. కాబట్టి 1, 3 రోజుల్లో చెప్పిన వాటిల్లో ఏదో ఒకటి నిజం అయి వుంటుంది. మరొకటి అబద్ధం.
- అలా కాకపోతే, అతడు వారంలో ఒకరోజుకన్నా ఎక్కువ రోజులు నిజం చెపుతాడన్నమాట. అది అసంభవం.
- "వరుసగా" మూడు రోజులపాటు అతడు మూడు ప్రకటనలు చేసాడు. 1, 3 ప్రకటనల్లో ఒకదాన్లో నిజం వుందని తెలిసిపోయింది. కాబట్టి 2వ రోజు ఇచ్చిన ప్రకటన అబద్ధం. అంటే... ఆరోజు గురు, శని, ఆదివారాల్లో ఒక రోజు కాదు.
- మొదటి రోజు ప్రకటన నిజమనుకుందాం. అప్పుడు మూడో ప్రకటన ప్రకారం మొదటి రోజు శుక్ర వారం గానీ, బుధవారంగానీ అవ్వాలి. కానీ రెండో రోజు ప్రకటన దాన్ని ఖండిస్తుంది. అంటే 1, 3 రోజుల ప్రకటనలు అబద్ధం.
- కాబట్టి మూడో రోజు ప్రకటనే వాస్తవం. ఆ లెక్క ప్రకారం - మూడోరోజు సోమవారం గానీ, మంగళవారం గానీ అయ్యుండాలి.

- "నేను సోమ, మంగళవారాల్లో అబద్ధం చెపుతాను" అన్నవాడెవడూ, ఆరోజు 'సోమవారం' అయితే అబద్ధం చెప్పడు. కాబట్టి అతడు సత్యం చెప్పే రోజు "మంగళవారం."

ఈ ప్రశ్నకి జవాబు ఆలోచించాలంటే చాలా ఓర్పు, పట్టుదల వుండాలి. మధ్యలో చాలా విసుగొస్తుంది కూడా.

❖ ❖ ❖

ఒక సంఖ్యని తలకిందులు చేసి తీసేస్తే తేడా 42. ఆ సంఖ్య ఎంత అన్నది మొదటి ప్రశ్న. ఒక అంకెని తిరగేసి చూస్తే మరో అంకెగా గానీ, అదే అంకెగా గానీ అర్థం వచ్చే అంకెలు 0, 1, 6, 8, 9 మాత్రమే. సమాధానం ఆ అయిదు అంకెల కలయికలోనే ఉండాలి. ఆ విధంగా 42 తేడా రావాలంటే ఆ సంఖ్య 61 అయ్యుండాలి. 61-19=42 కదా!

రెండో ప్రశ్నలో తేడా 21. అంటే ఆ సంఖ్య 89 అవ్వాలి. 89-68=21 కదా! కాస్త సునిశితమైన దృష్టి పెట్టి, దేనిలోంచి ఏది తీసేస్తే ఫలానా అంకెలు కుడివైపు వస్తాయని ఆలోచిస్తే జవాబు సులభమవుతుంది. 1 కుడివైపు రావాలంటే 9-8 గానీ, 1-0 గానీ అవ్వాలి కదా.

మూడో ప్రశ్న వినటానికి అయోమయంగాను, కష్టంగాను ఉంటుంది. కానీ కాస్త మనసు పెట్టి ఆలోచిస్తే మిగతా అన్ని ప్రశ్నలకన్నా ఇదే సులభమైంది. ఒక సంఖ్య తాలూకు రెట్టింపు, దానిలో సగం కన్నా 76.5 ఎక్కువ. ఆ సంఖ్య ఎంత? దీనికి సమాధానం రెండు రకాలుగా రాబట్టవచ్చు. 2x -   = 76.5 అయితే x ఎంత అని లెక్కకట్టవచ్చు. కానీ దీనికన్నా సులభమయిన మార్గం ఒకటి ఉన్నది. సంఖ్య 10 అనుకుందాం. సగం 5. రెట్టింపు 20. తేడా 15. తేడా 15 అయితే సంఖ్య 10. తేడా 76.5 అయితే సంఖ్య ఎంత? జవాబు 51. అంతే కదా!

నాల్గవ ప్రశ్న "రెండంకెల మొత్తం ఆ సంఖ్యలో 6వ వంతు". దీన్నే మరోలా చెప్పాలంటే x+y సంఖ్యల మొత్తమైతే, అది 10x+y లో 6వ వంతు. సమీకరణం చేస్తే 6 (x+y) = 10x+y అవుతుంది. దాన్ని 4x = 5y గా క్లుప్తీకరించవచ్చు. అప్పుడు అది 54 అవుతుంది. అంకెల మొత్తం 9. అది 54లో 6వ వంతే కదా!

ఇక చివరి ప్రశ్న : 5కి 5/4 కలిపినా, హెచ్చవేసినా అదే సమాధానం వస్తుంది." విక్రమార్కుడికీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.




## ౩౦. పదకొండు చావు ప్రశ్నలు

1. వీధిలో తెరమీద వస్తున్న సినిమాని ఇంటి అరుగుమీద భార్యతో కలిసి చూస్తున్న భర్త, మధ్యలో ఆమెని హత్యచేసి ఇంటిలోకి శవాన్ని తీసుకొచ్చాడు. ఆధునికంగా చెప్పాలంటే, ఓపెన్ ఎయిర్‌లో కార్లో కూర్చుని చూస్తున్నారు ఇద్దరూ. భార్యని మూడో కంటికి తెలియకుండా మర్డర్ చేసి కార్లోనే శవాన్ని ఇంటికి తీసుకొచ్చాడు.
2. భవనం ఇరవై అంతస్థులది. పాప కింద పడింది పై అంతస్థుమీద నుంచి కాదు. మంచం మీద నుంచి.
3. 'ఏ వైపు?' అన్నది ప్రశ్న. కుడివైపు, ఎడమవైపు, వెనుక వైపు, ముందు వైపు, లోపలి వైపు, బయటి వైపు అన్నవాటిలో ఒకటి సమాధానం అయి ఉండాలి. చచ్చినా, బతికిఉన్నా పిల్లికి వెంట్రుకలు బయటవైపునే ఉంటాయి.
4. తన చేతిలో ఉన్నదాన్ని కలిపి, "మూడు ఎముకలు" అన్నాడు ఒక విద్యార్థి. మిగతా ఇద్దరు విద్యార్థినులు గర్భవతులు. అందుకే ఒకామె నాలుగనీ, మరొకామె తన చేతిలో ఉన్నదాన్ని కూడా కలిపి అయిదనీ సమాధానం చెప్పారు. ఆ విధంగా ముగ్గురూ వాదించి, పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. నాలుగో అమ్మాయి కవలల తల్లి కాబోతోంది.
5. క్రీస్తు ముందు పుట్టినవాడు మరణిస్తే, ఆపై ఎంతకాలం తరువాత క్రీస్తు పుడతాడో, అతడి మెడలో రాగిరేకు వేసినవాడికివెలా తెలుస్తుంది?
6. అచేతనంగా వేలాడుతూ ఉన్నది భర్త ఫోటో. అది చూసి భర్త గుర్తొచ్చి ఏడ్చింది. ఆమె అన్నయ్య డాక్టరు. వచ్చి ఆమెని కుదుటపర్చటం కోసం సినిమాకి తీసుకెళ్లాడు.
7. జీపు తాలూకు నాలుగు టైర్లూ బాగానే ఉన్నాయి. డిక్కీలో స్పేరు టైరు పంక్చరై ఉంది. ఆరుగంటలు ప్రయాణం చేశాక మరో టైరు కూడా పంక్చర్ అవటంతో, ఉన్న నీళ్లు అయిపోయి చావు తప్పి కన్ను లొట్టపడిన పరిస్థితి ఏర్పడింది.
8. కారు 4 చక్రాలకి మొత్తం పదహారు బోల్టులు ఉంటాయి. మిగతా మూడు టైర్లకీ ఉన్న ఒక్కొక్క బోల్టు తీసి నాలుగోటైరుకి అమర్చి ప్రయాణం కొనసాగించి ఉంటుంది.


**9.** వంద అడుగుల నిచ్చెన నిలబెట్టి లేదు. పడుకోబెట్టబడి ఉంది. చివరి అంచు పై నుంచి దూకాడు అతడు.

**10.** రాత్రి చనిపోయింది బాలుడైతే– ముగ్గురూ అబద్ధం చెపుతున్నారు. వృద్ధుడైతే – ముగ్గురూ నిజమే చెపుతున్నారు. ప్రశ్న ప్రకారం ముగ్గురిలో **కనీసం ఒకరు నిజమూ ఒకరు అబద్ధమూ** చెప్పాలి. కాబట్టి మరణించింది వృద్ధురాలు.

**11.** కుక్క వెనక్కి తిరిగి చూడటానికి మొహాన్ని ఈ విధంగా మారిస్తే చాలు.



లేదా బల్లని తిప్పటం ద్వారా ఈ విధంగా కూడా చెయ్యవచ్చు.



### మీకు తెలుసా?

ఆనంద సన్నివేశాలు చూసినప్పుడు కన్నీళ్ళు ఎందుకొస్తాయి?

"ఆనంద భాష్పాలు, దుఖాశ్రువులు" అని రెండు రకాలు లేవు. ఎప్పటి నుంచో నొక్కిపెట్టి వుంచిన భావోద్వేగాలు నాటకీయంగా చూస్తున్నప్పుడు అలా లేని తమ స్థితి తల్చుకుని, అలా వుంటే ఎంత బావుణ్ణు అన్న భావంతో దుఃఖం కలుగుతుంది. కొడుకు తల్లికి సేవచేసే దృశ్యాలని అమెరికాలో కొడుకులు మరింత కన్నీళ్ళతో చూస్తారు. లంచగొండి ఇనస్పెక్టర్‌ని హీరో కొట్టే దృశ్యాన్ని సినిమాలో లంచగొండి పోలీసు తాలూకు కుటుంబం ఆనందంగా చూస్తుంది. దీన్నే సైకాలజీలో IDENTIFYING THE IDEAL అంటారు. చిన్న పిల్లలకి ఆనంద భాష్పాలు రావు. ఏడుపు ఆదుపు కోవలసిన స్థితి పిల్లలకి రాదు కాబట్టి, "ఆనందంతో ఏడవవలసిన" అవసరం కూడా వారికి వుండదు.



## 31. సూర్యుడస్తమించని రాత్రి

"విక్రమార్కా! నీవడిగిన రెండు ప్రశ్నలకీ నాకు సమాధానం దొరకలేదు. నీవే చెప్పు" అన్నాడు బేతాళుడు. విక్రమార్కుడు మాట్లాడలేదు. బేతాళుడు నవ్వి, "నీకు మౌనభంగం అయితే నేను వెళ్ళిపోతానని కదూ నీ భయం" అన్నాడు. దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "జనవరి నెలలో దక్షిణ ధృవ ప్రాంతంలో సూర్యుడు అస్తమించడు. అర్ధరాత్రి అయినా చీకటి పడదు. అందువలన నూతన సంవత్సర ప్రారంభపు అర్ధరాత్రి వాహనం ఆగిపోయినా సరే ప్రయాణికుడు కొండ పైనున్న ఇల్లు చూడగలిగాడు.

ఇక రెండో ప్రశ్నలో – అసలది పగలో రాత్రో చెప్పలేదు కాబట్టి, వాహనానికి దీపాలున్నాయా లేక నడిచే వ్యక్తి నల్ల బట్టలు వేసుకున్నాడా, తెల్లవి ధరించాడా అన్న ప్రశ్న రాదు."

"బాగా చెప్పావు రాజా! నీవి నిజంగానే గొప్ప తెలివితేటలు" అని బేతాళుడు అంటూ అదృశ్యమయ్యాడు.

### తిక్క ప్రశ్నకి జవాబు

"మొదటి వ్యక్తి తన జీతానికి కొంత మొత్తం కలిపి రెండో వ్యక్తికీ, అతడు ఆ సంఖ్యకి తన జీతమూ మరికొంత మొత్తమూ కలిపి మరొక కొత్త చీటీని ఆ తరువాతి వ్యక్తికీ ఇస్తాడు. నలుగురూ ఆ విధంగా చేసిన తరువాత, ఆ అంకె లొంచి, తాను అధికంగా కలిపిన మొత్తాన్ని తీసేసి మొదటి వాడు రెండో వ్యక్తికి ఇస్తాడు. ఈ వరుస క్రమంలో చివరి వ్యక్తి, తాను కలిపిన అధిక సంఖ్యని తీసేస్తే నలుగురి జీతపు మొత్తమూ వస్తుంది."

### మీకు తెలుసా?

గొంతులో వెంట్రుక చిక్కుకుంటే విలవిలలాడి పోతామెందుకు?

చర్మం అతి సున్నితంగా వుండి, స్పర్శ తెలుస్తూ బయటికి కనపడే మనిషి శరీరపు అంతర్భాగాల్లో ఒకటి గొంతు. గుండి సూదికన్నా సూదిగా రెండు వైపులా కొసదేరి వున్నది వెంట్రుక. ఇరిటేషన్‌కి అది ముఖ్య కారణం. ప్రేమలో తప్ప, మిగతా సమయాల్లో మనిషి ఇష్టపడనిది ఇతరుల వెంట్రుక. అన్నంలో వెంట్రుక వస్తే కొందరు అపర పరశురాములయ్యేది అందుకే.

## 32. ఎవరు దొంగ

**1.** "నేను నిర్దోషిని" అన్నాడు రాముడు. "మాలో ఒక్కరే నిజం చెపుతున్నారు" అన్నాడు సోముడు. సోముడు నిజం చెప్తున్నవాడైతే, రాముడు అబద్ధం చెప్తున్నాడన్న మాట. అతడు దోషి. అలా కాకుండా, సోముడు అబద్ధం చెప్తున్నాడనుకుందాం. అప్పుడు అతను చెప్పిన వాక్యం కూడా అబద్ధమే అవుతుంది. ఆ లెక్కన ఇద్దరూ అబద్ధం చెప్తున్నారు. ఆ విధంగా కూడా రాముడే దోషి.

**2.** ఇక చేప బరువుకి వస్తే, దాని బరువు... రెండు శేర్లు + దాని బరువులో సగం. కొంతమంది మొత్తం బరువు 3 శేర్లుగా పొరపాటు పడుతూ ఉంటారు. కాదు. దాని మొత్తం బరువు 4 శేర్లు. మరో విధంగా చెప్పాలంటే $x = 2 + \frac{1}{2}x$ అన్న సమీకరణంతో సాధించాలి.

**3.** మూడవ ప్రశ్నలో 'తల పొడవుని' రెట్టింపు చేసి తోకతో కలిపితే అది మధ్యభాగపు పొడవు అన్నాడు సోముడు. తల పొడవు అంగుళం అనుకుంటే, తోక పొడవు అంగుళం, మధ్యభాగం 3 అంగుళాలు అవుతుంది. మొత్తం 5 అంగుళాలు. వాస్తవానికి చేప పొడవు 24 అంగుళాలు. ఆ లెక్కన తల పొడవు 24/5 అవుతుంది. అంటే 4.8 అంగుళాలన్నమాట. తల, తోక, మధ్యభాగం వరుసగా 4.8, 4.8, 14.4 అంగుళాల పొడవుంటాయి.

**4.** మొదట దొంగని చూసింది తనేనన్నాడు 'మొదటివాడు'. తనే అన్నాడు 'రెండవవాడు'. దొంగని తొలిగా చూసింది రెండోవాడు అన్నాడు 'చివరివాడు'. **ముగ్గుర్లో కేవలం ఒక్కరే నిజం చెప్తున్నారు.** మనందరికీ సమాధానం రెండవ సైనికుడిగా తోస్తుంది. ఒకవేళ అతడు దొంగని మొదటిసారి చూశాడనుకుందాం. అప్పుడు **ఎంతమంది 'నిజం'** చెప్తున్నారు? రెండవవాడు, మూడవవాడు- ఇద్దరూ నిజం చెప్తున్నారు. కానీ ప్రశ్న ప్రకారం **ఒకరే నిజం** చెప్పాలి కాబట్టి... రెండవ సైనికుడు కాదు. మూడోవాడు ముందు చూశాడనుకుందాం. అప్పుడు ముగ్గురూ అబద్ధం చెప్తున్నట్లేగా! కాబట్టి అతడూ కాదు. ఇక మిగిలింది మొదటివాడు. దొంగని అతడు ముందు చూశాడను కుందాం. తనే చూశానన్నాడు కాబట్టి అతడు నిజం చెప్తున్నాడు. ప్రశ్నని గమనిస్తే – మిగతా ఇద్దరు సైనికులూ అబద్ధం చెప్తున్నారని తెలిసిపోతుంది. ప్రశ్న ప్రకారం ఒకరే నిజం చెప్పాలి కాబట్టి మొదటి సైనికుడే దొంగని ప్రథమంగా చూశాడు అన్నది సమాధానం. చాలా గొప్ప తర్కం వున్న ప్రశ్న ఇది.



## 33. నిప్పులపై నీటికాళ్లు

దానికి సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా అన్నాడు. "నీటిలోంచి గుడ్డుని తీసినప్పుడు దాని పైభాగాన ఉన్న పెంకు తడిగా ఉంటుంది. గుడ్డు లోపలి వేడికి పై తడి నీటి ఆవిరిగా మారుతుంది. ఆ ఆవిరి 'పొర' వేలికీ గుడ్డుకీ మధ్య రక్షణగా నిల్చి, వేడిని నిరోధిస్తుంది. ఆ పొర ఆరిపోయే లోపు తండ్రి గుడ్డుని పళ్ళెంలోకి వదిలేశాడు. ఆ సూత్రం తెలియక కొడుకు దాన్ని కాస్త ఎక్కువసేపు పట్టుకున్నాడు. అందుకే కాలింది.

ఇదే సూత్రం నిప్పులపై నడవటానికీ వర్తిస్తుంది. నిప్పు కణికల ముందు నీళ్ల గుంట వుంటుంది. నిప్పులపై పరుగెత్తేవారు అందులో కాళ్లు తడి చేసుకుని వెళ్తారు. పాదాలకంటిన నీరు ఆవిరి పొరగా మారి, కాళ్లని రక్షిస్తుంది. అలా కాకుండా పాదాలని నీటితో తడపకపోయినా, నిప్పులపై మరోక్షణం ఎక్కువసేపు ఉన్నా ఏ దేవుడూ ఆ కాళ్లని రక్షించలేడు."

రాజుకా విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**గుడ్డివారు సాధారణంగా నల్ల కళ్ళద్దాలు ఎందుకు ధరిస్తారు?**

గత దశాబ్దపు పాఠకుల పది గొప్ప సందేహాల్లో ఒకటి "అంధులైన పసివారు నవ్వుతారా?" అన్నది. నవ్వుతారు. అంధుల్లో 75 శాతం మంది, నూరుశాతం గుడ్డివారు కాదు. బయట వెలుతురుగా వున్నదో, చీకటో చెప్పగలరు. దృష్టి లోపం వేరు. వెలుతురు లోపం వేరు. అంధత్వం వున్నప్పుడు కంటి రెటీనా వెలుతురుకి చాలా సెన్సిటివ్‌గా వుంటుంది. అందుకే వారు నల్ల కళ్ళద్దాలు ధరించటానికి ఇష్టపడతారు. అందం కూడా ఈ విషయంలో ప్రాముఖ్యత వహిస్తుంది.

## 34. రథప్రమాదం

విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు.

"కోసలరాజు చెప్పినదానిలో చాలా అంతరార్థము, భవిష్యత్ ప్రణాళిక ఉన్నాయి. ఏ దేశపాలనైనా ఆయా రంగాల్లో నిష్ణాతులు, మేధావులు, రాజ్యాంగ నిపుణులమీదే ఆధారపడి ఉంటుంది. అవంతీరాజ్యపు నియోజకవర్గ ప్రతినిధులందరూ అజ్ఞానులని నిరూపించటమే కోసల యువరాజు ఉద్దేశ్యం! ప్రతీ ప్రశ్నకీ సమాధానం తెలియాలని కాదు కానీ అసలు 'ప్రయత్నించాలనే' కోరిక లేకపోతే ఎలా? ఒక ప్రశ్న వేయగానే, క్షణం కూడా ఆలోచించకుండా 'ఇది అసాధ్యం' అనేవారూ, సమస్యకి సమాధానం తెలుసుకోవటంలో ఉత్సాహం లేనివారూ చట్టసభల్లో ప్రతినిధులైతే, ఇక ఆ దేశం ఏమి పురోగతి సాధిస్తుంది? అందుకే పది గ్రామాలకోసం యుద్ధం చేస్తున్నారు. సమర్థులు తమ జ్ఞానాన్ని నమ్ముకుంటారు. అసమర్థులు లంచగొండులై అడ్డదార్లు అన్వేషిస్తారు. కొత్తగా సింహాసనం అధిష్టించిన యువరాజు ఆ విధంగా తాను అనుకున్న ఫలితం సాధించాడు.

ఇక సమాధానాల విషయానికొస్తే-

1. "నేనీ శస్త్రచికిత్స చేయలేను. గాయపడింది నా కొడుకు" అన్నది **యువకుడి తల్లి**. ఆమె కూడా వైద్యురాలు. ఇదీ మొదటి ప్రశ్నకి సమాధానం.

2. అయితే ఈ సమాధానం రెండో ప్రశ్నకి సరిపోదు. ఎందుకంటే, యువకుడి తల్లీ తండ్రీ - ఇద్దరూ స్పృహ తప్పి ఉన్నారు. "ఈ పరిస్థితుల్లో నా సొంత కొడుక్కి శస్త్రచికిత్స చేయలేను" అన్నది **యువకుడి తాత** అయి ఉంటాడు. యువకుడి తండ్రి వైద్యుడు. అతడి తాత, తండ్రి కూడా వైద్యులు అయ్యే అవకాశం ఉంది కదా! ఈ ఒక్కటే సరి అయిన సమాధానంగా తోస్తోంది.


3. మూడోప్రశ్నలో నాలుగు ముక్కలపై 'అ-క-3-4' అని రాసి ఉంది. **అచ్చు వెనుక వైపు తప్పనిసరిగా బేసిసంఖ్య ఉన్నదని నిరూపించాలి.** కేవలం రెండు రెండు ముక్కలే తిప్పి చూడాలి. అదీ షరతు!

మొదటి ముక్క 'అ'. అది అచ్చు కాబట్టి దాని వెనుక బేసిసంఖ్య ఉన్నదో లేదో తప్పనిసరిగా తిప్పి చూడాలి. ఇక రెండో అక్షరం 'క'. అది హల్లు కాబట్టి దాని వెనుక ఏమున్నదో మనకనవసరం. మూడో ముక్కపై ఉన్నది 3 అన్న అంకె. అది




ఎలానూ బేసిసంఖ్య కాబట్టి దాన్ని తిప్పి చూడనవసరం లేదు. చివరి ముక్క 4. అది సరిసంఖ్య కాబట్టి దాన్ని తిప్పి, వెనుక అచ్చు ఉన్నదా లేదా అని పరిశీలించాలి. ఆ విధంగా మొదటిది, చివరిది తిప్పి చూడాలి - అన్నది సమాధానం.

4. ఇక నాలుగో ప్రశ్నలో వరుసగా అంకెలు కలుపుతూపోతే సమాధానం కష్టం అవుతుంది. 3-3, 9-9, 4-4, 8-8, 6-6, 5-5, 1-1, 2-2, 7-7 లు అదే వరుసలో గీస్తే వస్తుంది.




5. ఈ ప్రశ్నకు సమాధానం ఈ విధంగా వుంటుంది.



## 35. రెండు పరీక్షలు

దానికి సమాధానంగా విక్రమార్కుడు ఈ విధంగా చెప్పాడు. "ఒక పాత్రలో వంద తెల్లవి, మరో దానిలో వంద నల్లవి వున్నాయి. వాటిని మొత్తం కలిపేసి, తిరిగి రెంటిలో సమానంగా సర్ది, కళ్ళు మూసుకుని వాటిలోంచి చెరొకటీ తీస్తే, అది తెల్ల ముత్యం అవటానికి ఎంత అవకాశం వుంటుంది? యాభై శాతం. మరోలా చెప్పాలంటే సగం... సగం! అలా కాకుండా మొదటి పాత్రలో ఒక తెల్లది, రెండో దానిలో మిగతా 199 వుంచితే, మొదటి పాత్రలో తెల్లముత్యం వచ్చే అవకాశం 100 శాతం, రెండో దానిలో 99/199 వుంటుంది. సగటు దాదాపు 75 శాతం అవుతుంది. ఇంకే విధంగా చేసినా ఇది పెరగదు. అదృష్టావకాశాలను పెంచుకోవటం అంటే అదే" అని ఒక క్షణం ఆగి తిరిగి కొనసాగించాడు.

"రెండో పరీక్ష మరింత క్లిష్టమయినది. అర్థం చేసుకోవటానికి చాలా ఓపిక కావాలి. మూడు గదుల్లో ఒకదానిలో రాకుమార్తె వున్నదని కోరుకున్నాక, రెండో గది తలుపు తీసి చూపించారు. అందులో ఆమె లేదు. ఇప్పుడు మనకి మరో అవకాశం ఇచ్చారు. అదృష్టాన్ని నమ్ముకున్నవాడు - ఏదైనా లాటరీయే కదా అనుకుంటాడు. అవకాశాల్ని పెంచుకునేవాడు మరింత తార్కికంగా ఆలోచిస్తాడు.

మూడుగదుల్లో మనం ఒక గదిని ఎన్నుకున్నామంటే మన అదృష్టశాతం మూడవవంతు... అంటే 33.3 శాతం మాత్రమే. దురదృష్ట శాతం 66.6 శాతం. రాజు మరో గదిలో తెరిపించాడు. అందులో రాకుమార్తె లేదని రాజుకి "నిశ్చయంగా" తెలుసు. ఇప్పుడున్నవి రెండే గదులు కాబట్టి, మూడో గదిని ఎన్నుకుంటే అదృష్ట శాతం మరికాస్త పెరుగుతుంది. మరోలా చెప్పాలంటే, దురదృష్టం 66.6 లో 50 శాతం తగ్గుతుంది. కౌసల్య కూతురు చేసిన పని అదే. సులభంగా అర్థమవటం కోసం మరో ఉదాహరణ చెపుతాను. వెయ్యి గదులు వున్నాయను కుందాం. నీవొకగదిని ఎన్నుకున్నావు. అందులో రాకుమార్తె వుండటానికి 1/1000 అవకాశం మాత్రమే వున్నది. మిగతా 999 గదుల్లో రాకుమార్తె దేనిలో వున్నదో తండ్రికి తెలుసు. 998 గది తలుపులు తీసి నీకు చూపించాడు. ఇక ఒకటి మాత్రమే మిగిలినది. మొదట ఎన్నుకున్న గదితోనే వుంటావా - రాజు వదిలిపెట్టిన గదిని ఎన్నుకుంటావా? ఆలోచించు."

విక్రమార్కుడికి ఈ విధంగా మౌనభంగం కాగానే భేతాళుడు శవంతో సహా తిరిగి చెట్టెక్కి నిద్రకుపక్రమించాడు.



## 36. శిఖరంపై గాలి సంచి

"అవును. ఈ లెక్క చేయటం ఎందుకు కష్టమైనదంటే, దీనికి ఒక సూత్రం లేదు. ఒక్కొక్క అడుగూ లెక్క కట్టుకుంటూ- 'చివరికి ఎక్కువ సంచులు మిగలాలంటే ఏం చెయ్యాలి?' అని ఆలోచించాలి. అదే చేస్తున్నాను" అంటూ విక్రమార్కుడు జవాబు స్ఫురించినవాడిలా సమాధానం చెప్పాడు.

"పర్వతారోహకుడు తాను మోయగలిగిన 300 సంచులతో బయల్దేరి, 600 అడుగులు పైకి ఎక్కుతాడు. దానికి అతడికి 60 సంచులు ఖర్చు అవుతాయి. అక్కడ 180 వదిలి, 60తో కిందికి దిగుతాడు. కిందికి రావటానికి ఆ అరవై కావాలి కదా!

అదే విధంగా రెండోసారి మరో 300 తీసుకెళ్తాడు. అలాగే మూడోసారి కూడా! ఇప్పుడా మొదటి మజిలీలో 180 + 180 + 240 మొత్తం 600 సంచులు పోగవుతాయి.

అక్కడినుంచి 1000 అడుగుల ఎత్తులో రెండో మజిలీ ఏర్పాటు చేసుకుంటాడు. అక్కడికి 300 తీసుకువెళ్లి 100 వదిలి కిందకి వచ్చి, రెండో విడత తిరిగి 300 తీసుకువెళ్తాడు. రెండో మజిలీలో ఇప్పుడు 100 + 200 మొత్తం 300 సంచులు పోగవుతాయి. ఇంకా దూరం 1400 అడుగులు ఉంది. అక్కడికి వెళ్లటానికి 140 ఖర్చవుతాయి. 160 మిగులుతాయి. ఎంత ఆలోచించినా ఇంతకన్నా ఎక్కువ సంచుల్ని పైకి చేర్చటం అసాధ్యంగా తోస్తోంది" అంటూ ఓ క్షణం ఆగి తిరిగి చెప్పాడు. "ఈ ప్రశ్నలో మెలిక ఏమిటంటే... రెండో మజిలీలోకి, తాను మోయగలిగేటన్ని సంచులు చేర్చటమే. అతడు మోయగలిగేది 300 మాత్రమే. అట్నుంచి వెనక్కి లెక్క కట్టుకుంటూ రావాలి. అప్పుడు మొదటి మజిలీ 600 అడుగుల ఎత్తులో, రెండో మజిలీ 1600 అడుగుల ఎత్తులో వుంటుంది. చాలా క్లిష్టమయిన్న లెక్కల్లో ఇదొకటి."

రాజుకీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా చెట్టెక్కాడు.

### మీకు తెలుసా?

**కొందరు నవ్వినప్పుడు బుగ్గల్లో నొక్కులు ఎందుకు పడతాయి?**

ఒకవైపు ళ్ళ చిగుళ్ళకీ, మరోవైపు బుగ్గల (లేదా) గెడ్డపు అంతర్భాగానికీ మధ్య కండరాల కలయిక సాధారణ మనుష్యుల్లో లాగా విడిపోకుండా వున్నప్పుడు, నవ్వుతూంటే కలిగే అవకరమే ఆ సొట్ట. కాబట్టి అవి పడనివారు అందమైన ఎదుటి నొక్కుల్ని చూసి ఈర్ష్య పడనవసరం లేదు.

## 37. తెలివి - వేగము

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం ఇచ్చాడు.

"రాణీ చెప్పింది నిజమే! పెద్దవారికన్నా కొడుకు నడక, గుర్రపు వేగమూ ఎక్కువ కాబట్టి ఆ అవకాశం వదులుకోకూడదు. బేతాళా! పైకి చిన్నదిగా కనపడినా ఇది మరొక చాలా క్లిష్టమైన లెక్క. నీవు చెప్పినట్టు దీనిని గణితసూత్రాలతో చేయటం వీలవుతుంది గానీ, ఎంతో కష్టపడుతూ చెయ్యాలి. జమిందారు గుర్రాన్ని ఎక్కడ వదిలిపెట్టి వెళ్లాలి అన్నదే సమస్య. గుర్రం ఖాళీగా ఉండకూడదు. ముగ్గురూ ఒకే సమయంలో చేరుకోవాలి అన్న సూత్రం మీదే జవాబు ఆధారపడి ఉంటుంది" అని ఒక క్షణం ఆలోచించి సమాధానం చెప్పాడు.

"తండ్రి 1.24 కి.మీ. ప్రయాణించి గుర్రాన్ని అక్కడ వదిలిపెట్టి, నడకతో ముందుకుసాగుతాడు. గమ్యం చేరుకోవటానికి జమిందారుకి 20.42 నిమిషాలు పడుతుంది. ఈ లెక్కలో నీవు నాకు చేసిన సహాయం ఏమిటంటే, గుర్రం వేగమూ, కొడుకు నడక వేగమూ ఒకటే. అవి గానీ వేరు అయ్యుంటే ఈ ప్రశ్న మరింత కఠినమయ్యేది. రెండు వేగాలూ ఒకటే కాబట్టి, తండ్రి వదిలేసిన గుర్రాన్ని 'వెంటనే' కొడుకు వేగంగా వెనక్కి తీసుకొస్తాడు. అప్పటికి తల్లి ఇంకా కొంత ముందుకు నడిచి వస్తుంది. కొడుకు 0.74 కి.మీ. దగ్గర తల్లికి గుర్రాన్ని ఇచ్చి, తను కూడా గుర్రంతో పాటే నడక కొనసాగిస్తాడు. మొత్తం ఇద్దరూ కలిసి 20.36 సెకన్లలో గమ్యం చేరుకుంటారు. మరోలా చెప్పాలంటే, తండ్రి అక్కడికి చేరుకోవటానికి సరీగ్గా అయిదు సెకన్ల ముందున్న మాట. ఆ 'అయిదు సెకన్లు' కూడా తగ్గించాలంటే మరింత సూక్ష్మంగా లెక్క కట్టాలి. నిన్ను భుజంమీద మోస్తూ అంత నిశితంగా లెక్క చేయటం కష్టం" అన్నాడు. రాజుకీ విధంగా మౌనభంగం కాగానే బేతాళుడు తిరిగి శవంతో సహా చెట్టెక్కాడు.



## 38. ఇరవై 'ఇరుకు' ప్రశ్నలు

1. ఒక తరం క్రితం భారతదేశం వచ్చినా, పాకిస్తాన్ పౌరుడయినా మరే దేశపు పౌరుడయినా, బ్రతికున్న మనిషిని పాతిపెట్టటానికి ఏ ప్రభుత్వమూ వప్పుకోదు.
2. తన రంగు నలుపని ఏ జంతువూ చెప్పలేదు. మాట్లాడలేదు కోబట్టి. (ఈ సమాధానం మీకు ముందే తెలుసు కదూ.)
3. కనీసం అయిదు ప్రశ్నలు వెయ్యాలి. నా జన్మదినం జనవరి 31 అనుకుందాం. 1. అది మొదటి పక్షం రోజుల్లోనా? 2. అది 16-23 మధ్యతేదీల్లోనా? 3. లేక 24-27 తేదీల మధ్యలోనా? 4. కాకపోతే 28, 29 లలో ఒకటా? 5. ఆఖరిప్రశ్న. జన్మదినం జనవరి 30నా? ఇంతకన్నా తక్కువ ప్రశ్నలతో సమాధానం సాధించటం సాధ్యమేమో ఆలోచించండి.
4. ప్రస్తుతం వున్న పాతస్టేషన్లు "ఎనిమిది". కొత్తగా నిర్మించిన స్టేషన్లు "అయిదు". పాత స్టేషన్ల నుంచి కొత్త వాటికి 40, కొత్త స్టేషన్ల మధ్య 10 టిక్కెట్లు - రాను, పోను మొత్తం 100 టిక్కెట్లు.
5. YOU ARE MINE.
6. రాధాకృష్ణులు మొత్తం 9 ఆటలు ఆడారు. రాధ 6, కృష్ణుడు మూడు గెల్చారు. అందువల్ల రాధకి 3 వరహాలు లాభం వచ్చింది.
7. మీరు సృష్టించిన రూమరు మొదటి ముప్ఫై నిముషాల్లో 4 గురికి తెలుస్తుంది. అప్పటికి మీతో కలిపి అయిదుగురు. గంట గడిచేసరికి మీ అయిదుగురూ కాక మరో (4 × 4) 16 మందికి తెలుస్తుంది. రెండు గంటల్లో 1+4+16+64+256. ఆ లెక్కన 8 గంటల్లో ప్రపంచమంతా పాకుతుంది. రూమర్లకి రెక్కలుంటాయన్నది అందుకే.
8. అయిదుగంటల్లో అయిదడుగుల లోతు తవ్విన కూలీలే వందగంటల్లో వంద అడుగులు తవ్వుతారు.
9. 16 రూపాయలకి 24 నిమ్మకాయలు వస్తాయి. 24 రూపాయలకి 36 నిమ్మకాయలు వస్తాయి. అంటే డజను ఎనిమిది రూపాయలు. ఖరీదు కాసింత ఎక్కువే. ఈ లెక్కని x, y లతో కూడా చెయ్యవచ్చు. ప్రయత్నించండి.
10. మొత్తం మేము ఏడుగురం. నాకు 3 అన్నలు, 2 అక్కలు, 1 చెల్లి, నా చెల్లికి 2 అక్కలు, 4 అన్నలు.
11. నటుడి వయసు 18. $3(x+3) - 3(x-3)$ అయితే $x = 18$ కదా. ఈ ప్రశ్నని ఇంకోలా కూడా చెయ్యవచ్చు. ప్రస్తుతం అతడి వయసు 10 ఏళ్ళ

అనుకుంటే, 3 ఏళ్ళ క్రితం వయసు 7, మూడేళ్ళ తరువాత 13. మూడు రెట్ల తేడా 39 - 21 = 18.

**12.** ఎత్తు ఎక్కేటప్పుడు గంటకి 16, దిగేటప్పుడు 6. కాస్త క్లిష్టమయిన లెక్కే ఇది. ప్రయత్నించండి.

**13.** చాలామంది పడవవారుకూడా ఈ ప్రశ్నకి సమాధానం తప్పుగా చెప్తారు. పడవతో పాటు బిరడా ముందుకు కదుల్తోంది కాబట్టి, దాని నుంచి ముందుకు వెళ్ళాలన్నా, వెనక్కి వెళ్ళాలన్నా (ప్రవాహ వేగము లెక్కలోకి తీసుకుంటే) కష్టం ఒకటే.

**14.** నీళ్ళని తొందరగా చల్లబర్చాలంటే సీసాని ఐసు "క్రింద" పెట్టాలి. కాఫీని వెచ్చ చేయాలంటే గిన్నెని మంట "పైన" పెట్టాలి.

**15.** గతుకుల ఉపరితలంపైకన్నా, నున్నగా ఉన్న ఉపరితలంపై కాంతికిరణాలు సమాంతరంగా పరావర్తనం చెందుతాయి. బూట్ల మీద రాసే పాలిష్, కంటికి కనిపించని సూక్ష్మ గతుకుల్లో నిండి, దాని ఉపరితలాన్ని సమతుల్యం చేస్తుంది. అప్పుడవి మెరుస్తాయి.

**16.** ఒకరు గంటలో 1/2, మరొకరు 1/3 టైపు చేయగలరు. కాబట్టి 3:2 నిష్పత్తిలో కాగితాలు పంచుకోవాలి. రాముడు 36, సోముడు 24 పేజీలు తీసుకోవాలి. మొదటి గంటలో వారు 50 పేజీలు, అంటే 5/6 వంతు చేయగలరు. పనిపూర్తి చేయటానికి 72 నిముషాలు పడుతుంది.

**17.** భీముడు తీసుకున్న సంచుల్లో పెద్దది (31 పళ్ళది) తప్పనిసరిగా వుండాలి. మరికొంచెం లోతుగా ఆలోచిస్తే... "రెట్టింపు" అంటే సరిసంఖ్య. ఏ మూడూ కలిపితే భీముడికి సరిసంఖ్య వస్తుందో ఆ విధంగా లెక్క కట్టాలి. ఆ విధంగా రాముడు మొదటి రెండు సంచులు (33) భీముడు చివరి మూడు సంచులు (66) కొనుక్కున్నారు.

**18.** చెప్పగలము. రైలు పట్టా నిడివి 15 మీటర్లు అనుకుంటే, పట్టాల జాయింటు దగ్గర శబ్దం వస్తుంది కాబట్టి, నిముషానికి పదిసార్లు శబ్దం వస్తే, 150 మీటర్లు ప్రయాణం చేసినట్టు! దాన్ని 60తో హెచ్చించి 1000తో భాగిస్తే, గంట వేగం కిలోమీటర్లలో వస్తుంది.

**19.** రైలు ఆగినప్పుడు పెట్టెలన్నీ ఇంజన్‌కి దగ్గిరగా వస్తాయి. తిరిగి కదలాలంటే, అన్నిటినీ ఒకేసారి లాగటం కష్టం. ఇంజన్‌కు అంత శక్తి వుండదు. కాస్త



వెనక్కి జరిపి, ఒక్కొక్క పెట్టెనీ క్రమక్రమంగా లాగటం సులభం. ఈ సాంకేతిక సూత్రాన్ని అనుసరించే ఎద్దులబండి లాగే వ్యక్తి కూడా, వాటిని అదిలించి, బండి కదిలిన తరువాత ఎక్కుతాడు.

**20.** ఏడు పళ్ళని 12 మందికి పంచాలంటే ఒక్కొక్కరికి 7/12 ఫండు వస్తుంది. మరోలా చెప్పాలంటే 3/12 + 4/12 వస్తుంది. 3 పళ్ళని ఒక్కొక్కదాన్నీ 4 ముక్కలుగా, మిగిలిన నాలుగు వాటిని మూడు ముక్కలుగా కోసి ఇవ్వాలి. ఒకొక్క కుర్రాడికి చెరొక 1/4 + 1/3 ముక్కలు వస్తాయి.

### పెరిగే గడ్డి - తినే గొర్రెలు

వంద గొర్రెలు 20 రోజుల్లో తినే గడ్డి 100 × 20 = 2,000 యూనిట్లు. 50 గొర్రెలు 60 రోజుల్లో తినేది. 50 × 60 = 3,000 యూనిట్లు. అంటే ఈ 40 రోజుల్లో 1,000 యూనిట్ల గడ్డి ఎక్కువ పెరుగుతుందన్నమాట. మరో విధంగా చెప్పాలంటే - 25 గొర్రెలకు సరిపడా గడ్డి ఒక్కరోజులో పెరుగుతుందన్న మాట.

ఇప్పుడు మళ్ళీ మొదటి వాక్యం దగ్గరకొస్తే, 20 రోజుల్లో గొర్రెలు 2,000 యూనిట్లు తిన్నాయి. మరోలా చెప్పాలంటే, మొదటిరోజు ప్రారంభంలో 1,500 యూనిట్ల గడ్డి ఉంది. గొర్రెలు ఆ గడ్డిని మేస్తూ ఉండగా 20 రోజుల్లో మరో 500 యూనిట్లు పెరిగింది.

ఇప్పుడు అసలు ప్రశ్న దగ్గరికి వద్దాం. మొత్తం గడ్డిని 25 రోజుల్లో ఖాళీ చేయాలి. ప్రారంభంలో 1,500 యూనిట్ల గడ్డి వుంటుంది. 25 రోజుల్లో 1,500 యూనిట్ల గడ్డి తినటానికి ఎన్ని గొర్రెలు కావాలి? జవాబు చాలా సులభం. ఇంతవరకూ వచ్చాక ఆరోక్లాసు కుర్రాడు చేస్తాడు. 60 గొర్రెలు కావాలి. అయితే - ఈ 25 రోజుల్లో 'పెరిగే' గడ్డి తినటానికి కూడా మరి కొన్ని గొర్రెలు కావాలి. అవి 25 అని మనకు ముందే తెలుసు. వాటిని కలపాలి. మొత్తం 85. అదీ జవాబు.

## 39. తెలివికి పరాకాష్ట

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "ప్రశాంతుడు సరి అయిన సమాధానం చెప్పగలగటానికి కారణం - అతడికి మంత్రిగారి మాటలు వినపడకపోవటమే. విని ఉంటే చెప్పలేకపోయి ఉండేవాడు. ఇప్పుడిక రాణిగారు ఏ విధంగా ఆలోచించినదీ చూద్దాం.


మొదటి ప్రశ్నలో "పెట్టె సంఖ్యలో మొదటి 7లో లేదు" అన్నది తేలిపోయింది. ఇక రెండో ప్రశ్న: "పెట్టె యాభై కన్నా పెద్ద సంఖ్యా?" అని అడిగింది. మంత్రి "కాదు" అని అబద్ధం రాసి ఉంటాడు. అది నిజమని రాణి మనస్ఫూర్తిగా నమ్మింది. అందుకే చివర్లో మొదటి అంకె "మూడా" అని ప్రశ్నించింది. కాబట్టి పెట్టె సంఖ్య 50 పైనే ఉంటుంది. ఇది మొదటి తర్కం.

"పెట్టె సంఖ్య వర్గమా?" అని రాణి అడిగినప్పుడు మంత్రి "అవునో-కాదో" రాసి ఉంటాడు. మంత్రి అలా రాయగానే రాణి ఆనందంతో, "ఇక ఆఖరి ప్రశ్న" అన్నది. "అది వర్గం కాదు" అని మంత్రి రాసి ఉంటే - జవాబు అంత తొందరగా లభించదు. కాబట్టి మంత్రి "అది వర్గమే" అని రాసి ఉంటాడు. **అది నిజమని రాజు ధృవీకరించాడు.** కాబట్టి పెట్టె సంఖ్య 64-81-100లో ఒకటి అయి ఉంటుంది. ఇది రెండో తర్కం.

ఇక ఆఖరి అంశానికి వద్దాం. మంత్రి రాసినదంతా నిజమని రాణి నమ్ముతోంది. "ఆ సంఖ్య 4తో భాగింపబడుతుందా?" అని రాణి అడిగిన ప్రశ్నకి మంత్రి ఏం జవాబు రాశాడో తెలియకపోయినా, **అబద్ధం చెప్పాడని** మాత్రం ప్రశాంతుడికి తెలుసు. కానీ రాణి అలా అనుకోవటం లేదు. 50 లోపులో వర్గాలు ఏడు వున్నాయి. అవి 1, 4, 9, 16, 25, 36, 49. కానీ ఆమె వాటిలో రెండిటిని తప్ప మిగతా వాటిని పట్టించుకోలేదు. అంటే మంత్రి అది 4తో భాగింపబడుతుందని రాశాడన్నమాట. అందుకే రాణీ అంత ఉత్సాహంగా లేచి "16" అని చెప్పివుంటుంది. ఆ జవాబు తప్పని తేలిపోయింది కాబట్టి, ఆ సంఖ్య - "4తో భాగింపబడని - 50కి పైన - వర్గము" అయి ఉంటుంది. అది కేవలం 81 మాత్రమే. ప్రశాంతుడు అదే చెప్పాడు." రాజుకీవిధంగా మౌనభంగం కాగానే బేతాళుడు శవంతోసహా తిరిగి చెట్టెక్కాడు.

❖ ❖ ❖


మూడు తిన్నటి గీతలతో 7 ఇళ్ళకీ ప్రహరీ గోడలు ఈ విధంగా నిర్మించవచ్చు.






## 40. ఏడువింతలు

1. ఇద్దరి వేళ్లు అయితే 25. ముగ్గురైతే 125. నలుగురైతే 625. అదే 670 కోట్లు అయితే - 5 టు ది పవర్ ఆఫ్ 670 కోట్లు. అందులో ఎన్ని సున్నాలుంటాయన్నది లెక్క కట్టాలి. గణితశాస్త్రం ప్రకారం అదీ జవాబు. అయితే, చేతివేళ్లు లేనివాళ్లు ఈ ప్రపంచంలో ఏ ఒక్కరున్నా, జవాబు 'సున్నా' అవుతుంది తర్కశాస్త్రం తెలిసినవారు ఆ విధంగా జవాబు ఇస్తారు.
2. లీపు సంవత్సరంలో అన్ని నెలలకీ 29 రోజులుంటాయి.
3. పడవలోని రాయిని నీటిలో పడెయ్యటం వలన పడవ పైకి తేలినా కానీ, నీటిలో రాయి "పూర్తిగా" మునుగుతుంది కాబట్టి మొత్తం మీద చెరువులో **నీటిమట్టం పెరుగుతుంది**. అదే కర్రదుంగ అయితే, అది నీటిలో "తేలుతూ" తొలగించిన నీటి భారం, అది నీటిలో కోల్పోయే బరువుకి సమానం కాబట్టి చెరువు నీటిమట్టంలో **మార్పు ఉండదు**. కర్రదుంగ పడవలో ఉన్నా, నీటిలో ఉన్నా ఒకటే.
4. "షార్కులు, పడవకి చిల్లులు లాంటి" భయభ్రాంతుల్ని చేసే విషయాలు ఊహించుకోవటం మానెయ్యండి. అదే సమాధానం.
5. ఈ ప్రశ్నకి సమాధానం లేదు. గర్భిణీ స్త్రీ చెట్టుమీద ఎక్కి, అక్కడ ఒంటికాలి శిశువుని కంటే తప్ప.
6. అఫ్ఘనిస్తాన్‌లో రైళ్లు లేవు.
7. ఇందులో చాలా సందేహాలున్నాయి. రాజుకి ఎందరు కూతుళ్లు? ఇద్దరుంటే అసలు గొడవే లేదు కదా. ఇంతకన్నా పెద్ద సందేహం: యువకుడు ప్రేమించింది ఆ రాజు కూతుర్నేనా? ఇంతకన్నా... ఇంతకన్నా పెద్ద అనుమానం: రాజుగారు ఒకయువకుడికి అర్ధరాజ్యం ఇస్తానన్నారు. రాకుమార్తె మరో యువకుడిని పెళ్లాడతానని వాగ్దానం చేసింది. అసలు ఇందులో సమస్య ఏమున్నది?
8. ఇక్కడ భూమి చుట్టుకొలత ఎంత ఉన్నది అనవసరం. మనిషి పొడవు 2 మీటర్లు కాబట్టి, భూకేంద్రం నుంచి వ్యాసార్థం కూడా అంతే పెరుగుతుంది. ఇక్కడ వ్యాసార్థం 2 మీటర్లు పెరిగిందీ అంటే చుట్టుకొలత $2 \times \Pi$ (22/7) పెరుగుతుంది. అంటే దాదాపు ఆరు మీటర్లు, భూమి చుట్టూ కట్టినా - బంతి చుట్టూ కట్టినా, రిబ్బన్ పొడవులో తేడా కూడా అంతే ఉంటుంది.



**9.** గతంలో ఇటువంటి ప్రశ్న ఒకటున్నది. అయితే దీనికీ దానికీ తేడా వుంది. 6 గుడ్లు వున్నాయి. అయిదుగురూ అయిదు తీసుకుంటే ఒకటి మిగులుతుంది కదా! ఇందులో ప్రశ్న ఏమీలేదు. మీ హడావుడికి పరీక్ష. అంతే.

**10.** పంపు కింద కుండని తిరగేసి బోర్లించి పెడితే అది ఎంతకీ నిండదు.

**11.** గజానికి 36 అంగుళాలు. ఆ లెక్కన పది గజాల్లో 720 అర (1/2) అంగుళాలు. నిమిషానికి 120 అర (1/2) సెకన్లు. ఆ రెండూ సమానమే.

**12.** చెరి రెండేసి ఫోన్‌లని ఒక గ్రూపుగా చేసి అయిదుసార్లు పరీక్షించాలి. ఎర్రలైటు వెలిగిన రెండు గ్రూపుల్లో ఒక్కొక్క ఫోనూ తిరిగి ఒకసారి పరీక్షించాలి. మొత్తం ఏడు పరీక్షలు. 11వ ఫోన్‌లో బాంబువున్నా ఈ లెక్కే సరిపోతుంది.

**13.** X + Y = 500, X + 1/2 Y = 350 అనుకుంటే X = 200 అవుతుంది. అదే సీసా బరువు. నూనె బరువు 150, తేనె బరువు 300 గ్రాములు.

**14.** 'రెండేళ్ల తరువాత నా కొడుకు వయసు రెట్టింపు' అంటే ప్రస్తుతం అతని వయసు 2 సంవత్సరాలు అయి ఉండాలి. 'నాలుగేళ్ల తరువాత మూడురెట్లు' అంటే ప్రస్తుతం పాప వయసు 2 సంవత్సరాలు. కాబట్టి ఇద్దరూ కవలలు.

**15.** మీటరుకి దాదాపు మూడు అడుగులనుకుంటే కిలోమీటరుకి 1000 మీటర్లు కాబట్టి విజయవాడ 250 కి.మీ. ప్రయాణం చెయ్యటానికి ఏడున్నర లక్షల అడుగులు వెయ్యాలి.

**16.** గొట్టంలో నీళ్లు పోస్తే బంతి పైకి తేలుతుంది. కుర్రాడి దగ్గర నీళ్లు ఎలాగూ ఉంటాయి కాబట్టి అవి ఉన్నట్టు రాయలేదు.

**మీకు తెలుసా?**

**దీపం చుట్టూ పురుగులు ఎందుకు చేరతాయి?**

దీపం కనుక్కోబడకముందు, ఆ మాటకొస్తే మనిషి పుట్టక ముందు లక్ష సంవత్సరాల నుంచీ ఈ భూమ్మీద పురుగులు సంచరిస్తున్నాయి. రాత్రివేళ ఆహారం కోసం అవి చంద్రుడూ నక్షత్రాల ఆధారంగా పయనం సాగించేవి. కాగడానీ, ఆపై బల్బునీ మనిషి కనుక్కున్నాక దీపాల్నే ఆ పురుగులు నక్షత్రాలనుకుంటున్నాయి. తమ భ్రమని అవి తెలుసుకుని మళ్ళీ పరిణామం చెందటానికి మరో లక్ష సంవత్సరాలు పడుతుంది. అప్పటికి దీపంగానీ, మనుష్యులుగానీ భూమ్మీద వుండరు.



## 41. ప్రేమికుల కలయిక

మొదటి ప్రశ్నకు సమాధానం: మొత్తం అయిదుగురు ఉన్నారు - ఇద్దరు పిల్లలు, ముగ్గురు సైనికులు. పడవ ఇద్దరు చిన్నపిల్లల్ని గానీ, ఒక సైనికుణ్ని గానీ మోయగలదు. అందుకని, మొదట ఇద్దరు చిన్నపిల్లలూ అటువెళ్లి ఒకరు వెనక్కి వచ్చి, సైనికుడిని అటు పంపాలి. తరువాత అదే పడవమీద అవతలి ఒడ్డున ఉన్న కుర్రాడు ఇటు రావాలి. ఈ రకంగా లెక్క వేస్తే, ఒక సైనికుడిని అవతలి ఒడ్డుకి పంపటానికి పడవ నాలుగు విడతలు తిరగాలి. ముగ్గురు సైనికులూ అటు వెళ్లి, ఇద్దరు పిల్లలు తిరిగి తమ ఒడ్డుకి రావటం కోసం మొత్తం పడవ 12 సార్లు అటూ ఇటూ ప్రయాణం చేయవలసి ఉంటుంది.

❖ ❖ ❖

ఇక రెండో ప్రశ్న. ఒక వ్యక్తి గాలి వాలులో మైలు దూరాన్ని 2 నిమిషాల్లోను, ఎదురుగాలిలో 6 నిమిషాల్లోను ప్రయాణం చేస్తాడు. గాలి లేకపోతే ఎంతసేపు పడుతుందన్నది సమస్య. పైకి చాలా సులభంగా కనపడే ప్రశ్న ఇది. అవసరమైన దానికన్నా ఎక్కువ చురుకుదనము, తొందరపాటు ఉన్న పిల్లలు, రెండిటికీ సగటు కట్టి "నాలుగునిమిషాలు" అని చెపుతారు. కాదు. "రెండు నిమిషాల్లో మైలు దూరం" అంటే గంటకి 30 మైళ్లు. అదే విధంగా ఆరు నిమిషాలంటే గంటకి 10 మైళ్లు. రెండిటి సగటు వేగం 20 మైళ్లు. అంటే గాలి ప్రభావం లేకపోతే మైలు దూరం ప్రయాణం చెయ్యటానికి 3 నిమిషాలు పడుతుంది అన్నమాట.

❖ ❖ ❖

చివరి ప్రశ్న చాలా కష్టమైనది. ఇది చెయ్యటానికి నేను చాలా కష్టపడవలసి వచ్చింది. మరోలా చెప్పాలంటే, నా విద్వత్తుకి మించినది. బేతాళా! నేను చెప్పబోయే దానికన్నా సులభంగా దీన్ని సాధించగలిగే విధానం మరేదైనా ఉంటే నువ్వు చెప్పు. నేను ఆలోచించిన విధానం ఇది:

పడవపై శంభు వేగాన్ని 'శ' అని, సంహిత వేగాన్ని 'స' అని, నది వెడల్పుని 'వె' అనుకుంటే, ఇట్నుంచి శంభు 720 గజాలు వెళ్లేసరికి, అట్నుంచి సంహిత (నది వెడల్పు - 720) గజాలు వచ్చింది.

ఇద్దరూ నది మధ్యలో ఒకచోట కలుసుకున్నారు. ఇద్దరి ప్రయాణసమయం ఒకటే కాబట్టి, దీన్నే సమీకరణం చేస్తే 720/శ = (వె-720)/స... అవుతుంది. దీన్ని ఒకవైపు వుంచు.

అక్కణ్నుంచి వారు ఇంకా ముందుకి ప్రయాణం చేసి ఒడ్డుకి చేరుకుని, ప్రియుడి కోసం సంహిత - ప్రియురాలి కోసం శంభు ఒక గంట ఎదురు చూసి, తిరుగు ప్రయాణమై 400 గజాల దగ్గర కలుసుకున్నారు. ఇద్దరూ "సరిగ్గా గంటసేపు" ఒకరికోసం ఒకరు ఎదురుచూశారు కాబట్టి దానిని మనం పరిగణనలోకి తీసుకోనవసరం లేదు. మొత్తం ప్రయాణాన్ని సమీకరిస్తే అది

"శంభు అవతలి వొడ్డుకి ప్రయాణించిన కాలం + తిరుగు ప్రయాణానికి పట్టిన కాలం = సంహిత ప్రయాణ కాలం" అవుతుంది. మరోలా చెప్పాలంటే

"((నదివెడల్పు - 720)+400)/శ = (720+(నదివెడల్పు-400))/స" అవుతుంది. ఇది రెండో సమీకరణం.

ఈ రెంటినీ క్లుప్తీకరించటం వలన నది వెడల్పు 1760 గజాలుగా తెలుస్తుంది. రాజమండ్రి - కొవ్వూరుల మధ్య గోదావరి వెడల్పులో సగం కన్నా కాస్త ఎక్కువ. ఇంతకన్నా సులభంగా దీన్ని సాధించటం ఎలాగో నాకు తెలియటం లేదు. నీకుతెలిస్తే చెప్పు" అన్నాడు విక్రమార్కుడు. రాజుకి మౌనభంగం కాగానే బేతాళుడు అదృశ్యమైపోయాడు.

## మీకు తెలుసా?

**దోమ కుడుతున్నప్పుడు లేని నొప్పి, దద్దురు లేచిన తరువాత ఎందుకుంటుంది?**

దోమ శరీరంపై కూర్చున్న నిముషం తరువాత కుట్టటం ప్రారంభిస్తుంది. రక్తం పీల్చటం కోసం కొక్కేన్ని దింపటానికి ముందు అది వదిలే ద్రవంవల్ల చర్మం తిమ్మిరెక్కి నొప్పి తెలీదు. గొడవేమీ లేకపోతే ఆరు నిముషాల పాటు దోమ కుడుతూనే వుంటుంది. అది వదిలిన ద్రవపు తిమ్మిరి తగ్గాక మంట, దురద ప్రారంభ మవుతాయి. ఇంకో విషయం తెలుసా? మనిషి 'మంట'నైనా భరించగలడు గానీ, దురదని తట్టుకోలేడు. అందుకే కొందరు రక్తం వచ్చే వరకూ గోకుతూనే వుంటారు. అన్నట్టు మరో సంగతి. కొందరి రక్తం దోమలకిష్టం అంటారు. కాదు. కొందరి చెర్మపు వాసన దోమలకి పడదంతే. చివరగా చిన్న చిరుసత్యం. రోదసీలో ప్రయాణించే నావికులు, ముక్కు చెవులూ దురదపెడితే చాలా అవస్థ పడతారు. పై కవరు అంచులకి వాటిని రుద్దుతూ కాస్తలో కాస్త సేద తీరుతారు.



## 42. అంకెల గారడీ

దానికి విక్రమార్కుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు. "బేతాళా! కష్టాల్లో వుండి భగవంతుని ప్రార్థించి మొక్కులిచ్చే వారి మనఃస్థితి అర్థం చేసుకోవచ్చు. కానీ లంచం తీసుకుని, లేదా పాపం చేసి - దాని పరిహారార్థం హుండీలో డబ్బు వేసి చేతులు కడుక్కునేవారి ఆత్మవంచనని క్షమించలేము. దొంగ బాబాలు వారికంటే నీచులు. వీరి తెలివితేటలు ప్రజల్ని మోసం చేయటానికే సరిపోతాయి.

"మనసులో నీవు ఒక అంకె తలుచుకుని... దాన్ని రెండుతో మూడుసార్లు హెచ్చవేసి... నీవు తలుచుకున్న అంకెని రెట్టింపు చేసి... దానికి కలుపు. వచ్చిన సంఖ్యలో కుడివైపు అంకె నీ భవిష్యత్తు- అది "శూన్యం". అని ఎవర్నయినా నిన్ను భయపెట్టవచ్చు. ఎందుకంటే ఏ అంకె తలుచుకున్నా చివరి అంకె 'సున్నా'యే వస్తుంది.

బుద్ధదానంద చేసిందదే. నీవు పుట్టిన సంవత్సరానికి నీ వయసు కలిపితే వచ్చేది ప్రస్తుత సంవత్సరంలో 2009 కదా. ఉద్యోగంలో చేరిన సంవత్సరానికి, వృత్తి అనుభవం కలిపితే వచ్చేది కూడా 2009 కదా. 2009 + 2009 = 4018 = 13 = 4 అదే రాహువు" అంటూ కొనసాగించాడు.

"ఉద్యోగి ఏడాది దాటాక వెళ్లాడు. అంటే 2010లో వెళ్లాడనుకుంటే లెక్క సరిపోదు. మరో నెల ఆగి 2011లో వెళ్లి ఉంటాడు. 2011 + 2011 లెక్కకడితే అప్పుడు 8 వస్తుంది. దాన్ని 'శని'కి ఆపాదించి స్వామి తన పబ్బం గడుపుకున్నాడు. మనిషి అజ్ఞానం మీద తెలివైనవాడు ఆడుకునే ఆటకి ఇదే ఒక ఉదాహరణ. ఇక నీ మొదటి ప్రశ్నకి సమాధానం - బహుశ ఆమె భర్తే అగ్నిమాపక దళ యువకుడు ప్రహ్లాద చక్రవర్తి అయి వుంటాడు. తన సేవకి ప్రతిఫలం తన భార్యకి చేరటం చూసి మనస్ఫూర్తిగా, హాయిగా నవ్వి వుంటాడు" అన్నాడు.

రాజుకీ విధంగా మౌన భంగం కాగానే శవంతోసహా తిరిగి చెట్టు ఎక్కాడు బేతాళుడు.

## మీకు తెలుసా?

**ఎందుకు కుందేళ్ళు మాటిమాటికీ ముందుకాళ్ళతో ముక్కు తడుపుఁ కుంటాయి?**

ఆహారాన్నీ, ప్రమాదాన్నీ ముక్కు తడిగా వుంటే తప్ప అవి పసిగట్టలేవు. చిన్న విషయాలకే కంగారు పడే అలవాటు కుందేళ్ళకున్నది. ఆ సమయంలో వాటి గుండె 350 (మామూలు సమయాల్లో నిమిషానికి 150) సార్లు కొట్టుకుంటుంది. అప్పుడు గాలి ఎక్కువ కావాలి. టెన్షన్ వల్ల చిన్నవయిన నాసికారంధ్రాలను అవి అందుకే దులుపు కుంటాయి. దాంతో ముక్కు తడి కూడా అవుతుంది.

# 43. దమయంతి స్వయంవరం

"నలమహారాజు ఎప్పుడూ నిజమే చెపుతాడు. దమయంతి మొదటి వ్యక్తిని "మధ్యలో కూర్చున్న వ్యక్తి ఎవరు?" అని అడిగింది.

"నల మహారాజు" అని అతడు సమాధానం చెప్పాడు. అది అబద్ధం. అదేగానీ నిజమైతే మధ్యలో కూర్చున్న వ్యక్తి తన పేరు యముడని చెప్పడు (నలుడు నిజమే చెపుతాడు). దీనివల్ల మొదటి ఇద్దరు వ్యక్తులూ అబద్ధం చెపుతున్నారు. కాబట్టి మూడో మనిషే నలుడని ఆమెకు అర్థమైంది. మొదటి ఇద్దరూ వేరే విధంగా సమాధానం చెప్పి ఉంటే, సమాధానం కాస్త కష్టమయ్యేది. అప్పుడు మూడోప్రశ్న అవసరం కలిగి ఉండేది".

రాజుకీవిధంగా మౌనభంగం కాగానే "సర్వేజనా సుఖినోభవతు" అంటూ బేతాళుడు అదృశ్యమయ్యాడు.